# ప్రత్యేక తెలంగాణ ఉద్యమం
# ప్రధాన ఘట్టాలు


## అంబటి వెంకన్న



జాబిలి కళామండలి
నల్లగొండ

**జాబిలి కళామండలి ప్రచురణ -4**

**నవంబర్, 2015**
**ప్రతులు: 1000**

**ప్రత్యేక తెలంగాణ ఉద్యమం**
**ప్రధానఘట్టాలు**

వెల : 200/- రూ॥

**కవర్ డిజైన్ :**

ప్రతులకు :-
**జాబిలి కళామండలి ప్రచురణలు**
ఇం.నెం. 7-1-155/D9/7
శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్
నల్లగొండ - 508 001

**అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో**

ముద్రణ :-
చరిత ప్రింటర్స్, హైద్రాబాద్

# అంకితం...




**తెలంగాణ రాష్ట్ర తొలి ఐ.టి. శాఖామాత్యులు**
**శ్రీ కల్వకుంట్ల తారక రామారావు గారికి...**

## ఇండ్ల....


| | | పేజి నెం |
|---|---|---|
| 1. | 1948కి ముందు తెలంగాణ | 01 |
| 2. | 1948 తర్వాత తెలంగాణ | 09 |
| 3. | 1952 ముల్కీ ఉద్యమం | 12 |
| 4. | ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ | 14 |
| 5. | 1969 తెలంగాణ ఉద్యమం | 29 |
| 6. | 1996 నుంచి 2014 | 45 |
| 7. | తెలంగాణ సంఘాలు - సభలు | 46 |
| 8. | టి.ఆర్.ఎస్ పార్టీ ఆవిర్భావం - లక్ష్యసాధన | 52 |
| 9. | ఫ్రీజోన్ వివాదము | 57 |
| 10. | కేసీఆర్ దీక్ష - అరెస్టు | 59 |
| 11. | శ్రీకాంతాచారి త్యాగం | 69 |
| 12. | 2009 డిసెంబర్ ప్రకటన | 80 |
| 13. | రెండు నాల్కల సీమాంధ్ర నాయకులు | 85 |
| 14. | జె.ఎ.సి.ల ఏర్పాటు | 94 |
| 15. | మిలియన్ మార్చ్ | 101 |
| 16. | తెలంగాణ జాగృతి - బతుకమ్మ | 109 |
| 17. | తెలంగాణ పాటల ధూం-ధాం | 116 |
| 18. | జయశంకర్ సార్ జీవితం | 128 |
| 19. | సకలజనుల సమ్మె | 146 |
| 20. | శ్రీకృష్ణ కమిటి నివేదిక | 150 |
| 21. | కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం | 154 |
| 22. | సాగరహారం | 161 |
| 24. | పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు | 169 |
| 25. | హైద్రాబాద్‌కు తిరిగొచ్చిన కేసీఆర్ | 172 |
| 26. | తెలంగాణ తొలి ప్రభుత్వం | 176 |

## బంగారు తెలంగాణ స్వాప్నికుడు కేసీఆర్ బాటలో పయనిస్తున్న తెలంగాణ ముద్దుబిడ్డలకు ఉద్యమాభివందనాలతో...



*తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు*
***శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు** గారు*



*శాసనమండలి సభ్యులు*
*శ్రీ **కర్నె ప్రభాకర్** గారు*



*తెలంగాణ సాంస్కృతికసారథి చైర్మన్*
*శ్రీ **రసమయి బాలకిషన్** గారు*

# ఒకమాట

ప్రపంచ ఉద్యమ చరిత్రలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ఘట్టాలు అత్యంత బలమైనయి. ప్రజాస్వామికమైనయి. ఈ పోరాటాల చరిత్ర ఈనాటిది కాదు. 1952 ముల్కీ ఉద్యమం నించి మొదలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు జరిగిన అనేక సంఘటనలు ఉద్యమాన్ని ఉరకలెత్తించినయే. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచ విప్లవాల సరసన చేరిందంటే అతిశయోక్తి కాదు. హైద్రాబాద్ సంస్థానం భారతయూనియన్‌లో విలీనం చేయబడిన తర్వాత తెలంగాణ ఉద్యోగాలను కొల్లగొట్టిన స్థానికేతరులు వెళ్ళిపోవాలని చేసిన ముల్కీ ఉద్యమం సందర్భంగ ఏడుగురు విద్యార్థులు పోలీసుల కాల్పుల్లో చనిపోయింద్రు. ఆ తర్వాత విశాలాంధ్రలో ప్రజారాజ్యం అని సీమాంధ్ర నాయకులు వేసిన ఎత్తుగడలకు కేంద్రం తలవంచింది. 1956లో ఫజల్ అలీ కమీషన్ నివేదికను కాలరాసి, తెలంగాణ ప్రజల అభీష్టాన్ని లెక్కచేయకుండ బలవంతంగ సీమాంధ్ర ప్రాంతంలో విలీనం చేసింద్రు. ఆంధ్రప్రదేశ్‌గ అవతరించిన మరుక్షణం నుంచే తెలంగాణ మీద సీమాంధ్ర నాయకుల ఆధిపత్యం పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను వ్యక్తం చేసిన 1969 ఉద్యమం రక్తసిక్తమైంది. వలసపాలకులు తెలంగాణ ఉద్యమకారుల మీద కర్కశంగ కాల్పులు జరిపి 370మంది విద్యార్థుల ప్రాణాల్ని బలి తీసుకుంద్రు. ఉత్తగనె అట్లతద్దినాడు అత్తా అల్లుడు సరసమాడినట్టు 'జై ఆంధ్ర' ఉద్యమంతో కేంద్రాన్ని బెదిరించింద్రు. 1975లో ఆరుసూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టి తెలంగాణకు ఇచ్చిన రాజ్యాంగ రక్షణలను నాశనం చేసింద్రు. నివురుగప్పుకున్న నిప్పులా ఉన్న తెలంగాణ నేల 1996లో ఒక్కసారిగ బగ్గుమన్నది. ప్రత్యేక తెలంగాణ కోసం నడుముగట్టింది. తెలంగాణ కవులు, కళాకారులు, మేధావులు పెద్దఎత్తున ముందుకొచ్చింద్రు. ప్రాణాలకు తెగించి కొట్లాడడానికి సిద్ధమైంద్రు. ఇంతలో కేసీఆర్ 2001లో తెలంగాణ రాష్ట్రసమితిని స్థాపించడం వల్ల ఇటు ఉద్యమాలు, అటు రాజకీయాలు రెండు రకాలుగ తెలంగాణ పోరాటం బలపడింది. నీళ్ళు, నిధులు, నియామకాలల్లో తెలంగాణకు జరుగుతున్న దోపిడిని అడ్డుకట్టలు వేసే విధంగ ఉద్యమం నిర్మించబడింది. అనేక పోరాటఘట్టాల అనంతరం కేసీఆర్ ఆమరణ దీక్ష ఢిల్లీని

కదిలించింది. 2009 డిసెంబర్ 9న కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించిండు. ఈ నేపథ్యంలో మళ్ళీ సీమాంధ్రనాటకాలను మీడియా రక్తికట్టించింది. దీంతో డిసెంబర్ 23న కేంద్రం మరో ప్రకటన చేయడంతో తెలంగాణ ఉద్యమం ఉగ్రరూపం దాల్చింది. మిలియన్‌మార్చ్, ఛలో అసెంబ్లీ, సాగరహారం, విద్యార్థిగర్జన వంటి మహాసభలను తలపెట్టి కేంద్రప్రభుత్వానికి, రాష్ట్రప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండ జేసింది. తెలంగాణ జెఎసిలు, పార్టీలు ఒక్కటై తమ లక్ష్యం తెలంగాణ తప్ప వేరొకటి కాదన్నంతగ ప్రభావితం చేసినయి. 2009 నవంబరు మొదలు ఈ ఉద్యమంలో లెక్కలేనంత మంది తెలంగాణ బిడ్డలు అసువులుబాసింద్రు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 450మంది అని చెప్పుతున్నప్పటికి ఈ లెక్క వేయికి మించి ఉంటుందనేది ఒక అంచనా. అయితే 1952, 1969 తెలంగాణ ఉద్యమంలో ప్రజలు, ఉద్యమకారులు పోలీసు కాల్పుల్లో చనిపోతే, 2009 ఉద్యమంలో ధర్మాగ్రహాన్ని వెలిబుచ్చి ఆత్మబలిదానాలు చేసుకుంద్రు. ఏదైతే ఏముంది నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల నినాదం ఒక్కటైంది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కేంద్రం సానుకులంగ ప్రకటన చేసింది. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడానికి అన్ని రకాల చర్యలు చేపట్టింది. ఈ దశలో హైద్రాబాద్‌ను పది సంవత్సరాలు ఉమ్మడి రాజధానిగ చేయాలని కాంగ్రేసు ప్రతిపాదించిన నేపథ్యంలో తెలంగాణ నాయకులు మానవత్వం నిండిన మనసుతో పెద్దమనుషుల్లా వ్యవహరించింద్రు. కాని గిచ్చి కయ్యం పెట్టుకునే ఆంధ్ర నాయకులు అతిగా ప్రవర్తించింద్రు. ఆంధ్ర రాష్ట్రం ఉమ్మడి మద్రాసు నుంచి వేరుపడిన సంధర్భంలో రాజాజి అప్పటికప్పుడే “గెటౌట్ ఆంధ్ర కుక్కల్లార” అంటూ ఉన్న ఫలంగ మద్రాసును ఖాలి చేయించిండు. ఇక్కడ ఆ పరిస్థితి లేకుండ వాళ్ళు కోరుకున్నదానికి తెలంగాణ నాయకత్వం అంగీకరించింది. రాజధాని ఏర్పాటు జరిగే వరకు ఉమ్మడిగ ఉండడానికి ఒప్పుకుంది. ఈ నేపథ్యంలో సీమాంధ్రులు హైద్రాబాద నడిగడ్డమీద ‘సేవ్ ఆంధ్రప్రదేశ్’ కార్యక్రమాన్ని చేపట్టి వాళ్ళ ఆంధ్రబుద్దిని ప్రదర్శించింద్రు. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో చేష్టలతో సభని గందరగోళ పరిచింద్రు. తెలంగాణ విద్యార్థుల్ని గాయపరిచింద్రు. తెలంగాణ సీమాంధ్ర ప్రజల మధ్య విభజన రేఖ గీసింద్రు. అనేక పోరాటాలు, ఆత్మబలిదానాలు చేసి

సాధించుకున్న తెలంగాణ మీద దాడి చేసి, పైశాచిక ఆనందాన్ని అనుభవించింద్రు. "ప్రాంతాలుగ విడిపోయి, అన్నదమ్ములుగ కలిసుందాం" అనే తెలంగాణ నినాదాన్ని సీమాంధ్ర నాయకత్వం పటాపంచలు చేసింది. అయినా తెలంగాణ ప్రజలు ఓర్చుకున్నరు. కేంద్రప్రభుత్వం చేసిన నిర్ణయానికి కట్టుబడి శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతుల్లో తెలంగాణని సాధించుకున్నరు.

జూన్ 2, 2014న దేశచరిత్రలో తెలంగాణ రాష్ట్రం 29వ రాష్ట్రంగ ఆవిర్భవించడంతో నింగినంటిన సంబరాలు చేసుకున్నరు. ఈ నేపథ్యంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోని ప్రధానఘట్టాలను ఒక చోట చేర్చి పుస్తకంగ తీసుకురావడానికి ఒక చిన్న ప్రయత్నం చేసిన. ఈ సందర్భంగ నాకు సహకరించిన మిత్రులు, సాహితీ పెద్దలందరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఈ పుస్తకానికి ఆర్థికంగా సహకరించిన పెద్దలు అమరబోయిన శ్రీనివాస్–డిఇ సూర్యపేట, పోలోజు యాదగిరి–డిఇ బోనగిరి, గుండమల్ల రాములు, కాశీ నాగాచారి అదే విధంగా నల్లగొండ జిల్లా టిఆర్‌వికెఎస్ నాయకులు పి కరెంట్‌రావు, కోట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, పొట్టబత్తుల శ్రీనివాస్, తవిడబోయిన గిరిబాబు గార్లకు ప్రత్యేక ధన్యవాదాలు.

**– అంబటి వెంకన్న**

నల్లగొండ

# *1948కి ముందు తెలంగాణ*

హైద్రాబాద్ సంస్థానాన్ని పాలించిన రాజవంశాలలో శాతవాహనులు, ఇక్ష్వాకులు, వాకాటకులు, విష్ణుకుండినులు, బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, వేములవాడ చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు, ముదిగొండ చాళుక్యులు, వెన్గొండ వంశీయులు, కందూరు చోడులు, కాకతీయవంశస్థులు, ముసునూరి వంశస్థులు, రేచర్ల పద్మనాయకులను ప్రధానవరుసలో మనం చెప్పుకోవచ్చు. ఇట్ల ఈ వరుసలో పాలించిన చివరి రాజవంశం అసఫ్‌జాహీలదే.

అయితే బహమనీ సుల్తాన్‌ల కాలం నుంచే దక్కన్‌లో ముల్కీ ఉద్యమాలు నడిచినయ్. 13వ శతాబ్దంలో ఇరాన్, ఇరాక్, టర్కి, అరేబియా దేశాల నుంచి అనేకులు దక్కన్ ప్రాంతంలో స్థిరపడ్డరు. వీళ్ళనే అఫాకీలు (స్థానికేతరులు) అన్నరు. దక్కనీలు ముల్కీలు, అఫాకీలు గైర్ ముల్కీలుగ కాలం గడిపింద్రు. అయితే వీళ్ళ నడుమ మతపరమైన అంశం చోటు చేసుకుంది. అఫాకీలు షియాలని, దక్కనీలంత సున్నీలనే బేధ భావం తారాస్థాయికి చేరింది. దీంతో అనేక ఘర్షణలు చెలరేగి 1521లో బహమనీ రాజ్యం అంతరించింది.



హైదరాబాదు రాజ్యం

కులీకుతుబ్‌షా 1512లో స్వతంత్ర కుతుబ్‌షాహి రాజ్యాన్ని స్థాపించిండు. కులీకుతుబ్‌షా ఆఫాకీ అయినప్పటికి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని స్థానికులకు ఎక్కువ అవకాశాలు కల్పించి, తెలుగు భాషను ప్రోత్సహించిండు. కుతుబ్‌షాహీలు గోల్కొండ సామ్రాజ్యాన్ని దగ్గరదగ్గర రెండు వందల సంవత్సరాలు పరిపాలించిండ్రు. అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న కుతుబ్‌షాహీల పాలన ఔరంగజేబు దండయాత్రలతో అంతం అయ్యింది. దక్కన్ ప్రాంతంలో అసఫ్‌జాహీలు స్వతంత్రాన్ని ప్రకటించుకున్నరు. ఔరంగబాద్ రాజధానిగా పరిపాలన సాగించిండ్రు.

అసఫ్‌జాహి వంశ స్థాపకుడు నిజాం ఉల్ ముల్క్ అసలు పేరు మీర్ ఖమ్రుద్దిన్ ఖాన్. మొగల్ చక్రవర్తి షా ఆలం కమ్రుద్దిన్‌ని అయోధ్య సుబేదారుగ నియమించిండు. ఆ తర్వాత చక్రవర్తి ఫరూక్‌షయర్ ఈయన రాజనీతిని, పరిపాలనా దక్షతను చూసి నిజాం ఉల్ ముల్క్ ఫతేజంగ్, అనే బిరుదునిచ్చి దక్కన్ సుభేదారుగా నియమించిండు. నాటి దక్కన్ సుభా కాందేశ్, బీరార్, తెలంగాణ, దౌలతాబాద్, అహ్మద్‌నగర్, ఆర్కాట్‌లతో కూడిన సువిశాల ప్రాంతం.

**నిజాం ఉల్-ముల్క్ (1724-48):** నిజాం ఉల్ ముల్క్ తన స్వతంత్ర పాలనలో భాగంగ మొదట తెలంగాణ మీద ఆదిపత్యాన్ని సాధించిండు. 1724 నుంచి 1748లో చనిపోయేంత వరకు దాదాపు 24 సంవత్సరాలు పరిపాలించిండు. ఉల్ ముల్క్ మరణానంతరం ఇతని రెండవ కొడుకు నాజర్‌జంగ్ దక్కన్ సుబేదార్ అయ్యిండు.

**నాజర్ జంగ్ (1748-1751):** 1748 నుంచి 1751వరకు నాజర్ జంగ్ (మీర్ అహ్మద్ అలీఖాన్) పరిపాలించిండు. ఈయన కాలంలో ఆంగ్లేయులు, ఫ్రెంచి వాళ్ళు పాలనలో జోక్యం చేసుకొని ఏకంగా నిజాం మేనల్లుడైన ముజఫర్‌జంగ్‌ను దక్కన్ సుబేదార్‌గా ప్రకటించిండ్రు. ముజఫర్‌జంగ్ కూడ హత్య చేయబడిండు. దీంతో నిజాం మూడవ కొడుకైన సలాబత్ జంగ్ ఫ్రెంచి వాళ్ళ సహకారంతో దక్కన్ సుబేదార్ అయ్యిండు.

**సలాబత్ జంగ్ (1751-1763):** 1751 నుంచి 1763వరకు సలాబత్‌జంగ్ పాలించిండు. తనకు సహకరించిన ఫెంచివారికి కొండవీడు, నిజాంపట్నం, నర్సాపురం ప్రాంతాలను ఇచ్చేసిండు.

**నిజాం అలీ ఖాన్ (1763-1803):**1763 నుంచి 1803 వరకు గల నిజాం అలీఖాన్ పాలనకాలంలో నిజాం రాజ్యం మీద ఫ్రెంచి వారి పెత్తనం నషించి బ్రిటీష్ ఆధిపత్యం మొదలైంది. నిజాం అలీఖాన్‌కు రెండవ అసఫ్‌జా అనే బిరుదును కూడ

ఇచ్చింద్రు. నిజాం అలీఖాన్ 1765లో తన రాజధానిని ఔరంగాబాద్ నుండి హైద్రాబాద్‌కు మార్చిండు. రాజధాని మార్పు జరగడం వలన ఇక్కడి సంస్కృతిలోను, భాషలోను అనేక మార్పులు చోటు చేసుకున్నయి. ఉర్దూ అధికార భాష కావడంతో ఉత్తరాది నుంచి అనేక మంది ఉర్దూ వచ్చిన పండితులు హైద్రాబాద్‌కు రావడం జరిగింది. దీనివల్ల 'ముల్కీ' సిద్దాంతానికి తెరలేసింది. అఫాకీలు అనబడే పర్షియన్ అధికారులకు వ్యతిరేకంగ బహమనీల కాలంలోనే ముల్కీ విధానం బయటికి వచ్చింది.

**సికిందర్ జా (1803–1829):** 1803 నుంచి 1829 వరకు పరిపాలించిన సికిందర్ జాని మూడవ అసఫ్‌జా అని పిలిచేవాళ్ళు. ఈయన కాలంలో జాగీర్దారులు పెద్దఎత్తున తిరుగుబాటు చేసింద్రు.

**నాసిరుద్దౌలా బహదూర్ (1829–1857):** 1829 నుంచి 1857 వరకు పరిపాలించిన నాసిరుద్దౌలా బహదూర్ కాలంలో దేశంలో అనేక ఉద్యమాలు తలెత్తినయ్. ముఖ్యంగ బ్రిటీష్ ప్రభుత్వ కార్యకలాపాలను నిరసిస్తూ దేశవ్యాప్త పోరాటాలు కొనసాగినయ్. ఇట్ల రాజ్యం దివాళ తీస్తున్న సమయంలో తురాజ్ అలీఖాన్ సాలార్‌జంగ్ అనే బిరుదుతో దివాన్ (ప్రధాని)గా అధికారాన్ని చేపట్టిండు.

**సాలార్‌జంగ్ (1853–1883):** అప్పుల్లో కూరుకుపోయిన నిజాం రాజ్యంలో వరుస కరువులు రావడంతో ఎంతో మంది చనిపోయింద్రు. ఈ పరిస్థితులను ఎదుర్కోనేందుకు 19వ శతాబ్ధపు చివరి భాగంలో హైద్రాబద్ తన అభివృద్ధి పంథాను మార్చుకుంది. దానికి ప్రధానమైన కారణం 1853లో ముఖ్తారుల్ ముల్క్ సర్ సాలార్‌జంగ్ బహదూర్ ప్రధానమంత్రి (దివాన్) గా నియమించబడడం. సాలార్‌జంగ్ చేపట్టిన సంస్కరణలు కొన్ని జాగిర్దారులకు, దేశముఖ్‌లకు ఎంతో బలాన్ని ఇచ్చినయి. నాటి నిజాం సంస్థానంలో కోటి ఎనబై లక్షల జనాభాలో 1100 మందికి పైగా జాగీర్దారులు ఉండేవారు. సైనిక వ్యయం పెరగడంతో ప్రజల మీద పన్నుల భారం మోపింద్రు. దాదాపు 40శాతం భూమి జాగీర్దారులు, భూస్వాముల చేతుల్లోనే ఉండేది. హైద్రాబాద్ రాష్ట్ర విస్తీర్ణం 82,698చ.మైళ్ళు అయితే 60,336చ.మైళ్ళు మాత్రమే దివానీ లేదా ఖల్సా ప్రాంతంగ ఉండేది. అంటే నిజాం ప్రభుత్వ పాలనలో ఉండే భూమి. జాగీర్దారులు దేశముఖ్‌లు నిజాంకు తెలిసి కొన్ని, తెలియక కొన్ని అనేక విధాల పన్నుల రూపంలో ప్రజలను పీడించేవాళ్ళు. వెట్టిచాకిరి చేయించుకునే వాళ్ళు. ఇలాంటి విషయాలను కొన్నింటిని మినహాయిస్తే 1883 వరకు నిజాం రాజుల వద్ద సాలార్‌జంగ్ దివాన్‌గా అనేక సంస్కరణలు చేపట్టిండు. హైద్రాబాద్ రాష్ట్ర అభివృద్ధికి ఆయన ఎనలేని సేవలు చేసిండు.

**అఫ్జల్ ఉద్దౌలా (1857-1869):** నాసిరుద్దౌలా చనిపోవడంతో ఆయన పెద్దకొడుకు అఫ్జల్ ఉద్దౌలా రాజ్య సింహాసనాన్ని అధిష్టించిండు. 1857 నుంచి 1869 వరకు అఫ్జలుద్దౌలా పాలించాడు. హైద్రాబాద్ సివిల్ సర్వీస్‌ను స్థాపించిన సాలార్‌జంగ్ ఇతర ప్రాంతాల నుండి ఉద్యోగులను హైద్రాబాద్‌కు ఆహ్వానించిండు. ఇతని కాలంలోనే ముల్కీ ఉద్యమాలు జరిగినయి. 1857 సిపాయిల తిరుగుబాటు జరిగిన సంధర్భంలో ఇతడు ఆంగ్లేయులకు సహకరించిండు.

**మీర్ మహబూబ్ అలీ పాషా(1869-1911):** మహబూబ్ అలీఖాన్1869 నుంచి 1911 వరకు పాలించిండు. ఈయన ఆరవ అసఫ్‌జాహీగా పరిపాలన కొనసాగించిండు. ఇతని కాలంలోనే 1880లో ఫార్సి భాషకు బదులుగా ఉర్దూ అధికార భాషగ మారింది. స్థానికేతరులకు జీతభత్యాలు ఎక్కువగా ఉండడం వలన వాటి విషయంలో 1883లో ప్రత్యేక గెజిట్‌ని ప్రకటించింది. ఈ గెజిట్ ప్రకారం ఉద్యోగాలన్ని అర్హతల ప్రకారం ముల్కీలకే ఇవ్వాలని నిర్ణయించింది. ఇతని కాలంలో కూడా కొన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈయన కాలంలో సాలార్జంగ్ కొంతకాలం, ముల్కీల పక్షపాతి స్వయంగ కవి అయిన కిషన్ పర్‌షాద్ కొంతకాలం దివాన్‌లుగా పనిచేసింద్రు.

**మీర్ ఉస్మాన్ అలీఖాన్(1911-1948):** హైద్రాబాద్ రాష్ట్రం అనేక సంఘర్షణలకు లోనై ప్రజల్లో భావావేశం కట్టలు తెంచుకుంటున్న సమయంలో మహబూబ్ అలీఖాన్ హఠాత్తుగ చనిపోవడంతో అతని కొడుకు ఉస్మాన్ అలీఖాన్ 25 సంవత్సరాల వయసులో సింహాసనాన్ని అధిష్టించిండు. ఈయన పూర్తిపేరు నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్. అసఫ్‌జాహీలలో చివరిపాలకుడైన మీర్ ఉస్మాన్ అలీఖాన్ మంచి సాహిత్య అభిమాని ఉర్దూలో గజళ్ళు కూడ రాసిండు. 1911 సెప్టెంబర్ 17న అధికారం చేపట్టి 1948వరకు పరిపాలించిండు. పదహారు జిల్లాలతో, ఒక కోటి డెబ్బయ్ లక్షల మంది జనాభా కలిగిన హైద్రాబాద్ సంస్థానం భారతదేశంలోనే అతి పెద్ద సంస్థానం. ఇక్కడ ఉస్మాన్ అలీఖాన్ చేసిన కృషి ఫలితంగ అనేక పరిశ్రమలు స్థాపించబడి హైద్రాబాద్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది. ప్రధానంగ గ్లాసు, కాగితం, అగ్గిపెట్టెలు, గుండీల వంటి పరిశ్రమలు స్థాపించబడినయి. ఉస్మాన్‌సాగర్, నిజాంసాగర్, హిమాయత్‌సాగర్ వంటి చెరువులను నిర్మించి నీటిపారుదల సౌకర్యాలు కల్పించబడినయి. ఉస్మాన్ అలీఖాన్ కాలంలోనే విద్య, వైద్యానికి ఎనలేని ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. నిజాం తన పేరు మీదనే 1918లో ఉర్దూ బోధన భాషగ ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని స్థాపించిండు. 1919లో మీర్

ఉస్మాన్ అలీఖాన్ ప్రభుత్వ ఉద్యోగాలలో ముల్కీలనే నియమించాలని ఫర్మాన జారి చేసిండు. ఈ ఫర్మాన ప్రకారం హైద్రాబాద్‌లో జన్మించిన వాళ్ళు మాత్రమే ముల్కీలు.

అయితే దాదాపు 40శాతానికి పైగా భూమి జాగీర్దార్లు, దేశముఖ్‌లు, మఖ్తేదార్లు, పాయెగాళ్ళు చిన్న చిన్న సంస్థానాధీశులుగా నిరంకుశంగ వ్యవహరించేవాళ్ళు. భూస్వాములు తమ స్వంత వ్యవసాయంతో పాటు అత్యధిక భూమిని కౌలుకిచ్చి సాగు చేయించేవాళ్ళు. ఈ పద్దతి వల్ల క్రమంగ వెట్టిచాకిరి వ్యవస్థ అవతరించింది. వృత్తిదారులను చిన్నచూపు చూసి చిత్రహింసలకు గురిచేసేవాళ్ళు. ముఖ్యంగా నల్లగొండ జిల్లా జనగామ తాలూకాలో విసునూరు రామచంద్రారెడ్డి, జన్నారెడ్డి ప్రతాపరెడ్డి లాంటి పెద్ద భూస్వాములు ప్రజలను చిత్రహింసలు పెట్టింద్రు. లెక్కకు మించిన పన్నులు విధించి అక్రమంగ లెవీ ధాన్యాన్ని వసూలు చేసింద్రు.

దేశముఖ్‌ల, భూస్వాముల దౌర్జన్యాలను ఎదిరించడం కోసం ఆంధ్రమహాసభ ప్రజల్లో చైతన్యాన్ని తీసకురావాలని అనేక ప్రయత్నాలు చేసింది. సభలు సమావేశాలు నిర్వహించింది. కరపత్రాలు ముద్రించి కార్యకర్తలను తయారు చేసింది. గ్రామ గ్రామాన కమిటీలు ఏర్పాటు చేసి దాదాపు 10వేల మంది కార్యకర్తలతో పెద్ద సైన్యంగా తయారయ్యింది. విసునూరు, కడవెండి దేవరుప్పల, మొండ్రాయి వంటి గ్రామాలలో నిరంతరం సభలు జరుపుతూ ప్రజల్లో చైతన్యం కలిగించింది. ముఖ్యంగ 1944లో జరిగిన భువనగిరి నిజాం రాష్ట్రాంధ్ర మహాసభ నాటికి ప్రజలు దేశముఖ్‌ల దౌర్జన్యాలను ఎదుర్కొనే విధంగ పరిస్థితి తయారయ్యింది.

దేశముఖ్‌లు అక్రమంగ వసూలు చేస్తున్న లెవీ ధాన్యాన్ని ఆంధ్రమహా సభ అడ్డుకుంది. దీంతో విసునూరు దొర కుట్రపన్ని కడవెండిలో తన గూండాలతో దాడికి స్దిమయ్యిందు. కడవెండి ఊరు ఊరంత ఒక్కటై సంఘటనా స్థలానికి పెద్ద ర్యాలిగా వస్తున్న సంధర్భంలో అగ్గిపిడుగై గర్జిస్తున్న దొడ్డి కొమురయ్య దొర గూండాలు జరిపిన కాల్పుల్లో మరణించిండు. ఆ సంఘటనతో ఉద్యమం సాయుధపోరాట రూపంగ మారింది. దొరలు భూస్వాములను జనం ఉరికిచ్చి కొట్టింద్రు. దిక్కుతోయని భూస్వాములు దేశముఖ్‌లు రజాకార్ల చెంతకు చేరింద్రు. ఖాశీంరజ్వీ ఏర్పాటు చేసిన రజాకార్ సేనను వెంట బెట్టుకొని విసునూరు రామచంద్రారెడ్డి కొడుకు బాబుదొర అనేక అఘాయిత్యాలకు పాల్పడ్డడు. ఊర్లకు ఊర్లే తగలబెట్టిండు. ఎందరినో చంపేసిండు. ఈ విధంగ కమ్యునిస్టులు రజాకార్లు పెద్ద ఎత్తున పోరాటానికి సిద్దమయ్యింద్రు.

## భారతదేశానికి స్వాతంత్ర్యం

1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ భారత తొలి ప్రధానిగా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడింది. దేశంలోని సంస్థానాలన్ని భారత యూనియన్‌లో విలీనమైనయి. హైద్రాబాద్ సంస్థానాధీశుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఎటూ తేల్చుకోలేని స్థితిలో తటస్థంగ ఉన్నడు. హైద్రాబాద్ సంస్థానంలో హిందువులు, ముస్లింలు అనే బేధభావం ఏనాడు తలెత్తింది లేదు. ప్రజలు వాళ్ళకు నచ్చిన భాషని, నచ్చిన మతాన్ని స్వీకరించడంలో పూర్తి స్వేచ్ఛ ఉన్నది. సంపూర్ణ మత సామరస్యాన్ని పాటించిన నిజాం నవాబు భారత యూనియన్‌లో చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున మత దురహంకారి అయిన కాశీంరజ్వీ రజాకార్ (స్వయం సేవక్) సైన్యాన్ని తయారు చేసిండు. నిజాం ప్రధాని లాయఖ్ అలీ కూడ కాశీంరజ్వీని సమర్థించిండు. దీంతో రజ్వీ బలవంతంగ మత మార్పిడులు చేసే ప్రయత్నాన్ని ముమ్మరం చేస్తూ సామాన్య జనాన్ని కమ్యునిస్టులను ఊచకోతలు కోయడం, ఊర్లు తగలబెట్టడం వంటి చర్యలకు పూనుకోవడంతో కమ్యునిస్టులు రజాకార్లను ఎదుర్కొంటు పోరాటానికి సిద్ధమయ్యింద్రు, కమ్యునిస్టులు కూడ స్వతంత్ర కమ్యునిస్టు రాజ్యం వస్తుందని కలల గన్నరు. ముస్లీం రాజ్య స్థాపన చేయాలని కాశీం రజ్వీ, కమ్యునిస్టు రాజ్యం ఆవిర్భవిస్తుందని కమ్యునిస్టులు పరస్పర దాడులు చేసుకోవడంలో ఎందరో సామాన్య ప్రజలు చనిపోయింద్రు. ఈ దశలో హైద్రాబాద్ రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలకొల్పడం కోసం జె.ఎన్. చౌదరి నేతృత్వంలో రాష్ట్రంలో సైనిక పరిపాలన ఏర్పడింది. పోలీసు చర్యలో భాగంగ కమ్యునిస్టులు, రజాకార్ల పరస్పర దాడుల్లో దాదాపు ఐదువేల మంది ప్రాణాలు కోల్పోయింద్రు.

నెహ్రూ ప్రభుత్వంలోని పటేల్ సైన్యాలు కమ్యునిస్టులను అణిచివేయడం కోసం గాలింపు చర్యలను తీవ్రతరం చేసింది. ఆంధ్రా కమ్యూనిస్టు పార్టీ నాయకుల కుట్రలు గ్రహించిన నెహ్రూ హైదరాబాదు విలీనం కోసం మోహరించిన సైనిక బలగాలను మరికొంత కాలం ఉంచాలని నిర్ణయించిండు. ఈ లోపు తమ ఆటలు సాగవని గ్రహించిన కొందరు కమ్యునిస్టులు లొంగిపోయింద్రు. మరికొందరిని సైన్యం నిర్బంధంగా తీసుకొచ్చి జైళ్ళలో బంధించింది.

## భారతయూనియన్‌లో హైద్రాబాద్ విలీనం

1948 ఆగస్టు 21 నిజాంరాజు ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేసిండు. భారత చర్యలను ఆపాలని కోరిండు. ఐక్యరాజ్యసమితి హైద్రాబాద్ సమస్యను ఎజెండాలో చేర్చింది. సెప్టెంబర్ 20న చర్చించాలని నిర్ణయించింది. కాని నెహ్రూ ప్రభుత్వం హైద్రాబాద్‌ను భారతయూనియన్‌లో విలీనం చేసే బాధ్యతని హోంమినిస్టర్ సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కు అప్పగించింది. దీంతో 1948 సెప్టెంబర్ 13న జనరల్ జయంత్‌నాథ్ ఆధ్వర్యంలోని భారతసైన్యం హైద్రాబాద్ సంస్థానంలో ప్రవేశించింది. దక్షిణ ప్రాంత కమాండింగ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ మహారాజా రాజేంద్ర సింహ ఆధ్వర్యంలో సంస్థానాన్ని అన్ని వైపుల చుట్టు ముట్టినయ్. దీంతో నిజాం రాజు హైద్రాబాద్‌ను బారత యూనియన్‌లో కలుపుతున్నట్టు దక్కన్ రేడియో ద్వార సమాచారం అందించిండు. తన సైనికాధికారి ఏల్ ఆంద్రూస్‌ను లొంగిపోవాల్సిందిగా ఆజ్ఞాపించిండు. అప్పటి వరకు అనేక అరాచకాలకు పాల్పడుతున్న కాశీంరజ్వీని బంధించి సికింద్రాబాద్ పరిధిలోని తిరుమలగిరిలో గల సైనిక కారాగారంలో బంధించింది. రజాకార్ సేన లొంగి పోయింది. కొందరు కమ్యునిస్టులు సైతం లొంగిపోయింద్రు. ఈ విధంగ 1948 సెప్టెంబర్ 17న పోలీసుచర్య (ఆపరేషన్ పోలో) ద్వార హైద్రాబాద్ సంస్థానం భారతయూనియన్‌లో విలీనం అయ్యింది.

జె.ఎన్. చౌదరి మిలిట్రి గవర్నర్‌గా 1949 వరకు ప్రభుత్వం నడిచింది. 1949 ఫిబ్రవరి 6న చౌదరి విడుదల చేసిన ఫర్మానతో నిజాం స్వంత ఆస్తులైన సర్ఫేఖాస్



భూములను వదిలిపెట్టవలసి వచ్చింది.

నిజాం రాజ్యంలోని జాగీర్లతో పాటు హాలిసిక్కా నాణెం కూడ రద్దయ్యింది. ఆ తర్వాత 1950 జనవరి 26న సీనియర్ సివిల్ అధికారి ముల్లర్ కాడింగ్ వెల్లోడి ముఖ్యమంత్రిగ పౌరప్రభుత్వ పాలన సాగింది.

నిజాం ప్రభువును రాజ్‌ప్రముఖ్ (ఇప్పటి గవర్నర్) గా నియమించిండ్రు. ఇందుకు గాను నిజాంకు భారతం ప్రభుత్వం ఏటా 1.25 కోట్ల రూపాయలను రాజ భరణంగా చెల్లించడానికి అంగీకరించింది.

1952 సాధారణ ఎన్నికల ద్వార బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రి అయ్యిండు. 1956 నవంబర్1 వరకు నిజాం చేతుల మీదుగ పాలన సాగింది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ తెలంగాణల ఎవరైతే ఉండకూడదని అనుకుండో అట్లాంటి ఆంధ్రుల పాలనని కండ్లార చూసిండు. చెమ్మగిల్లిన కండ్లతో1967 ఫిబ్రవరి 24న చనిపోయిండు.

అప్పుడు నిజాం దహన సంస్కారాలకు ప్రజాకవి కాళోజీ నారాయణ రావు కూడ పోయిండు. ఆ సంధర్భంలో కాళోజీ "నేను పోరాడింది వ్యక్తికి వ్యతిరేకంగ కాదు, వ్యవస్థకు వ్యతిరేకంగ" అనడమే కాకుండ, ఈనాటి ఈ పాలకుల కంటే నిజాం చాల నయం" అన్నడు కాళోజీ.

నిజాం మరణంతో హైద్రాబాద్ నగరం శోకసముద్రం అయ్యింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పదిరోజుల పాటు సంతాప దినాలను ప్రకటించింది.

# 1948 తర్వాత తెలంగాణ

1947 ఆగష్టు 15న దేశవ్యాప్తంగ స్వాతంత్ర్య సంబరాలు జరుపుకున్నరు. కాని నిజాం పాలనలోని తెలంగాణ ప్రజలు కమ్యునిస్టులు, రజాకార్ల దాడులతో కన్నశెరలతో ఊర్లు విడిచిపెట్టి వలసబాటలు పట్టింద్రు. దేశం నలుమూలల నుంచి ఎవ్వరు తెలంగాణలో అడుగుపెట్టినా, వాళ్ళందర్నీ కన్నతల్లి లెక్క చూస్తది తెలంగాణ నేల. కూడు, గూడునిచ్చి బతుకుదెరువు సూపిస్తది. వరదల్లో సర్వం కోల్పోయిన కోస్తాంధ్ర ప్రజలకు కడుపునిండ బువ్వబెట్టి ఆదుకున్న సందర్భాలు అనేకం ఉన్నయి. కాని అదే తెలంగాణ బిడ్డలు దేశముఖ్‌ల దౌర్జన్యాలు, రజాకార్ల ఆగడాలకు తట్టుకోలేక పక్కన ఉన్న ఆంధ్ర ప్రాంతానికి పోతే మంచినీల్లు ఇచ్చిన దిక్కులేదు సరికదా ఉన్నకాడికి దోసుకున్న సంఘటనలు కోకొల్లలు.

ముఖ్యంగ స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రానికి లేని విధంగ తెలంగాణకు ఒక విచిత్రమైన పరిస్థితి తలెత్తింది. 1952లో మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగే దాక తెలంగాణ ప్రాంతాన్ని బయటివాళ్ళే పాలించింద్రు. కొంతకాలం సైనిక పాలన మరికొంత కాలం వెల్లోడీల పాలన కొనసాగింది. ఈ సమయంలోనే ఆంధ్ర ప్రాంతం నుంచి అధికారులుగా వచ్చి ఇక్కడి వనరుల్ని, ఉద్యోగాలను కొల్లగొట్టింద్రు. తెలంగాణ సంపదను దోసుకుపోవడమే లక్ష్యంగ ఇక్కడ చేరింద్రు. దోపిడి భావజాలం కలిగిన ఆంధ్రుల తమిళనాడులో ఇమడలేకపోయింద్రు. గొంతెమ్మ కోర్కెలు కోరిన ఆంధ్రులను ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి తమిళులు తరిమేసింద్రు. రాయలసీమ రక్షణ కొరకు 1937 నవంబర్ 16న శ్రీబాగ్ ఒప్పందం చేసుకున్నరు. మద్రాస్‌లోని నాగేశ్వరరావు ఇంటిపేరే శ్రీబాగ్. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 1952 అక్టోబర్ 19న మద్రాస్‌లోని బులుసు సాంబమూర్తి ఇంట్లో పొట్టి శ్రీరాములు దీక్ష చేపట్టిండు. 58 రోజులు దీక్షచేసి డిసెంబర్ 15న కన్ను మూసిండు.

శ్రీరాములు త్యాగఫలితంగ 1953 అక్టోబర్ 1న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ముఖ్యమంత్రిగ టంగుటూరి ప్రకాశం పంతులు, ఉప ముఖ్యమంత్రిగ నీలం సంజీవరెడ్డి ఎన్నికయ్యిండు. ఆంధ్రలో రాజధాని నిర్మాణం జరిగేవరకు మద్రాసును ఉమ్మడి రాజధానిగ చేయాలని అడిగింద్రు. మద్రాసు ముఖ్యమంత్రి రాజాజి 24 గంటల్లో మద్రాసు ఖాళీ చేయాలని ఆజ్ఞాపించిండు. పిచ్చి కుక్కల్ని

తరిమినట్టు తరిమిండు. ఏగలేక తట్టబుట్ట సదురుకొని వచ్చిన ఆంధ్రులు కర్నూలులో గుడారాలు ఏసుకొని పాలన కొనసాగించిండ్రు.

జరసేపు అదట్ల ఉంచితె నిజాం కాలం నాటి హైద్రాబాద్ ఎట్ల ఉందో అట్ల రాష్ట్రంగ అవతరించింది. హైద్రాబాద్ రాష్ట్రంలోని పదహారు జిల్లాలలో 142 అసెంబ్లీ నియోజక వర్గాలను ఏర్పాటు చేసిండ్రు. వీటిలో 33 స్థానాలు ద్విసభ్య నియోజకవర్గాలు. ఈ ద్విసభ్య స్థానాలలోనే ఒకదానిలో జనరల్ ప్రతినిధి, రిజర్వు ప్రతినిధి ఎన్నికైతడు. మొత్తం 175 మంది శాసన సభ్యులకు గాను తెలంగాణ నుంచి 101 శాసనసభ్యులు ఎన్నిక కావాలె. ఈ విధంగ 1952 ఫిబ్రవరిలో జరిగిన మొదటి ఎన్నికలలో మొత్తం ఐదు పార్టీలు పోటీలో ఉన్నయి. కమ్యునిస్టు పార్టీ మీద నిషేదం ఉండడం మూలంగ పీపుల్స్ డెమక్రటిక్ ఫెడరేషన్ (పి.డి.ఎఫ్.) పేరుతో ఎన్నికలలో పోటి చేసిండ్రు. ఈ ఎన్నికలలో కాంగ్రేసు పార్టీ నుంచి పోటీచేసి గెలిచిన బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రి అయ్యిండు. 1952 మార్చిలో రాజ్‌ప్రముఖ్ నిజాం నూతన మంత్రివర్గంతో ప్రమాణ స్వీకారం చేయించిండు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన వి.బి. రాజుకు కార్మికశాఖ మంత్రిగా మంత్రివర్గంలో స్థానం దక్కడం చెప్పుకోదగిన అంశం. పి.డి.ఎఫ్ ప్రతిపక్ష హోదాలో ఉండగా స్పీకర్‌గా కాశీనాధరావు వైద్య బాద్యతలు తీసుకుండు.

ఆంధ్రరాష్ట్రంలో అనేక సమస్యలతో అల్లాడుతున్న ప్రకాశం పంతులు ప్రభుత్వం 1954లో కూలిపోయింది. ఆయన స్థానంలో బెజవాడ గోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యిండు. ఇక లాభం లేదని తెలంగాణ వనరులు, సంపద మీద కన్నుగుట్టిన ఆంధ్రులు అనేక కుట్రలు చేసిండ్రు. విశాలాంధ్రలో ప్రజారాజ్యమని, భాషా ప్రయుక్తరాష్ట్రమని కట్టుకథలు అల్లిండ్రు. హైద్రాబాద్‌ల కలిస్తెనే మన బాదలు తీరుతయని అనుకుండ్రు. ఆంధ్రుల పెత్తనం సాగే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేసిండ్రు. ఆంధ్రుల దెబ్బకు తట్టుకోలేని కేంద్రం 1953 డిసెంబర్ 29న రాష్ట్రాల పునర్విభజన కమీషన్ (ఎస్.ఆర్.సి) ను నియమించి, 1955 సెప్టెంబర్ 30లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించడం జరిగింది.

కుంజ్రు, ఫనిక్కర్‌లు సభ్యులుగ న్యాయమూర్తి సయ్యద్ ఫజల్ అలీ కమీషన్ అధ్యక్షునిగా పనిని ప్రారంభించింది.

వందల సంవత్సరాలుగ తెలుగు నేలను ఎందరో రాజుల పరిపాలించిండ్రు. ఎన్నో ప్రభుత్వాలు మారినయ్. కాని ఏనాడు తెలుగు భాష గుర్తుకు రాలేదు. ఆంధ్రరాష్ట్ర పాలన కర్నూలు గుడారాల్లో సాగుతున్నప్పుడు అప్పుడు గుర్తుకొచ్చింది తెలుగు భాష.

వెంటనే తెలుగు మాట్లాడే రెండు ప్రాంతాలను భాషా ప్రయుక్త రాష్ట్రంగ ఒక్కటి చేయాలని కొత్త రాగం తీసింద్రు. లోతుపాతులు తెలువని తెలంగాణ నాయకులను లోతులేసింద్రు. ఆఖరికి ఆ ఫజల్ అలీ కమీషన్ కూడ తెలంగాణను ఆంధ్రతో కలపాల్సిన అవసరం లేదని సూచించింది. పైగ అట్ల కలపడం వలన తెలంగాణ నష్టపోతుందని, కొత్త సమస్యలు తలెత్తుతయని కూడ హెచ్చరించింది. అయినా వినకుండ పెద్ద మనుషుల ఒప్పందం ఒకటి చేసి బలవంతంగ తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రలో విలీనం చేసింద్రు.

తెలంగాణ జర్రంత నిమ్మలంగ ఉన్నదంటే అది కేవలం 1952 నుంచి 1956 వరకు మాత్రమే. ఈ నాలుగు సంవత్సరాలే తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో పాటు ప్రజాస్వామ్య పాలనను అనుభవించింద్రు. తమని తాము మరిచిపోయి జీవించింద్రు.

# 1952 ముల్కీ ఉద్యమం

తెలంగాణ వనరుల మీద కన్నేసిన ఆంధ్రులు ఆశగొంటి తనంతో 1947కు ముందు నుంచే తెలంగాణ ప్రాంతానికి వలస బాట పట్టింద్రు. 1948 నుంచి 1952 మధ్య కాలంలో ఆంధ్ర ప్రాంతం నుంచి వలసలు వరదలై పొంగినయ్. అప్పుడే లంచాల సంస్కృతిని పెంచి పోషించింద్రు. 1952లో శాసనసభ్యుడైన రామాచారి అనే నాయకుడు హైద్రాబాద్ హితరక్షణ సమితిని స్థాపించి గైర్‌ముల్కీ గోబ్యాక్ అంటూ నినదించిండు. 1952లో వరంగల్ జూన్ 21న ప్రారంభమైన ముల్కీ ఉద్యమం ప్రత్యేకించి ఆంధ్రుల వ్యవహారశైలికి వ్యతిరేకంగ, పోలీసుచర్య ద్వార అక్రమంగ తెలంగాణ ఉద్యోగాల్లో చేరినవాళ్ళు వెనకకు వెళ్ళిపోవాలని ఐదు రోజులపాటు విద్యార్థులు నిరసన తెలిపింద్రు. ఆగస్టు 7న ఖమ్మంలో ఈ ఉద్యమం జరిగింది. ఆగష్టు 8న వరంగల్ జిల్లా మానుకోటలో విద్యార్థులు గైర్‌ముల్కీ గోబ్యాక్ అంటూ సమ్మెజేసింద్రు. ఆగష్టు 26న జంటనగరాల్లో విద్యార్థుల సమ్మె మొదలైంది. తరగతులు బహిష్కరించి నాన్‌ముల్కీలకు వ్యతిరేకంగ ఊరేగింపు జరిపింద్రు. ముల్కీ సర్టిఫికెట్ల జారీలో తగిన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు హామి ఇచ్చిండు. అయినప్పటికి పరాయి వాళ్ళకు ఉద్యోగాలు వస్తున్నందువల్ల విదార్థులు తీవ్రంగ ప్రతిఘటించింద్రు. విద్యార్థి ఐక్య కార్యాచరణను ప్రకటించింద్రు. హన్మకొండ హైస్కూల్‌లో శాంతియుతంగ సభ జరుపుకుంటున్న విద్యార్థులమీద పోలీసులు లాఠీచార్జ్ చేసింద్రు. విద్యార్థులు తిరగబడి రాళ్ళు విసరడంతో పోలీసులు గాయపడ్డరు. ఈ విషయం హైద్రాబాద్ విద్యార్థులకు తెలిసితెల్లారేసరికి సైఫాబాద్ కాలేజ్ నించి పెద్ద ఊరేగింపుగ బయలుదేరింద్రు. నిజం కాలేజ్ గేట్లు విరగ్గొట్టి లోపలికి దూసుకపోయింద్రు. ఈ ఊరేగింపులో కొందరు స్కూలు పిల్లలు కూడ ఉన్నరు. కాలేజ్‌లోని బెంచీలు, కుర్చీలు ధ్వంసం చేసింద్రు. వీళ్ళకు తోడు కాలేజ్ విద్యార్థులు జమైంద్రు. అందరు కలిసి “ఇడ్లి సాంబర్ గోబ్యాక్, గోంగూర పచ్చడి గోబ్యాక్” అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఆబిడ్స్ అంత కలియ తిరిగింద్రు. క్రమంగ తెలంగాణేతరులకు వ్యతిరేకంగ హైద్రాబాద్ దాక ఉద్యమం విస్తరించింది.

సెప్టెంబర్ 4న హైద్రాబాద్ పాతబస్తీలోని సిటికాలేజ్ విద్యార్థుల్లో ఒకరైన కేశవరావ్ జాదవ్ కూడా ఊరేగింపులో పాల్గొన్నడు. ప్రొఫెసర్ జయశంకర్‌సార్ ఈ

ఊరేగింపులో పాల్గొనడానికి బస్సులో హన్మకొండ నుంచి హైద్రాబాద్‌కు బయలు దేరిండు. అప్పటికే హైద్రాబాద్‌లో కాల్పులు జరిగినయన్న వార్తతో బస్సును బోనగిరి దగ్గర ఆపేసింఁడు. ఊరేగింపు మదీన హోటల్ సమీపంలోకి రాంగనే ఎలాంటి హెచ్చరికలు లేకుండ పోలీసులు కాల్పులు జరపడంతో అక్కడ ఒక విద్యార్థి చనిపోయిండు. కాల్పుల్లో గాయపడ్డ వాళ్ళను దావఖానలో చేర్పిస్తున్న సమయంలో మరొక విద్యార్థి చనిపోయిండు. ఉస్మానియా ఆస్పత్రికి వచ్చిన హోం మినిస్టర్ దిగంబర్ రావు బిందు మరికొందరు నాయకులు విద్యార్థులను శాంతించాలని కోరింఁడు. ఆవేశం చల్లారని విద్యార్థులు ఫతర్‌గట్టి పోలీస్‌స్టేషన్‌ని తగలబెట్టింఁడు. నగరమంత లాఠిచార్జ్‌లు, కాల్పులతో హోరెత్తింది. కర్ఫ్యూ విధించబడింది. విద్యార్థి నాయకులను నిర్భందంలోకి తీసుకుంది. ఈ ఘటనల్లో దాదాపు 18 మంది విద్యార్థులు చనిపోయినట్టు, వందలాది మంది గాయపడ్డట్టు వార్తలు వచ్చినయ్. వారం రోజుల పాటు స్కూళ్ళు, కాలేజీలు మూసేసింఁడు. సామాన్య జనం, స్త్రీలు, పిల్లలు కూడా చనిపోయిన వాళ్ళలో ఉన్నరు. ముల్కీ సమస్య రాజకీయానికో, మతానికో సంబంధించింది కాదని, తెలంగాణ స్థానిక ఉద్యోగాలకు సంబంధించిన అంశమని ఆవేదనని వ్యక్తం చేసింఁడు. దీంతో ప్రభుత్వానికి కొంత కనువిప్పు కలిగినట్టయ్యింది.

1953లో నాటి ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ మాట్లాడుతూ "విశాలాంధ్ర ప్రతిపాదన వెనక దురాక్రమణ పూరిత సామ్రాజ్యతత్వం దాగి ఉన్నదని" వాఖ్యానించిండు.

సీమాంధ్రులు కృష్ణా, గోదావరి నీళ్ళను ఆంధ్రకు తరలించుకపోయే ఎత్తుగడలు ఏస్తరు. అయిన తెలంగాణలో ఏముందని ప్రచారం చేస్తరు. సింగరేణి నుంచి బొగ్గు, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి టేకును తరలించుకపోతరు. అయినా తెలంగాణలో ఏముందని ప్రచారం చేస్తరు. ప్రపంచంలోనే అత్యంత ధనికుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ అని తెలిసినా ఇక్కడ ఏమి లేదని చెప్పుకు తిరిగే నీచ నికృష్టమైన జాతి ఆంధ్రులది. నిజాన్ని దాసి అబద్దాన్ని అందంగా పొదగడం కోసం ఎంతకైన తెగించే దుర్మార్గమైన జాతి ఆంధ్రులదనే భావన తెలంగాణ ప్రజలకు కలిగేలా చేసింది సీమాంధ్రుల ప్రవర్తన. క్రమంగ తెలంగాణ వనరుల మీద తెలంగాణ ప్రజలకు హక్కులు సన్నగిల్లినయ్. అధికారం నామమాత్రం అయ్యింది. 1952లోనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని కోరుకొని సాధించుకున్న ఆంధ్రులకు తెలంగాణ ఉద్యమం మాత్రం వేర్పాటు ఉద్యమంగ కనిపిస్తది.

# ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ

1956 జనవరిలో కేంద్రప్రభుత్వం ఫజల్‌అలీ కమీషన్ నివేదికని ప్రకటించింది. అప్పుడే హైద్రాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు కాంగ్రేస్ అధ్యక్షుడు యు.ఎన్.ఢేబర్‌కు ఉత్తరం రాసిండు. విలీనానికి తాను వ్యతిరేకమని, విలీనం వల్ల ఒక ప్రత్యేక సంస్కృతి కలిగిన తెలంగాణ అన్ని విధాల నష్టపోతదని, ఈ ఉత్తరం మధ్యంతర రిపోర్టుగా భావించాలని వేడుకున్నడు. కాని అనేక కుట్రలు, కుయుక్తులు, ఎత్తుగడలతో చేసిన పన్నాగం కాబట్టి ఎవరూ దీన్ని ఆపలేకపోయింద్రు. ఆంధ్ర, హైద్రాబాద్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు 1956 ఫిబ్రవరి 20న ఢిల్లీలో నలుగురు పెద్దల సమక్షంలో ఒక ఒప్పందం చేసుకున్నరు. ఇదే చరిత్రలో పెద్దమనుషుల ఒప్పందంగ మారింది.

**హైద్రాబాద్ పెద్ద మనుషులు:** బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకట రంగారెడ్డి, డా॥ మర్రి చెన్నారెడ్డి, జె.వి. నర్సింగరావు.

**ఆంధ్ర పెద్ద మనుషులు:** బెజవాడ గోపాల్ రెడ్డి, నీలం సంజీవరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, గౌతు లచ్చన్న

1956 జులై 19న పెద్దమనుషుల ఒప్పందం మీద సంతకాలు చేసింద్రు. ఆ క్షణంలోనే బూర్గుల రామకృష్ణారావు “నా మరణశాసనం మీద నేనే సంతంక చేసిన” అని ప్రకటించుకుండు. ఏదైతే ఏముంది పెద్దమనుషుల ఒప్పందాన్ని భారత పార్లమెంట్ ఆమోదించింది.1956 మార్చి 5న నిజాంబాద్‌లో భారత్ సేవక్ సమాజ్ వారు ఏర్పాటు చేసిన సభకు నెహ్రూ హాజరై తెలంగాణ విషయంలో అమాయకపు ఆడపిల్లని తుంటరి అబ్బాయికిచ్చి వివాహం చేయడం సరికాదని తన ఆవేదనని వ్యక్తం చేసిండు. రెండు ప్రాంతాల నాయకులు 14 అంశాల మీద ఏకాభిప్రాయం వ్యక్తం చేసినట్టు ప్రకటించిండు. అయితే ఆంధ్రుల అసలు రంగు తెలిసిన మహానాయకుడు భారత తొలి ప్రధానమంత్రి జవహార్‌లాల్ నెహ్రూ భాషా ప్రాతిపదికన రాష్ట్రాలను వ్యతిరేకించిండు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ కూడ ఈ విషయాన్ని వ్యతిరేకించిండు. వాస్తవానికి ఈ విలీనం ఎవరికీ ఇష్టం లేదు ఒక్క సీమాంధ్ర నాయకులకు తప్ప. ఆ విలీన సభలో నెహ్రూ మాట్లాడుతూ ‘తెలంగాణ ప్రజలు ఆంధ్రతో కలిసి ఉండడం ఇష్టం లేకపోతే భవిష్యత్తులో ఎప్పుడైన ఆలు మగలు విడాకులు తీసుకొని విడిపోయినట్టు




రెండు ప్రాంతాలు ఆంధ్ర, తెలంగాణగ విడిపోయి ఎవరి బతుకు వారు బతుకొచ్చు' అనే విషయాన్ని సూచించిండు.

1956 ఆగస్టు 31న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిల్లుని భారత తొలి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ ఆమోదించి సంతకం చేసిండు. 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించింది. ఈ బతవంతపు విలీనానికి ముందురోజే హైద్రాబాద్ రాజ ప్రముఖ్ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన పదవికి రాజీనామ చేసిండు. సెప్టెంబర్ 17, 1948లో ఈ నేలకు విముక్తి జరిగిందని భావిస్తే మల్లా 1956 నవంబర్1న బలవంతపు బాసింగం కట్టి తెలంగాణను కట్టు బానిసను చేసింద్రు.

నవంబర్ ఒకటి ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగి ఆంధ్రులు సంబరాలు జరుపుకుంటే నవంబర్ ఒకటిన తెలంగాణ ప్రజలు ద్రోహంతో తల్లడిల్లింద్రు. నవంబర్ ఒకటి తెలంగాణ చరిత్రలో విద్రోహదినంగ మారింది.

ఎందుకంటే ఒప్పందంలో రాసుకున్న ఏ ఒక్కదానికి ఆంధ్రనాయకత్వం కట్టుబడి ఉండలేదు. మొట్ట మొదట రాష్ట్రం పేరులోనే పెద్ద మోసం చేసింద్రు. 'ఆంధ్ర-తెలంగాణ' రాష్ట్రంగ ఏర్పాటు చేయడానికి బదులు 'ఆంధ్రప్రదేశ్' గా మార్చి తెలంగాణ ఉనికి లేకుండ జాగ్రత్త పడ్డరు. చివరికి ఆంధ్ర ఒంటె తెలంగాణని బయటికి గెంటేసినట్టు

అయ్యింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నీలం సంజీవరెడ్డి పదవిని అలంకరించిన మరుక్షణమే ఉపముఖ్యమంత్రి పదవికి మంగళం పాడిండు. ఒప్పందాన్ని ఆదిలోనే తుంగలో తొక్కిండు. తెలంగాణలో రగులుకుంటున్న నిరసన సెగలను చల్లార్చడానికి 1960లో తెలంగాణ ప్రాంతీయ సంఘాన్ని ఏర్పాటు చేసింద్రు. ఆ సంఘానికి తొలి అధ్యక్షునిగ కె.అచ్యుతరెడ్డి బాధ్యతలు చేపట్టిండు. 1960లో మొదటి హరిజన ముఖ్యమంత్రి అయిన దామోదరం సంజీవయ్యను 1962 మార్చిలో అజ్ఞాతంలోకి పంపి నీలం సంజీవరెడ్డి రెండవసారి ముఖ్యమంత్రి అయ్యిండు. దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉపముఖ్యమంత్రిగ కొండా వెంకట రంగారెడ్డిని నియమించిండు. సంజీవరెడ్డి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఉప ముఖ్యమంత్రి పదవిని మళ్ళీ రద్దు చేసిండు. 1964లో కాసుబ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి అయ్యిండు. తెలంగాణ ప్రాంతీయ సంఘానికి రెండవ అధ్యక్షుడిగా హాయగ్రీవాచారి నియమించబడిండు. తెలంగాణ సమస్యలను ఎన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకపోయిన ఫలితం లేకుండ పోయింది.

విశాలాంధ్రలో ప్రజారాజ్యాన్ని కలలుగన్న కమ్యునిస్టు నాయకులు అనేక కుట్రలతో విశాలాంధ్రని సాధించింద్రు. కుట్రలు ఒక్కటొక్కటిగ బయటికొచ్చి తట్టుకోలేక 1964 ఏప్రిల్ 11న కమ్యునిస్టు పార్టీ రెండుగ చీలి పోయింది.

కాసు బ్రహ్మానందరెడ్డి తిరిగి 1967 ఎన్నికలలో గెలిచి రెండవసారి ముఖ్యమంత్రి అయ్యిండు. కాని ఇదే సంవత్సరం జరిగిన లోక్‌సభ ఎన్నికలలో బూర్గుల రామకృష్ణారావు సికింద్రాబాద్ సీట్ అడిగినప్పటికి ఇవ్వకుండ అవమానించింద్రు. ఆ తర్వాత ఆయన కొంత కాలం కేరళ గవర్నర్‌గ పనిచేసి, తన రాజకీయ జీవితానికి స్వస్తి పలికిండు. 1969 తెలంగాణ ఉద్యమ ఫలితంగ కాసు 1971లో రాజినామా చేయడంతో, 1971 సెప్టెంబర్ 30న పి.వి. నర్సింహ్మారావు ముఖ్యమంత్రి అయ్యిండు.

1972 ఎన్నికలలో గెలిచిన కాంగ్రేసు మళ్ళీ పి.వి. నర్సింహ్మారావునే ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నది. అయితే 1972 మేలో తెలంగాణలో భూములను అన్యాక్రాంతం చేయడాన్ని నిషేదిస్తూ ఆర్డినెన్సును తీసుకొచ్చిండు. దీంతో సీమాంధ్ర నాయకుల్లో కొంత అలజడి రేగింది. అంతకుముందే 1970లో ముల్కీ రూల్సు చెల్లుబాటు అయితయని చెప్పిన హైకోర్టు తీర్పును సవాలు చేసింద్రు. ఈ పరిణామంతో 1972లో ముల్కీ రూల్స్‌ను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఆ సమయంలో పి.వి. నర్సింహ్మారావు తెలంగాణకు న్యాయం చేయాలని అనేక విధాలుగ ప్రయత్నం చేసిండు. ఇది భరించలేని ఆంధ్రులు ఏకంగ పి.వి. ముఖ్యమంత్రి పదవికే ఎసరు

పెట్టింద్రు. "జై ఆంధ్ర" అంటూ మంత్రులు రాజీనామ చేసింద్రు. రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేసింద్రు. 1973 జనవరి నుంచి 1973 డిసెంబర్ 10 వరకు దాదాపు 320 రోజులు రాష్ట్రపతి పాలనను కొనసాగించింద్రు. ఈ సమయంలోనే ఆరుసూత్రాల పథకాన్ని తీసుకొచ్చి తెలంగాణని తెర్లుతెర్లు జేసింద్రు. తర్వాత జలగం వెంగళరావు ముఖ్యమంత్రి అయ్యిండు. మర్రి చెన్నారెడ్డి ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గ వెళ్ళిపోయిండు.

1956లో భాషా ప్రయుక్త రాష్ట్రంగ ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిందని ఎంత గొప్పగ చెప్పినప్పటికి, ఆ తర్వాత ఈ దేశంలో 1960లో బొంబాయి, 1966లో పంజాబు రాష్ట్రాలు భాషా ప్రయుక్త సూత్రం ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరించబడినయి. అయితే మర్రి చెన్నారెడ్డి కాలంలో బలమైన తెలంగాణ ఉద్యమం వచ్చినప్పటకి ఇందిరాగాంధీ ఉద్యమాన్ని అణిచివేయాలని సంకల్పించింది.

దేశంలో జరిగిన అనేక పరిణామాల వల్ల 1977లో కాంగ్రేసు ఓడిపోయింది. ఇందిరాగాంధిని కాంగ్రేసు నుంచి బహిష్కరించిండంతో కాంగ్రేస్ –ఐ పేరుతో పార్టీని స్థాపించింది. చెన్నారెడ్డి గవర్నర్ పదవికి రాజీనామ చేసి కాంగ్రేస్–ఐ సారథ్యం తీసుకుండు. 1978 మార్చిలో మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యిండు. 1980 లోక్‌సభ ఎన్నికల్లో ఇందిరాగాంధి విజయం సాధించడంతో పాటు రాష్ట్రంలో 42 పార్లమెంట్ స్థానాలకు గాను మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలో 41 స్థానాలు గెలిచింద్రు. కేంద్ర మంత్రివర్గంలో మొదటి సారి తెలంగాణ వ్యక్తులు పి.వి.నర్సింహ్మారావు, శివశంకర్‌లకు మంత్రి పదవుల వచ్చినయి. మెదక్ నుంచి గెలిచిన ఇందిరాగాంధి ప్రధానమంత్రి అయ్యింది. మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా నూతనంగ రంగారెడ్డి జిల్లాను ఏర్పాటు చేసిండు. జోనల్ పద్ధతిని తీసుకొచ్చిండు. దీంతో మింగుడు పడని ఆంధ్రులు రాష్ట్రంలో అశాంతిని రగిల్చింద్రు. అసమ్మతిని తట్టుకోలేక రాజీనామ చేయడంతో టంగుటూరి అంజయ్య ముఖ్యమంత్రి అయ్యిండు. అతిపెద్ద మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడంతో పాటు 11 సంవత్సరాలకు పంచాయతి ఎన్నికలు జరిపించిన ఘనత సొంతం చేసుకుండు. టంగుటూరి అంజయ్య 1982 ఫిబ్రవరిలో రాజీనామ చేయడంతో అనూహ్యంగ అధిష్టానం భవనం వెంకట్రామిరెడ్డిని ముఖ్యమంత్రిని చేసింది. ఆ తర్వాత ఆరు నెలల్లోనే భవనాన్ని దింపి కోట్ల విజయభాస్కర్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసింద్రు. 1982 ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రేసు ఓడిపోయి ఎన్.టి. రామారావు స్థాపించిన టి.డి.పి అధికారంలోకి వచ్చింది.

## తెలుగుదేశం ఎప్పుడు తెలంగాణది కాదు

మార్చి 21, 1982లో ఎన్.టి.రామారావు కొంతమంది కాంగ్రేసు నాయకులతో కలిసి తెలుగుదేశం పార్టీని స్థాపించిండు. 1983 జనవరి 9న రామారావు ముఖ్యమంత్రి అయ్యిండు. ఎన్.జి.ఓ.ల గోస చూసిన రామారావు కంటితుడుపు చర్యగ 1984లో జైభారత్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీని నియమించిండు. ఏడాది లోపల నివేదిక సమర్పించిన ఈ కమిటి 1975-1985 మధ్య కాలంలో రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్దంగ తెలంగాణలో 59వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నట్టు నివేదికను సమర్పించింది. దీంతో రామారావు సుందరేశన్‌తో ఏకసభ్య కమిటీని నియమించిండు. ఈయన సిఫార్సుల మేరకు 610 జి.ఓ.ని జారి చేసిండు. ఆంధ్రుల ఆత్మగౌరవం అనే నినాదంతో ఉపన్యాసాలతో ఊదరగొట్టి తెలంగాణని ఆగం చేసిండు. తెలంగాణ ప్రాంతీయ మండలిని రద్దు చేసిండు. ఆస్థానకవి పదవి నుంచి దాశరథిని తొలగించిండు. ట్యాంక్‌బండ్ మీద ఆంధ్రుల విగ్రహాలు ప్రతిష్టించిండు. శ్రీశ్రీ విగ్రహాన్ని పెట్టి ఆనందించిండు. తెలంగాణ మీద మొసలి కన్నీళ్ళు కార్చి 610 జి.ఓ.తో చేతులు దులుపుకుండు. తెలంగాణ విషయంలో ఆంధ్ర పాలకులు జి.ఓ.లు చేసేది కేవలం కాలయాపనకే అని రామారావు నిరూపించిండు. నీళ్ళు, నిధలు, ఉద్యోగాలలో తెలంగాణకు తీరని ద్రోహం తలపెట్టిండు. 1984 ఆగష్టు 16న రామారావు నిరంకుశత్వాన్ని ఎదిరించి నాదెండ్ల భాస్కర్ రావు ముఖ్యమంత్రి అయ్యిండు. రామారావు చేసిన తప్పుల్ని కొన్నింటిని సరిదిద్ది సెప్టెంబర్ 16న అనేక వత్తిళ్ళకు తలొగ్గి రాజీనామ చేసిండు.

1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఎన్.టి.ఆర్ మళ్ళీ విజయం సాధించిండు. చంద్రబాబు నాయుడికి పార్టీ కార్యదర్శి పదవిని ఇచ్చిండు. ముఖ్యమంత్రిగా ఉండి విశ్వామిత్ర సినిమాలో నటించిండు. గొప్ప పరిపాలన దక్షుడనుకున్న ఎన్.టి.రామారావు పరాశ్కాలకు ఎక్కువ సమయాన్ని కేటాయించిండు.

1989లో టి.డి.పి ఓడిపోయి, కాంగ్రేసు విజయం సాధించడంతో మర్రి చెన్నారెడ్డి రెండవసారి ముఖ్యమంత్రి అయ్యిండు. అనేక విధాల అసమ్మతిని రగిల్చిన నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి చెన్నారెడ్డిని దించి 1990లో ముఖ్యమంత్రి అయ్యిండు. రెండేండ్లు నిండక ముందే అసమ్మతి వాదులు జనార్ధన్ రెడ్డిని గద్దెదించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 13వ ముఖ్యమంత్రిగా 1992లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నామినేట్ చేయబడిండు. రాష్ట్ర కాంగ్రేసు రాజకీయాలు అస్తవ్యస్తంగ ఉన్న ఈ సమయంలో,

1992లో రాజీవ్‌గాంధీ మరణించడంతో కేంద్రంలో పి.వి. నర్సింహ్మారావు ప్రధానమంత్రి అయ్యిండు. దీంతో తెలంగాణ కాంగ్రేసు నాయకుల్లో కొత్త ఉత్సాహం నిండింది. తెలంగాణ ప్రాంత అభివృద్ధిని కోరుకుంటు 1992లో జానారెడ్డి తెలంగాణ ఫోరం కన్వీనర్‌గ పి.వి.కి వినతిపత్రం ఇచ్చి, సంతోషపడ్డడు. అయితే పి.వి. నర్సింహ్మారావుకు ప్రధాని పదవిని పదిలపరుచుకోవడానికే ఉన్న పుణ్యకాలం సరిపోయింది. రాష్ట్రంలో ముఖ్యమంత్రుల మార్పు గందరగోళ పరిస్థితులకు దారితీసింది. కాంగ్రేసు అంతర్గంత కలహాల పుణ్యమాని ఎన్ని ఏశాలేసినా ఎన్.టి.ఆరే ముఖ్యమంత్రి అయ్యిండు. 1994 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయ పతాకాన్ని ఎగరేసింది. సహకార రుణాల మాఫీ, రెండు రూపాలయలకే కిలో బియ్యం వంటి ఆకర్శణీయమైన పథకాలతో విజయఢంకా మోగించింది. ఇంతలో లక్ష్మీపార్వతి రామారావు జీవితంలోకి అడుగుపెట్టింది. దీంతో కుటుంబ తగాదాలు ఎక్కువైనయ్. ఇంటి పోరు భరించలేక 1995 ఆగష్టు 30న రాజీనామ చేసిండు.

ఎన్.టి.రామారావు మీద తిరుగుబాటు చేసి విజయం సాధించిన చంద్రబాబు నాయుడు 1995 సెప్టెంబర్ 1న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిండు. రాజకీయ ప్రత్యర్థులందరిని దూరం చేసిండు.

చంద్రబాబు ప్రభుత్వం పన్నులను విపరీతంగ పెంచి ప్రజలమీద మోయలేని భారం మోపింది. విజన్ 2020 పేరుతో చంద్రబాబు గారడి చేసిండు. అప్పులు పెరిగి అల్లాడుతున్న ఆంధ్రప్రదేశ్‌ని స్వర్ణాంధ్రగ మార్చుతనని మాయమాటలు చెప్పిండు. చంద్రబాబు హైటెక్ సినిమాని చూపించిండు. అప్పుచేసి కొప్పుపెట్టగల నేర్పరితనంతో ప్రతిది ప్రైవేట్ పరం చేసిండు. విద్యను సామాన్యునికి అందని ద్రాక్షగా మార్చిండు. చంద్రబాబు ఎరజూపిన పదవుల ఆశతో తెలంగాణ తెలుగుదేశం ఎం.ఎల్.ఏలు ఏనాడు నోరు తెరిచేవాళ్ళు కాదు. తెలంగాణ దోపిడి, వివక్షకు గురైతుందని తెలిసికూడ ఒక్కరంటే ఒక్కరు ప్రతిఘటించిన పాపాన పోలేదు. కాని 1996 నాటికి తెలంగాణ మేథావులు, కవులు, కళాకారులు ప్రతేక్యక తెలంగాణ రాష్ట్రం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టింద్రు.

తెలంగాణ ఉద్యమంతో పొంచిఉన్న ప్రమాదాన్ని పసిగట్టిన చంద్రబాబు నాయుడు 610 జి.ఓ. మీద మరింత జాప్యం చేయడం కోసం గిర్‌గ్లాని (ఏకసభ్య) కమిటీని నియమించి 90 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించిండు. 204 ప్రభుత్వత శాఖలకు గాను కేవలం 52 శాఖల సమాచారం మాత్రమే బయటికి తీయగలిగిండు. మిగతా 152 శాఖలు గిర్‌గ్లానికి కనీసం సహకరించలేదు. ఈ

శాఖలన్నింటిలోను సీమాంధ్రులు పెద్దఎత్తున రాష్ట్రపతి ఉత్తర్వులను ధిక్కరించి ఉద్యోగాలు చేస్తున్నరనే విషయం ఎవరికైన అర్థమైతది. గిర్‌గ్లాని తనకు లభించిన సమాచారం మేరకు ఓపన్ కేటగిరి పోస్టులను నాన్‌లోకల్ కోటాగ వక్రీకరించింద్రని తేల్చిండు. బోగస్ సర్టిఫికెట్లతో అక్రమంగ ఉద్యోగాలు పొందినట్టు తేల్చిండు. అయితే ఈ విషయాన్ని కప్పిపుచ్చడం కోసం మాటమార్చి మరింత విషయ సమాచారం సేకరించడం కోసమని కమిటీని మరో మూడున్నర సంత్సరాలకు పొడిగించిండు. 2004లో తుది నివేదికను సమర్పించిన కమిటీ 1975 నుంచి 2001 వరకు అనేక రకాల ఉల్లంఘనలు జరిగినట్టు కమిటి తగిన సమాచారాన్ని ఇచ్చింది. అయినప్పటికి వలస పాలకులు తదుపరి చర్యలకు ఎలాంటి ఆస్కారం కల్పించలేదు.

మిగులు బడ్జెట్‌గ ఉన్న హైద్రాబాద్ ఆదాయాన్ని తెలంగాణ కోసం కాకుండ ఆంధ్రకు తన్నుకపోయింద్రు. తెలంగాణలో మద్యాన్ని పారించి ఆంధ్రలో నిషేదం విధించింద్రు. (అసలు వాళ్ళు వచ్చిందే అందుకు కదా...) తప్పుడు 'ముల్కీ' సర్టిఫికెట్‌లతో తెలంగాణ బిడ్డల్ని విద్యకు, ఉద్యోగాలకు దూరం చేయగలిగింద్రు. ఆల్విన్ కంపెని, నిజాం షుగర్ ఫ్యాక్టరీలను మూసేసింద్రు. చాదర్‌ఘాట్ స్కూల్‌ను అమ్ముకున్నరు. హైద్రాబాద్ సంస్కృతిని ఆగం జేసింద్రు. అడ్డికి పావుసేరు లెక్కన తెలంగాణ భూములన్ని మింగి కూసుండ్రు. బ్రిటీష్ పాలనను మించి దోపిడి చేసింద్రు. ఆంధ్ర భోజన శాలలు ఏర్పాటు చేసి ఇడ్లీ, సాంబార్‌ని తీసుకొచ్చింద్రు. తెలంగాణ తిండిని ఎద్దేవ చేసింద్రు. నీళ్ళు, నిదులను తెలంగాణకు దక్కకుండ చేయడమే లక్ష్యంగా పాలన కొనసాగించింద్రు. తెలంగాణలోని బొగ్గును తరలించుక పోయింద్రు. పీనిగెలు తింటోడు పొయ్యి ఏనిగెలు తింటోడు వచ్చినట్టయ్యింది తెలంగాణ పరిస్థితి.

తెలంగాణలోని కరువుని పట్టించుకోని వలసాంధ్ర పాలకులు ఆంధ్రలో వరదలొస్తె అల్లాడిపోయింద్రు. తెలంగాణ ప్రాంతీయ మండలిని ఆగం చేసింద్రు. ఎన్.టి.ఆర్ పాలనలోని తెలుగుదేశం ప్రభుత్వం ఏకంగ ప్రాంతీయ బోర్డునే రద్దు చేసింది. తెలంగాణలో ప్రాజెక్టులు కట్టి నీళ్ళు ఆంధ్రకు పారిచ్చుకుంద్రు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల వల్ల వేలాది ఎకరాల సాగు భూమి నీటిలో మునిగింది. వందలాది గ్రామాలు నామ రూపాలు లేకుండ పోయినయి. ముంపు బాధితులతో తెలంగాణ గోస దీస్తె పంట పొలాలలో నీళ్ళని చూసుకొని సీమాంధ్ర ప్రాంతం మురిసిపోయింది. తెలంగాణ యాసని, భాషని, సంస్కృతిని హీనం చేసింద్రు. బువ్వ, నాగలి, గొడ్లు ఇయన్ని తప్పుడు పదాలైనట్టు, అన్నం, అరక, పశువులే అచ్చమైన తెలుగు పదాలైనట్టు, ఆంధ్రుల తప్పుడు భాషని తెలంగాణ ప్రజల మీద రుద్ది ఇక్కడి

కట్టుబొట్టు, ఆచార వ్యవహారాలను అవమానపరిచింర్రు. తెలంగాణకు సంబంధం లేని వాళ్ళ పేర్లను, విగ్రహాలను ఆవిష్కరించింర్రు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రను పాఠ్య పుస్తకాల నిండ నింపింర్రు. తెలంగాణ పెద్ద మనుషుల చరిత్ర కనపడకుండ చేసింర్రు. తెలంగాణ అంశం లేవనెత్తిన ప్రతిసారి భాష గురించి మాట్లాడే ఆంధ్రులు ఏనాడు తెలంగాణ, ఆంధ్ర భాష ఒక్కటని ఒప్పుకున్నది లేదు. ఒకే భాష గల రాష్ట్రాలు భారత దేశంలో ఏడు ఉన్నయి. అయినా ఒక్కతల్లి రక్తం పంచుకొని పుట్టిన బిడ్డలే వేరు వేరుగా బతుకుతున్న సందర్భంలో, భాష ఒక్కటైనంత మాత్రాన కలిసి ఉండాలన్న నియమం ఎక్కడ లేదు.

## విద్యా-వైద్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనాభాలో 40 శాతానికి పైగా ఉన్న తెలంగాణలో 1956 నుంచి ఉన్నత విద్యాసంస్థలు నెలకొల్పిన దాఖలాలే లేవు. ఐటిఐలు, పాలిటెక్నిక్‌ల వంటి సాంకేతిక విద్యా సదుపాయాలు ఆంధ్ర ప్రాంతంలో మాత్రమే కల్పించింర్రు. ఎయిడెడ్ డిగ్రి కళాశాలల కోసం ఖర్చుచేసిన 12 వందల కోట్లలో తెలంగాణ కోసం ఖర్చు చేసింది కేవలం పది శాతం మాత్రమే. ప్రభుత్వ విద్యా సంస్థలు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, ప్రైవేట్ విద్యా సంస్థలను తెలంగాణ నిండ నింపింర్రు. నారాయణ, చైతన్య, కేశవరెడ్డి, భాష్యం లాంటి విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి, వేలాది రూపాయల ఫీజులతో తెలంగాణ చెమట నెత్తుర్లను పిండుకున్నరు. విద్యను వ్యాపారమయం చేసింర్రు. హైద్రాబాద్‌ను ఫ్రీజోన్‌గా మార్చుకొని విశ్వవిద్యాలయాలను ఆంధ్రుల అడ్డాగ మార్చుకున్నరు.

తెలంగాణ సొమ్ముతో ఆంధ్ర ప్రాంతంలో విశ్వవిద్యాలయాలు నిర్మించుకున్నరు. తెలంగాణలో మాత్రం కేవలం తెలంగాణ ప్రాంతానికి కాకుండ అందరికి ఉపయోగపడేలా విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసింర్రు.

1976లో గుంటూరులో నాగార్జున యూనివర్సిటి, 1978లో అనంతపూర్‌లో కృష్ణ దేవరాయ యూనివర్సిటి, 1983లో తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, 1985లో సంస్కృత విశ్వవిద్యాలయం, 1986లో విజయవాడలో వైద్య, ఆరోగ్య విశ్వవిద్యాలయం, కుప్పంలో ద్రావిడ విశ్వవిద్యాలయాలు మునుంబెట్టి కట్టుకుంర్రు. ఇగ తెలంగాణలో 1976లో నిర్మించిన కాకతీయ విశ్వవిద్యాలయం తప్ప ఇంకో కొత్త యూనివర్సిటి కానరాదు. హైద్రాబాద్‌లో 1962లో ఫారెన్ లాంగ్వేజస్ సంస్థలు, 1964లో వ్యవసాయ విశ్వవిద్యాలయం, 1982లో అంబేద్కర్ ఓపెన్

యూనివర్సిటి, 1974లో సెంట్రల్ యూనివర్సిటి, 1985లో తెలుగు విశ్వవిద్యాలయం నిర్మించినప్పటికి ఇవేవి తెలంగాణకు మాత్రమే ఉపయోగపడేవి కాదని, తెలంగాణ ప్రేమతో అంతకన్న కాదన్న విషయం ఎవరికైన అర్థమైతది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించక ముందే హైద్రాబాద్‌లో ఉస్మానియా, గాంధీ, నిజాం లాంటి ఆసుపత్రులు అనేకం ఉన్నయి. కాన్సర్, యునాని, కోరంటి, నీలోఫర్, ప్రసూతి దావఖానలు ప్రజలకు అందుబాటులో ఉండేయి. 1956 నుంచి క్రమంగ వీటి ప్రాధాన్యత తగ్గింది. కామినేని, యశోద లాంటి కార్పోరేట్ దావఖానల హడావిడి పెరిగింది. ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోయినయి. గణేశ్, ఠాగూర్ లాంటి సినిమాలకు అద్భుతమైన కథలు అందించిన ఘన చరిత్ర వలసాంధ్ర పాలకులదే. నిజాం నవాబును నిరంకుశుడని ప్రచారం చేసినప్పటికి ప్రజారోగ్యం మీద వాళ్ళు చూపించిన ప్రేమలో సగం కూడా సీమాంధ్రపాలకుల ప్రజాస్వామ్య ప్రభుత్వం చూపించలేక పోయింది.

## ఉద్యోగాలు

తెలంగాణలోని ఉద్యోగాల విషయంలో సీమాంధ్ర పాలకుల వివక్ష ఇంతా అంత కాదు. తెలంగాణను బలవంతంగ ఆంధ్రలో విలీనం చేసిన నాటి నుంచి ఇలాంటి జి.వో.లు, ఒప్పందాలు అనేకం కాలగర్భంలో కలిసిపోయినయి. 1968 నాటికే ముల్కీ నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగ 25వేల ఉద్యోగాలు పొందినట్టు రికార్డులు ఉన్నయి. ఈ విషయంలో నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి జారీ చేసిన జి.ఓ. నెం.36 అమలుకు కూడ నోచుకోలేదు. తెలంగాణ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లలో ఆంధ్ర ఉద్యోగులకు పనిదొరికింది తప్ప తెలంగాణలో నిరుద్యోగం పోలేదు. 1983లో ప్రభుత్వ లెక్కల ప్రకారమే రెండు లక్షల ఇరవై నాలుగు వేల మంది ఆంధ్ర ఎన్జీవోలు ఉంటే కేవలం లక్షా తొమ్మిది వేలమంది మాత్రమే తెలంగాణ ఎన్జీవోలు ఉన్నరు. సెక్రెటేరియెట్, కోర్టులు, దావఖానలు, పరిశ్రమలల్లో ఉన్నత ఉద్యోగులందరు సీమాంధ్రులే. ఇంజనీర్లందరు వాళ్ళే. ఇట్ల తెలంగాణ మొత్తం సీమాంధ్ర ఉద్యోగులతో నింపేసింద్రు. అధికారుల అండతో వ్యాపారులు కూడ తెలంగాణ ప్రాంతంలో తిష్ట వేసింద్రు. రియల్ ఎస్టేట్ దందాలు పెంచింద్రు. అవినీతి, అక్రమాలకు తావులేని తెలంగాణ మట్టిలో విషబీజాలు నాటింద్రు. సినిమా సంస్కృతిని పెంచి ప్రజలను తప్పుదోవ పట్టించింద్రు. ముల్కీ నిబంధనలు ముక్కిపోయినయ్. అధికారులందరు వాళ్ళే కాబట్టి నివాస ధృవీకరణ పత్రాలతో పెద్ద పనిలేకుంట

పోయింది. అది కూడ నాలుగు సంవత్సరాలకే కుదించడం వల్ల నివాస ధృవీకరణ పత్రాలు పొందడం సులభమైంది. దీంతో ఇక్కడికి వచ్చిన ప్రతివాడు స్థానికుడే అన్నట్టు అయిపోయింది. తెలంగాణ విద్యా, ఉద్యోగ రంగాలలో పూర్తిగ నిర్లక్ష్యానికి గురైంది.

మొత్తానికి1985లో ఎన్.టి. రామారావు ప్రభుత్వం ఉద్యోగాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని గ్రహించింది. వెంటనే 610జి.ఓ.ని జారి చేసింది. 610 జి.ఓ. ప్రకారం తెలంగాణ వాళ్ళ స్థానంలో అక్రమంగ ఉద్యోగం పొందిన ఆంధ్రులను వాళ్ళ ప్రాంతాలకు బదిలీ చేసి ఆ స్థానంలో తెలంగాణ వాళ్ళను నియమించాలని అది కూడ మూడు నెలల్లో జరగాలని ఆ జి.ఓ సారాంశం. 1986లో ఆంధ్రుల అక్రమంగ పొందిన ఉద్యోగాలు 59వేలని లెక్క తేల్చింండ్రు. కాని ఒక్కరిని ఎనకకు పంపి తెలంగాణ వాళ్ళకు ఉద్యోగం ఇచ్చిన సంధర్భం లేదు. 1989లో కాంగ్రేస్ అధికారంలోకి వచ్చింది. 1995లో తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. కాని 610జి.ఓ. ఒకటుందన్న సంగతే ఎవరికి తెలువకుంట పోయింది. తెలంగాణను నిత్య దరిద్రంలో ముంచి సీమాంధ్రను అభివృద్ధి చేసుకుంటు ఆనందంగ గడిపింండ్రు. తెలంగాణ వ్యాప్తంగ నిరుద్యోగులు పెరిగిపోయింండ్రు. తెలంగాణకు రావాల్సిన ఉద్యోగాలలో ఆంధ్రులు అక్రమంగ కొనసాగుతున్న ఉద్యోగుల సంఖ్య ఇప్పుడు దాదాపు మూడు లక్షల వరకు చేరుకుందన్న ఆశ్చర్యం లేదు.

## నీటివనరులు

1840 ప్రాంతంలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి నది మీద ఆనకట్ట కట్టడం, కృష్ణానది మీద ఆనకట్ట కట్టడం వలన ఉభయ గోదావరి జిల్లాలతో పాటు, కృష్ణా గుంటూరు జిల్లాలు సస్యశ్యామలం అయినయి. గోదావరి ఆనకట్ట కింది 12 లక్షల ఎకరాలు, కృష్ణా బ్యారేజి కింద 10 లక్షల ఎకరాల ఆయకట్టు ఏర్పడింది. దీంతో అప్పటి దాక కరువు కాటకాలతో, ఆకలి చావులతో అల్లాడుతున్న ఆ జిల్లాలు అభివృద్ధి పథంలోకి అడుగుపెట్టినయి.

నిజాం పాలనాకాలంలో 1832లోనే ఇచ్చంపల్లి వద్ద భారీ నీటి పారుదల ప్రాజెక్టుకు ప్రణాళిక సిద్ధం చేసింండ్రు. నిర్మాణం ప్రారంభం అయిన తర్వాత నిజాం నియమించిన ఫ్రెంచి, బ్రిటీష్ నిపుణులు, ఇంజనీర్లు వాళ్ళ కుటుంబాలకు చెందిన 18 మంది మలేరియా బారినపడి చనిపోవడంతో నిర్మాణం అర్ధాంతరంగ ఆగిపోయింది. ఇచ్చంపల్లి పూర్తిఅయి ఉంటే తెలంగాణ ప్రాంతంలోని కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మెదక్ జిల్లాలు సస్యశ్యామలం అయ్యేవి.

కృష్ణానది మహబూబ్‌నగర్ జిల్లా గుండా రాష్ట్రంలో ప్రవేశిస్తుంది. కృష్ణానది పరివాహక ప్రాంతం 69శాతం ఉన్న తెలంగాణలో నీటి వినియోగం కేవలం 15 శాతం మాత్రమే. 31శాతం పరివాహక ప్రాంతం ఉన్న సీమాంధ్రలో కృష్ణా నీటి వినియోగం 85శాతంగ ఉన్నది.

1956కు ముందే ప్రతిపాదించిన జూరాల ప్రాజెక్టును 1962లో ప్రకటించింద్రు. 1980లో శంఖుస్థాపన చేసి 2000 సంవత్సరం వరకు సగం పనులు కూడ చేయలేని దౌర్భాగ్య ప్రభుత్వం సీమాంధ్ర ప్రభుత్వం. జూరాల ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యాన్ని తగ్గించి సగం సగం పనులతో నిర్మాణం పూర్తికాక ముందే ప్రాజేక్టును ప్రారంభించి చేతులు దులుపుకుంద్రు. భీమా ఎత్తిపోతల పథకాన్ని మొత్తమే పక్కకు పెట్టింద్రు. రాజోలిబండలో రాళ్ళు తియ్యలేదు. కోయల్‌సాగర్‌లో మన్ను తియ్యలేదు. నెట్టెంపాడు ప్రాజెక్టు కట్టింది లేదు. కృష్ణానది మీద కట్టవలసిన లిఫ్ట్ ఇరిగేషన్‌లను గాలికి వదలేసింద్రు. 1948లో నిజాం కాలంలో ప్రారంభించిన తుంగభద్ర ప్రాజెక్టు సమైక్యరాష్ట్రంలో ఇంచు కదిలింది లేదు. మొత్తంగ పాలమూరు జిల్లాను ఎండబెట్టి రాయలసీమ జిల్లాలకు నీరు తీసుకపోయే అన్ని ఏర్పాట్లు చేసుకున్నరు.

గోదావరి నది పరివాహక ప్రాంతం 79శాతం ఉన్న తెలంగాణలో ఇప్పటివరకు 70 టి.ఎం.సి.లకు మించి నీటిని వినియోగించుకున్నది లేదు. రాష్ట్రానికి కెటాయించిన 1480 టి.ఎం.సి.లలో మొత్తానికి మొత్తం తెలంగాణకు కేటాయించడం న్యాయం. ధర్మంగ తెలంగాణకు 1169 టి.ఎం.సి.లు రావాలె. అట్లాంటిది సమైక్య పాలనలో 120 టి.ఎం.సి.లకు మించి నీటి చుక్క అందలేదు. ఇతర చిన్న, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వార మొత్తం 320 టి.ఎం.సిలకు మించి ఉపయోగించుకున్నది లేదు.

నిజాం కాలంనాటి పోచంపాడు ప్రాజెక్టును కనీసం ముట్టుకోకుండ మధ్యలోనే దీని పేరు మార్చి శ్రీరాంసాగర్ అని పిలిచింద్రు. 1942లో కృష్ణాపురం దగ్గర కట్టవలసిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 1963లో ప్రతిపాదనలు తయారు చేసింద్రు. ఆఖరికి నీటి నిలువ సామర్థ్యాన్ని తగ్గించి 1986లో 450 కోట్ల ప్రపంచబ్యాంకు నిధులు నిధులు తెచ్చి 1991వరకు ఒక్క పైస ఖర్చు చేయకుండ కాలయాపన చేసింద్రు. శ్రీరాంసాగర్ మొదటిదశ అని రెండవ దశ అని వచ్చిన పైసలు జీతభత్యాలు, రోడ్డు ఖర్చులకని, పప్పులు పుట్నాలు చేసి ఎక్కడోల్లక్కడ ఎల్లెల్కలేసింద్రు. నిజాం కాలంలోనే పది కోట్లతో పనులు ప్రారంభించిన నిజాంసాగర్ ప్రాజెక్టు ఆ తర్వాత సమైక్య రాష్ట్రంలో లక్షలాది ఎకరాలను ముంపులో ముంచింది. ముంపు భూములను తెలివిగా సీమాంధ్రలు ఆక్రమించి నిజామబాద్‌ని వాళ్ళ అడ్డాగా మార్చుకున్నరు.

మంజీర నది మీద నిర్మించిన సింగూరు ప్రాజెక్టు అచ్చంగ తెలంగాణ సొమ్ముతో కట్టింది. పరిసర ప్రాంతాల ప్రజలకు చుక్క నీరియ్యకుండ పక్కనే గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న మెదక్ జిల్లాను ఎండబెట్టి కృష్ణాపరివాహక ప్రాంతంలోని జంట నగరాలకు నీళ్ళు తీసుకొచ్చిన ఘనులు సీమాంధ్ర పాలకులు.

కరీంనగర్ జిల్లాలోని మహదేవపూర్ దగ్గర గోదావరి నదిమీద ప్రాజెక్టు నిర్మాణానికి ఎప్పుడో రూపకల్పన జరిగింది. దాదాపు తెలంగాణ మొత్తానికి నీళ్ళు అందించగల సామర్థ్యం ఉన్న ఇచ్చంపల్లి ప్రాజెక్టుకై కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. పెన్‌గంగ–ప్రాణహిత 1975 నుంచి కాయితాల నడుమనే కాలం ఎల్లదీస్తుంది.

తెలంగాణలో 1956కు ముందున్న ప్రాజెక్టుల ద్వార 42 టి.ఎం.సిల నీరు లభిస్తే, 1956 తర్వాత కట్టిన ప్రాజెక్టుల ద్వార తెలంగాణకు వచ్చిన నీరు కేవలం 15 టి.ఎం.సి.లు మాత్రమే. అదేవిధంగ సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు ముందు చెరువు కుంటల ద్వార 12లక్షల ఎకరాలకు పైగా సాగు చేసిన రైతులు సమైక్య పాలన కుట్రల వల చెరువు కుంటలు నాశనమై, రియల్ ఎస్టేట్ల పాలైనయ్. చేపలు పట్టుకొని జీవనం సాగించే బెస్తల బతుకు అగమ్య గోచరంగ మారింది. క్రమంగ తెలంగాణలో చెరువు–కుంటల ద్వార సాగయ్యే భూమి ఐదు లక్షల ఎకరాలకు పడిపోయింది. వలసపాలనలో వ్యవసాయంతో పాటు మత్స్యసంపదకు నష్టం వాటిల్లింది. చెరువు లేక కరువుతో అల్లాడిన బెస్తలు బతుకుదెరువు లేక బొంబాయి, మద్రాసు వంటి పట్టణాలకు వలసబోయింద్రు. ఇదే అదునుగ 'స్థానికత' అనే అంశాన్ని ఉపయోగించుకొని ఇతర కులాలకు చెందినవాళ్ళు మత్స్యసొసైటీలలో సభ్యులుగ చేరింద్రు. మత్స్యకారులనే పేర బెస్తల జీవనబృతిని నాశనం చేసింద్రు.

రాష్ట్రంలోని మొత్తం జలవనరుల్లో తెలంగాణకు 1153 టి.ఎం.సిలు కేటాయించగ ఇప్పటి వరకు 380 టి.ఎం.సిలకు మించి వినియోగించుకున్న దాఖలాలు లేవు. 1930లోనే నాగార్జునసాగర్ ప్రాజెక్టు రూపకల్పనకు రంగం సిద్ధం అయ్యింది. 1954లో ఆంధ్ర, హైద్రాబాద్ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుగ నందికొండ ప్రాజెక్టు పేరుతో కార్యరూపం దాల్చింది. దీని ప్రకారం నల్లగొండలోని దేవరకొండ, మిర్యాలగూడ, మహబూబ్‌నగర్‌లోని అచ్చంపేటకు గుంటూరులోని పలనాడు ప్రాంతానికి నీరు అందేలా ప్రణాళిక రూపొందించింద్రు. హైద్రాబాద్‌లో 7లక్షల ఎకరాలకు, ఆంధ్రలో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో సిద్ధం చేసిన ప్రణాళిక 1956లో సమైక్య ఆంధ్రప్రదేశ్ అవతరించడంతో బుట్ట దాఖలైంది. కుడి, ఎడమ కాల్వల నిర్మాణంలో వివక్షను చూపించింద్రు. రాష్ట్రంలోని నాగార్జునసాగర్

ప్రాజెక్టు వల్ల ఆంధ్రలోని గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు నీరు పారుతుంటె తెలంగాణలో కేవలం నల్లగొండ కొస ప్రాంతం, సగానికి పైగా ఆంధ్రులు సంసారం జేసే ఖమ్మం జిల్లాకు మాత్రమే సాగర్ నీరు పారుతుంది. తెలంగాణ నాయకుల అసమర్థత వల్ల, వలసపాలకులు చూపిన వివక్ష వలన మహబూబ్‌నగర్‌లోని జూరాల, నల్లగొండలోని డిండి ప్రాజెక్టులు దుమ్ముగొట్కపొయినయ్. నాగార్జునసాగర్ ప్రాజెక్టు వల్ల నల్లగొండ జిల్లాలో 21 గ్రామాలు నీట మునిగినా నల్లగొండ గొంతు తడవలేదు.

ఫ్లోరైడ్ నీళ్ళే నల్లగొండ దూపదీర్చి పేగుల్ని మెలిబెట్టి సంపినయ్.

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో తెలంగాణలో 117 ఊర్లు ముంపుకు గురైనయి. లక్షలాది మంది నిరాశ్రయులై ఆదెరువు లేక అల్లాడింద్రు. 1981లో రూపొందించిన శ్రీశైలం ఎడమ కాల్వకు ఎన్నో ఆటంకాలు కల్పించి, నిధలు సమకూర్చడంలో అంతులేని వివక్షను చూపించింద్రు. కుడి కాల్వను మాత్రం నిరాటంకంగ కొనసాగించింద్రు. 1983లో తెలుగు గంగ ప్రాజెక్టుకు 1075 కోట్లు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసింద్రు. 1996లో శ్రీశైలం ఎడవ కాల్వకు 76కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంద్రు. పాలమూరు జిల్లాలో 67 ఊర్లు మునిగిపోయి నిరాశ్రయులైన వాళ్ళకు కనీసం నష్టపరిహారం కూడ అందించలేని స్థితిలో తెలంగాణమీద సవతి తల్లి ప్రేమను చూపించింద్రు. తెలంగాణను ఎడారి జేసింద్రు.

## విద్యుత్తు

నిజాం కాలంనాటి సెంట్రల్ ల్యాబ్, ఆర్.ఆర్. ల్యాబ్ వంటి సంస్థల్లో ఆంధ్రోల్లు నిండిపోయింద్రు. తెలంగాణలో స్థాపించిన అనేక పరిశ్రమల్లో నేడు ఆంధ్రోళ్ళు పెత్తనం చెలాయిస్తున్నరు. ఉద్యోగాలు మొత్తం ఆంధ్రవాళ్ళతోనే నింపుకున్నరు. పరిశ్రమల్లో 23శాతంగ ఉన్న తెలంగాణ ఉద్యోగుల్లో అందరికందరు రోజుకూలీలే తప్ప ఉన్నత ఉద్యోగాలు వేళ్ళ మీద లెక్కపెట్టొచ్చు. కంపు, కాలుష్యాలను తెలంగాణల వదిలేసి కట్టలకొద్ది రూపాయలు ఆంధ్రకు ఎత్తుక పోయింద్రు. ఆంధ్రప్రదేశ్ అవతరించక ముందే తెలంగాణలో రెండు వందలకు పైగా పరిశ్రమలు ఉండేయి. అవన్నీ సీమాంధ్ర పాలనలో నష్టాలలో కూరుకపోయి మూతబడ్డయ్. కాదుకాదు మూతపడేలా చేసింద్రు.

రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో 50శాతం థర్మల్ పవర్‌ప్లాంట్‌ల ద్వా లభిస్తుంది. ఎన్.టి.పి.సి 2452మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తే, తెలంగాణ కేవలం 150 మెగావాట్లు మాత్రమే వినియోగించుకుంటుంది. రాష్ట్రంలో నాలుగు థర్మల్ పవర్

ప్లాంట్‌లలో ఒక్కటి మాత్రమే తెలంగాణల ఉన్నది. కాని ఈ నాలుగింటికి బొగ్గు, ఇతర ముడిసరుకు మొత్తం తెలంగాణ నుంచే పంపిణీ జరుగుతది.

తెలంగాణలోని జలవిద్యుత్ కేంద్రాల వల్ల జరిగే విద్యుత్ ఉత్పత్తి 1250 మెగావాట్లు. దీంట్లో తెలంగాణ కేవలం 20 శాతం విద్యుత్‌ను మాత్రమే వినియోగించుకుంటుంది. 220 కె.వి. సబ్‌స్టేషన్‌లు ఆంధ్ర ప్రాంతంలోనే అధికంగ ఉన్నయి. విద్యుత్ ఉత్పత్తి చేపట్టే కంపెనీలు పదకొండు దాక ఉంటే కేవలం ఒక్కటి మాత్రమే తెలంగాణల ఉన్నది.

విద్యుత్ ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నది తెలంగాణ ప్రాంతం. వినియోగంలో అగ్రస్థానంలో ఉన్నది మాత్రం ఆంధ్ర ప్రాంతం. విద్యుత్ సబ్సిడీలను అందరు వాడుకుంటున్నా అది కేవలం రైతులకు మాత్రమే ఇచ్చినట్టు రాద్ధాంతం చేసింద్రు. ప్రభుత్వ విద్యుత్‌ను పక్కన పెట్టి, ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి సంస్థల నించి కొనుగోలు చేస్తున్న విద్యుత్ లెక్కలనే మార్చి మార్చి చూపించింద్రు. కోస్తాలో కరెంటు చార్జీలు తగ్గించి తెలంగాణలో కరెంటు చార్జీలు పెంచిన ఘనత సీమాంధ్ర పాలకులకే చెల్లుతుంది. ఈ విధంగ తెలంగాణ రైతాంగానికి తీరని ద్రోహం తలపెట్టి, తెలంగాణ బతుకుల్ని చీకటి చేసింద్రు.

సింగరేణి కంపెని 1889 నుంచి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించింది. 1989లో శతజయంతి ఉత్సవాలు జరుపుకునే నాటికి లక్షా పదహారు వేల మంది కార్మికులు 18 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింద్రు. గోల్డెన్‌షేక్ హ్యాండ్ (స్వచ్ఛంద పదవీ విరమణ) ఇతర పద్ధతుల ద్వార పోను మిగిలిన 80వేల కార్మికులతో 36మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. కార్మికుల సంఖ్యను తగ్గించి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచింద్రు. కార్మికుల మీద భారాన్ని వేసింద్రు. క్రమంగ సింగరేణిలో అధికారుల సంఖ్యను పెంచుకుంటు, ఏదో పద్ధతిలో కార్మికులను తొలగించే పనులు ముమ్మరం చేసింద్రు. సింగరేణిని మెత్తం ఆంధ్ర కాంట్రాక్టర్ల పరం చేసింద్రు. కార్మికులు వాళ్ళ హక్కులను కాపాడుకోవడానికి కోర్టుల సుట్టు తిరిగే పరిస్థితి ఏర్పడింది. చంద్రబాబు నాయుడు క్యాప్టివ్ గనుల పేర అనిశెట్టిపల్లి, పెనుగడప, చిలకచర్ల వంటి ఏడు గనులను ప్రైవేట్‌పరం చేసే ప్రయత్నాన్ని ప్రతిపక్ష హోదాలో ఉన్న వై.యస్. రాజశేఖర్ రెడ్డి అడ్డుకుండు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వై.యస్. క్యాప్టివ్ మైన్స్‌ను ఆమోదముద్ర వేసిండు. చిలకచర్ల, అనిశెట్టిపల్లి, పెనుగడప గనులను జిందాల్ కంపెనీకి అప్పజెప్పిండు. అదేవిదంగ జల్లారం, ఆడియాట్రా, కెటికె8, 8ఎ గనులను ప్రైవేట్ పరం చేయడానికి గ్లోబల్ టెండర్లను పిలిచిండు. చిత్రమైన విషయం

ఏందంటే సింగరేణి కంపెని బోరింగ్ డిపార్ట్‌మెంట్ ద్వార కోట్లరూపాయలు ఖర్చుచేసి బొగ్గు నిక్షేపాలను కనుగొన్న తర్వాత వాటిని ప్రైవేట్ వారికి అప్పగించిండు.

కరీంనగర్‌లో తెలుగుదేశం కిరాయి గూండాలు రవీందర్ రెడ్డిని కిడ్నాప్ చేసి చంపి ఉద్యమాన్ని నెత్తుటేరులు పారించింద్రు. తెలంగాణ జనసభ నాయకులందరిని జిల్లాల్లో బెదిరించి రాజీనామాలు చేయమని చిత్రహింసలు పెట్టింద్రు. కళాకారులను అక్రమ అరెస్టులు చేసింద్రు.

# 1969 తెలంగాణ ఉద్యమం

1952 నుంచి 'గైర్‌ముల్కీ గోబ్యాక్' అంటూ విద్యార్థులు పోరాటం చేస్తూనే, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్‌గ ఆంధ్ర ప్రాంతానికి చెందినవాళ్ళను నియమించవద్దని ఆందోళన చేసింద్రు. అయినప్పటికి 1957లో ఆంధ్రకు చెందిన డా॥ డి.ఎస్.రెడ్డిని వి.సి.గా నియమించింద్రు. విద్యార్థులు ఎన్నిసార్లు పట్టుపట్టిన ప్రభుత్వం అతనినే కొనసాగించింది. 1967లో ముఖ్యమంత్రికి, వైస్‌ఛాన్స్‌లర్‌కు మధ్య వ్యవహారం కుదరక వి.సి. పదవికాలాన్ని ఐదు సంవత్సరాల నుంచి మూడు సంవత్సరాలకు తగ్గించి డి.ఎస్.రెడ్డిని తొలగించిండు. డా॥ నర్సింహ్మారావును వి.సి.గా నియమించిండు. విశ్వవిద్యాలయాలలో రాజకీయ నాయకుల జోక్యం తగదని విద్యార్థులు జైపాల్‌రెడ్డి నాయకత్వంలో ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించింద్రు. ఈ సమయంలో కోర్టుకు వెళ్లిన డి.ఎస్.రెడ్డి తనకు అనుకూలంగ తీర్పుతెచ్చుకొని వి.సి. పదవిలో కొనసాగిండు. 1968 తర్వాత జైపాల్‌రెడ్డి ముఖ్యమంత్రికి అనుకూలంగ మారి సమైక్యవాదిగ తయారయ్యిండు.

ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకపోవడం కోసం 1968 డిసెంబర్ 6న హైద్రాబాద్ వివేకవర్ధిని కళాశాల నుండి



పెద్ద ఊరేగింపును మొదలు పెట్టిండ్రు. పోలీసులు ఊరేగింపు మీద లాఠీచార్జ్ చేసి విద్యార్థులను దారుణంగ కొట్టిండ్రు. విద్యార్థులు గాయపడ్డరన్న విషయం మిగతా జిల్లాలలోని విద్యార్థులకు తెలిసింది. క్రమంగ ఉద్యమం 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంగ రూపుదాల్చింది. దీన్ని వ్యతిరేకించిన కాంగ్రెసు, కమ్యునిస్టు నాయకులు సంయుక్తంగ ఏర్పాటు చేసిన సమావేశాన్ని అడ్డుకున్న విద్యార్థుల మీద కాల్పులు జరిపిండు నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి. 400 మంది విద్యార్థుల్ని బలితీసుకుండు. తెలంగాణలో నెత్తురుటేరులు పారించిండు. దీంతో ఉద్యమం తీవ్రరూపం దాల్చింది.

1969 జనవరి 5న పాల్వంచ థర్మల్ పవర్‌స్టేషన్‌లో అగ్గి రాజుకుంది. ఆంధ్ర ఉద్యోగులను వెనకకు పంపాలని ఖమ్మం గాంధీచౌక్‌లో బి.ఎ. చదువుతున్న రవీంద్రనాథ్ నిరాహార దీక్ష చేపట్టిండు. విద్యార్థి సంఘాలు మద్దతు పలికి ఖమ్మంలో బ్యాంకులు, బస్సుల మీద దాడులు చేసిండ్రు. తెలంగాణ రక్షణ సమితిని స్థాపించి తెలంగాణలోని నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేసిండ్రు. నిజాంబాద్‌లో విద్యార్థులు కాలేజ్‌లు, స్కూళ్ళు బంజేసి 'నాన్‌ముల్కీ గోబ్యాక్' అంటూ నినాదాలు చేసిండ్రు. ఖమ్మంలో తెలంగాణ వార్తల్ని వక్రీకరించి రాసిన ఆంధ్ర పత్రికలను తగలబెట్టిండ్రు.

పెద్దమనుషుల ఒప్పందాన్ని తుంగల తొక్కి, తెలంగాణ రక్షణలను నాశనం చేస్తున్న ప్రభుత్వం మీద నిరసన వ్యక్తం చేస్తూ ఉస్మానియా విద్యార్థులు జనవరి 13న 'తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి'ని ఏర్పాటు చేసి ఉద్యమంలోకి వచ్చిండ్రు. మెడికల్ విద్యార్థి అయిన మల్లిఖార్జున్‌ను సమితి ప్రధాన కార్యదర్శిగ ఎన్నుకున్నరు. తెలంగాణ శాసనసభ్యులు రాజీనామ చేయాలని, నిధుల దుర్వినియోగం మీద విచారణ జరిపించాలని డిమాండ్ చేసిండ్రు. ప్రత్యేక తెలంగాణే లక్ష్యంగ విద్యార్థులు త్యాగాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చిండ్రు. అదేరోజు హైద్రాబాద్‌లోని ప్రముఖులు కొందరు సమావేశమై ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కాటం లక్ష్మీనారాయణ అధ్యక్షులుగా 'తెలంగాణ పరిరక్షణల కమిటి'ని ఏర్పాటు చేసిండ్రు. సభ్యులుగ సోషలిస్టు పార్టీ నుంచి మహదేవ్‌సింగ్, మజ్లీస్‌పార్టీ నుంచి సలావుద్దీన్ ఓవైసి, కార్పోరేటర్ పద్మనాభన్, రఘువీర్‌రావు, మాధవరావు, జాఫర్ హుస్సేన్ మరికొందరు ఉన్నారు. వీళ్ళందరు తమ కమిటీ పక్షాన విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించిండ్రు. ఈలోగ విద్యార్థులు 'సేఫ్‌గార్డులు' సపరేటిస్ట్‌లనే రెండు వర్గాలుగ చీలిపోయిండ్రు.

సేఫ్‌గార్డులు సమైక్యవాదులకు మద్దతుగ, సపరేటిస్ట్‌లు ప్రత్యేక తెలంగాణ లక్ష్యంగ పనిచేయడం మొదలు పెట్టింద్రు.

విద్యార్థులు జనవరి 15న తరగతులు బహిష్కరించి సమ్మె మొదలు పెట్టింద్రు. నిజాం కాలేజి నుంచి కోఠి దాక పెద్ద ఊరేగింపుగ బయలుదేరి కోఠిలో బహిరంగ సభ జరిపింద్రు. ఈ సభలో విద్యార్థి నాయకులు, మల్లిఖార్జున్, పులి వీరన్న, పుల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గోపాల్ వంటి నాయకులు అనర్ఘళంగ, ఆవేశపూరితంగ మాట్లాడింద్రు. తెలంగాణకు చెందిన మంత్రుల దిష్టిబొమ్మలను దహనం చేసింద్రు. ఖమ్మంలో రవీంద్రనాద్ ఆరోగ్యం క్షీణదశకు చేరింది. దీంతో తెలంగాణ మొత్తం ఉద్యమం ఉగ్రరూపం దాల్చింది. నిజాం కాలేజి విద్యార్థులు సచివాలయాన్ని దిగ్బందించింద్రు. విద్యార్థులు ఉద్యమాన్ని విరమించి తరగతులుకు హాజరుకావాలని వి.సి. డి.ఎస్ రెడ్డి చేసిన ప్రకటనని విద్యార్థులు పట్టించుకోలేదు.

జనవరి 18న సపరేటిస్టులు మల్లిఖార్జున్, శ్రీధర్‌రెడ్డిల నాయకత్వంలో నిజాం కాలేజ్ నించి ఊరేగింపుగ కోఠి వైపుకు బయలుదేరింద్రు. ఊరేగింపు సరిగ్గ ఆబిడ్స్ చౌరస్తకు రాంగనే ఎదురుంగ వెంకట్రామిరెడ్డి, సదానంద్‌ల నాయకత్వంలో సేఫ్‌గార్డ్సు ఊరేగింపు వచ్చింది. విద్యార్థి ఫెడరేషన్ నాయకుడు సదానంద్ మంచివక్త, స్థానికుడు. తన ప్రసంగంతో రెచ్చిపోయిన విద్యార్థులు పెద్దపెట్టున నినాదాలు చేసింద్రు. ప్రమాదాన్ని పసిగట్టిన పోలీసులు రెండు గ్రూపులకు మధ్యన అడ్డంగ నిలబడ్డరు. ఈలోపు ఏదో మూలనుంచి రాళ్ళుపడడంతో విద్యార్థులు పోలీసుల లాఠీలు గుంజుకొని కొట్టుకున్నరు. పోలీసులు టియర్‌గ్యాస్ వదిలి అదుపు చేసింద్రు. విద్యార్థులు రమాకాంత్‌రెడ్డి, పులివీరన్నల తలలు పగిలినయ్.

విద్యార్థి ఉద్యమ తీవ్రతను చూసిన తెలంగాణ ఉద్యోగులు వెంటనే సమావేశమై, తక్షణమే ఆరువేల మంది ఆంధ్ర ఉద్యోగులను వెనకకు పంపకపోతే ప్రత్యక్ష కార్యచరణకు దిగుతమని అల్టిమేటమ్ ఇచ్చింద్రు. ఈ విషయం మీద తగిన నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీలో ప్రతిపక్షాలు హెచ్చరించినయ్. ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి 19న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసిండు. నిబంధనలకు విరుద్దంగ పనిచేస్తున్న ఆంధ్ర ఉద్యోగులను వెనకకు పంపిస్తనని చెప్పిండు. తెలంగాణ నిధుల లెక్కను తేల్చడానికి సీనియర్ అదికారిని నియమిస్తానని చెప్పి విద్యార్థులు ఆందోళన విరమించవలసిందిగ విజ్ఞప్తి చేసిండు. కాని విద్యార్థి నాయకుడు మల్లికార్జున్ ఆందోళన విరమించేదిలేదని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమే మా ధ్యేయమని ప్రకటించిండు. అప్పటికే కుమార్ లలిత్ లెక్కల ప్రకారం తెంగాణ మిగులు నిధులు

34.10కోట్లు ఉన్నట్టు తేలింది. భార్గవ్ కమిటీ రిపోర్టును ప్రచురించలేదు.

1969 జనవరి 20 సోమవారం రోజున శంషాబాద్ పాఠశాల విద్యార్థుల మీద పోలీసులు కాల్పులు జరిపిండ్రు. దీంతో రైల్వేస్టేషన్ మీద దాడిచేసిన విద్యార్థులను చెదరగొట్టడానికి కాల్పులు జరిపిండ్రు. 15 సంవత్సరాల లోపు విద్యార్థులు తీవ్రంగ గాయపడ్డరు. కాల్పులకు నిరసనగ నిజాం కాలేజ్ విద్యార్థులు 'పోలీస్ జులుం బంద్ కరో' అంటూ నినదించిండ్రు.

ఈ సభలో గోపాల్ ప్రసంగిస్తున్న సమయంలో కాల్పుల్లో గాయపడ్డ విద్యార్థి మరణించిండన్న వార్త తెలువడంతో విద్యార్థులు రెచ్చిపోయిండ్రు. పోలీసుల మీద తిరగబడ్డరు. రాళ్ళు, ఇటుకలతో దాడి చేసి పోలీసులను గాయపరిచిండ్రు. బాష్పవాయువులను, ఇనుప కంచెలను తొక్కుకొని బయటికి వచ్చిండ్రు. దీంతో పోలీసులు తమ ప్రతాపాన్ని చూపించి కాలేజ్ సిబ్బందిని సైతం చితకబాదిండ్రు. శ్రీదర్‌రెడ్డి, పులి వీరన్న లాంటి విద్యార్థినాయకులను 34 మందిని అరెస్ట్ చేసిండ్రు.

జనవరి 22న ప్రభుత్వం తెలంగాణ రక్షణలు అమలు చేయడానికి జి.ఓ.ని విడుదల చేసింది. ఆ జి.ఓ. ద్వార ఆంధ్ర ఉద్యోగులను వెనకకు పంపిస్తమని హామి ఇచ్చింది. ఖమ్మంలో రవీంధ్రనాద్ 17రోజుల దీక్షను విద్యార్థి నాయకుడు వెంకట్రామిరెడ్డి విరమింప జేసిండు. దీంతో సేఫ్‌గార్డుల ఉద్యమం చల్లారింది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగంగ సదాశివపేటలో పోరాటం చేస్తున్న విద్యార్థుల మీద కాల్పులు జరిపిండ్రు. శంకర్ అనే 17సంవత్సరాల యువకుడు చనిపోయిండు. 1969 ఉద్యమంలో తొలి అమరుడు అయ్యిండు. ఆంధ్ర ప్రాంత ఉద్యోగులను వెనకకు పంపే జి.ఓ. మీద రిట్ పిటిషన్ దాఖలు చేసిండ్రు. తెలంగాణ వ్యాప్తంగ సమ్మెలు, నిరాహార దీక్షలు ఎక్కువైనయి.

విద్యార్థి కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో సదస్సు నిర్వహించుటకు గాను తెలంగాణ జిల్లాల్లో విస్తృతంగ పర్యటించింది. అందులో భాగంగానే నల్లగొండకు వచ్చిండ్రు. అదే రోజు నల్లగొండ పట్టణంలో ఉప సర్వేయర్‌గ పనిచేస్తున్న రంగాచార్యులు అనే ఆంధ్ర ఉద్యోగిని ఎవరో పెట్రోలుపోసి తగలబెట్టిండ్రు. ఆయన చనిపోవడంతో ఆంధ్రప్రాంతంలో జి.వో.కు వ్యతిరేకంగ ఉద్యమం మొదలైంది. రాజధానిని హైద్రాబాద్ నుంచి ఆంధ్రకు మార్చాలని డిమాండ్ చేసిండ్రు. పెరిగిన ఆందోళన వల్ల పోలీసు కాల్పుల్లో నాగార్జునసాగర్‌లో ఒక విద్యార్థి చనిపోయిండు.

వరంగల్‌లో కాళోజీ నారాయణరావు అధ్యక్షతన జనవరి 28న తెలంగాణ విమోచనోద్యమ సమితి ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సభ ముఖ్యమంత్రి

రాజీనామ చేసి రాష్ట్రపతి పాలన విధించాలని తీర్మాణం చేసింది. ఆంధ్ర తెలంగాణ జిల్లాల్లో గొడవలు పెద్దఎత్తున జరిగినయ్. కొదాడ సరిహద్దు ప్రాంతంలో యుద్ధ వాతావరణం ఏర్పడింది. జి.వోని రద్దు చేసి సమైక్యాంధ్రని కొనసాగించాలని డిమాండ్ చేసింద్రు. గజ్వేల్‌లో జనవరి 30న జరిగిన కాల్పుల్లో నర్సింహ్మలు అనే 12 సంవత్సరాల విద్యార్థి చనిపోయిండు. హైకోర్టులో ఆంధ్ర, తెలంగాణకు చెందిన ఉద్యోగులు జి.ఓ.ల మీద పోటిపడి రిట్‌లు దాఖలు చేసింద్రు. ఫిబ్రవరి 20న ముల్కీ నిబంధనలు రాజ్యాంగ సమ్మతమేనని తీర్పునిచ్చింది. కాని ఉద్యోగులను వెనక్కి పంపకుండ సూపర్‌న్యూమరి పోస్టులను సృష్టించాలని ఆదేశించింది. దీంతో కొండ వెంకట రంగారెడ్డి తెలంగాణ సమస్య మీద అన్ని పార్టీలను ఆహ్వానించి, సమావేశాన్ని ఏర్పాటు చేసిండు.

ఫిబ్రవరి 28న హైద్రాబాద్‌లో తెలంగాణ ప్రజాసమితి ఆవిర్భ వించింది. ఇందులో యువకులు మేథావులే ఎక్కువగ ఉన్నరు. సిద్ధిపేటకు చెందిన యువ లాయర్ మదన్‌మోహన్ దీనికి అధ్యక్షుడు అయ్యిండు. మార్చి 3న తెలంగాణ బంద్‌కు పిలుపునివ్వడంతో పాటు, శాంతియుత సత్యాగ్రహాలు చేయాలని నిర్ణయించింది. బంద్ విజయవంతం అయ్యింది. తెలంగాణ రక్షణలు అమలు చేయాలని లేని పక్షంలో అసెంబ్లీలో సహాయనిరాకరణ చేపడతామని 52మంది తెలంగాణ శాసనసభ్యులు హెచ్చరించింద్రు.

విద్యార్థులు రెండు నెలలు కష్టపడి మొత్తానికి రెడ్డి హాస్టల్ మైదానంలో మార్చి 8,9న 15వేల మందితో సదస్సును ఏర్పాటు చేసింద్రు. ఈ సభకు శ్రీమతి సదాలక్షి అధ్యక్షత వహించింది. రెండవరోజు సభ ముగింపుకు 30వేల మంది దాక వచ్చింద్రు. ప్రత్యేక తెలంగాణ సాధించి తీరుతమని ప్రతిజ్ఞ చేసింద్రు. మల్లికార్జున్, శ్రీధర్‌రెడ్డి, సదాలక్ష్మి మహదేవ్‌లు తమ ప్రసంగాలతో ఉద్రూతలూగించింద్రు. “జై తెలంగాణ’ అంటే ‘జైజై తెలంగాణ” అనే నినాదాలతో సభ దద్దరిల్లింది. మార్చి 11న విద్యార్థుల సమ్మె కార్యరూపం దాల్చింది. ఉద్యోగులు పెద్ద ఎత్తున మద్దతు ప్రకటించింద్రు. మార్చి 17ను ఉద్యోగులు ‘పోరాటదినం’గా ప్రకటించింద్రు. విద్యార్థులు ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగ అసెంబ్లీలోకి దూసుకపోయింద్రు. చాలామందిని పోలీసులు అరెస్టు చేసింద్రు. ఎనిమిది మంది తెలంగాణ శాసనసభ్యులు విద్యార్థులకు మద్దతు ప్రకటించింద్రు. కొండా వెంకట రంగారెడ్డి ప్రత్యేక తెలంగాణ తమ లక్ష్యమని ప్రకటించడంతో ఉద్యమానికి కొత్త ఉత్తేజం కలిగింది. మంత్రులను ఘెరావ్ చేసింద్రు. తెలంగాణ వ్యాప్తంగ సభలు, సదస్సులు జరిగినయి.

తెలంగాణలో రోజురోజు జరిగే పరిణామాల మీద మార్చి 22న కొండాలక్ష్మణ్ బాపూజి, తెలంగాణ ప్రాంతీయ కమిటి అధ్యక్షుడు జె. చొక్కారావులు ఢిల్లీలో ప్రధానమంత్రిని కలిసింద్రు.

ముల్కీ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని మార్చి 29న సుప్రీంకోర్టు తీర్పుని వెలువరించింది. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ మీద దాడిచేసి నిప్పు పెట్టింద్రు. ఆ మంటల్లో చిక్కుకుని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు చనిపోయింద్రు. వరంగల్‌లో విద్యార్థులను వందలాదిగ అరెస్టు చేసింద్రు. ఇదే రోజు కొండా లక్ష్మణ్ బాపూజి తన మంత్రి పదికి రాజీనామ చేసిండు. తెలంగాణకు మేఘాలయ మాదిరి ప్రాంతీయ ప్రతిపత్తిని కోరిండు. కాని హై కమాండ్ విననందున ప్రత్యేక తెలంగాణే శరణ్యమని చెప్పిండు. మార్చి 30న ప్రత్యేక తెలంగాణ కాంగ్రేసు సమితిని ఏర్పాటు చేసిండు. తెలంగాణ శాసనసభ్యులందరు ప్రత్యేక తెలంగాణనే కోరుకున్నరు.

సికింద్రాబాద్ అంజలీ టాకీస్ చౌరస్తాలోని బూరుగు మహదేవ్ సమావేశ మందిరంలో కమ్యునిస్టు పార్టీ సభ జరిగింది. తెలంగాణ రక్షణలను అమలు చేస్తూ సమైక్య రాష్ట్రంగా ఉంచాలని తీర్మాణించింది. ఈ సభకు రాజాబహద్దూర్, మగ్దూం లాంటి కమ్యునిస్టు అగ్రనాయకులందరు వచ్చింద్రు. సభాధ్యక్షుడైన నగర కమ్యునిస్టు నాయకుడు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని విమర్శించడంతో వివాదం చెలరేగింది. జై తెలంగాణ నినాదాలతో హాలు మార్మోగింది. కమ్యునిస్టులకు వ్యతిరేకంగ గొడవ మొదలైంది. రాళ్ళు విసురుకుంద్రు. లాఠీచార్జ్ చేసిన పోలీసులు కాల్పులు కాల్పులు కూడ జరపడంతో అక్కడికక్కడే ముగ్గురు చనిపోయింద్రు. అనేకమంది గాయపడ్డరు. పోలీసులు కనపడ్డోన్ని కనపడ్డట్టే చితకబాదింద్రు. ప్రకాశ్ అనే యువకున్ని పోలీసులు వెంటబడి పట్టుకొచ్చి మరీ కాల్చి చంపింద్రు. ఉద్యమ కారుల మీద పి.డి. (ప్రివెంటివ్ డిటెన్షన్) చట్టాన్ని ప్రయోగించి మల్లికార్జున్, మదన్‌మోహన్‌లను అరెస్టు చేసింద్రు. మదన్‌మోహన్ స్థానంలో ఎస్.పి.గిరి ప్రజాసమితి అధ్యక్షుడు అయ్యిండు. గద్వాలలో జరిగిన కాల్పులతో సత్యాగ్రహానికి దిగిన గిరిని అరెస్టు చేయడంతో సదాలక్ష్మి తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షురాలు అయ్యింది. తెలంగాణ ఉద్యమ నినాదం డిల్లీకి చేరింది. కాంగ్రేసు నాయకుడు మర్రి చెన్నారెడ్డి ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని సమర్థించిండు. ఈయన రాకతో ఉద్యమం రాజకీయ రంగు పులుముకుంది. శ్రీధర్ రెడ్డిని పి.డి. యాక్టు కింద అరెస్టు చేసింద్రు.

తెలంగాణ వాదుల అరెస్టులకు నిరసనగ ఏప్రిల్ 11న సామూహిక సత్యాగ్రహం

జరిగింది. ఉద్యమ తీవ్రత డిల్లీకి చేరడంతో ఇందిరాగాంధీ ముఖ్యనాయకులను డిల్లీకి పిలిచింది. ఇందిరాగాంధీ ఏకపక్ష నిర్ణయాలు చేసి తెలంగాణ వాదుల అసంతృప్తిని దూరం చేయడానికి పార్లమెంట్‌లో ఎప్రిల్ 12 ఎనిమిది సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టింది.

1. ఆంధ్ర పాలకులు దోసుకపోయిన తెలంగాణ మిగులు నిధుల లెక్క తేల్చడానికి ఉన్నతాధికార సంఘం ఏర్పాటు చేయడం
2. తెలంగాణకు నిధులను సమకూర్చడం
3. తెలంగాణ అభివృద్ధికి ముఖ్యమంత్రి అధ్యక్షతన కమిటి
4. ప్రణాళిక సంఘం సలహాదారుల కమిటి
5. కమిటీలో ఎక్కువ అధికారాలు అధికారులకు ఉండేలా చూడడం
6. స్థానికులకే తెలంగాణ ప్రాంత ఉద్యోగాలు దక్కేలా చర్య తీసుకోవడం
7. తెలంగాణ ఉద్యోగుల సర్వీసు సమస్యలు పరిష్కరించడం
8. తెలంగాణ అభివృద్ధి కేంద్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం

ఈ పథకంలోని ఏ ఒక్క అంశము తెలంగాణ వాదులను సంతృప్తి పరచలేదు. తెలంగాణ వ్యాప్తంగ నిరసన జ్వాలలు భగ్గుమన్నయ్.

తెలంగాణ ప్రజాసమితి మేడేని 'డిమాండ్స్ డే' అనే పేరుతో తెలంగాణ వ్యాప్తంగ జరపాలని పిలుపునిచ్చింది. హైద్రాబాద్‌లో చార్మినార్ నుంచి రాజ్‌భవన్‌కు ఊరేగింపుగ వెళ్ళి గవర్నర్‌కు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించింద్రు. కాని ఊరేగింపుకు నాంపల్లి నుంచి మాత్రమే అనుమతి దొరికింది.

మల్లికార్జున్, మదన్‌మోహన్, కేశవరావ్‌జాదవ్‌లు చార్మినార్ నించి కదిలే ఊరేగింపుకు నాయకత్వం వహించింద్రు. అనేక విధాలుగ మారు వేశాల్లో భక్తుల మాదిరిగ పోలీసులకు అంతుచిక్కకుండ వేలాదిమంది చార్మినార్ దగ్గరికి చేరింద్రు. ఒక్కసారిగ జై తెలంగాణ నినాదాలు ఆకాశాన్ని అంటుకున్నయి. అక్కడ కొండా వెంకట రంగారెడ్డి ప్రసంగించి ఊరేగింపుని ప్రారంభించిండు. ఊరేగింపు మదీనాకు చేరంగనే పోలీసులు టియర్‌గ్యాస్ ఇడిసింద్రు. ఉద్యమకారులు రాళ్ల వర్షం కురిపించింద్రు. చెదిరిన గుంపులు మళ్ళీ ఒక్కటైనయి. రాళ్ళు పడతనే ఉన్నయ్. లాఠీచార్జ్ జరుగుతనే ఉంది. ఊరేగింపు సిద్దంబర్ బజార్ మసీదు దగ్గరికి రాంగనే పోలీసులు కాల్పులు జరిపింద్రు. సిద్దంబర్ చౌరస్త నించి మొజంజాహి మార్కెట్ దాక బజారంత రక్తసిక్తమయ్యింది. రణరంగాన్ని తలపించింది. పోలీస్ వ్యాన్‌లను తగలబెట్టింద్రు. రెండు గంటల దాక ప్రత్యక్ష యుద్ధం జరిగింది. ముగ్గురు అక్కడికక్కడే

చనిపోయింఁడు. లెక్కలేనంత మంది గాయపడ్డరు. గాయపడ్డవాళ్ళని ఆ తర్వాత ప్రజలే దావఖాన్ల ఏసింఁడు. ఊరేగింపు పబ్లిక్ గార్డెన్ చేరింది. సికింద్రాబాద్ నించి వచ్చే ఊరేగింపు పరేడ్‌గ్రౌండ్ దగ్గరికి రాంగనే ఎస్.బి. గిరిని అరెస్టు చేసింఁడు. ఊరేగింపు బోట్స్‌క్లబ్ చేరంగనే జనసంద్రం ఉప్పొంగింది. అక్కడ స్వతంత్రపార్టీ నాయకుడు తెలంగాణను సమర్థించే గౌతు లచ్చన్న ప్రసంగించిండు. అనంతరం ర్యాలి ట్యాంక్‌బండ్, సెక్రెటేరియట్ దాటి పబ్లిక్ గార్డెన్ చేరుకుంది. నగరం నలుమూలల నించి వేలాదిగ విద్యార్థులు, ప్రజలు రాజ్‌భవన్ చేరుకుంఁడు. గవర్నర్ ఖండూబాయి దేశాయ్‌తో డెలిగేషన్ బృందం మాట్లాడుతున్న సమయంలో పోలీసులు కాల్పులు జరిపి యుద్ధ వాతావరణాన్ని సృష్టించింఁడు. రాజ్‌భవన్ ఎదుట రైలు పట్టాల మీద విద్యార్థులు గాయాలపాలై పడిపోయింఁడు. సికింద్రాబాద్ సాయం కాలేజ్ విద్యార్థి యం.కె ఉమేందర్ రావు చనిపోయిండు. పోలీసు కాల్పుల్లో దాదాపు 20 మంది దాక చనిపోయిన 1969 మేడే హైద్రాబాద్ చరిత్రలో చీకటి రోజుగ మిగిలిపోయింది. ఈ సంఘటన ప్రజలను కూడ ఆలోచనలో ముంచింది. మే 2న జంటనగరాల బంద్ జరిగింది. ఇ.వి. పద్మనాభన్ అనే కార్పోరేటర్ ఈ అల్లర్లకు కారణమని అతన్ని అరెస్టు చేసింఁడు. అదేరోజు రాత్రి సికింద్రాబాద్ జేమ్స్‌స్ట్రీట్‌లో పోలీసు వ్యాన్‌మీద బాంబులు విసిరండంతో ఫారూక్ అలీ అనే కానిస్టేబుల్ చనిపోయిండు. ఆ తర్వాత ఈ బాంబు వేసింది పాలుపోసి బతికే నరేందర్, ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసే కుమార్ అని తెలిసి వాళ్ళని అరెస్టు చేసింఁడు.

కొండ వెంకట రంగారెడ్డి మే 15న తన పదవికి రాజీనామ చేసి ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మద్దతిచ్చిండు. మే 23న తెలంగాణ ప్రజా సమితి అధ్యక్షుడిగ మఱ్ఱి చెన్నారెడ్డి ఏకగ్రీవంగ ఎన్నికైండు. దీంతో మఱ్ఱి చెన్నారెడ్డి తెలంగాణ ప్రత్యక్ష ఉద్యమంలోకి వచ్చినట్టయ్యింది. అయితే 1952 గైర్‌ముల్కీ ఉద్యమంలో (కొండా, మఱ్ఱి) మామ అల్లుండ్లు ఇద్దరు మధ్యలోనే ఉపసంహరించుకున్నరని విద్యార్థి నాయకులు వీళ్ళను తీవ్రంగ వ్యతిరేకించింఁడు. పెద్ద మనుషుల ఒప్పందంలో లాలూచి పడ్డది కూడ వీళ్ళేనని విమర్శించింఁడు.

టి.ఎన్.జి.ఓ. నాయకుడు ఆమోస్ మే 24న ఉద్యోగుల సభలో జూన్ ఒకటి నాటికి ప్రత్యేక తెలంగాణ ఏర్పడకపోతే రక్తపాతం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించిండు. దీంతో ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల గుర్తింపుని రద్దు చేసింది. తెలంగాణ వ్యాప్తంగ నిరసనలు జరిగినయి. జడ్చర్లలో కాల్పుల మూలంగ ఒకరు చనిపోయింఁడు. సత్యాగ్రహాలు చేయడం అరెస్టు చేయడం రోజువారి

కార్యక్రమంగ కొనసాగింది. అమోస్‌ను పి.డి. చట్టం కింద అరెస్టు చేసింండ్రు. సదాలక్ష్మి, రాజారాం లాంటి వాళ్ళను అరెస్టు చేసి సుదూర ప్రాంతాలకు తీసుకపోయింండ్రు.

కమ్యునిస్టు పార్టీ నాయకుడు, హైద్రాబాదీ అయిన మగ్దూం ప్రజల మనోభావాలను అర్ధం చేసుకొని తెలంగాణ ఉద్యమం వైపు మొగ్గిండు. కాని ఉద్యమం నడుస్తున్న సమయంలో ఆగస్టులో ఆయన మరణించిండు. సి.పి.యం. పార్టీ మాత్రం విశాలాంధ్రలో ప్రజారాజ్యం అనే నినాదాన్ని వదలకుంట పట్టుకుంది.

తెలంగాణ ప్రజాసమితి 1969 మే1న రాజ్‌భవన్‌కు పెద్ద ర్యాలి తీసింది. ప్రభుత్వం ర్యాలీకి అనుమతి ఇవ్వకపోయినా ఉద్యమకారులు ధైర్యంగ ముందుకు నడిసింండ్రు. 'బానిస బతుకు కంటే చావే మేలని' ప్రభోదించిన కొండ వెంకట రంగారెడ్డి మాటలు బలంగ పనిచేసినయి. ఉద్యమకారులు ప్రాణాలకు తెగించి ముందుకు ఉరుకొచ్చింండ్రు. ప్రభుత్వం ఉద్యమ కారులమీద కాల్పులు జరపడానికి భయపడ్డది. 1969 మే21న తెలంగాణ ప్రజాసమితి బాధ్యతలు మర్రి చెన్నారెడ్డి తీసుకుండు. విద్యార్థులు మల్లికార్జున్ నాయకత్వంలో మే 29న పరీక్షలు బహిష్కరించాలని వైస్‌ఛాన్స్‌లర్‌కు వినతి పత్రం సమర్పించింండ్రు. అమోస్‌కు మద్దతుగ విద్యార్థులు నిరాహార దీక్షలు మొదలు పెట్టింండ్రు. అమోస్ కుటుంబానికి ఉపాధ్యాయులు, ప్రజలు పెద్ద ఎత్తున విరాళాలు ప్రకటించి ఉద్యమానికి మరింత బలాన్ని అందించింండ్రు.

తెలంగాణ ప్రజాసమితి జూన్ 2న నగరబంద్‌కు పిలుపినిచ్చింది. అయితే ఆబిడ్స్ చౌరస్తాలో దుర్గావిలాస్ అనే ఒక హోటల్ మరియు లాడ్జి తెరిచి ఉంచడంతో బంద్ చేయాలని విద్యార్థులు అడిగింండ్రు. ఇది కోస్తాంధ్ర వాళ్ళది కావడం వల్ల పథకం ప్రకారమే హోటల్లో ఉన్న రౌడీలు కారంపొడి, కత్తులతో దాడి చేసింండ్రు. ఇరు వర్గాలు వీరోచితంగ కొట్టుకుంటున్న సమయంలో ప్రేమకిషోర్ అనే యువకున్ని షటర్‌లోపల బంధించి కత్తులతో పొడిచింండ్రు. విద్యార్థులు అతన్ని తీసుకొని దావఖానకు పోయే లోపల చనిపోయిండు. దీంతో జనం రెచ్చిపోయింండ్రు. ఎన్నిసార్లు కర్ఫ్యూ విధించిన పరిస్థితి అదుపులోకి రాలేదు.

జూన్ 4వ తేదీన పాతబస్తీలో అలియాబాద్‌లో పోలీసు కాల్పుల్లో టి.వెంకటేశ్వరరావు అనే న్యాయవాది చనిపోయిండు. షక్కర్‌గంజ్‌లో బియ్యం చెరుగుతున్న ఒక మహిళకు తూటా తగిలి చనిపోయింది. కవాడిగూడలో ఆకుల నరేందర్, చాదర్‌ఘాట్‌లో రేణుక, బేగంపేటలో ముగ్గురు స్త్రీలు, సాధారణ మనుషులు ఎందరో ఈ నాలుగు రోజుల్లో ప్రాణాలు కోల్పోయింండ్రు. హైద్రాబాద్‌లో జరిగే అల్లర్లు, కర్ఫ్యూ గురించి జనం పేపర్లలో చూస్తూ, రేడియోలలో వింటు ఎప్పటికప్పుడు

విషయాల్ని తెలుసుకోవడంలో ఆసక్తిని కనబరిచింఁడు. ఈ ఒక్కరోజు పోలీసులు ఏడుసార్లు కాల్పులు జరిపి స్త్రీలు, పిల్లలని కూడ చూడకుండ చంపేసింఁడు. ఈ స్థితిలో కూడ తెలంగాణ మంత్రులు, శాసనసభ్యులు ఉద్యమానికి మద్దతు పలికింఁడు తప్ప పదవులను వదులుకోలేదు. జూన్ 6న హైద్రాబాద్‌లో కాళోజీ నారాయణరావు అధ్యక్షతన తెలంగాణ రచయితల సదస్సు జరిగింది జూన్ 10న తెలంగాణ ఉద్యోగుల నిరవధిక సమ్మె మొదలైంది. ప్రభుత్వ దమననీతికి వ్యతిరేకంగ విద్యార్థి కార్యాచరణ సమితి మరియు తెలంగాణ ప్రజా సమితి జూన్ 16న తెలంగాణ బంద్‌కు పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ బంద్ సంపూర్ణంగ విజయవంతమై, ఉద్యమానికి మరింత ఊపునిచ్చింది.

జూన్ 25న హైద్రాబాద్ ఆబిడ్స్ చౌరస్తాలో జరిగిన సత్యాగ్రహానికి 50వేలకు పైగ జనం సత్యాగ్రహంలో పాల్గొన్నట్టు వార్తలే వచ్చినయ్. లాటీచార్జ్, కాల్పులు జరుగుతయిని తెలిసి కూడ ప్రజలు ఇంత పెద్ద ఎత్తున రావడమనేది తెలంగాణ ఆకాంక్ష ప్రజల్లో ఎంత ధృడంగ ఉందో అర్థమైతది. తండోపతండాలుగ వస్తున్న జనాన్ని కట్టడి చేయడం పోలీసుల వల్ల కాలేదు. ఆబిడ్స్ చౌరస్తాలో ఉన్న బృందావన్ హోటల్ కూడ దుర్గావిలాస్ వాళ్ళకు చెందిందే. హోటల్ ముందు గుంపుగూడిన జనం కోపంతో రగిలిపోయి హోటల్ మీద దాడి చేసింఁడు. ఫర్నీచర్ ధ్వంసం చేసింఁడు. అద్దాలు పగలగొట్టింఁడు. గుండాలు ఎదురుదాడి చేసింఁడు. శ్రీధర్ రెడ్డి సంయమనం పాటించి ఇరువర్గాలకు చేతులెత్తి దండం పెట్టిండు. ముందు నన్ను కాల్పండి అంటూ పోలీసులను వేడుకున్నడు. దీంతో యువకులు ప్రేంకిషోర్ అమర్‌హై అంటూ నినాదాలు చేస్తూ వెళ్ళిపోయింఁడు.

అదేరోజు రాత్రి ముషీరాబాద్ జైళ్ళో ఖైదీలు సత్యాగ్రహం చేసే వాళ్ళ మీద దాడి చేసింఁడు. జైలు అధికారుల సాయంతో ఖైదీలు రెచ్చిపోయింఁడు. జైలు రక్తసిక్తమైంది. హాహాకారాలకు చుట్టుపట్టు జనం ముషీరబాద్ జైలుకు తరలివచ్చింఁడు. గేటుని ఇరుగదన్నే ప్రయత్నం చేసింఁడు. ఆఖరికి కాగడాలు తయారు చేసి కిటికీలోంచి జైలు లోపలికి విసరడంతో ఆఫీసు తగలబడ్డది. పరిస్థితిని సమీక్షించడానికి అక్కడికి వచ్చిన పార్లమెంట్ సభ్యుడు జి. వెంకటస్వామి జీపు టైరును తుపాకితో కాల్చడంతో జీపు బోల్తాపడి అందరికి గాయలైనయ్. ముఖ్యమంత్రి తనను చంపడానికి కుట్ర చేసిండని ఆరోపించిండు. ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగ తెల్లారి ఉద్యమకారులు బంద్‌కు పిలుపునిచ్చింఁడు.

ఆ తర్వాత చాలా రోజుల వరకు ముషీరాబాద్ జైళ్ళో ములాఖత్‌లను బందుజేసింఁడు.

తెల్లారే సరికి తెలంగాణ అగ్రనాయకులందర్ని అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించిండ్రు. వీళ్ళలో మర్రి చెన్నారెడ్డి, కొండాలక్ష్మణ్ బాపూజీ, విశాల్ పిట్టీ, ఇ.వి. పద్మనాభన్, సంతపురి రఘువీర్ రావులు ఉన్నరు. అగ్రనాయకుల అరెస్టును నిరసిస్తూ జంటనగరాల బంద్‌ను పాటించిండ్రు. జంటనగరాలకు చెందిన లాయర్లు 400 కార్లలో ఊరేగింపుగ రాజ్‌భవన్‌కు చేరుకొని గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చిండ్రు. ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలనను విధించాలని కోరిండ్రు. జూన్ 27న ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి పరిస్థితిని గమనించి రాజీనామ లేఖను పార్టీ అధ్యక్షుడు నిజలింగప్పకు ఇచ్చిండు. దీంతో అధిష్ఠానం తదుపరి నిర్ణయం తీసుకునే వరకు బ్రహ్మానందరెడ్డినే ముఖ్యమంత్రిగ కొనసాగాలని ఆదేశించిండు.

తెలంగాణ ఉద్యమకారులు ఆరునెల్ల పోరాట ఫలితమే ముఖ్యమంత్రి రాజీనామ చేసిండని ఇది మనందరి విజయమని రోడ్లమీదకొచ్చి సంబరాలు చేసుకుండ్రు. నగరమంత ఊరేగింపులు జరిపిండ్రు. హద్దులు దాటిన ఆనందం పోలీసులకు ఆగ్రహాన్ని తెప్పించింది. పోలీసులు అమాయకులైన ప్రజల మీద లాఠీలు ఝులిపించిండ్రు. తూటాలు పేల్చిండ్రు. అయినా లెక్కచేయని జనం పోలీసు జీపుల్ని, ఫైర్‌ఇంజన్‌లని దహనం చేసిండ్రు. సికింద్రాబాద్ హెడ్‌పోస్టాఫీస్‌ని తగలబెట్టిండ్రు. దుకాణాలను ధ్వంసం చేసిండ్రు. వీధులన్ని సర్వనాశనం చేసిండ్రు. జూన్ 29న తెలంగాణ మంత్రులందరు రాజీనామ చేసిండ్రు. జూలై 1న ఆటో, ట్యాక్సి డ్రైవర్లు వెయ్యిమందికి పైగా పెద్ద ఊరేగింపు జరిపి బహిరంగ సభ నిర్వహించిండ్రు. ప్రభుత్వం విద్యార్థి నాయకులను బంధించింది. పి.డి. చట్టం అమలు చేసి రాజమండ్రి జైలుకు తరలించింది. వీళ్ళలో ఉస్మానియా హాస్పిటల్ అసిస్టెంట్ సర్జన్ డా॥గోపాలల్‌కిషన్ ఉన్నడు. మొత్తం భారతదేశంలోనే పి.డి. యాక్టు కింద అరెస్ట్ అయిన తొలి గజిటెడ్ ఆఫీసర్ ఈయనే. మాజీమంత్రి శ్రీమతి సదాలక్ష్మి తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని తెలంగాణ మంత్రులను సంఘబహిష్కరణ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. జులై నెలలో ప్రతిరోజు ఏదో ఒక చోట ఉద్యమాలు, అరెస్టులు, కాల్పులు జరుగుతూనే ఉన్నయి. జులై 12న తెలంగాణ వ్యాప్తంగ 'ఫ్లాగ్‌డే' జరుపుకుండ్రు. ఈ సంధర్భంగ పార్లమెంట్ సభ్యుడు డా॥ మెల్కోటెను అరెస్టు చేసిండ్రు.

జూలై 16న 37 రోజులుగా కొనసాగుతున్న తెలంగాణ ఉద్యోగులు సమ్మె విరమించిండ్రు. ఆగస్టు నెలలో ఖమ్మం జిల్లాలో హోం మినిష్టర్‌గ ఉన్న జలగం వెంగళరావు రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్ల సమైక్యవాదులు, ప్రత్యేకవాదుల నడుమ ఉద్రిక్తత తలెత్తింది. మంత్రి ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నంలో పోలీసులు కాల్పులు జరిపిండ్రు.

ఈ కాల్పుల్లో ముగ్గురు చనిపోయింద్రు. హైద్రాబాద్‌లో ముమ్మరంగ సత్యాగ్రహాలు కొనసాగుతూనే ఉన్నయి. 17మంది మహిళల ఆధ్వర్యంలో ఆబిడ్స్‌లో జరిగిన సత్యాగ్రహానికి కుమారి నర్సమ్మ నాయకత్వం వహించింది. అదేవిధంగ సికింద్రాబాద్‌లోని గుమస్తాలందరు వాసుదేవ్ నాయకత్వంలో సత్యాగ్రహంలో పాల్గొన్నరు. లక్షలాది మంది పాల్గొన్న ఈ సత్యాగ్రహోద్యమంలో వేలాది మందిని అరెస్టు చేసి జైళ్ళలో బంధించింద్రు. సికింద్రాబాద్‌లో సత్యాగ్రహం చేస్తున్నవాళ్ళమీద పోలీసులు కాల్పులు జరపడంతో చేపలబాయికి చెందిన రవీంద్రనాద్ చనిపోయిండు. వరంగల్‌లో కాళోజీ నారాయణరావును అరెస్టుచేసింద్రు.

తెలంగాణ ప్రజాసమితి ఆధ్వర్యంలో ఆగస్టు 15న వివేకవర్ధని కాలేజ్‌లో జాతీయజెండతో పాటు తెలంగాణ జెండను ఆవిష్కరించింద్రు. కొండా వెంకట రంగారెడ్డి, సదాలక్ష్మి, సుమిత్రాదేవిలు అధ్భుతంగ మాట్లాడింద్రు.

తెలంగాణ ప్రాంతానికి చెందిన పార్లమెంటు సభ్యులు జి. వెంకటస్వామి, డా॥మెల్కోటే ఆగస్టు 18న పార్లమెంట్‌లో తెలంగాణ అంశం మీద మాట్లాడింద్రు. అప్పటికే 250 మంది విద్యార్థులు చనిపోయింద్రని, బంగారు భవిష్యత్తు ఉన్న 300 మంది విద్యార్థులను పి.డి.యాక్టుతో నిర్భంధించింద్రని లక్షలాది మందిని అరెస్టు చేసింద్రని ఆవేశంతో ప్రసంగించింద్రు. వెంకటస్వామి మాట్లాడుతూ పోలీసుల తుపాకి గుండ్లను కొద్దిలో తప్పించుకొని పార్లమెంటుకు వచ్చినట్టు, ఉద్యమ తీవ్రతను అర్థమయ్యేటట్టు వివరించిండు. తెలంగాణ సాధించే వరకు పోరాడుతానని శపథం చేసి 'జై తెలంగాణ' అంటూ ప్రసంగాన్ని ముగించిండు.

ఆ తర్వాత రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అగ్రనాయకులు, ఉద్యమకారులందరిని విడుదల చేసింద్రు. సెప్టెంబర్‌లో కళాశాలల ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. సెప్టెంబర్ 2న కొండా లక్ష్మణ్ బాపూజీ శాసనసభను గంటన్నర సేపు స్థంభింప జేసిండు. తెలంగాణ అంశాన్ని చర్చించాలని పట్టుబట్టిండు. సెప్టెంబర్ 8న శ్రీధర్‌రెడ్డి జైలు నుంచి విడుదలై వివేకవర్థిని కాలేజ్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిండు. పోరాటం కొనసాగిస్తమని ప్రకటించిండు. సెప్టెంబర్ 9న వాంఛూ కమిటి 'ముల్కీ నిబంధనలు కొనసాగించడం వీలు కాదని' ప్రకటించడంతో కళాశాలల మీద బాంబులు వేసి నిరసన తెలిపింద్రు. సెప్టెంబర్ 17 నాటికి రాష్ట్రం ఏర్పడక పోతే పోటీ ప్రభుత్వం నడుపుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించింద్రు.

తెలంగాణ కాంగ్రేసు నాయకులు ముఖ్యమంత్రిని మార్చితె ఉద్యమం

ఆగిపోతుందని కొందరు, విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని కొందరు ప్రకటించిండ్రు. మర్రి చెన్నారెడ్డి ఏకంగ రాష్ట్రపతి వి.వి.గిరి ముందు ఈ విషయాన్ని ప్రస్తావించిండు. దానికి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి కూడ సంతోషాన్ని వ్యక్తం చేసిండు. విద్యార్థులు కళాశాలలకు పోతే ఏ సమస్య ఉండదని వాళ్ళ మాటల్లోని సారాంశం బయటికి వచ్చింది. విద్యార్థులు తరగతులకు హాజరు కావాలన్న మల్లికార్జున్ నిర్ణయాన్ని సికింద్రాబాద్ విద్యార్థులు తీవ్రంగ వ్యతిరేకించిండ్రు. నిర్ణయం తీసుకోవల్సింది విద్యార్థులు కాని మర్రిచెన్నారెడ్డి, మల్లిఖార్జున్‌లు కాదని శ్రీదర్‌రెడ్డి తీవ్రంగ విమర్శించిండు. విడతల వారిగ పోరాటం కొనసాగిస్తామని సూచించిండు. అక్టోబర్ 10న తెలంగాణ వ్యాప్తంగ మూడు లక్షల మంది సత్యాగ్రహం చేపడతారని అయితే దీంట్లో 18 సంవత్సరాల లోపు వారు పాల్గొనకూడదని పత్రికా ప్రకటన విడుదల చేసిండు. అన్నిచోట్ల సత్యాగ్రహం ప్రశాంతంగ జరిగింది. కాని ఆబిడ్స్‌లో బస్సును తగలబెట్టడంతో సత్యాగ్రహం ఉద్రిక్తంగ మారింది. బాష్పవాయు ప్రయోగం, లాఠీచార్జ్‌లు జరిగినయ్. తెలంగాణ విషయంలో కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా మల్లికార్జున్ నిరాహార దీక్ష చేసిండు. విద్యార్థులను తరగతులకు హాజరు కావాలని వేడుకుండు. అక్టోబర్ 11న కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజా సమితికి రాజీనామ చేసిండు. మల్లీకార్జున్ దీక్ష 12 వ రోజుకు చేరింది. ఈయనకు మద్దతుగ విద్యార్థి విభాగం మహిళ అధ్యక్షురాలు సి. హెచ్. రమాదేవి దీక్షను ప్రారంభించింది. మూడు రోజుల్లోనే రమాదేవి దీక్షను పోలీసులు భగ్నం చేసిండ్రు. తెలంగాణ ప్రజాసమితి నవంబర్1 రాష్ట్రావతరణకు నిరసనగ తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చింది. నవంబర్ 1 నుంచి 11 రోజుల నిరాహార దీక్ష చేపడుతున్నట్టు కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రకటించిండు. నవంబర్ 26న విద్యార్థులు పరీక్షలు రాస్తున్నందున ఉద్యమంలో కాస్త స్థబ్దత ఏర్పడిందని అన్నారు. మరుసటి రోజునే ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన చెన్నారెడ్డి వచ్చే సంవత్సరం జనవరి వరకు ఉద్యమాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించిండు.

డిసెంబర్ 6వ తేదీన తెలంగాణ ప్రజాసమితి అధ్యక్ష పదవి నుంచి మర్రి చెన్నారెడ్డిని తొలగిస్తున్నట్టు సదాలక్ష్మి మరికొందరితో కలిసి ప్రకటించింది.

బొంబాయిలో జరిగిన ఇందిరా కాంగ్రేసు సభలో తెలంగాణ అంశం చర్చకు కూడ రానీయలేదు. డిసెంబర్ 26న తెలంగాణ ప్రజా సమితి అధ్యక్షుడిగా మర్రి చెన్నారెడ్డి, 29న మల్లికార్జున్ విద్యార్థి కార్యాచరణ సమితికి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగ ఎన్నికైండ్రు.

అసెంబ్లీ ఎదుట గల గన్‌రాక్‌పార్క్‌లో తెలంగాణ అమరవీరుల స్మారకస్థూపాన్ని నిలబెట్టాలని శ్రీధర్‌రెడ్డితో కలిసి విద్యార్థులు ఆలోచన చేసింద్రు. అంతర్జాతీయ శిల్పి ఎక్కా యాదగిరిరావుతో స్థూపానికి రూపకల్పన చేయించింద్రు.

1971లో లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలొచ్చినయ్. ఈ ఎన్నికల్లో ప్రజాసమితి పార్టీకి పది స్థానాలు దక్కినయ్. పెద్దపల్లి నుంచి వి. తులసీరాం, కరీంనగర్ నుంచి యం. సత్యనారాయణరావు, మెదక్ నుంచి మల్లికార్జున్, సిద్దిపేట నుంచి జి. వెంకటస్వామి, సికింద్రాబాద్ నుంచి ఎం.ఎం. హాషం, హైద్రాబాద్ నుంచి జి.యస్. మెల్కోటె, మహబూబ్‌నగర్ నుంచి జె. రామేశ్వర్ రావు, నాగర్‌కర్నూల్ నుంచి ఎం. భీష్మదేవ్, నల్లగొండ నుంచి కె. రామకృష్ణారెడ్డి, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎస్.బి. గిరి గెలిచింద్రు. తెలంగాణ ఆకాంక్షతో ఓట్లేసిన జనాన్ని నిలువున ముంచి ఉద్యమాన్ని ఇందిరాగాంధీ కాళ్ళకాడ తాకట్టు పెట్టిండు. మర్రిచెన్నారెడ్డి తెలంగాణ ప్రజాసమితి పార్టీని కాంగ్రేస్‌లో విలీనం చేసిండు.

370 మంది విద్యార్థులు చనిపోయిన 1969 ఉద్యమం ప్రధానంగ పట్టనాలకే పరిమితం అయ్యిందనడానికి నిధర్శనం 1970లో జరిగిన పంచాయతిరాజ్ ఎన్నికలలో 115 స్థానాలకు గాను తెలంగాణ ప్రజాసమితికి కేవలం 20స్థానాలు మాత్రమే రావడం, విద్యార్థి ఉద్యమంలోని దుందుడుకుతనం తెలంగాణ నాయకుల డొల్లతనం, కాంగ్రేసు నాయకుల దళారితనం ఈ ఉద్యమంలో బయటపడ్డయి. ఏదేమైన భారత స్వాతంత్రపోరాటంలో సిపాయిల తిరుగుబాటుకు ఉన్న ప్రాధాన్యత తెలంగాణ ఉద్యమంలో 1969 ఉద్యమం సంతరించుకుంది. సీమాంధ్ర పాలకులకు ఒక హెచ్చరికను చేసింది. ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణిచివేయడం వలన భవిష్యత్తులో ఎప్పుడైన, ఏదో ఒక రూపంలో తెలంగాణ మళ్ళీ విజృంభిస్తుందనే సంకేతాలనైతే ఇచ్చింది.

1952 ముల్కీ ఉద్యమం గాని, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం గాని ప్రజల ఆకాంక్షల నించి పుట్టుకొచ్చినయి. ఇవేవి రాజకీయనాయకులు సృష్టించినయి కావు. పైగా ప్రజలు ప్రాణాలకు ఎదురునిలిచి పోరాడి రాజకీయ నాయకులకు పదవులను కట్టబెట్టిన ఉద్యమం.

1971 లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో తెలంగాణ ప్రజాసమితి 11 పార్లమెంట్ స్థానాలలో ఘనవిజయం సాధించింది. మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ప్రజాసమితిని కాంగ్రేసు పార్టీలో విలీనం చేసిండు.

1969లో జరిగిన అఖిలపక్ష ఒప్పందం ద్వార తప్పుడు ముల్కీ సర్టిఫికెట్‌లు

సమర్పించిన వాళ్ళని విచారించి శిక్షించాలని, నిబంధనలకు వ్యతిరేకంగ ఉద్యోగల్లో చేరినవాళ్ళను తొలగించాలని, స్థానిక సంస్థలకు ముల్కీ నిబంధనలను వర్తింప చేయాలని, నిధులు లెక్క తేల్చాలని, విద్యావసతులు కల్పించాలని కోరుకున్నరు. సరేనని అడ్డంగ తలూపిన ఆంధ్ర ప్రభుత్వం మొత్తానికి ఉద్యమాన్ని అణిచేసింది.

1972లో పి.వి.నర్సింహ్మారావు ముఖ్యమంత్రిగ ఉన్నప్పుడే శాసనసభకు ఎన్నికలు వచ్చినయ్. కాంగ్రేస్ ఈ ఎన్కికల్లో మొత్తం 287 స్థానాలకు గాను 196 గెలిచి ఘనవిజయం సాధించింది. 1972 మార్చి 20న పి.వి. రెండవసారి ముఖ్యమంత్రిగ ప్రమాణస్వీకారం చేసిండు. 1972 లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు హడావిడిగ ముల్కీ నిబంధనలు రాజ్యాంగబద్ధం కావని తీర్పునిచ్చింది. తెలంగాణ రక్షణలను కాపాడాలని దృఢసంకల్పంతో ఉన్న పి.వి. ఇందిరాగాంధీ సహకారంతో కేసును సుప్రీంకోర్టు వరకు తీసుకపోయిండు. దీంతో 1972 అక్టోబర్ 3న సుప్రీంకోర్టు తీర్పుని వెలువరించింది. హైద్రాబాద్ ప్రభుత్వ ముల్కీ నియమాలకు బదులు1958లో నియమావళి పేరుతో కేంద్రప్రభుత్వం చేసిన చట్టాన్ని రద్దు చేసింది కాబట్టి ముల్కీ శాసనం అమలులో ఉన్నట్టే అని తీర్పు స్పష్టంగా ఇచ్చింది. ముల్కీ నిబంధనల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆంధ్రులకు మింగుడు పడలేదు. ఈ దెబ్బతో తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్నలు జై ఆంధ్ర ఉద్యమాన్ని లేవదీసిండ్రు. విద్యార్థి నాయకుడైన చంద్రబాబు నాయుడు జై ఆంధ్ర ఉద్యమాన్ని సమర్థించిండు. ఊకదంపుడు ఉపన్యాసాలతో గుంటూరు రైల్వే స్టేషన్‌ని తగలబెడతం, దక్షణ భారతాన్ని వేరుచేస్తం, ప్రత్యేక ఆంధ్రని చేసుకుంటం అని విద్వేశాలను రగిలించిన ఆంధ్రులకు తెలంగాణ ఉద్యమం మాత్రమే వేర్పాటు ఉద్యమంగ కనిపిస్తది.

ఉత్తగనే పుట్టుకొచ్చిన మూడు నెలల ఉత్తుత్త 'జై ఆంధ్ర' ఉద్యమానికి కేంద్రం వణుకుడుబట్టి తెలంగాణ రక్షణలను తొలగిస్తున్నట్టు ప్రకటించింది. చేతగాని మాటలకే కేంధ్రం చేతులు ఎత్తేసింది. 1973లో పి.వి. నర్సింహ్మారావు ని ముఖ్యమంత్రి పదవికి రాజీనామ చేయించి రాష్ట్రపతి పాలన విధించింది.

ఐదు, ఆరు, ఎనిమిది సూత్రాల పథకాలు, అఖిలపక్ష ఒప్పందాలతో 69 ఉద్యమాన్ని అణిచివేసిండ్రు. అధికారం కోసమే చెన్నారెడ్డి ఉద్యమాన్ని నీరుగార్చిండన్న అపవాదు మిగిలిపోయింది. 1973 సెప్టెంబర్ 21 ఆరు సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టింది. వీటికి చట్టబద్దత కల్పించింది. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ జరగడంతో 1973 అక్టోబర్ ముల్కీ నిబంధనలు రద్దయినయ్. ఆరు సూత్రాల పథకంలోని 5వ నిబంధన "ఫిర్యాదులను పరిష్కరించడానికి అవసరమైతే రాజ్యాంగాన్ని

సవరించే అధికారం రాష్ట్రపతికి ఉండాలె" ప్రకారం రాజ్యాంగ సవరణ చేసి ఆర్టికల్ 371 డిని చేర్చింట్రు. ఈ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రాన్ని ఆరు జోన్‌లుగ విభజించింట్రు. 1,2,3, జోన్‌లు ఆంధ్రప్రాంతం, 4వజోన్ రాయలసీమ, 5,6, జోన్‌లు తెలంగాణ. ఈ ఆరు సూత్రాల పథకం ఆంధ్రులకు ఎనలేని లాభాన్ని చేకూర్చి పెట్టింది. దీంతో తెలంగాణ ప్రాంతీయ బోర్డు రద్దయ్యింది. రాజధానిని ఫ్రీజోన్‌గ మార్చుకున్నరు. నివాస పరిమితిని 15 సంవత్సరాల నుండి 4 సంవత్సరాలకు కుదించింట్రు. ఆంధ్ర, తెలంగాణ ఆదాయాన్ని విడివిడిగా చూపే పద్ధతిని రద్దు చేసింట్రు.

ఈ సూత్రాల వల్ల వలసాంధ్ర పాలనలో తెలంగాణకు ఉన్న గోషి ఊడిపోయింది. నాటి నుంచి తెలంగాణ పేరు చెప్పుకొని నాయకులు బాగుపడ్డరు తప్ప ప్రజలు కన్నశెరలు అనుభవించింట్రు. తెలంగాణ నాయకులు ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టి బతికింట్రు. కొందరు నాయకులు కసితో రగిలిపోతు అదును కోసం ఎదురు చూసింట్రు.

# 1996 నుంచి 2014

తెలంగాణ ప్రాంతానికి ఒక రాష్ట్రంగ ఏర్పడడానిక కావలసిన అన్ని వనరులు సమృద్ధిగ ఉన్నయి. జల, ఖనిజ, మానవ వనరులు పుష్కలంగ ఉన్నయి. ఇతర ప్రాంతాల మీద ఆధారపడి బతకాల్సిన అవసరం లేకుండ బొగ్గు, సున్నపురాయి, ఇనుప ఖనిజ నిక్షేపాలు ఉండడం ఈనేల చేసుకున్న పుణ్యం. సకల సంపదలతో సస్యశ్యామలంగ బతికిన తెలంగాణ ప్రాంతాన్ని పీల్చి పిప్పి చేసిన ఘనత వలసాంధ్ర పాలకులకే దక్కుతుంది. చేనేత కార్మికులు, రైతులు ఆకలి చావులు, ఆత్మహత్యలతో అల్లాడిపోతుంటే పట్టించుకున్న నాధుడు లేడు. అయ్యో అన్న పాలకుడు లేడు. తెలంగాణకు న్యాయంగ, ధర్మంగ దక్కాల్సినవాటి కోసం ఉద్యమిస్తె అణిచేసింద్రు. అమాయకుల ప్రాణాల్ని బలితీసుకుంద్రు. ఒక రకంగ చెప్పాలంటె 1969 ఉద్యమం అనుకున్న లక్ష్యాన్ని చేరక పోవడం వల్లనే తెలంగాణలో యువకులు నక్సలిజం వైపుకు అడుగులేసింద్రు. తెలంగాణ బిడ్డలు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రాణాలు పోగొట్టుకున్నరు. ఎన్.టి. రామారావు నక్సలైట్లను దేశభక్తులని పిలిచిండు. కాని ఆ దేశభక్తుల సమస్యలను వాళ్ళ డిమాండ్లని మాత్రం పరిష్కరించలేదు. నిరుద్యోగులైన యువకులు నిలువున రగిలిపోతుంటె, బారెడు సినిమా డైలాగులు చెప్పిండు. కాని ఏనాడు తెలంగాణ బాధని, దుఃఖాన్ని తీర్చింది లేదు. వలసపాలకుల కుట్రలను భరించలేక తిరగబడితె మూడోకంటికి తెలవకుండ మనుషుల్ని మాయజేసిండు. పైగ తెలంగాణ ఉద్యమంలో నక్సలైట్లు ఉన్నరని, వాళ్ళంత వేర్పాటువాదంతో సంఘ విద్రోహానికి పాల్పడుతున్నరని ఉద్యమాల మీద ఉక్కుపాదం మోపిన కర్కోటకులు సీమాంధ్ర పాలకులు. ఒక్క 1990 –94 మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లలోనే దాదాపు ఐదారొందల మంది చనిపోయింద్రు. వీళ్ళలో సగానికి పైగా తెలంగాణ వాళ్ళే. మిగతా సగం దాదాపు అందరు రెక్కలు ముక్కలు చేసుకొని ఆరుగాలం కష్టం చేసే రైతులే.

తెలంగాణ వాస్తవ పరిస్థితి తెలిసి కూడ పట్టించుకోని సీమాంధ్ర పాలకుల ద్వంద్వనీతిని, రెండుకండ్ల సిద్ధాంతాన్ని ఎదిరించడానికి తెలంగాణ బిడ్డలు అనేక రూపాలలో తమ నిరసనని వ్యక్తం చేసింద్రు. ప్రజాస్వామ్యబద్ధంగ సభలు సమావేశాలు జరిపి, శాంతియుత పోరాటాలు చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సంఘాలు ఏర్పాటు చేసింద్రు. 1996 మొదలు 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం సిద్ధించే వరకు అలుపులేని పోరాటం కొనసాగించింద్రు.

# తెలంగాణ సంఘాలు - సభలు

జలగం వెంగళరావు 1975 ఏప్రిల్ 12-19వరకు వారం రోజుల పాటు హైద్రాబాద్ ఎల్.బి. స్టేడియంలో ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగ జరిపిండు. విద్యాశాఖ మంత్రిగ ఉన్న మండలి వెంకట కృష్ణారావుకు ఈ బాధ్యతలు అప్పజెప్పిండు. ఈ సభల నిర్వహణలో కోట్ల రూపాయల అవినీతి జరిగినట్టు ఆ తర్వాత బయటపడింది. తెలంగాణ నాయకుడు టి. అంజయ్య ముఖ్యమంత్రిగ ఉన్నప్పుడు రెండవ ప్రపంచ తెలుగు మహాసభలను కౌలాలంపూర్‌లో నిర్వహించింద్రు.

తెలంగాణ ప్రజాసమితి 1987లో మళ్ళీ ఆవిర్భవించింది. వరంగల్‌కు చెందిన భూపతి కృష్ణమూర్తి అధ్యక్షుడిగా తిరిగి పనిని ప్రారంభించింది.

1990లో ముఖ్యమంత్రి పదవికి చెన్నారెడ్డి రాజీనామ చేయడంతో నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యిండు. ఈయన కాలంలోనే మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు మారిషస్‌లో జరిగినయ్. ఎప్పుడు తెలంగాణ వాదం పుంజుకునే పరిస్థితి ఉంటే అప్పుడు తెలుగు పేరుతోని సభలు, సమావేశాలు ముమ్మరంగ జరిగినయి. ఆ సభల కోసం తెలంగాణ కవులు, రచయితలు కూడ వెంపర్లాడిన సందర్భాలు ఉన్నయి.

1992లో జరిగిన విద్యార్థుల ఉద్యమం మరోసారి తెలంగాణ వాదాన్ని బలంగ తెరమీదికి తెచ్చింది. కాలేజ్ సీట్లలో 85శాతం తెలంగాణకు మిగిలిన 15శాతం ఓపన్ కోటా అయితే వలసాంధ్ర పాలకులు ఆ 15 శాతాన్ని స్థానికేతరులకు రిజర్వు చేసింద్రు. ఈ విషయం మీద విద్యార్థులు జరిపిన సభకు జార్జిఫెర్నాండెజ్, మేధాపాట్కర్‌లు వచ్చి విద్యార్థి ఉద్యమానికి మద్దతు పలికింద్రు.

1997 ఆగస్టు 14, 15 తేదీలలో ప్రొఫెసర్ జయశంకర్ సార్, కేశవరావు జాదవ్, వి. ప్రకాశ్, రాపోలు ఆనందభాస్కర్ లాంటివాళ్ళు మరికొందరితో కలిసి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సమావేశం ఏర్పాటుచేసుకొని తెలంగాణ అంశాన్ని చర్చించింద్రు. విద్యార్థులు, మేధావుల్లో వచ్చిన కదలికతో అదేరోజు తెలంగాణ ఐక్యవేదికను ఏర్పాటు చేసింద్రు.

ఎన్.టి. రామారావు మూడవసారి ముఖ్యమంత్రి అయినప్పుడు జైళ్ళశాఖ మంత్రిగ పనిచేసిన టి. ఇంద్రారెడ్డి 1997లో జై తెలంగాణ పార్టిని స్థాపించిండు.

చంద్రబాబు కేంద్రంలో దేవెగౌడతో కలిసి చక్రం తిప్పుతున్నప్పుడు లక్ష్మీపార్వతి పార్టీలో ఉన్న ఇంద్రారెడ్డి తెలంగాణ ఆకాంక్షను గుర్తించిండు. తెలంగాణ విజయ యాత్రలు చేసిండు. ప్రొఫెసర్ జయశంకర్ లాంటి తెలంగాణ పెద్దతులు ఇంద్రారెడ్డికి మద్దతునిచ్చిండ్రు. ఇంద్రారెడ్డి జైతెలంగాణ పార్టీకి అధ్యక్షుడిగ ప్రకటించుకొని ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రజలు ఆ పార్టీకి దూరమైండ్రు. అనతి కాలంలోనే వై.యస్.ని మించిన మొనగాడు లేడని తెలంగాణ రాష్ట్ర సాధన వై.యస్.తోనే సాధ్యమైతదని జై తెలంగాణ పార్టీని కాంగ్రేసులో కలిపిండు. సీమాంధ్రుల కాళ్ళుగడిగి దండం పెట్టిండు. ఆ తర్వాత రోడ్డు యాక్సిడెంట్‌లో చనిపోయిండు.

1984 ఎన్నికలలో జనసంఘ్ పేరు మారి భారతీయ జనతా పార్టీగ అవతరించింది. జనసంఘ్ నేత అటల్‌బిహారీ వాజపాయ్ హైద్రాబాద్ ప్రత్యేక రాష్ట్రంతో పాటు చిన్న రాష్ట్రాల ఏర్పాటును సమర్థించిండు. అలాంటిది భారతీయ జనతా పార్టీ 2004 వరకు తెలంగాణ అంశాన్ని పలకరించింది లేదు. బి.జె.పి.లో తెలంగాణ వాదాన్ని బలపర్చిన నాయకుడు కేవలం సి.హెచ్. విద్యాసాగర్ రావు మాత్రమే. 1997లో బి.జె.పి తెలంగాణకు అనుకూలమని ప్రకటించి 1998 మార్చిలో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో విజయం సాధించింది. లోక్‌సభ స్పీకర్‌గ టి.డి.పికి చెందిన జి.యం.సి బాలయోగి ఎన్నికైండు. 1999లో లోక్‌సభకు, శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరిగినయ్. కేంద్రంలో మళ్ళీ బి.జే.పి గెలిచింది. ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు వాజ్‌పాయ్ ప్రభుత్వానికి మద్దతిచ్చిండు. చంద్రబాబుని పక్కన పెట్టుకొని తెలంగాణ ఇవ్వడం సాధ్యమయ్యే పని కాదు కాబట్టి బి.జే.పి. తెలంగాణ మినహా ఉత్తరాంచల్, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్ అనే మూడు రాష్ట్రాలను నవంబర్ 2000 సంవత్సరంలో ఏర్పాటు చేసింది.

2000 సంవత్సరం ఆగస్టులో సోనియాగాంధి హైద్రాబాద్‌కు వచ్చినప్పుడు జయశంకర్ సార్ కాంగ్రేసు నాయకులను కలిసి తెలంగాణ విషయంలో సోనియాగాంధికి విన్నవించాలని కోరిండు. చంద్రబాబు మీద కోపంతో ఉన్న వై.యస్. వెంటనే చిన్నారెడ్డిని ఉసిగొల్పిండు. 38 మంది కాంగ్రేసు శాసనసభ్యులు సంతకాలు చేసిన ఉత్తరాన్ని సోనియాగాంధికి ఇచ్చిండ్రు. ఆ సందర్భంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ సోనియాతో మాట్లాడినప్పుడు తెలంగాణ విషయం నా మదిలో ఉందని చెప్పింది.

కాంగ్రేసు నాయకుడు చిన్నారెడ్డి 1999లో తెలంగాణ ప్రాంతీయ కాంగ్రేసు కమిటిని ఏర్పాటు చేసిండు. తెలంగాణ చిత్రపటంతో కూడిన కాంగ్రేసు జెండ పట్టుకొని సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం మీద గొంతెత్తిండు. ప్రజల్లో

ఉన్న స్పందనను చూసి, 2001లో వనపర్తిలో భారి బహిరంగ సభను ఏర్పాటు చేసిండు. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయమని ప్రకటించిండు. 2004లో శాసనసభ ఎన్నికలొచ్చినయ్. ఈ ఎన్నికలలో టి.ఆర్.ఎస్ పార్టీ కాంగ్రేసుతో పొత్తు పెట్టుకుంది. ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగ సోనియాగాంధి 2004 మార్చి7న కరీంనగర్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరైంది. "తెలంగాణ అన్ని విధాల వెనకబడి ఉంది. మీ బాధ నాకు తెలుసు. మీ ఆకాంక్ష నెరవేరడానికి అన్ని విధాల ప్రయత్నం చేస్త" అని హామి ఇచ్చింది. ఈ మాటల్ని ఉండవల్లి ఆరుణ్‌కుమార్ తెలుగులోకి ట్రాన్స్‌లేషన్ చేసి చెప్పిండు. ఈ ఎన్నికల్లో కాంగ్రేస్ విజయం సాధించి 2004 మే13న వై.యస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యిండు. టి.ఆర్.ఎస్ 26 అసెంబ్లీ స్థానాలతో పాటు ఐదు పార్లమెంట్ స్థానాలను గెలుచుకుంది. ఖమ్మం మినహా అన్ని జిల్లాల్లో టి.ఆర్.ఎస్ జెండ ఎగిరింది. కరీంనగర్ పార్లమెంట్ సభ్యునిగ కేసీఆర్, ఆదిలాబాద్ నుంచి మధుసూదన్ రెడ్డి, మెదక్ నుంచి ఏలె నరేంద్ర, వరంగల్ నుంచి రవీంద్రనాయక్, హన్మకొండ నుంచి బి. వినోద్‌కుమార్ గెలిచింద్రు. కేంద్రంలో యూపిఎ భాగస్వామ్య పక్షాలతో మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రి అయ్యిండు. టి.ఆర్.ఎస్. కేంద్రమంత్రి వర్గంలో చేరింది. కేసీఆర్. నరేంద్రలు మంత్రులయ్యింద్రు. యూపిఎ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో తెలంగాణ అంశాన్ని చేర్చింద్రు. ఆ తర్వాత పార్లమెంట్‌లో 2004 జూన్7న రాష్ట్రపతి అబ్దుల్ కలాం తెలంగాణ ప్రజల కోరక నెరవేరుతుందని తన ప్రసంగంలో పేర్కొన్నడు.

టి.ఆర్.ఎస్ రాష్ట్ర మంత్రివర్గంలో కూడ చేరింది. సంతోష్‌రెడ్డి, విజయరామారావు, ఎ.చంద్రశేఖర్, నాయిని నర్సింహ్మారెడ్డి, వి.లక్ష్మీకాంతారావు, టి. హరీశ్‌రావులకు మంత్రి పదవులు వచ్చినయి. కేసీఆర్ పార్లమెంట్ సభ్యుడిగ కొనసాగడం వలన సిద్దిపేట అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. ఇక్కడినుంచి హరీశ్‌రావు పోటీచేసి గెలిచిండు. రాష్ట్రంలో వై.యస్. ముందు చిన్నారెడ్డి లాంటి నాయకుల పాచికలు పారలేదు. తెలంగాణ పేరెత్తితే తొక్కిసంపేటట్టు తయారైండు రాజన్న. వై.యస్. అనుకూలునిగ మారి మంత్రి పదవి సంపాదించుకుండు. తెలంగాణ అంటెనే తెల్వనట్టు మాట్లాడిండు.

2004 మే నెలలో ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణవిద్యావంతుల వేదికను ప్రారంబించిండు.

మరో సంవత్సరంలో ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం స్వరం మార్చింది. వై.యస్. తెలంగాణ ఏర్పాటుకు సంబంధించి రోశయ్య కమిటిని

నియమించిడు. కాని ఈ కమిటీని ఎవరు నమ్మలేదు. ఈలోపు ప్రభుత్వం ఎస్.ఐ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఈ రిక్రూట్‌మెంట్‌లో 610 జి.ఓ అమలు చేయాలని టి.ఆర్.ఎస్ ఉద్యమ బాట పట్టింది. హరీశ్‌రావు అఖిలపక్ష నాయకులతో కలిసి స్పీకర్ సురేశ్‌రెడ్డికి వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది. 610 జి.ఓ. విషయంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి వై.యస్. భజన చేసిండు.

2008 ఆగుష్టు 26న సినీ నటుడు చిరంజీవి తిరుపతిలో ప్రజారాజ్యం పార్టీని ప్రకటించిండు. సామాజిక న్యాయం అనే నినాదంతో జనంలోకి వచ్చిన చిరంజీవిని జనం తిరస్కరించింద్రు.

2009 ఫిబ్రవరి 12 అసెంబ్లీ సమావేశాల చివరి రోజు కాంగ్రేసు తెలంగాణకు అనుకూలమనే సంకేతాలను ఇచ్చింది. 2009 ఫిబ్రవరి 28న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభకు హాజరైన సోనియాగాంధీ మరోసారి తెలంగాణ ఇవ్వడానికి కాంగ్రేసు పార్టీకి ఎలాంటి అభ్యంతరం లేదని ప్రకటించింది. ద్వంద్వనీతిలో ఆరితేరిన వై.యస్. ఎన్నికల ప్రచారంలో మునిగిపోయిండు. టి.ఆర్.ఎస్ ప్రభంజనానికి చంద్రబాబుకు చెమటలు పట్టి, ప్రణబ్‌ముఖర్జి కమిటీకి లేఖ ఇయ్యకుండ తప్పించుకొని తిరిగిండు. తెలంగాణ టి.డి.పి. నాయకులు నాగం జనార్ధన్‌రెడ్డి, దేవెందర్ గౌడ్ చంద్రబాబు మీద వత్తిడి పెంచింద్రు. మహనాడులో కూడ తెలంగాణ విషయం లేవనెత్తక పోవడంతో దేవేందర్ గౌడ్ పార్టీకి రాజీనామ చేసిండు. చంద్రబాబు తెలంగాణ వ్యతిరేకినన్న ముద్ర తొలగించుకోవడం కోసం 2008 అక్టోబర్ 18న చంద్రబాబు ప్రణబ్ కమిటీకి లేఖ ఇచ్చిండు.

2008 నవంబర్ 12న బి.జె.పి. "సంకల్పయాత్ర" మొదలు పెట్టింది. బి.జె.పి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే తెలంగాణ ఇస్తమని ప్రకటించింది. 2000 సంవత్సరంలో చంద్రబాబు అడ్డుపడ్డందు వల్లనే తెలంగాణ ఇవ్వలేకపోయినమని ఎల్.కె అద్వాని సభలో మాట్లాడిండు.

2009 జనవరి 16న విజయశాంతి తాను స్థాపించిన తల్లి తెలంగాణ పార్టీని టి.ఆర్.ఎస్.లో విలీనం చేసింది.

2009 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తెలంగాణ అంశాన్ని ఎజెండాలో చేర్చింది. ఉభయకమ్యునిస్టు పార్టీలతో కలిసి టి.డి.పి., టి.ఆర్.ఎస్ పార్టీలు మహాకూటమిగ అవతరించినయి.

చంద్రబాబుతో విబేధించిన దేవేందర్ గౌడ్‌ను కేసీఆర్‌తో కలిసి పనిచేయాలని జయశంకర్ సార్, వి. ప్రకాశ్, ఆర్. విద్యాసాగర్‌రావు లాంటి నాయకులు, మేధావులు

వెళ్ళి కలవడం జరిగింది. కేసీఆర్ మీద అసంతృప్తితో ఉన్న నాయకుల ప్రోద్భలంతో దేవేందర్ గౌడ్ నవ తెలంగాణ పార్టీని ఏర్పాటు చేసిండు. కేంద్రంతో సంబంధం లేకుండ దేవేందర్ గౌడ్ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిండు. ప్రభుత్వ కార్యాలయాల మీద బోర్డులు మార్చాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిండు. తెలంగాణ రాష్ట్ర పక్షి పాలపిట్ట అని కూడ ప్రకటించిండు. సున్నిత మనస్కుడైన దేవేందర్ గౌడ్ తెలంగాణ నాయకుల అవకాశవాదానికి తట్టుకోలేక ఎన్నికల ముందు వచ్చిన చిరంజీవి ప్రజారాజ్యం పార్టీలో 2009 మార్చిలో నవ తెలంగాణ పార్టీని విలీనం చేసిండు.

తెలంగాణలో ఎన్నికలు పూర్తి అయిన వెంటనే వై.యస్ రాజశేఖర్ రెడ్డి ఓట్ల కోసం ఆంధ్ర ప్రజలను రెచ్చగొట్టిండు. తెలంగాణ విడిపోతే మనం హైద్రాబాద్‌కు పోవాలంటే వీసా తీసుకోవలసిందే నని ఆవేశంగ మాట్లాడిండు. 2009 ఏప్రిల్ 16న తెలంగాణ మీద ఇంతకాలం దాచుకున్న విషాన్ని వెల్లగక్కిండు.

2009 ఎన్నికలలో కూడ కాంగ్రేసు 157 స్థానాలతో విజయం సాధించింది. టి.ఆర్.ఎస్ పది అసెంబ్లీ స్థానాలను రెండు ఎం.పి స్థానాలను గెలుచుకుంది. మహబూబ్‌నగర్ ఎం.పి.గా కేసీఆర్. మెదక్ నుంచి విజయశాంతి గెలిచింది. మొదటి సారి కేటీఆర్ సిరిసిల్ల నించి గెలిసిండు. ఈటెల రాజేందర్ శాసనసభాపక్ష నేతగ వ్యవహరించిండు.

2009 జూన్ 10న శాసనసభ మొదటి సమావేశం జరిగింది. తెలంగాణ ఉద్యమం గురించి, రాష్ట్ర ఆకాంక్షని గురించి ఈటెల రాజేందర్ సభలో మాట్లాడే ప్రయత్నం చేసిండు. అంతలోనే చెంగున సింగులు దులిపి లేసిన వై.యస్. రాజశేఖర్‌రెడ్డి "పట్టుమని పదిసీట్లు కూడ సాధించలేని వాళ్ళు ఏ మొఖం పెట్టుకొని మాట్లాడుతున్నరని" నిండు సభలో ఈటెల రాజేందర్ మొఖం పట్టుకొని అడిగి అవమానించిండు. అహంకార పూరిత సీమాంధ్ర పెత్తనాన్ని ప్రదర్శించిండు. తెలంగాణ ఉద్యమానికి ఉరిబెట్టే ప్రయత్నం చేసిండు. సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉంటడని ఆశించిన దేవేందర్ గౌడ్ 2009 ఆగస్టు 6న ప్రజారాజ్యం పార్టీని విడిచి టి.డి.పి గూటికి చేరిండు.

రెండవసారి ముఖ్యమంత్రి అయిన రాజశేఖర్‌రెడ్డి శాసనసభ సమావేశాల అనంతరం 'రచ్చబండ' కార్యక్రమాన్ని తలపెట్టిండు. అదే సమయంలో రాష్ట్రంలో జోరుగ వానలు పడుతున్నయ్. ప్రతికూల వాతావరణంలో రచ్చబండ కార్యక్రమానికి వెళుతున్న వై.యస్ హెలికాప్టర్ నల్లమల కొండల్లోని పావురాల గుట్టలో కూలింది. 2009 సెప్టెంబర్ 2న రాజశేఖర్‌రెడ్డి మృతదేహాన్ని ఇడుపులపాయకు చేర్చిండ్రు.

జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి ప్రయత్నించి బంగపడ్డడు. కాంగ్రేసు అధిష్టానం సీనియర్ కాంగ్రేసు నాయకుడు రోశయ్యని ముఖ్యమంత్రిగా నియమించింది.

రాజశేఖర్ రెడ్డి సావుతో తెలంగాణకు పెండ్లి కళ వచ్చింది. తెలంగాణ ఉద్యమం ఊపందుకున్నది. ఊరు వాడ ఏకమై కదిలింది. అన్ని పార్టీల (సి.పి.యం. మినహా) నాయకులు తెలంగాణ కోసం గొంతెత్తిండ్రు.

కవులు, రచయితలు, మేధావులు కదం తొక్కింండ్రు. కథ, కవిత, పాట ప్రతిది తెలంగాణ అంశంగ బయటికి వచ్చింది. తెలంగాణ ఉద్యమంలో మొదటినుంచి పాట ప్రత్యేక పాత్రను పోషించింది. పాట లేనిదే తెలంగాణ ఉద్యమం లేదు అన్నంతగ పాట ప్రజలతో మమేకమైంది.

# టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం- లక్ష్యసాధన

సీమాంధ్ర పాలకులు మోసం చేస్తున్న విషయాన్ని కనీసం బయటకు చెప్పలేని నాయకులు తెలంగాణ నిండ ఉన్నరు. తెలంగాణ ప్రాంతమంత బానిసల్లా బతుకుతుంటే నాయకులు వలస పాలకుల కావలికుక్కల్లా వ్యవహరించిండ్రు. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ పేరెత్తలేని స్థితిలో ఉన్నప్పుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కరుడుగట్టిన వలస పాలకుడు చంద్రబాబునాయుడు మీద తిరుగుబాటు జెండా ఎగరేసిండు. తెలంగాణకు చెందిన మేథావులు, కవులు కేసీఆర్‌ని కలిసిండ్రు. 45 సంవత్సరాలుగ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పూసగుచ్చినట్టు చెప్పిండ్రు. జయశంకర్ సార్ ఎన్నో విషయాలు కేసీఆర్‌తో పంచుకుంటున్నప్పుడు తన స్వభావాన్ని అర్థం చేసుకుండు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడం కేసీఆర్ వల్లనే సాధ్యం అయితదని గ్రహించిండు. ప్రజల యాసతో కూడిన నిండైన తెలంగాణ భాషను మాట్లాడి ప్రజలకు విషయాన్ని అందించడంలో కేసీఆర్ సమర్థుడని, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేయగల మొండి మనిషని అందరు అనుకున్నరు. వలసపాలనలో తెలంగాణ వనరులు దోపిడికి గురైన వైనాన్ని రోజుల తరబడి చర్చించిండ్రు. నీళ్లు, నిధులు,బొగ్గు, ఉద్యోగాలు, కరెంటు వంటి అనేక అంశాలను సీమాంధ్ర నాయకులు ఏవిధంగ చూసిండ్రో తెలంగాణకు ఎంత అన్యాయం చేసిండ్రో తెలంగాణ ప్రజలకు వివరించి చెప్పడమే తక్షణకర్తవ్యమని భావించిండు. అందులో భాగంగానే కేసిఆర్ 2001 ఏప్రిల్ 27న కరీంనగర్ బహిరంగ సభను ఏర్పాటు చేసిండు.

సీమాంధ్ర నాయకుల వివక్షపూరిత పాలనతో విసిగిపోయిన తెలంగాణ పల్లె జనం తండోప తండాలుగ చీమలబరులై సభాప్రాంగణమంత కిక్కిరిసిపోయింది.

తెలంగాణ కోసం తన డిప్యూటి స్పీకర్ పదవికి, శాసనసభ్యత్వానికి రాజీనామ చేసి, ఆ వేదిక మీదనే తెలంగాణ రాష్ట్ర సమితిని ప్రకటించిండు.

“తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేవరకు ఉద్యమం నుంచి పక్కకు తప్పుకుంటే రాళ్ళతో కొట్టి చంపడి” అంటూ తెలంగాణ ప్రజల హృదయాలను గెలిచిండు. తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించి సీమాంధ్రుల కుయుక్తులను ఒక్కటొక్కటి పూసగుచ్చినట్టు ప్రజలకు చెప్పడం మొదలు పెట్టిండు. తెలంగాణ కోసం చాలామంది పుట్టిండ్రు. చాలమంది పోయిండ్రు. ఇగ ఈ బక్కమనిషితోని ఏమైతదిలే అనుకున్నరు. ఆశామాషిగ

తీసుకున్నరు. కాని తప్పుడు వాగ్దానాల గుంట నక్కల పాలనకు తెరపడిందని గ్రహించలేక పోయింద్రు.

వెంటనే 2001 మే నెల నడి ఎండాకాలంలో కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో సింహగర్జన పేరుతో భారి బహిరంగ సభను ఏర్పాటు చేసి జార్ఖండ్ ముక్తిమోర్చా నాయకుడు శిబుసోరెన్‌ను ఆహ్వానించిండు. సోరెన్ తెలంగాణ ఉద్యమానికి మద్దతు పలికిండు. 2001 జూన్ 2న మహబూబ్ నగర్‌లో సభ ఏర్పాటు చేసిండు. వరుసగ జూన్ 6న ఆదిలాబాద్‌లోను, జూన్ 7న నిజాంబాద్‌లోను సభలు జరిపిండు. ఎక్కడబోయిన జనం బ్రహ్మరథం పట్టింద్రు. సీమాంధ్ర పాలకులు చేస్తున్న దోపిడిని, చూపిస్తున్న వివక్షను సామాన్య రైతులు, పేదలు సైతం అర్థం చేసుకుంద్రు.

టి.ఆర్.ఎస్ పార్టీ పుట్టిన 65 రోజుల్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినయి. 2001లో సర్పంచ్, మండల, జిల్లా ప్రజాపరిషత్ ఎన్నికలు జరిగినయి. టి.ఆర్.ఎస్. పార్టీ బలపర్చినవాళ్ళలో 1000 మంది సర్పంచ్‌లు, 87 మంది ఎం.పి.టి.సీలు, 84 మంది జడ్.పి.టి.సిలు గెలిచి, ఎన్నికలలో అనూహ్య విజయాలను సాధించింది. అంటే తెలంగాణ ప్రజలు తెలంగాణ రాష్ట్రం కోసం పరితపిస్తునన్నరన్న విషయం అర్థమైంది. ముఖ్యంగ గ్రామీణ ప్రాంతాల జనం తెలంగాణ ఆకాంక్షను కలిగి ఉండడం కేసీఆర్‌నే ఆశ్చర్యానికి గురిచేసింది. కాని ఆంధ్రులతో ఎంతకాలం కలిసున్నా తెలంగాణ అభివృద్ధి చెందదనే విషయం అందరికి అర్థమైంది. ఆంధ్రలో కొబ్బరి చెట్లు కూలిపోతే చూపించిన ప్రేమ వలసపాలకులకు తెలంగాణ రైతుల మీద లేదన్న వాస్తవాన్ని ప్రజలు కూడ గుర్తించింద్రు. పదవులను పట్టుకు వేలాడే కొందరు స్వార్థ రాజకీయ నాయకులు తప్ప మెజారిటీ జనం ప్రత్యేక తెలంగాణను కోరుకుంటున్నరు. పదువుల కోసం మాత్రమే తెలంగాణ అంశాన్ని వాడుకున్న నాయకులు ఉన్నరు. హాయిగ ఆంధ్రుల మోచేతి నీల్లు తాగేవాళ్ళు, వాళ్ళ ఎంగిలి మెతుకులకు ఆశపడి బతికే వాళ్లు కొందరు తెలంగాణ ఉద్యమం పట్ల విముఖతని ప్రదర్శించింద్రు. ఎందరో తెలంగాణ కోసం కొట్లాడింద్రు. ఇప్పుడు మాత్రం వస్తదా అని వెటకారాలు మాట్లాడింద్రు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులైతే తెలంగాణ రాకూడదని బలంగ కోరుకున్నరు. భూములమీద రాబందులై కోట్లు సంపాదించింద్రు. తెలంగాణ వస్తే భూములకు రేట్లు తగ్గుతయని ప్రచారం చేసింద్రు. కేసీఆర్ కు మంత్రి ఇవ్వకపోవడం వల్లనే ఈ ఉద్యమాన్ని లేవదీసిండని తప్పుడు ప్రచారం చేసింద్రు. కాని ఈ విషయంలో చాలాసార్లు పదవుల దక్కనివాళ్ళు తెలంగాణలో ఎందరో ఉన్నరని వాళ్ళు ఏనాడు తెలంగాణ ఉద్యమం ఎందుకు చేయలేదని ప్రశ్నించిన వాళ్ళు కూడ ఉన్నరు. ఎక్కడ

చూసిన తెలంగాణ ముచ్చటే జనంలో చర్చనీయాంశం అయ్యింది.

నీది నువ్వు తిను మాది మేము తింటం అనే ఆలోచన ప్రజల్లో కలిగింది. కాని 45 సంవత్సరాలుగ మాది మేమే తింటం. మీది మేమే తింటం అన్న పద్ధతిలో వలసాంధ్ర పాలన కొనసాగింది. దీంతో ప్రజల్లో తీరని అసంతృప్తి, అసహనం కొట్టొచ్చినట్టు కనిపిస్తుండేది.

2001 సెప్టెంబర్ 22న కేసీఆర్ రాజీనామ చేసిన సిద్దిపేట శాసనసభకు ఎన్నికలు నిర్వహించింద్రు. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించడానికి చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. ఆంధ్ర నాయకుల కుట్రల్ని ఛేదించి ప్రజలు కేసీఆర్‌ని గెలిపించింద్రు. ఆత్మవిశ్వాసం పెరిగిన కేసీఆర్ జనబలంతో ముందుకు దుసూకపోయిండు. నవంబర్ 17న ఖమ్మంలో సభ జరిపిండు. జనంలో పెద్ద స్పందన కనిపించింది. ఆంధ్రప్రజలు అధిక శాతం ఉన్న ఖమ్మంలో కూడ సభ విజయవంతం కావడం తెలంగాణ వాదులను ఆశ్చర్యానికి గురిచేసింది. దీన్నిబట్టి తెలంగాణలో ఉండే ఆంధ్రులు సైతం తెలంగాణను కోరుకుంటున్నరనే విషయం అర్థమైంది. 2002 మార్చి 27న రంగారెడ్డి జిల్లా వికారాబాద్‌లో భారి బహిరంగ సభ జరిగింది. ప్రజల్లో ఉన్న తెలంగాణ ఆకాంక్షను ధైర్యంగ బయటికి వ్యక్తం చేసింద్రు. తెలంగాణ అంశం మీద, రాష్ట్ర సాధన సాధ్యాసాధ్యాల మీద మేథావుల్లో చర్చ మొదలైంది. కవులు కళాకారులు పాటలుపాటలతో ధూంధాం సభలు మొదలైనయి.

తెలంగాణ రాష్ట్ర సమితికి ప్రజల్లో ఆదరణ పెరిగింది. కేసీఆర్ చిత్తశుద్ధిని, అంకితభావాన్ని జనం గుర్తించింద్రు. దాపరికం లేకుండ మాట్లాడే కేసీఆర్ తత్వం ఉద్యమానికి కొండంత బలాన్నిచ్చింది. ఇంతలో ఏలె నరేంద్ర తెలంగాణ కోసం గొంతెత్తిండు. పార్టీ తెలంగాణ అంశాన్ని వ్యతిరేకించింది. దీంతో బి.జె.పి నుంచి బయటికి వచ్చిన ఏలె నరేంద్ర తెలంగాణ సాధన సమితిని ఏర్పాటు చేసిండు. ఒక బలమైన ఉద్యమాన్ని నిర్మించే క్రమంలో ముందుకు కదిలిండు. కేసీఆర్ పోరాట పటిమను, జనబలాన్ని చూసిన ఏలె నరేంద్ర కలిసికట్టుగ ఉద్యమించాలని నిర్ణయించుకుండు. అందరు ఒక్కటై తెలంగాణ సాధించాలనే లక్ష్యంతో 2002 ఆగష్టు 11న తెలంగాణ సాధన సమితిని టి.ఆర్.ఎస్‌లో విలీనం చేసిండు.

2002 ఏప్రిల్ 27న టి.ఆర్.ఎస్ మొదటి వార్షికోత్సవ సభను నల్లగొండలో ఘనంగ నిర్వహించింద్రు. మిర్యాలగూడ రోడ్డులోని అలకాపురి మైదానంలో సభ జరిగింది. ఈ సభలో కేసిఆర్‌తో పాటు శిబూసోరెన్, అజిత్‌సింగ్, భీమ్‌సింగ్, ఆచార్య జయశంకర్ సార్, ఆర్.విద్యాసాగర్ రావులు మాట్లాడి ప్రజలను ఉత్తేజపరిచింద్రు.

ఎట్టిపరిస్థితులలోను ఉద్యమం ఉద్రిక్తతలకు లోను కాకుండ జయశంకర్ సార్ ఎప్పటికప్పుడు కేసీఆర్‌ని, ఇతర నాయకులను హెచ్చరిస్తుండేవాడు. 1969 ఉద్యమంలో జరిగిన పొరపాట్లు తలెత్తకుండ జాగ్రత్తలు తీసుకోవాలని పదేపదే సూచిస్తూ ఉండేవాడు. జనం ఆవేశంతో ఉంటరు, వాళ్ళ ఆవేశానికి ఆజ్యం పోయకుండ శాంతియుత పద్ధతుల్లో మాత్రమే రాష్ట్రాన్ని సాధించాలని కోరుకుండు. జయశంకర్ సార్ అనుభవం, కేసీఆర్ మొండితనం, తెలంగాణ ప్రజల నిండుగుణం ఉద్యమానికి ఊపునిచ్చింది.

కేసీఆర్ 2002 సెప్టెంబర్‌లో పల్లెబాట కార్యక్రమాన్ని తలపెట్టిండు. జనం పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నరు. 2003 నవంబర్ 25 నుంచి జనవరి 5 వరకు టి.ఆర్.ఎస్ జలసాధన ఉద్యమం చేపట్టింది. నీళ్ళు లేక గోస పడుతున్న తెలంగాణ మొత్తం ముక్తకంఠంతో సీమాంధ్ర పాలన మీద దుమ్మెత్తి పోసింది. ప్రాజెక్టుల శంకుస్థాపన రాళ్ళు బోరున విలపిస్తున్న విషాద దృశ్యాలను ప్రజలు తలుచుకొని కుమిలిపోయిండ్రు. 2003 జనవరి 6న హైద్రాబాద్‌లో తెలంగాణ గర్జన పేరుతో టి.ఆర్.ఎస్. భారి బహిరంగ సభను ఏర్పాటు చేసింది. తెలంగాణ కన్నీటిగాథను డిల్లీకి వినిపించాలని టి.ఆర్.ఎస్ పార్టీ చేపట్టిన కారు ర్యాలి 2003 మార్చి 27న డిల్లీకి చేరింది. ఢిల్లీలో ఏర్పాటు చేసిన భారి బహిరంగ సభకు రాంవిలాస్ పాశ్వాన్ హాజరై తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చిండు. తెలంగాణ పార్టీ పుట్టడంతోనే పులి అడుగులేసింది.

2003 ఏప్రిల్ 27న వరంగల్‌లో టి.ఆర్.ఎస్ ఏర్పాటు చేసిన వార్షికోత్సవ సభకు దేవెగౌడ, అజిత్‌సింగ్ హాజరై మద్దతు ఇచ్చిండ్రు. అసదుద్దిన్ ఒవైసితో సహా అన్ని పార్టీల ముఖ్యనేతలు హజరైండ్రు. ఆ తర్వాత కేసీఆర్ ఆలంపూర్ నుంచి గద్వాల దాక 180కి.మీ. పాదయాత్ర చేసిండు. ఆ తర్వాత నల్లగొండ జిల్లాలో కోదాడ నుంచి హాలియా దాక పాదయాత్ర చేసిండు. 2003 ఆగస్టు 30న పాదయాత్ర హాలియాకు చేరుకుంది. పాదయాత్రల ద్వార తెలంగాణ రైతులు, ప్రజలు నీటికోసం పడుతున్న బాధల్ని ప్రత్యక్షంగ చూసిండు. నల్లగొండ ఫ్లోరైడ్ బాధకు కాళ్ళు చేతులు వంకర్లు తిరిగిన పల్లెల్ని చూసి కన్నీరు బెట్టిండు.

కేసీఆర్ గుండెలోతుల్లోంచి దుఃఖం ఎగదన్నుకొచ్చింది. 2003 సెప్టెంబర్ 9న ఢిల్లీలోని మౌలంకర్ హోటల్‌లో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నేతలతో బహిరంగ సభను ఏర్పాటు చేసిండ్రు. ఆ సభకు భన్వర్‌లాల్, అజిత్‌సింగ్, శిబూసోరెన్ వంటి నాయకులు హాజరై కొత్త రాష్ట్రాల జాతీయ కన్వీనర్‌గ కేసీఆర్‌ని ఎన్నుకుండ్రు.

తెలంగాణ నాయకులు, ప్రజలే కాకుండ మొత్తం దేశంలోనే కేసీఆర్ శక్తి

గుర్తించబడింది. అయితే ఇతర రాష్ట్రాల (విదర్భ, గోర్ఖాల్యాండ్) ఉద్యమంతో పోల్చితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమస్య భిన్నమైనదని ఆయా రాష్ట్రాల నేతలు అంగీకరించేలా చేసిన ఘనత కేసీఆర్‌ది. తెలంగాణలో మొదటినుంచి ఉన్న జఠిలమైన సమస్య నిరుద్యోగాంశమే కాబట్టి, యువకులను, విద్యార్థులను తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగ 2003 సెప్టెంబర్ 17న ఉస్మానియా ఆర్ట్స్‌కాలేజ్ ముందు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసిండు. తెలంగాణ పది జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులు తెలంగాణ నినాదాన్ని మార్మోగించిండ్రు.

టి.ఆర్.ఎస్. 2004లో కాంగ్రేస్‌తోని, 2009లో టి.డి.పి.తోని పెట్టుకున్న ఎన్నికల పొత్తు కారణంగానే ఆయా పార్టీలలో కూడ తెలంగాణ పాట పాడడం మొదలైంది. ఆ సందర్భంగా ఆ పార్టీల అగ్రనాయకులను కలిసి తెలంగాణ అంశం మీద మంతనాలు జరిపే అవకాశం దొరికింది. దీంతో కేసీఆర్ ఎత్తుగడలు ఫలించినయి. అధికారం సంగతి పక్కన పెడితే ఆయానాయకుల్లో, పార్టీలలో కదలిక తీసుకువచ్చే ప్రయత్నం ఫలించింది. లేదంటే పార్టీ మ్యానిఫెస్టోలో తెలంగాణ అంశం చేర్చేవాళ్ళు కాదు. యూపిఏ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో తెలంగాణ అంశం ఉండేది కాదు.

# ఫ్రీజోన్ వివాదము

ఆరు సూత్రాల పథకానికి చట్టబద్ధత కల్పించడం కోసం రాజ్యాంగాన్ని సవరించి జి.ఎస్.ఆర్.524(ఈ) నెంబరుతో ఉత్తర్వును జారీ చేసిండ్రు. 1975 అక్టోబర్ 18న జారిచేసిన ఈ ఉత్తర్వునే ప్రెసిడెన్షియల్ ఆర్డర్ అన్నరు. దీన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వ నియామకాల్లో తీసుకోవాల్సిన విషయాలకు సంబందించి జి.ఓ. 674ను జారి చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం లోకల్ కేడర్లు, లోకల్ ఏరియాల నిర్ధారణ, బదిలీలు, జోన్‌ల వర్గీకరణ, లోకల్ క్యాండిడేట్స్, లోకల్ క్యాండెట్లకు రిజర్వు చేసిన ఉద్యోగాల పరిమితులు. వీటి ఆధారంగ రాష్ట్రాన్ని ఆరు జోన్‌లుగా విభజించిండ్రు.

1వ జోన్: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం
2వ జోన్: తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ
3వ జోన్: గుంటూరు, ప్రకాశం, నెల్లూరు
4వ జోన్: కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు
5వ జోన్: వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్
6వ జోన్: మెదక్, హైద్రాబాద్ (రంగారెడ్డి కలిపి) నిజాంబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ

1973 డిసెంబర్ 10న రాష్ట్రపతి పాలనను ఎత్తేసి ముఖ్యమంత్రి బాధ్యతలను జలగం వెంగళరావుకు అప్పజెప్పిండ్రు. 1974 అక్టోబర్ 18న మర్రి చెన్నారెడ్డి ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా వెళ్ళిపోయిండు. ఇక ఏ అడ్డు అదుపు లేని వెంగళరావు రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో అంతులేని వివక్షను చూపించిండు. జోన్‌లకు కేటాయించిన వాటాలు పోను మిగిలిన వాటిని ఓపన్ కేటగిరిలో నియామకాలు చేపట్టాలె. ఆంధ్రానాయకులు హైద్రాబాద్‌ను ఏడో జోన్‌గ చేయాలని అన్నరు. రాష్ట్రపతి ఉత్తర్వుల్లో ఎక్కడ కూడ హైద్రబాద్ ఏడో జోన్ అని గాని, ఫ్రీ జోన్ అని గాని ఎక్కడ లేదు.

ఈ విధంగ హైద్రాబాద్ ఆరోజోన్‌లో భాగమైనప్పటికి రాష్ట్రపతి ఉత్తర్వులోని 14ఎఫ్ నిబంధన ప్రకారం పోలీసు నియామకాలలో ఫ్రీజోన్‌గ పరిగణించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.

ఉద్యమం కాస్త సద్దుమణిగిన ప్రతిసారి ఏదో ఎత్తుగడతో పోరాటాన్ని పతాకస్థాయికి తీసుకపోవడం ఒక్క కేసీఆర్‌కు మాత్రమే సాధ్యం అయ్యింది. అయితే

2009 లో కేసీఆర్‌కు ఫ్రీజోన్ అనే ఆయుధం దొరికింది. ఇదే విషయం మీద తెలంగాణ ఉద్యోగ సంఘాలు టి.ఎన్.జి.ఓల ఆధ్వర్యంలో అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టడంతో క్రమంగ ఉద్యమం తీవ్రరూపం దాల్చింది.

1975 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం హైద్రాబాద్ ఆరోజోన్‌లో భాగమే కాని రాజశేఖర్ రెడ్డి ఆ ఉత్వర్వులను పక్కనపెట్టి హైద్రాబాద్ ఫ్రీజోన్ అంటూ ఎస్.ఐ. పోస్టులను భర్తీచేసే ప్రక్రియని మొదలు పెట్టిండు. టి.ఆర్.ఎస్‌తో పాటు ప్రజాసంఘాలు, జె.ఎ.సి.లు ఉద్యమాన్ని ఉధృతం చేయడంతో ఎస్.ఐ పోస్టుల ప్రక్రియ ఆగిపోయింది. ఆంధ్ర ఉద్యోగులు మళ్ళీ సుప్రీంకోర్టుకు పొయింండ్రు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలను పరిగణనలోనికి తీసుకొని 2009 అక్టోబర్ 9న సుప్రీంకోర్టు హైద్రాబాద్ ఫ్రీజోన్ అనే తీర్పుని ఇచ్చింది. ఈ తీర్పు ముల్కీ నిబంధనలకు, రాష్ట్రపతి ఉత్తర్వులకు ఆటంకమని, అగ్గిమీద గుగ్గిలమైన తెలంగాణ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టింండ్రు. తట్టుకోలేని రోషయ్య సర్కారు అక్టోబర్ 19న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ విషయం మీద రాజ్యాంగ సవరణకు రాష్ట్రప్రభుత్వం సిఫారసు చేయాలని, టి.ఆర్.ఎస్. పార్టీ సభ నుంచి వాకౌట్ చేసింది. హైద్రాబాద్ ఫ్రీజోన్ కాదు అది ఆరోజోన్‌లో భాగమనే నినాదందో ఫ్రీజోన్‌కు వ్యతిరేకంగ తెలంగాణ వ్యాప్తంగ ఉద్యమాలు జరిగినయి. వరంగల్ లోని కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు నిరాహార దీక్ష చేపట్టింండ్రు. కేసీఆర్ అక్కడికి వెళ్లి సంఘీబావాన్ని ప్రకటించిండు. ప్రభుత్వం దిగిరాకపోతే తాను దీక్ష చేపడతానని చెప్పిండు.

అక్టోబర్ 28 న హైద్రాబాద్‌లో ఫ్రీజోన్‌కు వ్యతిరేకంగ టి.ఆర్.ఎస్.పార్టీ, తెలంగాణ ఉద్యమకారులు 'జైల్‌భరో' కార్యక్రమాన్ని చేపట్టింండ్రు. "ఫ్రిజోన్ కాదుర – హైద్రాబాద్ మాదిర" అంటూ నినదించిండ్రు. ఆ సంధర్భంగ ఏర్పాటు చేసిన ర్యాలిలో కేసీఆర్ పాల్గొని ఇక ప్రత్యేక తెలంగాణ ఏర్పాటే దీనికి పరిష్కారమని గర్జించిండు. ఇగ "తెలంగాణ వచ్చుడో – కేసీఆర్ సచ్చుడో తేల్చుకుంట" నని ప్రభుత్వాన్ని హెచ్చరించిండు. 2009 నవంబర్ 5న అయితే జైత్రయాత్ర లేదంటే శవయాత్ర అని ప్రకటించిండు.

# కేసీఆర్ దీక్ష - అరెస్టు

సిద్దిపేట మండలం చింతమడకలో పుట్టిన పులిబిడ్డ, తెలంగాణ ఉద్యమ రథసారథి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మెదక్ జిల్లా సిద్దిపేట దగ్గర్లోని రంగధాంపల్లిలో దీక్ష చేపట్టాలని నిర్ణయించిండు. 2009 నవంబర్ 29న దీక్షకు దిగుతున్నట్టు ప్రకటించిండు. 2009 నవంబర్ 26న కేసీఆర్ హైద్రాబాద్ నుంచి కరీంనగర్ బయలు దేరిండు. ఎక్కడ ఆగకుండ సక్కగ కరీంనగర్‌కు పోయి అక్కడ్నే మూడు రోజులుండు.

1985 నుంచి 2004 వరకు ఆరుసార్లు శాసనసభ్యునిగ ఎన్నికైన ప్రజానాయకుడు ప్రాణత్యాగానికి సిద్ధపడుతున్నట్టు, తెలంగాణ పల్లెపల్లెకు వ్యాపించింది. తెలంగాణ కోసం కేసీఆర్ సచ్చిపోతందుకు తయారైతుండని గ్రామీణ ప్రజలు ఆవేదనకు లోనై సీమాంధ్ర ప్రభుత్వాన్ని, నాయకులను దుమ్మెత్తి పోసింద్రు. జనం సిద్దిపేట బాటబట్టింద్రు. పోలీసులు అరెస్టులు మొదలు పెట్టింద్రు. సిద్దిపేట వైపు వెళ్ళే విద్యార్థులను, ప్రజలను పోలీసులు వెనకకు పంపుతుంద్రు. ఎన్ని ఆటంకాలు ఎదురైన వేలాదిమంది కార్యకర్తలు సిద్దిపేటకు చేరింద్రు. సిద్దిపేటలో ప్రజలు, పోలీసులు, నాయకులు రణభూమిల నిలబడ్డట్టు నిలబడ్డరు. ఇప్పుడో, ఇంక జరసేపటికో మౌనయుద్ధం మొదలైతదని అందరు ఆసక్తిగ ఉన్నరు. దేనికైన సరే ఎంతటి త్యాగానికైన ఎనకాడేది లేదని నిర్ణయించుకున్నరు. హరీశ్‌రావు నాయకత్వంలో ఐదారు రోజుల నుంచి దీక్షాస్థలం అంటిపెట్టుకొని తిరుగుతున్నరు. ప్రాణంపోయినా దీక్షాస్థలిని వదిలేది లేదని ప్రతిజ్ఞ చేసింద్రు. రంగదాంపల్లి సర్పంచ్ కనకయ్య కార్యకర్తలకు అన్ని ఏర్పాట్లు చేసిండు. వసతులను దగ్గరుండి చూసుకుండు.

అయితే కరీంనగర్ నుంచి కేసీఆర్ దీక్షాస్థలికి చేరకముందే నవంబర్ 28నాడే అరెస్టు చేయాలని పోలీసులు పథక రచన చేసింద్రు. ఎట్టి పరిస్థితిలోను పోలీసుల అరెస్టు వ్యూహాన్ని ఛేదించడమే లక్ష్యంగ కేటీఆర్ తనపనిలో నిమగ్నమై ఉన్నడు. కేసీఆర్‌తో పాటు ప్రొఫెసర్ జయశంకర్‌సార్, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, నాయిని నర్సింహ్మారెడ్డి, విజయరామారావు ఇంకా కొందరు ఉన్నరు. వీళ్ళతోనే కలిసి శనివారం రాత్రి భోజనం చేసిండు. బయట జరిగే పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటనే ఉన్నరు. అయితే ఈ అర్ధరాత్రికే కేసీఆర్ సిద్దిపేటకు పోతున్నటు ప్రచారం జరగడంతో

ఆ రాత్రి 12గం॥ల సమయానికి పోలీసుల సంఖ్య పెరిగింది. వాళ్ళ హడావిడి కూడ పెరిగింది. డి.జి.పి రవిశంకర్ అయ్యన్నార్, ఎస్.పి., డి.ఎస్.పి ఉత్తర తెలంగాణ భవన్‌కు చేరుకుంద్రు. కేసీఆర్‌ని అరెస్టు చేస్తరని భావించిన కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేసింద్రు. మహిళలైతే కారం పోట్లాలు వెదజల్లింద్రు. కార్యకర్తలు చావడానికే కాదు చంపడానికి సిద్ధమన్నరు. ఈ గొడవను విన్న కేసీఆర్ తన గదిలోంచి బయటికి వచ్చిండు. సహచరులను లేపిండు. "ఎందుకీ పోలీసులు ఆగమాగం జేత్తాండ్లు" అసలు సంగతేందో చూడమని కేటీఆర్‌ని చూసి అనంగనే కేటీఆర్ బయటికి వచ్చిండు. "ఇంతమంది పోలీసులు ఎందుకొచ్చింద్రు. ఇక్కడేమన్న బందిపోటు దొంగలున్నరా" అని ప్రశ్నించడంతో పోలీసులు తోక ముడిచింద్రు. ఆ రాత్రి అరెస్టు ప్రయత్నాన్ని విరమించింద్రు.

ఆదివారం పొద్దున్నే బయటికి వచ్చిన కేసీఆర్‌కు మహిళలు మంగళహారతులిచ్చి వీరతిలకం దిద్దింద్రు. 7గంటలకే తయారై మీడియా ముందుకొచ్చిండు. "ఎన్ని ఆటంకాలు ఎదురైన దీక్ష ఆగదు ఎక్కడ అరెస్టు చేస్తే, అక్కడ్నే దీక్ష మొదలు పెడతనని ఖరాకండిగ చెప్పిండు. తెలంగాణ ప్రజల ఆకాంక్షని ప్రజాస్వామ్యయుతంగ నెరవేర్చడానికి ఇదే మంచి సమయమని, ప్రజలు అప్రమత్తంగ ఉండాలని" అన్నడు.

అంతేకాకుండ "తెలంగాణ ఏర్పాటు విషయంలో సోనియాగాంధి చొరవ చూపాలని, ముఖ్యమంత్రి రోశయ్య ఢిల్లి పెద్దల్ని ఒప్పించి తీరాలని" కేసీఆర్ డిమాండ్ చేసిండు.

ఇంతలో సీమాంధ్ర పాలకుల వ్యూహాలకు అనుగుణంగ పోలీసుల కదలికలు మొదలైనయి. పోలీసులు అనేక ఉపాయాలతో ఉత్తర తెలంగాణ భవన్ వైపుకు దూసుకొచ్చే ప్రయత్నం చేసింద్రు. భవన్ దగ్గర టి.ఆర్.ఎస్. కార్యకర్తలు, ఉద్యమకారులు కేటీఆర్ ఆధ్వర్యంలో ఎంతకైన తెగించి కొట్లాడడానికి సిద్ధపడ్డ జనం సైనికుల్లా నిలబడ్డరు. వేలాది మంది కార్యకర్తల్ని, జనం ఆవేశాన్ని గమనించిన పోలీసులు వాళ్ళ వ్యూహం ఫలించే అవకాశం కానరాకపోవడం వలన నిశ్చేష్టులై నిలబడ్డరు.

సరిగ్గ ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో కేసీఆర్ కరీంనగర్ నుంచి సిద్దిపేటకు బయలుదేరిండు. అంతలోనే కొంపలు మునిగిపోయినట్టు ఉరుకొచ్చిన పోలీసులు బద్రత కారాణాలరిత్యా కేసీఆర్‌ని స్వంత కారులో కాకుండ వాళ్ళు తెచ్చిన బుల్లెట్‌ప్రూఫ్ టాటాసుమోలో ఎక్కాలని చెప్పింద్రు. సీమాంధ్ర పాలకుల కుయుక్తులు, పోలీసుల కపటనాటకం తెలిసినప్పటికి, కేసీఆర్ సరేనని పోలీసువాహనంలో ముందు

సీట్లో కూర్చుండు. ఆయనతోపాటు జయశంకర్‌సార్, లక్ష్మీకాంతరావు, నాయిని నర్సింహ్మారెడ్డి, విజయ రామారావు, రాజయ్యయాద్ కూడ అదే వాహనంలో ఎక్కింద్రు. దీక్షాస్థలికి బయలుదేరిన కేసీఆర్ తన వాహనం ముందు పోలీసు వాహనాలు ఉండొద్దని, మీ పోలీసుల రక్షణ మాకు అవసరం లేదని గట్టిగ చెప్పిండు. దీంతో పోలీసు వాహనాలనాలను పక్కకు తీసింద్రు. ఆ వెంటనే కేసీఆర్ వాహనం ముందు బయలు దేరిన తర్వాత, దాదాపు 100కార్లు కాన్వాయ్‌గ యాత్ర మొదలైంది. ఈటెల రాజేందర్ ఇతర నాయకులు కేసీఆర్‌ని అనుసరించింద్రు. వేలాది మంది వెంట నడువగ 'జై తెలంగాణ' నినాదాల నడుమ కేసీఆర్ బయలు దేరిండు. కేసీఆర్ వాహనాన్ని పోలీసు వాహనాలు వెంబడించినయి. కేసీఆర్ వాహనం మానేరు బ్రిడ్జి దగ్గరికి రాంగనే పోలీసు వాహనాలు చుట్టిముట్టినయ్. ఆక్టోపస్ ఎస్.పి సజ్జనార్, కమలాసన్‌రెడ్డిలు దగ్గరికొచ్చి కేసీఆర్‌ని అరెస్టు చేస్తున్నటు చెప్పింద్రు. పోలీసు వాహనంలోకి రావాల్సిందిగా కోరింద్రు. కేసీఆర్ పోలీసుల దౌర్జన్యాన్ని నిరసించిండు. మమ్మల్ని అరెస్టు చేసే హక్కు మీకు ఎక్కడిదని ప్రశ్నించిండు. పోలీసులు ఏ మాత్రం పట్టించుకోకుండ కేసీఆర్‌ను పోలీసు వాహనంలోకి బలవంతంగ ఎక్కించుకునే ప్రయత్నం చేసింద్రు. దీంతో కేసీఆర్ ధర్నాకు దిగిండు. రోడ్డు పక్కన కూసుండు. జయశంకర్ మిగతా నలుగురు కూడ కేసీఆర్‌తోపాటు కూసున్నరు. ఈలోపు అక్కడికి వచ్చిన కార్యర్తలు బస్సుల అద్దాలు పగలగొట్టింద్రు. కేసీఆర్‌ని అరెస్టు చేస్తే ఆత్మహత్య చేసుకుంటమని బస్సుపైకి ఎక్కింద్రు. అడ్డం వచ్చిన ప్రతి ఒక్కరిని నెట్టేసి కేసీఆర్‌ని అల్గునూరు వద్ద బలవంతంగ పోలీస్ ఎస్కార్ట్ బండిలో ఎక్కించింద్రు. మిగతావాళ్ళను వేరొక బండ్లో ఎక్కించింద్రు. జయశంకర్‌సార్‌ని అక్కడే వదిలేసింద్రు. పరిస్థితిని గమనించిన కేటీఆర్ బండ్లు వదిలిపెట్టి బ్రిడ్జి మీదినుంచి పరుగులు తీసి అల్గునూరు సెంటర్‌లో పోలీసులకు అడ్డు తగిలిండు. ఎందుకు అరెస్టు చేసింద్రు? ఎక్కడికి తీసుకపోతుంద్రని నిలదీసిండు. కార్యకర్తలు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కార్యకర్తలు విధ్వంసాన్ని సృష్టించింద్రు. కేసీఆర్‌ని వరంగల్‌కు తీసుకపోతుంద్రని కేటీఆర్, జయశంకర్‌సార్, విద్యాసాగర్ వరంగల్ బయలు దేరింద్రు. ఈటెల రాజేందర్ వేలాదిమంది కార్యకర్తలతో రోడ్డుమీద కూర్చోని నిరసన వ్యక్తం చేసిండు. రెండు గంటలపాటు రోడ్లు బ్లాక్ చేసి అందరిని అరెస్టు చేసింద్రు. దీక్షాస్థలిలో ఉన్న హరీశ్‌రావు విషయం తెలుసుకొని కార్యకర్తల అనుమతితో దీక్షకు సిద్దమై కుసుండు. దీంతో పోలీసులు హరీశ్‌రావుని అరెస్టు చేయడానికి వచ్చింద్రు. కార్యకర్తలు ప్రతిఘటించడంతో లాఠీచార్జ్ చేసింద్రు. హరీశ్‌రావు చూపిన సాహసం వల్ల పోలీసులు

వెనకకు తగ్గింగ్రు. ఆ తర్వాత అందరిని అరెస్టు చేసింగ్రు. కార్యకర్తలు పోలీసుల మీద రాళ్ళ వర్షం కురిపించింగ్రు. సిద్దిపేట నెత్తురోడింది. కాకతీయ యూనివర్సిటి దగ్గర కేటీఆర్‌ని అదుపులోకి తీసుకుంగ్రు. కేటీఆర్ తప్పించుకొని హన్మకొండలోని జయశంకర్ సార్ ఇంటికి చేరిండు. అక్కడ పోలీసులు విశ్వప్రయత్నం చేసి కేటీఆర్‌ని అరెస్టు చేసి అర్ధరాత్రి వరగంల్ సెంట్రల్ జైలుకు తరలించింగ్రు. పోలీసు కాన్వాయ్ మరిపెడ దాటి ఖమ్మం వైపుకు పరుగులు తీసింది. గంటన్నరలో ఒంటరి కేసీఆర్‌ని ఖమ్మం తీసుకొని పోయింగ్రు. ఖమ్మం ఎస్.పి ఆదేశాల మేరకు కొత్తగూడెం టుటౌన్ ఎస్.ఐ రమేశ్ అప్పటికే పోలీస్ స్టేషన్‌లో కేసీఆర్ మీద కేసులు పెట్టింగ్రు. రెండు ప్రాంతాల ప్రజలను రెచ్చగొట్టి, శాంతి బద్రతలకు బంగం కలిగిస్తుందని ఆరోపణలు చేస్తూ ఆరు సెక్షన్‌ల కింద కేసులు బనాయించింగ్రు. లక్ష్మీకాంతరావు, నాయిని, విజయరామారావు మరికొందరు కేసీఆర్ వెంటనే ఉన్నరు వీళ్ళందరిని ఖమ్మం మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచింగ్రు. 14రోజుల రిమాండ్ విధించి దానవాయిగూడెంలోని జిల్లా జైలుకు తీసుకపోయింగ్రు. కేసీఆర్ దగ్గరి బంధువు, వ్యక్తిగత సహాయకుడు జె. సంతోష్ వచ్చి మందులు, బట్టలు ఇచ్చి పోయిండు. జైళ్ళో ప్రత్యేక బ్యారక్‌లో ఉన్న కేసీఆర్ జైళ్లోనే దీక్ష ప్రారంభిస్తున్నట్టు ప్రకటించిండు. బెయిల్ పిటిషన్ వేయవలసిన అవసరం లేదని లాయర్లకు చెప్పిండు. జైలును మార్చేందుకు మాత్రమే పిటిషన్ మీద సంతకాలు చేసిండు. శ్రీకాంతాచారి విషయం తెలుసుకున్న కేసీఆర్ ఏడ్చిండు. ఉద్యమంలో ఏదైతే జరగకూడని అనుకున్నానో అదే జరిగిందని ఆవేదన చెందిండు.

కేసీఆర్‌ను అరెస్టు చేయడంతో తెలంగాణ మొత్తం బగ్గున మండింది. ఎక్కడికక్కడ నిరసనలు, రాస్తారోకోలు చేస్తూ రోశయ్య దిష్టిబొమ్మలను దహనం చేసింగ్రు. తెలంగాణ అట్టుడికిపోయింది. విషయం తెలుసుకున్న హరీశ్‌రావు రంగథాంపల్లి దీక్షాస్థలంలో దీక్షకు దిగుతున్నట్టు ప్రకటించిండు. పరిస్థితి ఉద్రిక్తంగ మారింది. హైద్రాబాద్‌లో విద్యార్థులు, ఉద్యమకారుల రెచ్చిపోయి బస్సులకు నిప్పు పెట్టింగ్రు.

కేసీఆర్ అరెస్టుకు నిరసనగ తెల్లారి బంద్‌కు పిలుపునిచ్చింగ్రు. తెలంగాణ వాదులంత ఒక్కరొక్కరుగ ఖమ్మం బాట పట్టింగ్రు. పత్రికలు, ఛానళ్ళు హోరెత్తినయి. కేసీఆర్ పచ్చి మంచినీళ్ళు కూడ ముట్టుకోకుండ 24 గంటలు గడిచిపోయింది. సహచరులు ఆందోళన చెందింగ్రు. ఆ క్షణంలో 'నాకు ఏమన్నయినతే మీరంత లేరు' అన్న కేసీఆర్ మాటతోని అందరు ఏడ్చినంత పనైంది. ఉద్యమాన్ని శాంతియుతంగ ముందుకు తీసుకొని పోయే అన్ని మార్గాలను అన్వేశిస్తనే ఉంగ్రు. ఉద్యమంలో కలిసి వచ్చే వాళ్ళను సమాయత్తం చేస్తుంగ్రు. 30 తేది సోమవారం

పోలీసులు జైలు లోపల మోహరించింన్రు. కేసీఆర్‌ని మళ్ళీ ఎక్కడికో తీసుకపోయే ప్రయత్నం చేసింన్రు. ఇది గ్రహించిన కెప్టెన్ లక్ష్మీకాంతరావు తలుపుకు అడ్డంగ పండుకున్నడు. పోలీసులు శత్రుదేశ సైనికుల లెక్క మారింన్రని, ఆవేదన చెందిండు. "పోలీసుల దౌర్జన్యం నశించాలని" ఒక్కసారిగ పోలీసుల మీద విరుచుకపడ్డడు. తన మిలిట్రి బలాన్ని చూపించిండు. మిగతావాళ్ళు "సార్‌ని ఎక్కడికి తీసుకపోవద్దు" అంటూ పోలీసులతో వాగ్వాదం చేసింన్రు. ఖమ్మం జైల్లో పోలీసులు కెప్టెన్‌ని మాజి సైనికుడన్న గౌరవం కూడ లేకుండ ఈడ్చేసింన్రు. కార్యకర్తల మీద లాఠీచార్జ్ చేసి కేసీఆర్‌ని స్ట్రెచర్ మీదికి ఇసిరేసింన్రు. పోలీసుల ప్రవర్తన క్రూరంగ మారింది. వలసపాలకుల ఆలోచనలో ఏదో మార్పు వచ్చిందనే విషయం స్పష్టంగ అర్థమయ్యింది. ఉద్యమకారులకు ప్రభుత్వం మీద అనుమానం పెరిగింది.

"కేసిఆర్‌ని ఎక్కడికి తీసుకపోయింన్రు" అని
రాజయ్యయాదవ్ జైలు అధికారిని గట్టిగ ప్రశ్నించడంతో
"ఆస్పత్రికని" సమాధానం చెప్పిండు.

మొత్తానికి కేసీఆర్‌ని ఖమ్మం జిల్లా ఆస్పత్రి రూమ్ నెంబర్ 17లో జాయిన్ చేసింన్రు. గాంధీ ఆస్పత్రి నించి వచ్చిన వైద్యులచేత పరీక్షలు నిర్వహించింన్రు. ఖమ్మం ఆస్పత్రి పరిధిలో వంద మీటర్ల దాక నిర్మానుష్యంగ మారింది. దావఖాన పరిసర ప్రాంతాలు నాయకుల, కార్యకర్తల నినాదాలు, నిరసనలతో దద్దరిల్లింది. ఇంతలో హరిశ్‌రావుతో మరికొందరు నాయకులు దావఖాన లోపలికి పోయింన్రు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పాపాలాల్ ఇతర వైద్యులు కేసీఆర్ దగ్గరే ఉన్నరు. ఏం జరుగుతుందో అర్థకానంత వేగంగ పోలీసులు, డాక్టర్లు నీరసంగ మత్తుగ పడుకొని ఉన్న కేసీఆర్‌కు పండ్ల రసం తాగిస్తున్నట్టు చేసింన్రు. ఇదంత ఓ కానిస్టేబుల్ వీడియో తీసిండు. హరిశ్‌రావు అనుమానంతో ఎవరు మీరంత అని వీడియో తీస్తున్నవాన్ని అడగడంతో తడబడి మీడియా అని సమాధానం చెప్పిండు. తన అనుమానం నిజమేనని గ్రహించిన హరీశ్‌రావు ఎనకముందు చూడకుండ రెండు సప్పరించిండు. పరిస్థితిని గమనించి అక్కడున్న పోలీసులు అతన్ని విడిపించుకొని వెళ్ళిపోయింన్రు. అంతే రాత్రి ఏడు గంటల సమయంలో "కేసీఆర్ దీక్ష విరమించిండన్న వార్త టీవీలలో బాంబు పేలినట్టు పేలింది.

"2009 డిసెంబర్ 1న కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపిన వైద్యులు మత్తుమందు ఇచ్చి రంగునీళ్ళు మూతికాడ పెట్టిన ఫోటోలు టీవీలలో ప్రసారం చేసింన్రు. పోలీసులు కేసీఆర్ దీక్ష భగ్నమైందని ప్రకటించింన్రు.

ఆ తర్వాత అదే వార్తని డిపిఆర్వో ముర్తుజా అధికారికంగ మీడియాకు విడుదల చేసిండు. క్షణాల్లో వార్త టీవీల్లో హల్‌చల్ చేసింది.

సీమాంధ్ర మీడియా చిచ్చరపిడుగులా రెచ్చిపోయింది. కేసీఆర్‌కు వ్యతిరేకంగ వార్తలు పోగేసి మంట పెట్టింది. యూనివర్సిటీల్లో కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం, గద్దర్ మాటలతో కలిపి సీమాంధ్ర మీడియా ఎంత చేయాల్నో అంత చేసింది. కాని సామాన్యజనం కేసీఆర్ దీక్ష విరమించిండంటే నమ్మలేకపోయింద్రు. సీమాంధ్ర పాలకులు చేసిన కుట్రలో భాగంగ పోలీసులు ఆడిన నాటకమని స్పష్టంగ కనిపిస్తుందని అదే విజువల్స్‌ని చూసిన జనం కూడ అనుకున్నరు. కాని తెలంగాణ నాయకులు కొందరు రెచ్చిపోయి మాట్లాడింద్రు. కేసీఆర్ దీక్ష విరమించిండన్న వార్తతో రెచ్చిపోయిన ఉస్మానియా విద్యార్థులు కేసీఆర్‌ని నిందిస్తూ నిరసనలు తెలిపింద్రు. మరికొందరు దీన్ని కుట్రగ భావించి కేసీఆర్‌ని ఖమ్మం నించి హైద్రాబాద్ తీసుకురావాలని లేదంటే కేసీఆర్ ప్రాణాలకే ప్రమాదమని దీక్షలు చేపట్టింద్రు.

ఆ క్షణంలోనే కేసీఆర్ బలాన్ని కూడగట్టుకొని

"తెలంగాణ కోసం బలిపీఠం ఎక్కిన నేను, తెలంగాణ బిడ్డలు చనిపోతుంటె బాధపడుతున్న అంతేకాని, ఎట్టి పరిస్థితులలో దీక్ష విరమించేది లేదని" మీడియాకు ప్రకటించిండు.

అదేరోజు రాత్రి ఖమ్మం వచ్చిన జయశంకర్‌సార్ బయట జరిగే విషప్రచారాన్ని చూసి హరీశ్‌రావు, వినోద్‌కుమార్ ఇతర నాయకులతో కలిసి దీక్ష విషయంలో సీమాంధ్ర మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని, కేసీఆర్ దీక్ష కొనసాగుతుందని ప్రకటించింద్రు. పోలీసులకు అప్పజెప్పి పోయిన జైలు అధికారులను, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ని కేసీఆర్ మందలించిండు.

"మీ బాధ్యతని మీరు సక్రమంగ నిర్వహించ లేనప్పుడు ఎందుకయ్యా మీకు డిగ్రీలు, ఉద్యోగాలు రాజినామ చేయండి. తెలంగాణ భవన్‌లో జీవితాంతం జీతమిస్త" అని తీవ్రస్వరంతో మాట్లాడిండు. ఆ మాటలతో వాళ్ళలో కొంత చైతన్యం కలిగినట్టయ్యింది. చేసిన తప్పుకు సిగ్గుతో తలదించుకుంద్రు. కేసీఆర్ తెలంగాణ జర్నలిస్టులతో జరిగిన విషయాన్ని పంచుకుండు.

"తెలంగాణ రాష్ట్రం ప్రకటించే వరకు దీక్ష విరమించేది లేదని" పరామర్శకు వచ్చిన నాయకులతో ప్రభుత్వానికి వర్తమానం పంపిండు. మానవ హక్కుల కమీషనర్ జస్టిస్ సుభాషణ్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి జరిగిన విషయాన్ని వివరించిండు. జాగృతి కవిత ఫిర్యాదు మేరకు కేసీఆర్ గదిలోకి వెళ్ళకూడదని కమీషన్ పోలీసులను

ఆదేశించింది. ఖమ్మం పట్టణానికి చెందిన డాక్టర్ గోపినాథ్‌ని వైద్యసేవల నిమిత్తం పిలిపించుకుండు. కేసీఆర్ భార్య, సోదరి, బంధువులు ఆస్పత్రికి వచ్చిండ్రు. ఖమ్మం జిలా కలెక్టర్ అర్ధరాత్రి వరకు అక్కడే ఉండి ఆ తర్వాత కేసీఆర్ ఆరోగ్యం బాగ క్షీణిస్తుందని మీడియాతో మాట్లాడిండు. అందుకే కేసీఆర్ కోరినట్టు డాక్టర్ గోపినాథ్‌ని రప్పించినమని చెప్పిండు.

సీమాంధ్ర పోలీసు అధికారులు తెలంగాణ పోలీసులను కన్నమాటలు అంటుండ్రు. బండ బూతులు తిడుతుండ్రు. "పోరగాండ్లంత రోడ్ల మీదికొచ్చి రాస్తారోకోలు చేస్తుంటే, విధ్వంసానికి పాల్పడుతుంటే మీరేంజేత్తాండ్లు పీకుతాండ్ల అంటున్నరు కొడుకులు. మాకేమో పోరగాళ్ళని కొట్టాలంటే చేతులొస్తలేవు. అందుకనే తెలంగాణ కోసం సచ్చిపోతనని" కానిస్టేబుల్ కిష్టయ్య సెల్‌టవర్ ఎక్కి తుపాకితో కాల్చుకొని చనిపోయిండు. కానిస్టేబుల్ కిష్టయ్య ఆత్మబలిదానం తెలంగాణ పోలీసులను మరింత ఆలోచింపజేసింది. తెలంగాణ ఉద్యమం పట్ల సానుభూతి పెరిగి, ఉద్యమకారులకు సహకరించడం మొదలైంది.

డిసెంబర్ 2న కేసీఆర్ దీక్ష నాలుగో రోజుకు చేరింది. బి.పి. షుగర్ లెవల్స్ బాగ పడిపోయినయి. బి.పి. కంట్రోల్ కోసం కేసీఆర్ వేసుకునే ఈనం ట్యాబ్‌లెట్స్ తప్ప డాక్టర్లు ఇచ్చిన ఏ మందులు వేసుకుంట లేదు. డాక్టర్లు సెలైన్ ఎక్కించే ప్రయత్నాన్ని ముమ్మరం చేసిండ్రు. అయితే డాక్టర్లు వచ్చిన ప్రతిసారి వాళ్ళ వెనుక ఒక వ్యక్తి కెమెరాతో వస్తున్న విషయాన్ని కేసీఆర్ గమనించిండు. ఆస్పత్రి బయట, తెలంగాణ మొత్తం ఉద్యమం ఉధృతంగ సాగుతుంది. ఎక్కడిక్కడ జనం దీక్షలు, బంద్‌లు, రాస్తారోకోలతో రోశయ్య ప్రభుత్వాన్ని రోడ్లమీద దహనం చేస్తుండ్రు. పిండాలు పెడుతుండ్రు. ఖమ్మంలో న్యూడెమోక్రసి పోరాటం తీవ్రరూపం దాల్చింది. హైద్రాబాద్‌లో ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్‌ని తగలబెట్టిండ్రు. రెండుబోగీలు పూర్తిగ ధ్వంసం అయినయి. కాసు బ్రహ్మానంద రెడ్డి విగ్రహాన్ని తగలబెట్టి డాంబరు పోసిండ్రు. ఖమ్మంలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ధ్వంసం చేసిండ్రు. విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నిరసన ఊపందుకుంది. మంగళవారం పెన్‌డౌన్ చేసిన ఉద్యోగులు బుధవారం కేసీఆర్‌ని విడుదల చేయాలని డిమాండ్ చేయడంతో ప్రభుత్వానికి పట్టపగలే సుక్కలుగనపడ్డయ్.

నల్లగొండలో యం.జి. యూనివర్సిటి విద్యార్థులు నార్కట్‌పల్లి – అద్దంకి బైపాస్‌ని దిగ్బంధనం చేసిండ్రు. కోమటిరెడ్డి దిష్టిబొమ్మని దహనం చేసిండ్రు. క్లాక్‌టవర్ సెంటర్‌లో నిరసన చేస్తున్న విద్యార్థుల మీద పోలీసులు లాఠీచార్జ్ చేసిండ్రు. మిర్యాలగూడ, సూర్యాపేట, నకిరేకల్, భువనగిరి, తుంగతుర్తిలో పెద్ద పెత్తున నిరసనలు

చేసింద్రు. కాంగ్రేసు నాయకులను దుమ్మెత్తి పోసింద్రు. బస్సులను తగలబెట్టింద్రు. ధర్మారంలో బి.ఎస్.ఎన్.ఎల్ టవర్‌ను కాల్చేసింద్రు. అన్ని యూనివర్సిటీలలో నిరసన జ్వాలలు ఆకాశాన్ని అంటుకున్నయ్.

జూనియర్ లెక్చరర్ల కోసం 6వతేది నిర్వహించవలసిన పరిక్షను ప్రభుత్వం నిరవధిక వాయిదా వేసింది. 4వరోజు కూడ ఆత్మహత్యలు ఆగలేదు. మెదక్‌జిల్లా దౌల్తాబాద్ మండలం తిమ్మక్కపల్లిలో రాజేందర్, కరీంనగర్‌లో కాలేజ్ విద్యార్థి శ్యాం ఒంటి మీద కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంద్రు. పోలీసుల దౌర్జన్యాన్ని, సీమాంధ్ర పాలన తీరునుచూసిన యువకుడు కుంచ శ్రీను కొండపాక సమీపంలో గుండెపోటుతో మరణించిండు. ఆందోళనలతో అట్టుడికిన ఉస్మానియా యూనివర్సిటి ఉద్యమ కేంద్రంగ మారింది. విద్యార్థులు చేపట్టిన దీక్ష శిబిరానికి కొండా లక్ష్మణ్ బాపూజీ వచ్చిండు. జెఎసిగ ఏర్పడిన విద్యార్థులు పోరాట యోధులకు వారధిగ నిలిసింద్రు. ఉపెందర్, రవీంద్రనాయక్, సుమన్ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి తెలంగాణ పోరాటాన్ని గురించి చెప్పింద్రు. కేసీఆర్ విషయంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా ప్రభుత్వమే భాధ్యత వహించాలని చెప్పింద్రు. ఢిల్లిలో కాంగ్రేసు నాయకులు ఎవరికి తోచినట్టు వాళ్ళు మాట్లాడుతున్నరు. ఇంతలో ఖమ్మం కోర్టు బలవంతంగనైన కేసీఆర్‌కు వైద్యం అందించాలని సెలైన్ ఎక్కించాలని ఆదేశించింది. సబితా ఇంద్రారెడ్డి ముఖ్యమంత్రితో మాట్లాడింది. కేసీఆర్‌కు ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ వచ్చినందున ఖమ్మం నుంచి హైద్రాబాద్ తరలించాలని ఆదేశించింది. అందుకోసం మొదట హెలిపాడ్‌ని సిద్దం చేసింది. ఖమ్మం కలెక్టర్ ఉషారాణి కేసీఆర్ కుటుంబ సభ్యులకు హెలిపాడ్ విషయం చెప్పినప్పుడు వాళ్ళు రోడ్డుమార్గంలోనే హైద్రాబాద్ నిమ్స్‌కు తీసుకుపోవాలని కోరుకున్నరు. డిసెంబర్ 3న తెల్లారకముందే 3గంటల ప్రాంతంలో 108 వాహనంలో కేసీఆర్‌ని స్ట్రెచర్ మీదేసి, హరిశ్‌రావు ఇతర వైద్య సిబ్బంది కేసీఆర్‌ని హైద్రాబాద్ నిమ్స్‌కు తరలించింద్రు. కేటీఆర్, భార్య శోభ వేరే బండిలో అంబులెన్సును అనుసరించి నిమ్స్‌కు చేరుకుంద్రు. నిమ్స్ డైరెక్టర్ ప్రసాదరావు, డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్యపరిక్షలకు సిద్దమయ్యింద్రు.

"నాకు ట్రీట్‌మెంట్ అవసరం లేదు" అని కేసీఆర్ అనడంతో

"దయచేసి సహకరించండి మేం కేవలం వైద్య పరీక్షలు మాత్రమే నిర్వహిస్తామని" డాక్టర్లు అన్నరు. పరీక్షలన్ని జరిపి ఊపిరితిత్తులని ఎక్స్‌రే తీస, గుండెను ఈసిజి తీసింద్రు. కేసీఆర్‌కు సెలైన్ ఎక్కించే ప్రయత్నం చేసింద్రు. దానికి కేసీఆర్ నిరాకరించిండు.



కేసీఆర్‌తో ఉన్న నాయిని, కెప్టెన్ మరో ఇద్దరు కేసీఆర్ ఆజ్ఞ మేరకు బెయిల్ పిటిషన్ వేయడంతో కోర్టు వాళ్ళకు బెయిల్ మంజూరు చేసింది. కేసీఆర్‌ని కూడ బెయిల్ పిటిషన్ వేయమని కొందరు సలహా ఇచ్చినప్పుడు

"మనం తప్పు చేయలేదు, అయినా అరెస్టు చేసి జైళ్ళ పెట్టింద్రు. ప్రభుత్వమే తప్పుని ఒప్పుకొని విడుదల చేయాలె. మనం దేబరించేదేంది?" అని మొండి ధైర్యంతో మాట్లాడిండు. జర్నలిస్టులు ఢిల్లిలో రోశయ్యను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింద్రు. అడ్డదిడ్డమైన సమాధానాలతో రోశయ్య అయ్యాల సగం పిచ్చోడనిపించిండు.

టి.ఆర్.ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో సమావేశమై తెలంగాణ అమరవీరుల ఆత్మశాంతి కోసం నివాళులు అర్పించింది. అన్ని మండల కేంద్రాల్లో అమరులకు నివాళి అర్పించే కార్యక్రమం చేయాలని పిలుపునిచ్చింది.

నల్లగొండ జిల్లా నకిరెకల్ ప్రధాన రహదారి మీద రాస్తారోకో చేసింద్రు. 10బస్సులు, 15లారీలు ధ్వంసం చేసింద్రు. గంటల తరబడి ట్రాఫిక్ ఆగిపోయింది. హైద్రాబాద్ కె.పి.హెచ్.బి. కాలనీలో రెండు బస్సులు తగలబెట్టింద్రు. విద్యార్థి ఉద్యమాలకు తట్టుకోలేని ప్రభుత్వం కళాశాలలకు 15రోజులు సెలవులు ప్రకటించింది. యూనివర్సిటీల మెస్ బంద్ చేసి విద్యార్థులను బయటికి పంపాలని వి.సి. తిరుపతిరావు మీద పోలీసులు వత్తిడి చేసింద్రు.

అంతకు ముందే అనుకున్నట్టుగ డిసెంబర్ 4న కోదండరాం కన్వీనర్‌గ

తెలంగాణ పొలిటికల్ జె.ఎ.సి ఏర్పడింది. ఈ జెఏసీలో టి.ఆర్.ఎస్. తెలంగాణ కాంగ్రేస్, తెలంగాన టి.డి.పి ఫోరం, బి.జె.పి. సి.పి.ఐ., న్యూడెమోక్రసి పార్టీలు చేరినయి. డిసెంబర్ 10వ తేదీ లోపల తెలంగాణ రాష్ట్రం ప్రకటించాలని జెఏసి ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించింది. డిసెంబర్ 4 శుక్రవారం కేసీఆర్ దీక్ష 6వ రోజుకు చేరింది. అయితే జైత్రయాత్ర లేకుంటే శవయాత్ర అన్న ఒక్క మాటతో తెలంగాణ కార్యాచరణ ప్రకటించిండు కేసీఆర్. కేసిఆర్ స్వగ్రామం చింతమడక నించి మహిళలు పెద్ద ఎత్తున నిమ్స్ ఆస్పత్రికి తరలి వచ్చిండ్రు. మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్సి నాగేశ్వర్ లాంటి వాళ్ళు ఎందరో ఆస్పత్రికి వచ్చిండ్రు. మెదక్ ఎం.పి విజయశాంతి కూడ వచ్చింది. ఉస్మానియా యూనివర్సిటి జెఏసి ప్రతినిధులు వి. రామారావు గౌడ్, ఎర్రోళ్ళ శ్రీనివాస్, పిడమర్తి రవి, పృధ్వీరాజ్ చైహాన్, దరువు ఎల్లయ్య, రవీంద్ర నాయక్, ఉపెందర్, విజయ్‌కుమార్‌లు కేసీఆర్‌ని కలిసి పరామర్శించిండ్రు. దీక్షకు పూర్తి సంఘీభావం ప్రకటించిండ్రు.

ఆ వెంటనే ఉస్మానియా జెఏసి ఈనెల 9వతేదీ లోపల రాష్ట్ర అసెంబ్లీలో తెలంగాణ తీర్మాణం చేసి పంపాలని లేదంటే 10న అసెంబ్లీ ముట్టడి చేస్తామని చెప్పిండ్రు. కేసీఆర్‌కు ఏమైన అయితే రాష్ట్రం అగ్నిగుండం అయితదని హెచ్చరించిండ్రు. అంతే రాష్ట్రంలో జరుగుతున్న నిరసనలు ముఖ్యమంత్రి రోషయ్యకు ముచ్చెమటలు పట, కాలం మూడినట్టు, కుర్చి కదిలినట్టనిపించింది.

# శ్రీకాంతాచారి త్యాగం

కాసోజు శంకరమ్మ, వెంకటాచారి దంపతులకు జన్మించిన కాసోజు శ్రీకాంతచారి తెలంగాణ రాష్ట్రసాధనే ధ్యేయంగ ఉద్యమంలో ముందుకు ఉరికిండు. 2009 నవవబర్ 29న కేసీఆర్ దీక్ష తలపెట్టిన రోజు సీమాంధ్ర పోలీసులు దీక్ష భగ్నం చేయాలని అనేక ప్రయత్నాలు చేసిండ్రు. అందులో భాగంగానే కేసీఆర్‌ని అరెస్టు చేసి తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేస్తరని యువకులు నిరాశ చెంది, ఉద్వేగానికి లోనయ్యిండ్రు. తెలంగాణ రాకపోతే బతుకే లేదని నల్లగొండ జిల్లా పొడిచేడు గ్రామానికి చెందిన కాసోజు శ్రీకాంతాచారి ఒంటి మీద పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నడు. శరీరం కాలి చర్మం నేలమీద రాలుతుంటే జూలు విదిల్చిన సింహంలా చుట్టూ చూస్తుండు శ్రీకాంత్. రగులుతున్న తెలంగాణ గుండె మంట ముందు ఈ మంటలు నన్నేమి చేస్తయ్ అన్నంత ధీమాతో ఆ ఉద్యమజ్వాలను ఊరూర అంటించిండు. ఎల్.బి.నగర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ముందు పడిపోయిండు. శ్రీకాంతచారిని ముందు కామినేనికి, అక్కడ్నించి అపోలో దావఖానకు తీసుకపోయిండ్రు. ఆ సమయంలో కల్వకుంట్ల కవిత అన్ని విధాల సాయపడింది. తెలంగాణ ఉద్యమంతో పాటు శ్రీకాంతాచారిని బతికించే ప్రయత్నం చేసింది. అయినా తెలంగాణ తల్లి రుణంతీర్చుకొని డిసెంబర్ 3న దావఖానలో శ్రీకాంతాచారి చనిపోయిండు.



కడుపుగాలిన తెలంగాణతల్లి కన్నెర్ర జేసింది. ఉద్యమంతో ఊరువాడ ఒక్కటై, ఉప్పెనై కదిలింది. పోలీసుల దెబ్బలకు గాయపడి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్న నాయక్ చనిపోయిండు. దీంతో ఉస్మానియాలో రెచ్చి పోయిన విద్యార్థులు పోలీసుల మీద రాళ్ళ వర్షం కురిపించిండ్రు. పోలీసుల దగ్గరినుంచి లాటీలు గుంజుకొని తిరగబడి కొట్టిండ్రు. గాయాలపాలైన విద్యార్థుల్లో తొట్టస్వామి, సుమన్, రాజారాం యాదవ్, మానవహక్కుల కమీషన్ ముందు వాదనలు వినిపించిండ్రు.

కరీంనగర్ జిల్లా మల్లాపూర్ మండలం వాల్గొండకు చెందిన దండిగ పృద్వీరాజ్, వరంగల్ జిల్లా గోపాతండకు చెందిన భుక్యా ప్రవీణ్, మెదక్ జిల్లా దుద్దెడ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌లు ఉరిపెట్టుకొని చనిపోయింద్రు.

తెలంగాణ పది జిల్లాలలో ఉద్యమ కారులు రెచ్చిపోయింద్రు. సీమాంధ్ర పాలకుల నిరంకుశత్వాన్ని ఎదిరించింద్రు. 2001లో హైద్రాబాద్ జలదృశ్యంలో పార్టీ పెట్టినప్పుడు కేసీఆర్ ఒక్కడే కావచ్చు. ఇయ్యాల మొత్తం తెలంగాణ ఉద్యమానికే ఊపిరయ్యిండు. మొత్తానికి కేసీఆర్ దీక్ష తెలంగాణ సమాజాన్ని ఒక్కటి చేసింది. ప్రతి ఒక్కరు పార్టీలు సంఘాలకు అతీతంగ తెలంగాణ రాష్ట్రాన్ని డిమాండ్ చేసి సాధించే దిశగా అడుగులేసింద్రు. కేసీఆర్‌కు సంఘీబావం ప్రకటించి, వలసపాలకుల గుండెల్లో ప్రకంపనలు సృష్టించింద్రు.

ఆరురోజులు గడిచిపోయింది. డిసెంబర్ 5 శనివారం నాడు కేసీఆర్‌ని ఐసియులో పెట్టింద్రు. తెలంగాణ రాష్ట్రాన్ని టెన్షన్‌లో పెట్టింద్రు. తెలంగాణ పదిజిల్లాల అభిమానులు, ఉద్యమకారులు నిమ్స్‌కు బాటపట్టింద్రు. మధ్యాహ్నం సమయంలో సినీనటుడు, ప్రజారాజ్యంపార్టీ నాయకుడు చిరంజీవి నిమ్స్‌కు వచ్చినప్పుడు ఆందోళన జరిగింది. ఆ తర్వాత సంజాయిషి ఇచ్చుకొని వెళ్ళి కేసీఆర్‌ని కలిసిండు. కేసీఆర్ పరిస్థితిని ఉద్యమతీవ్రతను ముఖ్యమంత్రికి వివరించిండు. తండోపతండాలుగ నిమ్స్‌కు తరలివస్తున్న జనంతో పాటు అన్ని పార్టీల నాయకలు, ప్రజాసంఘాల బాధ్యులు వచ్చి కేసీఆర్‌ని పరామర్శించి పోతుంద్రు. ఉస్మానియా విద్యార్థులు కూడ పెద్ద ఎత్తున నిమ్స్‌కు చేరుకుంద్రు. బయటికి వచ్చిన కేటీఆర్‌ని అన్న సార్ ఎట్లున్నడని అడిగింద్రు. “నాన్న ఆరోగ్యం బాగలేదు. అయినా దీక్ష విరమించనని అంటున్నడు” అని కండ్లనిండ నీళ్ళు నింపుకున్నడు. టి.ఆర్.ఎస్ పార్టీ ఈ అర్ధరాత్రి నుంచి 48 గంటల బంద్‌కు పిలుపునిచ్చిందన్న విషయాన్ని వాళ్ళకు చెప్పిండు. అంతకుముందే డిసెంబర్ 6,7 తేదీలలో జెఏసీ తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చింది. దాదాపు ఆరేడొందల మంది విద్యార్థులు రోడ్లమీదికొచ్చి పంజాగుట్ట రోడ్డుమీద కూర్చొని రాస్తారోకో చేసింద్రు. అమీర్‌పేట చౌరస్తాలోని దుకాణాలు, ఆంధ్రమెస్‌లు, హోటల్స్, బిగ్‌బజార్, చందనబ్రదర్స్ వంటి దాదాపు డెబ్బయ్ ఎనబై షాపులను ధ్వంసం చేసింద్రు. “కేసీఆర్‌కు ఏమన్నయితే నా కొడకల్లార ఇక్కడ ఒక్కడు మిగలడు” అంటూ వీరంగం సృష్టించింద్రు. బస్సుల అద్దాలు పగలగొట్టింద్రు. విద్యార్థులను చెదరగొట్టడానికి పోలీసులు ఎన్నిసార్లు లాటీచార్జ్ చేసింద్రో లెక్కేలేదు. తెలంగాణ పదిజిల్లాలలో ఈ నిరసన సెగలు అంటుకున్నయ్. మెదక్ జిల్లా కొండపాక దగ్గర 50 బస్సులను ధ్వంసం చేసింద్రు.

కాంగ్రేసు నాయకుల ఇండ్లను ముట్టడించింద్రు. ఎం.ఆర్.పి.యస్ కార్యకర్తలు అర్ధనగ్న ప్రదర్శన చేసింద్రు. పాలకుర్తి మండలం వల్మిడిలో చెరుకు అంజయ్య కరెంటు తీగలు పట్టుకొని ఆత్మహత్య చేసుకుండు. పొద్దున్నే పేపర్ల నిండ ఆంధ్రోళ్ళకు మద్దతుగా సీమాంధ్ర రాతలు “ సెటిలర్స్ మీద విద్యార్థుల దాడులు” దాడులను ఖండించిన చంద్రబాబు” దాడులకు అండగ ఉంటామన్న తెలుగుదేశం” ఇవి బ్రేకింగ్ న్యూస్‌లు. ఇలాంటివి ఎన్నోసార్లు ప్రచారం చేసినయి. కాని తెలంగాణ కోసం ఇంత జరుగుతుంటే ఏనాడు ఆ తీవ్రతను మాత్రం ప్రభుత్వాల దృష్టికి తీసుకపోయిన పాపాన పోలేదు. ఇంత మంది బిడ్డలు సచ్చిపోతుంటే ఒక్కరు అట్ల వచ్చి తొంగిచూసినోల్లు లేరు. ఇలాంటి అనేక విషయాలను తెలంగాణ ప్రజలు, ఉద్యమకారుల మదిలో రగులుతున్నయి. రోడ్లమీద మంటలై మండుతున్నయి.

డిసెంబర్ 6, ఆదివారం ఎక్కడి బస్సులు అక్కడ్నే ఆగిపోయినయి. ఒక్క హైద్రాబాద్ ఇమ్లీబన్ డిపోలోనే 16వేల బస్సులు నిలిచిపోయినయి. పెట్రోల్ బంక్‌లు, సినిమాహాళ్ళు ఏ ఒక్కటి తెరువ లేదు. 48గంటల బంద్ స్మశాన నిశబ్ధంతో కొనసాగింది. మరోవైపు మెదక్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో బస్సులు, ప్రభుత్వ కార్యాలయాలకు నిప్పు బెట్టింద్రు. సీమాంధ్ర నాయకుల విగ్రహాలతో పాటు షాద్‌నగర్‌లో తెలుగుతల్లి విగ్రహాన్ని ముక్కలు ముక్కలు చేసింద్రు. తెలంగాణ ద్రోహుల లిస్ట్‌ని తయారు చేసి వాళ్ళ ఇండ్ల మీద ఉచ్చలు పోసింద్రు. పిడికలు గొట్టింద్రు. రోడ్ల మీద ఎక్కడనన్న కనపడితే గోబ్యాక్ అంటూ వెంటపడి తరిమింద్రు. తెలంగాణ ఉద్యమతీవ్రతని తట్టుకోలేని కాంగ్రేస్ మంత్రులందరు నిమ్స్‌కు వచ్చింద్రు. కేసీఆర్ పరిస్థితిని చూసి “దీక్ష విరమించాలని, సోనియాకు లేఖ రాస్తమని” చెప్పింద్రు. “తెలంగాణ ప్రకటన రాకుండ దీక్ష విరమించేది లేదని, మీ లేఖలతో పని కాదని” కేసీఆర్ తీవ్రస్వరంతో చెప్పడంతో అందరు అక్కడినుంచి వెళ్ళిపోయింద్రు. బండారు దత్తాత్రేయ, సి.హెచ్. విద్యాసాగర్‌రావు. కె.లక్ష్మణ్ ఇంకా ఇతర నాయకులు, విరసం నేత వరవరరావు, జర్నలిస్ట్‌లు అమర్, శ్రీనావాస్‌రెడ్డి కేసీఆర్ పరిస్థితిని చూసి బాధపడ్డరు. దీక్ష విరమిస్తే అందరం కలిసి ఉద్యమం చేద్దామని చెప్పింద్రు. అయినా కేసీఆర్ ఎవరి మాటల్ని నమ్మదల్చుకోలేదు. పట్టిన పంథాన్ని విడువని మొండి మనిషని అందరికి అర్థం అయ్యింది. చూస్తందుకు బక్కపలుచగ ఉన్నా, ఆశయంతో కూడిన బరువు ఎవరూ కదిలించలేని ఎత్తయిన కొండశిఖరం లెక్కుంది. కన్నతల్లుల గర్భశోకం కన్నీటి పాటయ్యింది.

మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేటలో శివ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకుండు.

ఎంత పోరాడిన తెలంగాణ వస్తలేదని, ఇంకా మన పోరాటాన్ని ఉధృతం చేయాలని వరంగల్ జిల్లా కురవి మండలం సూదనపల్లిలో తోడేటి నాగరాజు కరెంటు తీగలు పట్టుకొని చనిపోయిండు. వరంగల్ జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూరులో దేవరాయ రమేశ్ అనే డిగ్రి విద్యార్థి ఊర్ల జనమంత చూస్తుండంగనే వాటర్ ట్యాంక్ ఎక్కి "కాంగ్రేస్ నాయకుల్లార ఖబడ్దార్" అంటూ కిందికి దునికిండు. కాళ్ళు,వెన్నెముక ఇరగడంతో హైద్రాబాద్ నిమ్స్‌కు తీసుకపోయింద్రు. కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణ్‌పూర్‌లో కార్యకర్త బనిగెల అశోక్ కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తుందన్న బాధతో వంటిమీద కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని చనిపోయిండు. జమ్మికుంట మండలం రాచపల్లిలో ఆరెల్లి కృష్ణ పురుగుల మందు తాగిండు. తిమ్మాపూర్లో నాలుక వెంకటయ్య టి.వి. వార్తలు చూసుకుంట గుండె ఆగి సచ్చిపోయిండు. మెదక్ జిల్లా మగ్దాంపూర్‌లో గంగరబోయిన గురువయ్య ఉరేసుకుని సచ్చిపోయిండు. రాజగోపాలపేటకు చెందిన తలారి రమేశ్ పురుగుల మందు తాగి చనిపోయిండు. దుబ్బాక మండలం ఎనగుర్తిలో నర్సింహులు రాస్తారోకో చేస్తూనే గుండె ఆగి చనిపోయిండు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు వందలాదిమంది తెలంగాణ మట్టి బిడ్డలు పిట్టల్లా రాలిపోయింద్రు.

కేసీఆర్ పరిస్థితి విషమించిపోతుంది. ఇంకా బతికి సాధించేది ఏమిలేదు అన్నంతగ కేసీఆర్ దీక్షలో మునిగిపోయిండు. ఉన్న ఆ కాస్త శక్తి కూడ అడుగంటి పోయింది. రాత్రి అయిందంటే జ్వరం కమ్ముకుంటుంది. ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో హరీశ్‌రావు, కేటీఆర్, కవితలు పక్కనే ఉండి ఒకరినొకరు చూసుకోవడం తప్ప, కేసీఆర్‌ని దీక్ష విరమించమని చెప్పే ధైర్యం వీళ్ళకు లేదు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ నా పక్కన ఉంటే ఉద్యమ స్ఫూర్తి కలుగుతుందని కేసీఆర్ పదపదే అనడంతో పాటు ఎప్పుడు తన దగ్గరే ఉండాలని కోరుకున్నడు. కేసీఆర్ తపోదీక్షను చూసిన జయశంకర్ సార్ కన్నతండ్రి లెక్క సేవలు చేసిండు. కంటికి రెప్పయ్ కాపాడిండు.

తెలంగాణ పదిజిల్లాలో ఉద్యమం తీవ్రరూపం దాల్చుతుంది. కాంగ్రేస్ ఎంపీలు నిమ్స్‌కు వచ్చింద్రు. కేశవరావు వచ్చీరావడంతోని కేసీఆర్‌ని చూసి కన్నీరు బెట్టిండు. ఢిల్లీ పరిస్థితిని వివరించి దీక్ష విరమించమని కోరిండు. కాని కేసీఆర్ ఒప్పుకోలేదు. "కాంగ్రేసు సంగతి మీకు తెలియంది కాదు. మీరంత కలిసి కేంద్రం మీద వత్తిడి తెస్తే రాష్ట్రం వస్తది. లేకుంటె నా ప్రాణం పోతది. ఉద్యమమైతే బతుకుతదని" మొకమ్మీద కొట్టినట్టు చెప్పిండు.

ఇంతలోనే నిమ్స్ వద్ద ఒక్కసారిగ మళ్ళీ పోలీసుల హడావిడి పెరిగింది. రోప్

పార్టీ వచ్చింది. డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీ చేసింగ్రు. పెద్ద కాన్వాయ్ మిలీనియం బ్లాక్ ముందు ఆగింది. దీంతో వచ్చింది ముఖ్యమంత్రి రోశయ్య అని అందరికి అర్ధమైంది.

"తెలంగాణ ద్రోహి సి.యం.రోశయ్య గోబ్యాక్" అంటూ పెద్దపెట్టున నినాదాలు చేసింగ్రు. సరిగ్గ రాత్రి పదిన్నర ప్రాంతంలో రోశయ్య కేసీఆర్ ఉన్న గదిలోకి పోయిండు. అప్పుడు కేసీఆర్ దగ్గర కేటీఆర్, కవిత ఉన్నరు. ఆరోగ్య విషయాలను అడిగినప్పుడు కేసీఆర్ నిమ్స్ డైరెక్టర్ ప్రసాదరావు వైపు చూసిండు.

రోశయ్య సమస్యను పరిష్కరించే మంచి వార్త ఏదన్న ఢిల్లీ నించి మోసుకొచ్చిండేమో అనుకున్నరు మన తెలంగాణ నాయకులంత, కాని రోశయ్య ఉత్తసేతులతోని ఊపుకుంట వచ్చిండు.

కేసీఆర్ వైఖరిని గమనించిన రోశయ్య "పరిష్కారం నా చేతిలో లేదు. మీ ఆరోగ్యరిత్య దీక్ష విరమిస్తే మంచింది. నేను చేయగలిగింది చేస్త. 14ఎఫ్ రద్దు కోసం ఇవాళ తీర్మాణం చేసినం. రేపు అసెంబ్లీలో కూడ చేస్తం. హైద్రాబాద్‌ను ఆరోజోన్‌గానే గుర్తిస్తం. ముందు మీరు దీక్ష విరమించండి" అనడంతో కేసీఆర్ బలాన్ని కూడగట్టుకొని బల్లగుద్దినట్టు "మీరు ఒక్కడుగు కూడ ముందుకు వేయకుండ దీక్ష విరమించాలంటే ఎట్ల సాధ్యం అయితది. పార్లమెంట్‌లో బిల్లు పెడతమన్న స్పష్టమైన హామి రావాలె. ముందు మీరు అసెంబ్లీలో ప్రత్యేక తెలంగాణ తీర్మాణం చెయ్యాలె" అంటూ స్పష్టం చేసిండు. సరిగ్గ అప్పుడే మాజీ కేంద్రమంత్రి అజిత్‌సింగ్ అక్కడికి వచ్చిండు. కేసీఆర్ మాటలకు మరింత బలాన్ని చేకూర్చుతూ అజిత్‌సింగ్ రోశయ్యతో "మీరే ఓ నిర్ణయం తీసుకోవాలె" అన్నడు. ఇంతకు మించిన అదును మళ్ళీ రాదని అన్ని పార్టీలనించి తెలంగాణ నాయకులు ప్రభుత్వం మీద వత్తిడి పెంచింగ్రు. ఎవరిస్థాయిలో వాళ్ళు ఢిల్లీలో మంతనాలు జరిపింగ్రు.

తెలంగాణ ఉద్యమరథసారథి, నాలుగుకోట్ల ప్రజల ఆశోజ్యోతి కన్నతండ్రి కేసీఆర్ ఆరోగ్యపరిస్థితిని చూసిన కేటీఆర్, కవితలు ఇద్దరు కూడ డీలా పడ్డరు."డాడీ కండీషన్ ఏందని" డాక్టర్లను నిలదీసింగ్రు. అప్పుడు డాక్టర్లు "షుగర్,బి.పి కంట్రోల్ కావడం లేదని" చెప్పింగ్రు. ఏదైతే ఏముంది కేసీఆర్ కండీషన్ సీరియస్‌గ ఉందని అందరికి అర్ధమైంది. నిమ్స్ డైరెక్టర్ చెప్పుతున్న విషయాలు అందరిని ఏడ్పించినయి. జయశంకర్ సార్ కూడ అద్దాలు తీసి కండ్లు తుడుచుకుండు. హరీశ్, కేటీఆర్, కవిత కన్నీటి పర్యంతమైంగ్రు. మందులు సెలైన్‌లతో లాభం లేదు. దీక్ష విరమించమని మీరైన చెప్పండని డాక్టర్లు చెప్పింగ్రు. సరిగ్గ అప్పుడే అహ్మద్‌పటేల్ నించి కేసీఆర్‌కు ఫోన్ వచ్చింది. కవిత ఫోన్‌లో మాట్లాడింది. "రావు గారు ఎలా ఉన్నారు?" "నాట్‌వెల్

వీక్‌గా ఉన్నారు. ఇన్‌ఫెక్షన్స్ వచ్చి కండీషన్ సీరియస్‌గా ఉంది" ఒకే టేక్ కేర్ కన్వే మై కన్సర్న్ టు హిమ్. ఐ విల్ టాక్ లాటర్" ఫోన్ కట్ అయింది. అహ్మద్ పటేల్ ఫోన్ విషయాన్ని కవిత హరీశ్‌రావు, కేటీఆర్‌లతో పంచుకుంది. ఏదో ఫార్మాలిటి కోసం ఫోన్ చేసిండని అందరు డిజప్పాయింట్ అయ్యి రాత్రి ముద్ద ముట్టకుండ అట్లనే కుర్చీలల్ల అడ్డం ఒరిగిండ్రు.

డిసెంబర్ 7, సోమవారం కేసీఆర్ జ్వరంతో వణికిపోతుండు. మొదటిరోజు బంద్‌తో ఎక్కడి బస్సులు అక్కడ నిలిచిపోయి బంద్ విజయవంతం అయ్యింది. 48 గంటల బంద్‌కు స్పందించిన జనాన్ని చూసి కేసీఆర్‌లో కొంత బలం వచ్చింది. తెలంగాణ ప్రతిబిడడ్డకు మనసులో దండం పెట్టుకుండు. కాని పిట్టల్లా రాలిపోతున్న తెలంగాణ బిడ్డల్ని చూసి కన్నీటి పర్యంతం అయ్యిండు. నిన్నటి బంద్‌లో జరిగిన సంఘటనలతో ఒక్కరు దుకాణాలుగాని, ఏవి గాని తెరవలే. కాని హబ్సిగూడలో సీమాంధ్రులకు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ తెరిచి ఉంచడంతో ఆ స్కూల్ బస్సుని తగలబెట్టిండ్రు. ఉప్పల్‌లో చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్ తెరిచి ఉండడంతో విద్యార్థులు దాడి చేసిండ్రు. రైల్‌రోకో చేసి రైళ్ళను ఎక్కడివక్కడ నిలిచిపోయేటట్టు చేసిండ్రు. ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించిండ్రు. సింగరేణి బొగ్గుగని కార్మికులు విధులు బహిష్కరించిండ్రు. తెలంగాణ రాష్ట్రంతో పాటు కేసీఆర్ ప్రాణాలు ముఖ్యమేనని నినదించిండ్రు.

విద్యార్థులు ఛలో అసెంబ్లీకి పిలుపునివ్వడంతో పోలీసులు ఉస్మానియా విశ్వవిద్యాలయం మీద దృష్టి పెట్టిండ్రు. డిసెంబర్ 10న తలపెట్టిన ఛలో అసెంబ్లీని జరగకుండ చూడాలన్న ఆలోచనతో ప్రభుత్వం విద్యార్థుల మీద ఆంక్షలు పెంచింది.



పోలీసుల బలగాలు యుద్ధానికి పొయినట్టు ఆదివారం అర్ధరాత్రి నుంచే యూనివర్సిటీని చుట్టుముట్టింద్రు. యూనివర్సిటీలోకి పోలీసులు వెళ్ళ కూడదని మానవహక్కుల కమీషన్ ఆదేశించినప్పటకి తెల్లారేసరికి క్యాంపస్‌లోని 18 హాస్టళ్ళలో పోలీసులు నిండిపోయింద్రు. హాస్టల్‌ని ఖాళీచేసి వెళ్ళిపోవాలని హెచ్చరికలు జారి చేసింద్రు. ఏ కారణం లేకుండ పోలీసులు క్యాంపస్‌లోకి రావడాన్ని విద్యార్థులు తీవ్రంగ ప్రతిఘటించింద్రు. దీంతో డి.సి.పి స్టీఫెన్ రవీంద్ర నాయకత్వంలో పోలీసులు రజాకార్ల తీరుగ మారిపోయింద్రు. దీక్షా శిబిరం మీద దాడిచేసి చితకబాదింద్రు. టెంట్లు పీకేసింద్రు. బ్యానర్లు చింపింద్రు. విద్యార్థులను వెంటబడి కొట్టింద్రు. కిందపడ్డోల్లను, హాస్టల్ రూమ్‌లల్ల ఉన్నోల్లను ఒక్కరిని విడువకుంట కొట్టింద్రు. జైతెలంగాణ అన్న ఆడవాళ్ళను కూడ కొట్టింద్రు. లేడీస్ హాస్టళ్ళల్లో కూడ మగ పోలీసులు వీరంగం ఆడింద్రు. మీడియాని క్యాంపస్‌లోకి రాకుండ చేసి, పోలీసులు వాళ్ళ ఇష్టానుసారం వ్యవహరించింద్రు. సీమాంధ్ర కసినంత వెళ్ళగక్కింద్రు. విద్యార్థుల, పోలీసుల పరస్పర దాడులతో క్యాంపస్ హోరెత్తింది. ఈ విషయం తెలుసుకున్న హరీశ్‌రావు, ఈటెల రాజేందర్ ఉస్మానియా యూనివర్సిటికి బయలుదేరింద్రు. పోలీసులు వాళ్ళను గేటు దగ్గరనే ఆపింద్రు. హోం మినిస్టర్ సబిత చెప్పినా స్టీఫెన్ రవీంద్ర వినలేదు. పైగా ఎమ్మెల్యేలను అరెస్టు చేయాలని ఆజ్ఞాపించిండు. ఎమ్మెల్సీ నాగేశ్వర్‌ని కూడ అరెస్టు చేసింద్రు. కొండా లక్ష్మణ్ బాపూజీని పెద్దమనిషని కూడ చూడకుండ ఈడ్చి పారేసింద్రు. పక్కనే ఉన్న మాణిక్యేశ్వరి నగర్‌లో పోలీసులు విలయతాండవం చేసింద్రు. పెండ్లి జరిగే ఇంట్లోకి చొరబడి టెంట్లు పీకేసింద్రు. బోదాస్ నర్సింహ్మా అనే వ్యక్తిని తీవ్రంగ కొట్టింద్రు. ఈ దృశ్యాలను టీవీలలో చూసే జనాలకు గుండెలు అవిసిపోయినయ్. ఆవేశం తన్నుకొచ్చింది. పోలీసు కొడుకులను మెడబట్టి కొరకాలన్నంత కోపం వచ్చింది.

కాకతీయ విశ్వవిద్యాలయంలో కూడ విద్యార్థుల దీక్షలు 9వరోజుకు చేరుకున్నయి. ఉస్మానియాలో పోలీసులు వీరంగం చేసిన తీరు కాకతీయ విద్యార్థులకు సమాచారం అందింది. అప్రమత్తమైన విద్యార్థులు వి.సి. సాయంతో పోలీసులు క్యాంపస్‌లో అడుగుపెట్టకుండ అన్ని జాగ్రత్తలు తీసుకుంద్రు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్టీఫెన్‌రవీంద్ర వ్యవహారాన్ని, టి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేలు, హోంమంత్రి సబిత దృష్టికి తీసుకపోయి పాలనతీరు మీద, శాంతిబద్రతల పరిరక్షణ అంశం మీద నిలదీసింద్రు. ప్రశ్నలవర్షం కురిపించింద్రు. దీంతో విషయం తెలుసుకుంటానని చెప్పి సహచర మంత్రులతో విషయాన్ని చెప్పింది.

"నేను హోంమంత్రిగ ఉండడం దండగ. నా డిపార్ట్‌మెంట్‌లోనే నాకు

తెలియకుండ నిర్ణయాలు జరుగుతున్నయి. నేను పదవిలో ఎందుకుండాలని" ఆవేదనతో అన్నది. ఏం జరిగిందని వాళ్ళు ప్రశ్నించడంతో "ఉస్మానియాలో మళ్ళీ లాఠీచార్జ్ చేసింద్రంట, ఎమ్మెల్యేలను అడ్డుకొని, జర్నలిస్టులని కొట్టింద్రంట ఇదేం న్యాయం. పోలీసులు కంట్రోల్‌లో ఉండాలని చెప్పినా, నా మాట వినట్లేదు" అని ఏడ్చినంత పనిచేసింది. ముఖ్యమంత్రికి ఈ విషయాన్ని చెప్పడంతో ఆయన బాధ్యులపై చర్యలు తీసుకుందాం మీరు తొందరపడకండి అన్నడు. ఉస్మానియా ఘటనలకు స్టీఫెన్ రవీంద్రని బాధ్యున్ని చేస్తూ విధుల నించి తప్పించింది. న్యాయవాదులు, జర్నలిస్టులు, టి.ఆర్.ఎస్. హక్కుల సంఘాల ఫిర్యాదు మేరకు మానవహక్కుల కమీషన్ చైర్మన్ విచారణకు ఆదేశించిండు. కమీషన్ సభ్యులు జస్టిస్ ఇస్మాయిల్, జస్టిస్ పాటిల్‌రావులు యూనివర్సిటీకి పోయింద్రు.

నిమ్స్‌లోకి దొంగచాటుగ వచ్చిన చంద్రబాబు ఇతర తెలుగుదేశం నాయకులు మొకం చెల్లక దిడ్డిదారిని వచ్చి మందలిచ్చి పోయింద్రు. రాష్ట్రంలో శాంతి బద్రతల పరిస్థితి క్షీణించింది. కేసీఆర్ దీక్ష విరమించే స్థితిలో లేదు.

ముఖ్యమంత్రి రోశయ్యకు అధిష్టానం నించి వర్తమానం అందింది. 7వ తేదీన అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసిండు. అధిష్టానం నిర్ణయమే తమ నిర్ణయమని కాంగ్రేసు ప్రకటించింది. రాష్ట్ర విభజనకు తీర్మాణం పెడితె మద్దతు ఇస్తమని టి.డి.పి చెప్పింది. టి.ఆర్.ఎస్., బి.జే.పి., సి.పి.ఐ.లు అసెంబ్లీలో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టాలని సూచించినయి. పార్టీల నిర్ణయాన్ని ముఖ్యమంత్రి ఢిల్లీకి పంపిండు. తెలంగాణ నాయకులు ఢిల్లీ మీద వత్తిడి పెంచింద్రు. డిసెంబర్ 8నాటికి కేసీఆర్ దీక్ష పదవరోజుకు చేరింది. డిల్లీలో కేంద్రం పూర్తిగ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయం మీదనే తర్జనబర్జనలు పడుతుంది.

రాత్రి పదిగంటలకు కేసీఆర్ ఫోన్ మోగింది. ఫోన్‌లో అహ్మద్ పటేల్. ఢిల్లి కోర్ కమిటీ సమావేశంలో జరిగిన వివరాలను చెప్పిండు. వీలైనంత త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పి, దీక్ష విరమించాలని కోరిండు. దానికి బదులుగ కేసీఆర్ "మీరు నిర్ణయం తీసుకోండి. తర్వాత నేను నిర్ణయం తీసుకుంట" అని చెప్పిండు. అఖిలపక్ష సమావేశం ముగించుకొని నాయకులందరు నిమ్స్‌కు చేరుకుంద్రు. ఇంతలోనే మాజీ ఎం.పి వినోద్ కుమార్‌కు చిదంబరం ఫోన్ చేసిండు.

"తెలంగాణ అంశాన్ని మేము తీవ్రంగ పరిగణిస్తున్నాము. ఎలాంటి పరిష్కారాన్ని మీరు సూచిస్తున్నారు. రావుగారు ఏమంటున్నారు" అని అడిగిండు.

"తెంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన స్పష్టమైన ప్రకటన చేయండి"

"ఎలాంటి ప్రకటన ఆశిస్తున్నారో చెప్పండి"

"కేసీఆర్ గారితో మాట్లాడి చెబుతా" కేసీఆర్, జయశంకర్, వినోద్ ముగ్గురే మాట్లాడుకున్న తర్వాత వినోద్ ఫోన్ కలిపితే కేసీఆర్ చిదంబరంతో మాట్లాడిండు. "ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని మీరు స్పష్టంగ ప్రకటించాలని" కుండబద్దలు కొట్టినట్టు చెప్పిండు. ప్రకటన ఎలా ఉండాలనే

దానిమీద జయశంకర్ సార్ నోట్ తయారు చేస్తరని చెప్పిండు.

డిసెంబర్ 9 సోనియాగాంధి పుట్టినరోజున ముఖ్యమంత్రి రోషయ్యకు డిల్లీ నుంచి పిలుపు వచ్చింది. ఆగమేఘాల మీద డిల్లీకి పోయిండు. సోనియాగాంధీ సూచనల మేరకు హోంమంత్రి చిదంబరం కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడిండు. తెలంగాణ మీద ప్రకటన చేయబోతున్నట్టు చెప్పిండు. కేసీఆర్ మాట్లాడలేక పోతున్నందున పక్కనే ఉన్న జయశంకర్ సార్‌కు, వినోద్‌కుమార్‌లకు ఫోన్ ఇచ్చిండు. ప్రకటన స్పష్టంగ ఉండాలని కేసీఆర్ చెప్పిండు.

తొమ్మిదోరోజు కూడ ఆత్మహత్యలు కొనసాగుతనే ఉన్నయి. నల్లగొండ జిల్లా భువనగిరి మండలం రాయగిరిలో గుంటి సతీష్ ఆత్మహత్య చేసుకుండు. నడిగూడెం మండలం పాలవరం గ్రామానికి చెందిన సట్టు వీరనాగులు పురుగుల మందు తాగి చనిపోయిండు. మెదక్ జిల్లా మీర్‌దొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన వారాల వెంకటేశం ఇంట్లోనే ఉరేసుకొని చనిపోయిండు. వరంగల్ జిల్లా రేగొండ మండలం జగ్గయ్యపేటలో వాకిటి బుచ్చయ్య గుండెపోటుతో చనిపోయిండు. కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపల్లి గూడెంలో విద్యార్థి సాంబయ్య కరెంటు స్థంబం ఎక్కి ఆత్మహత్య చేసుకుండు. వరంగల్ జిల్లా రేగొండ మండలం భాగిర్తిపేట గ్రామానికి చెందిన కర్నె భిక్షపతి తల పలగొట్టుకొని ఆత్మహత్యకు పూనుకుండు. కరీంనగర్ జిల్లా పెద్దపల్లి మండలం నిట్టూరులో సుధాకర్ అనే యువకుడు వంటిమీద కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుండు. ఇల్లంతకుంట మండలం వెంకట్రావులపల్లిలో కడగండ్ల తిరుపతి కిరోసిన్ పోసుకొని అగ్గిపెట్టుకుండు. ఈ విధంగ బంగారు భవిష్యత్తు ఉన్న వందలాది యువకులు తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మహత్యలు చేసుకుంటుండ్రు. హోరాహోరి యుద్ధమైతె ఎదురునిలిచి పోరాటం చేసే వీలుంటది. కాని తెలంగాణ పోరాటం సీమాంధ్రపాలకుల కుట్రలను కనిపెట్టి కొనసాగిస్తున్న నిరంతర యుద్ధం. అందుకే ఇక్కడ ఆత్మహత్యే ఆయుధమైంది. తెలంగాణలో జరిగే ఆత్మహత్యలను చూసి, చెట్టు-పుట్ట, వాగు-వంక, సకలజీవప్రపంచం కన్నీరుపెట్టింది కాని, కరుడుగట్టిన వలసపాలకుల్ని మాత్రం కరిగించలేకపోయింది.

ఆఖరికి తెలంగాణ గోస చెవినపడ్డది.

ఒక తల్లి బాధ మరో తల్లికే తెలుస్తదన్నట్టు తెలంగాణ తల్లుల గర్భసోకానికి తల్లడిల్లిన సోనియాగాంధి ఢిల్లీలో తెలంగాణ ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను అంచనావేసింది.

డిసెంబర్ 8, మంగళవారం కేసీఆర్ ప్రాణం గాలిలో ఊగిసలాడుతుంది. దాదాపుగ డాక్టర్లు చేతులు ఎత్తేసింద్రు. 55 కిలోల మనిషి 38 కిలోలకు తగ్గిండు. నిన్నరాత్రి నించి కేసీఆర్ మందులు కూడ వేసుకోవడం లేదని, సెలైన్ కూడ ఎక్కించుకోవడం లేదని డాక్టర్లు కేటీఆర్, కవితలకు వాస్తవ ఆరోగ్య పరిస్థితిని వివరించి చెప్పింద్రు.

"దీక్ష విరమించి ఆహారం తీసుకుంటే తప్ప మేం ఏం చేయలేమని" చెప్పింద్రు. వాళ్ళేకాదు ఎవరు చేసేదేమి లేదు. అంతలోనే కేసీఆర్ చిన్నగ కదిలి "డాక్టర్ సాబ్ నా ప్రాణం మందులు, మాత్రల్లో లేదు తెలంగాణ ప్రకటనలో ఉంది" అన్నడు. డాక్టర్లు ఏమిచేయలేక "ఇది అలార్మింగ్ స్టేజ్" అని చెప్పి వెళ్ళిపోయింద్రు.

ఇంకా 48 గంటల్లో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉన్నది. తెలంగాణ ఉద్యమం, కేసీఆర్ దీక్ష సీమాంధ్రపాలకులకు కత్తిమీద సాములా తయారైంది. విద్యార్థుల ఉద్యమాన్ని తలుచుకుంటెనే పోలీసులకు వణుకుపుడుతుంది. గత అనుభవాలు భవిష్యత్ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం 30వేల పోలీసు బలగాలను దింపింది. జిల్లాకు 60 మంది ఐపియస్‌లను నియమించింది. హైద్రాబాద్‌లో 144 సెక్షన్ అమల్లోకి తెచ్చింద్రు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల నించి ఆదనపు బలగాలను దింపింద్రు. వరంగల్ కాకతీయ క్యాంపస్‌లో పోలీసులు అడుగుపెడితె తన వి.సి. పదవికి రాజినామ చేస్తానని ప్రొఫెసర్ లింగమూర్తి గట్టిగ హెచ్చరించిండు.

కార్యకర్తలు, ఉద్యమకారులు కాంగ్రేసు నాయకులు, మంత్రుల ఇండ్లను ముట్టడించింద్రు. అసెంబ్లీలో తెలంగాణ తీర్మాణం ప్రవేశపెట్టాలని టి.ఆర్.ఎస్ శాసనసభ్యులు డిమాండ్ చేసింద్రు. పోడియం వద్దకు దూసుకపోయింద్రు. ఎంతమొత్తుకున్న స్పీకర్ కిరన్‌కుమార్‌రెడ్డి అంగీకరించలేదు. హరీశ్‌రావు మైకును విరగ్గొట్టి విసిరే ప్రయత్నంలో స్పీకర్ వద్దని ప్రాదేయపడ్డడు. తెలంగాణ ఆవేశానికి స్పీకర్ తల వంచిండు.

ఆత్మహత్యల విషాదం రాష్ట్రాన్ని కుదిపేస్తుంది. కరీంనగర్ జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డి పేట గ్రామానికి చెందిన కోల రవిగౌడ్ "నా చావు తెలంగాణ కోసమేనని" లేఖ రాసి ఇంట్లోనే ఉరి పెట్టుకుండు. నిట్టూరులో ఆత్మహత్యకు పాల్పడ్డ

సుధాకర్ చనిపోయిండు. నల్లగొండ జిల్లా తుర్కపల్లి మండలం గోగులగుట్ట తండాకు చెందిన ధరావత్ సుధాకర్ పాలిటెక్నిక్ విద్యార్థి ఉరిబెట్టుకొని చనిపోయిండు. యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో గోపి రాములు గుండెపోటుతో చనిపోయిండు. మాణిక్యేశ్వరి నగర్‌లో పోలీసు దెబ్బలో గాయపడ్డ బోధాస్ నర్సింహ్మా గాంధీ ఆస్పత్రిలో చనిపోయిండు. నిజాంబాద్ జిల్లా గాంధారి మండలం గౌరారం గ్రామానికి చెందిన శాంతాబాయి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది.

# 2009 డిసెంబర్ ప్రకటన

డిసెంబర్ 9, 2009 తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఒక మరుపురాని ఘట్టం. కారణజన్ముడు, కార్యదీక్షాపరుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వరుసగ పదిరోజుల నుంచి నిద్రాహారాలు మాని, కళ్ళల్లో వత్తులేసుకొని తెలంగాణ ప్రకటన కోసం ఎదురు చూసిండు.

"ఇప్పుడు తప్పితె ఇగ తెలంగాణ రాదని" ప్రాణాలకు తెగించి ప్రతిన బూనిండు. ఇదే సమయంలో తెలంగాణ మొత్తం ప్రాణాలకు తెగించి కొట్లాడిన ఒక అత్యద్భుత ప్రజాస్వామిక యుద్ధం అంతిమదశకు చేరింది.

తెల్లారితే అసెంబ్లీ ముట్టడి తలుచుకుంటే ప్రభుత్వానికి దడ పుడుతుంది. తెలంగాణ ప్రజల పోరాటం, మొక్కవోని దీక్ష చూసి సీమాంధ్ర ప్రభుత్వానికి చలిజ్వరం పట్టుకుంది.

తెలంగాణభవన్‌లో టి.ఆర్.ఎస్ పోలీట్‌బ్యూరో సమావేశం జరిగింది. అప్పుడే తెలంగాణ కోసం ఉద్యమిస్తున్న ప్రజాసంఘాల నాయకులు తెలంగాణ భవన్‌కు చేరుకుంద్రు. విద్యావంతుల వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం,ప్రజా గాయకుడు గద్దర్, మందకృష్ణ మాదిగ, అల్లం నారాయణ, పాశం యాదగిరి, సంధ్య వంటి నాయకులు 70 మంది దాక వచ్చింద్రు. అందరు కలిసి కేసీఆర్‌ని దీక్ష విరమింప జేయాలని, ఉద్యమాన్ని కొనసాగించడానికి గద్దర్, మందకృష్ణలు దీక్ష చేపడతామని ప్రకటించింద్రు. "కేసీఆర్‌ని చంపడానికే ప్రభుత్వం కంకణం కట్టుకుందని" అందరు ఆవేదన వ్యక్తం చేసింద్రు. వీళ్ళ అభిప్రాయాన్ని కేసీఆర్ ముందు పెట్టి "బతికుండి తెలంగాణ సాధిద్దామని చెప్పింద్రు. కేసీఆర్ ససేమిరా ఒప్పుకోకుండ "ఇప్పుడు నేనేం చావను" అనే ధీమాని కేసీఆర్ వ్యక్తం చేసిండు.

జయశంకర్‌సార్ గుండెనిండ గూడుకట్టిన దుఃఖంతో "కాంగ్రేస్ తెలంగాణ ఇవ్వకూడదనే ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చిందని, దాని గత చరిత్ర అంత మోసపూరితమే కాబట్టి, కాంగ్రేసును ఇపుడుకూడ నమ్మే పరిస్థితి లేదని" నైరాశ్యంతో అన్నడు. వెంటనే కేసీఆర్

"కాదుకాదు కాంగ్రేస్ తెలంగాణ ఇస్తుంది. ఇవ్వాల్సి వస్తుంది" అనే దృఢవిశ్వాసాన్ని వ్యక్తం చేసిండు.

కేంద్రంలో కాంగ్రేసు ప్రభుత్వం తెలంగాణ విషయంలో కాలయాపన చేస్తుందని, సోనియాగాంధి కేసీఆర్ ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని, సీమాంధ్ర ప్రభుత్వానికి నిరసనగ ప్రజలు, విద్యార్థులు ప్రాణలు తీసుకుంటూనే ఉన్నరు.

వరంగల్ జిల్లా వెంకటాపురం మండలం పాలంపేటకు చెందిన టి.ఆర్.ఎస్ కార్యకర్త సర్వ శ్రీను టివీలో వార్తలు చూస్తు గుండెపోటుతో చనిపోయిండు. స్టేషన్ ఘనపూర్‌కు చెందిన ఫక్రుద్దిన్ గుండె కూడ ఆగిపోయింది. తొర్రూరు మండలం కంఠాయిపాలెం గ్రామానికి చెందిన ఈదెగ మధుకర్ (10) కాగడాల ప్రదర్శనలో పాల్గొని గాయపడి చనిపోయిండు. రఘునాదపల్లి మండలం వెల్ది గ్రామానికి చెందిన వంగాల రాజు కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని, చికిత్స పొందుతూ వరంగల్ ఎం.జి.ఎం.లో చనిపోయిండు. నిజాంబాద్ జిల్లా గాంధారి మండలం ఉత్తనూర్‌లో టి.ఆర్.ఎస్ అభిమాని కాశయ్య గుండెపోటుతో చనిపోయిండు. కరీంనగర్ జిల్లా వేములవాడలో మంజుల, పెద్దపల్లి మండలం రంగాపూర్‌లో గోలి శ్రీనివాస్‌లు పురుగుల మందు తాగి చనిపోయింద్రు. ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు మండలం టి.ఆర్.ఎస్ ఉపాధ్యక్షుడు ముత్యాల రాజుగౌడ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుండు. రంగారెడ్డి జిల్లా శామీర్‌పేట మండలం కొల్లూరులో గిరిపల్లి నర్సింహ్మ వంటిమీద కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిండు.

ఎన్నివిధాల ప్రయత్నం చేసిన, ఎంత ఓదార్పునిచ్చిన విద్యార్థులు, ఉద్యమకారులు నేలరాలుతనే ఉన్నరు. సీమాంధ్ర పాలకుల ఉక్కుసంకెళ్ళ నడుమ బంధీయైన తెలంగాణతల్లి, కన్నబిడ్డల దిక్కులేని సావులను చూసి కంటికె పుట్టెడు దుఃఖంలో మునిగిపోయింది. ఢిల్లీలో జరిగిన అనేక పరిణామాల అనంతరం పార్లమెంట్ సమావేశంలో లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ కేసీఆర్ దీక్ష విషయాన్ని ప్రస్తావించి “మనతోటి పార్లమెంట్ సభ్యుడు కేసీఆర్ దీక్ష విరమించుకోవాలని కోరుతున్న” అని ప్రకటించింది. “తెలంగాణ ఎంత ముఖ్యమో కేసీఆర్ ఆరోగ్యం కూడ అంతే ముఖ్యం. పరిస్థితి చేయిదాటుతున్నందున ప్రధాని చొరవ తీసుకోవాలని” ప్రతిపక్ష నాయకుడు అద్వాని సూచించిండు.“తెలంగాణకు మేం మద్దతిస్తున్నాం. అఖిలపక్ష సమావేశం పెట్టండని” సి.పి.ఐ నాయకడు గురుదాస్ గుప్తా అన్నడు.

అదేరోజు మధ్యాహ్నం 3గంటలకు రోశయ్య హుటాహుటిన ఢిల్లికి చేరుకొని సోనియా ఇంటి ముందల నిలబడంగనే “మీట్ మిస్టర్ పటేల్” అన్నది. వెంటనే రోశయ్య అహ్మద్‌పటేల్ దగ్గరికి ఉరికిండు. అహ్మద్ పటేల్ తెలంగాణ విషయంలో మేడమ్ చాలా సీరియస్‌గ ఉన్న విషయాన్ని రోశయ్యకు చెప్పిండు.

రష్యానించి తిరిగొచ్చిన ప్రధానమంత్రి తెలంగాణ అంశం మీద ఆసక్తితో విషయాన్ని, గతంలో జరిగిన అంశాలను అన్నింటిని కోర్‌కమిటీలో చర్చించిండ్రు.

"తెలంగాణ రాష్ట్రం ప్రకటిస్తే మంచిదేమో" అన్నది సోనియాగాంధి

"మిగత ప్రాంతాలవారు అభ్యంతరం చెబుతారేమో" మొయిలి గుణిగిండు.

"రాష్ట్రంలో, దేశంలో అన్ని పార్టీలు ఒప్పుకున్నాయి" చిదంబరం నిజాయితీగ అన్నడు.

"తెంగాణని ఇంకా నాన్చొద్దు" ఎ.కె. ఆంటోని కుండబద్దలుకొట్టినట్టు చెప్పిండు.

"తెలంగాణ ప్రకటిస్తే పెద్దగ ఇబ్బందేమి ఉండదనుకుంట" సోనియాగాంధీ సాధు స్వభావంతోని అత్యంత సాహసంతో కూడిన నిర్ణయం తీసుకుంది.

"ఓ సారి అందరితో మాట్లాడితే మంచిదేమో" మొయిలి మరోసారి అడ్డుపుల్ల వేసే ప్రయత్నం చేసిండు.

"వాళ్ళకు పెద్దగ నష్టం లేదు. వి విల్ డిక్లేర్ తెలంగాణ. ప్రిపేర్ ఎ స్టేట్‌మెంట్" అని ఆవేశంతో అందరి నోళ్లు మూతపడేలా అన్నది సోనియాగాంధి.

కతం ఆ మాటతోని సీమాంద్రతొత్తుల గుండెలు అవిసినయ్.

నెహ్రూజీవితంలో ఆత్మశాంతిలేని అంశం ఏదైన ఉందంటే అది తెలంగాణ ప్రాంతాన్ని బలవంతంగ సీమాంద్రలో విలీనం చేయడమే. అట్లాంటి తెలంగాణ అంశాన్ని ఆయన కడుపులో పుట్టిన బిడ్డ ఇందిరాగాంధీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఉక్కుపాదాలతో అణిచేసింది. ఎక్కడైన తండ్రి ఆశలు నెరవేర్చే వారసత్వం ఉంటది కాని అందుకు భిన్నంగ ఇందిరాగాంధి కోడలైన సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఎవరు ఎన్ని ఆటంకాలు సృష్టించినా తెలంగాణ ఏర్పాటు ఆగదని ప్రకటించింది. నెహ్రూ ఆకాంక్షని నెరవేర్చిన నిజమైన వారసురాలినగ చరిత్రలో చెరగని ముద్రవేసుకుంది.

తెలంగాణ ప్రకటన అంశాన్ని కేసీఆర్‌తో స్వయంగ ఫోన్‌లో మాట్లాడి చెప్పమని సోనియగాంధి చిదంబరానికి సూచించింది. వెంటనే చిదంబరంతో పాటు కోర్ కమిటి సభ్యులు ప్రకటన ముసాయిదాని తయారు చేసిండ్రు.

ఒక్క తెలంగాణలోనే కాకుండ మొత్తం దేశమంత ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయం కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నరు. దీక్షలు, పోరాటాల ఫలితంగ మొత్తానికి తెలంగాణ ఉద్యమం మొండి ప్రభుత్వాల మెడలు వంచింది. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి విషమించి పోతున్న దశలో కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించింది. డిసెంబర్ 9, 2009న రాత్రి పదకొండు గంటలకు చిదంబరం

మీడియా ముందుకు వచ్చి యూపిఎ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటించిండు.

"తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నాం. అందుకు తగిన విధంగ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మాణం ప్రవేశ పెడతరు. నవంబర్ 29 తర్వాత ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల మీద పెట్టిన కేసులన్ని ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది. వీటికి అనుగుణంగ పనిచేస్తమని ముఖ్యమంత్రి హామి ఇచ్చిండు. కేసీఆర్ ఆరోగ్యం విషయంలో ఆందోళన ఉన్నది. ఆయన వెంటనే దీక్ష విరమించుకోవాలని కోరుతున్నం. విద్యార్థులందరు ఆందోళన విరమించి శాంతియుత పరిస్థితులకు సహకరించాలని" చిదంబరం స్పష్టంగ యావత్ ప్రపంచానికి చాటిచెప్పిండు.

అంతే ఒక్కసారిగ ప్రకటన చూసిన ప్రతి ఒక్కరు లేచి నిలబడ్డరు. వాళ్ళకు తెలువకుండనే కండ్లల్లో ఆనంద భాష్పాలు ఆనంద తాండవం చేసి భూతల్లిని తాకినయి. జై తెలంగాణ జైజై కేసీఆర్ అంటూ జనం రోడ్ల మీదికొచ్చిండ్రు. నిమ్స్‌లో కార్యకర్తల కేరింతలు ఆకాశాన్ని అంటుకున్నయి. జయశంకర్ సార్, విద్యాసాగర్ రావులతో కలిసి ఉద్యోగ సంఘాల నాయకులు స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మందకృష్ణ, ఇంకా ఎందరో నాయకులు కేసీఆర్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప జేసిండ్రు. జనం మనిషికి జేజేలు పలికిండ్రు.

కేసీఆర్ దీక్షా, పట్టుదల ముందు మరణం ఓడిపోయింది. తెలంగాణ ధర్మపోరాటంలో సాధించిన విజయ గర్వం ముందు మృత్యువు మూగబోయింది. 11రోజులు నీడలా వెంటాడిన మృత్యుదేవత ప్రాణం అరచేతిలో పెట్టుకొని పరుగుతీసింది. తెలంగాణ విప్లవ వీరునికి స్వాగత నీరాజనాలు పలికి తాను ఒంటరిగానే నిష్క్రమించింది.



వెంటనే కేసీఆర్ వీల్‌చైర్‌లో నిమ్స్ నుంచి బయటికి వచ్చి ప్రజలకు అభివాదం చేసిండు. మాసిన గడ్డం, ఎన్నుకు బట్టిన డొక్కతో రెండు చేతులెత్తి దండం

పెట్టి కండ్లనిండ నీళ్ళు నింపుకుండు. కోటికాంతుల తెలంగాణ కండ్లముందు కదలాడింది. అరవయ్యేండ్ల కల సాకారమయ్యింది. అమరుల ఆశయం నెరవేరింది. తెలంగాణ వ్యాప్తంగ ప్రజలు తెల్లవార్లు ఆనందోత్సాహాలలో మునిగిపోయింద్రు. స్వాతంత్ర్య సంబరాలను జరుపుకుంద్రు. పొద్దున్నే సూర్యుడు కొత్తగ ఉదయిస్తున్న అనుభూతి కలిగింది. పక్షులు రెక్కలు విప్పుకుంటున్నట్టు తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ విహంగాలై ఎగిరింద్రు, దునికింద్రు ధూంధాం జేసింద్రు.

# రెండు నాల్కల సీమాంధ్ర నాయకులు

డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తమని చిదంబరం ప్రకటించడంతో జనమంత సంబరాలల్ల మునిగింద్రు. ఆనందం 24 గంటలు కాకముందే ఆవిరైపోయింది. తెలంగాణ ప్రకటన విషయాన్ని జీర్ణించుకోలేని సీమాంధ్ర నాయకులు మీడియా ఒక్కసారిగ బగ్గుమన్నరు. సోనియా గాంధి అర్ధరాత్రి తెలుగుజాతిని రెండు ముక్కలు చేసిందని గొంతు చించుకుంద్రు. సీమాంధ్రలో జనం ప్రశాంతంగ ఉంటే ఛానళ్ళు ఉద్యమాన్ని నడిపినయి. ఏ టీవి చూసిన మంటలు మండుతున్నయ్. హైద్రాబాద్ వక్ఫ్‌బోర్డు భూముల మింగి కుసున్న లగడపాటి రాజగోపాల్ చెంగబింగ ఎగిరిండు. పోలీసులే మనుషుల్ని తీసుకొచ్చి బస్సు అద్దాలు దగ్గరుండి పలగొట్టించింద్రు. విద్యార్థులను బలవంతంగ తీసుకొచ్చి రోడ్ల మీదేసింద్రు. సమయానికి సీమాంధ్ర క్లిప్పింగులు దొర్కక తెలంగాణ ఉద్యమ క్లిప్పుంగులను అటీటు చేసి వాడుకున్న దృశ్యాలు అనేకం సీమాంధ్ర సమైక్య ఉద్యమంలో కనిపించినయి. జర్నలిజం విలువల్ని, ప్రజాస్వామ్య పద్దతుల్ని సర్వనాశనం చేసి, రాజ్యాంగవిరుద్దమైన కార్యక్రమాలతో సీమాంద్రనాయకులు పీకతెగిన మేకలెక్క మొత్తుకుంద్రు.

పార్టీలకు అతీతంగ అందరు ఒక్కటయ్యింద్రు. డిసెంబర్ 10న రాజీనామ నాటకానికి తెరలేపింద్రు. రిహార్సల్ అవసరం లేని పాత్రలు కాబట్టి ఎవరి డైలాగ్‌లు వాళ్ళు చెప్పింద్రు. ఇంతలోనే చంద్రబాబు మాటమార్చి రెండు నాల్కలు బయటికి సూపిచ్చిండు. రెండుకండ్ల సిద్దాంతాన్ని నెత్తికెత్తుకుండు. డిసెంబర్ 15న టి.డి.పి పార్లమెంట్ సభ్యులు సమైక్యాంధ్ర ప్లకార్డులు పట్టుకుంద్రు. జగన్ కూడ వాళ్ళ సరసన చేరిండు. అదేరోజు లగడపాటి విజయవాడలో దీక్షకు కుసుండు. సమైక్యాంద్ర హీరోవి నువ్వేనని నన్నపనేని రాజకుమారి స్లోమోషన్‌లో ముద్దు పెట్టింది. దొంగ దీక్షదారి లగడపాటిని పోలీసులు అరెస్టు చేస్తరని ఆడ మాయమై ఉరుకొచ్చి హైద్రబాద్ నిమ్స్‌ల తేలిండు. రాయపాటి, కావూరి రాకాసి బల్లులైంద్రు. ఎక్కడేం దొర్కక ఏదో ఒకటి పట్టుకొని వొర్లుతనే ఉన్నరు. మొత్తానికి తిమ్మిని బమ్మి జేసింద్రు. కేంద్రంతో డిసెంబర్ 23న మరో ప్రకటన చేయించింద్రు. చిదంబరం "రాష్ట్ర అసెంబ్లీల తీర్మాణం చేసిన తర్వాతనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తమని" ఉల్టా ప్రకటన చేసిండు. తెలంగాణ పల్లెలు మల్లా రోడ్లమీదికి వచ్చినయ్. విశ్వవిద్యాలయాలు కోపంతో

రగిలిపోయినయ్. కాలేజ్‌లు, బస్సుల బంద్‌లకు పిలుపునిచ్చినయ్. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు డిసెంబర్ 24న దీక్ష ప్రారంభించిండ్రు. అదే రోజు నల్లగొండలో జరుగుతున్న జాతీయ కబడ్డి క్రీడా పోటీల మీద వందలాది విద్యార్థులు దాడి చేసిన ఘటనలో పోలెబోయిన శ్రీనివాస్ యాదవ్, కరణ్ జయరాజ్, లింగస్వామి, నాగార్జున, శ్రీను తదితరులను అరెస్టు చేసి జిల్లా జైలుకు పంపిండ్రు. విద్యార్థులు, తెలంగాణ ఉద్యమకారులు జిల్లా జైల్లో నిరాహార దీక్షను చేపట్టిండ్రు. విద్యార్థుల దీక్షకు మద్దతు తెలపడానికి పోయిన టి.డి.పి నాయకుడు నాగం జనార్ధన్‌రెడ్డిని విద్యార్థులు మీదబడి కుమ్మిండ్రు. కారుని బోల్తా పడేసిండ్రు. దీంతో పోలీసులు లాటీచార్జ్ చేసిండ్రు. ఉస్మానియ రక్తసిక్తం అయ్యింది. 26న మాజి పోలీస్ అధికారి నరసింహన్ గవర్నర్‌గ వచ్చిండు. తెలంగాణ ఉద్యమాన్ని అణిచేయడానికే ఈ మార్పు జరిగిందని అందరు భావించిండ్రు. జె.ఎ.సి నేతలు, విద్యార్థి నాయకులు ఒక్కటై ఉద్యమాన్ని కొంతపుంతలు తొక్కించిండ్రు. అసమర్థ కాంగ్రేసు నాయకులు తక్షణమే రాజీనామ చేయాలని డిమాండ్ చేసిండ్రు. ఆవేశంతో ఊగిపోతున్న తెలంగాణ ఉద్యమాన్ని కొంత నీరుగార్చడానికి కేంద్రప్రభుత్వం 2010 జనవరి 5న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎనిమిది పార్టీలను ఢిల్లీకి ఆహ్వానించింది. హోంమంత్రి చిదంబరం అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రతి పార్టీ నుంచి ఇద్దరు చొప్పున 16 మంది హాజరయ్యిండ్రు. రోశయ్య ప్రత్యేక ఆహ్వానితుడిగ హాజరైండు. టి.ఆర్.ఎస్ పార్టీ నుంచి కేసీఆర్, జయశంకర్ సార్ హాజరయ్యిండ్రు. ఇద్దరు ముక్తకంఠంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాని కోరిండ్రు. కాంగ్రేస్ పార్టీ నుంచి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలంగాణ ఏర్పాటుకు కాలపరిమితిని కోరిండు. కావూరి సాంబశివరావు అసలు విభజనే వద్దన్నడు. టి.డి.పి నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలుగుదేశం పార్టీని ఇబ్బంది పెట్టడానికే కాంగ్రేస్ తెలంగాణ అంశాన్ని లెవనెత్తిందని అసలు విషయాన్ని దాటేసిండు. యనమల రామకృష్ణుడు చిదంరబరం నిర్ణయానికి మా అభిప్రాయం అవసరం లేదని అన్నడు. ఎం.ఐ.ఎం.నుంచి అసదుద్దిన్, అక్బరుద్దిన్‌లు హాజరై రాష్ట్రంలోని గందరగోళ పరిస్థితిని చక్కదిద్దాలని అన్నరు. బి.జె.పి నుంచి హాజరైన ఇద్దరు బండారు దత్తాత్రేయ, హరిబాబులు తెలంగాణకు అనుకూలమనే విషయాన్ని చెప్పిండ్రు. ప్రజారాజ్యం పార్టీ నుంచి చిరంజీవి, రామచంద్రయ్యలు హాజరై సమైక్య ఆంధ్రకే కట్టుబడి ఉన్నమని చెప్పిండ్రు. దీంతో చిరంజీవి అందరివాడని అనుకుంటే కొందరివాడుగానే మిగిలిపోయిండు. సి.పి.యం నుంచి రాఘవులు, జూలకంటి రంగారెడ్డిలు హాజరై ఇద్దరు కూడ తెలంగాణ ఏర్పాటును మొదటి నుంచి

వ్యతిరేకిస్తున్నట్టు చెప్పింద్రు. సి.పి.యం కేంద్రనాయకత్వం అంటే అది పూర్తిగ ఆంధ్ర నాయకత్వ అన్నట్టు తెలంగాణకు బద్ధశత్రువులుగ మిగిలిపోయింద్రు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భరించలేకపోయింద్రు. 1946లోనే "విశాలాంధ్రలో ప్రజారాజ్యం" అనే పుస్తకం రాసిన పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి ఆకాంక్షలు, ఆశయానికి విరుద్ధంగ, ప్రస్తుత ప్రజాఉద్యమాలను గౌరవించే ధైర్యం లేక సమైక్యనినాదానికే కట్టుబడి ఉన్నరు. సి.పి.ఐ నుంచి నారాయణ, గుండా మల్లేశ్‌లు హాజరై తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను సమర్థిస్తున్నట్టు చెప్పింద్రు. ప్రజాఉద్యమాలను గుర్తించి, గౌరవించిన ఘనతను స్వంతం చేసుకుంద్రు. అన్నిపార్టీల నిర్ణయాన్ని విన్నతర్వాత కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణ పోరాటం జరిగిన తీరుతెన్నులను సమావేశం ముందు పెట్టిండు. 2009 మే ఎన్నికలలలో అన్నిపార్టీలు తెలంగాణకు మద్దతు ప్రకటించిన విషయాన్ని గుర్తుచేసిండు. 2009 డిసెంబర్ 7న ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో అన్ని పార్టీలు తెలంగాణకు అనుకూలమని ప్రకటించినందువల్లనే 2009 డిసెంబర్ 9న కేంద్రప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయాన్ని ప్రకటించినట్టు చిదంబరం బల్లగుద్ది చెప్పిండు. తెలంగాణకు వ్యతిరేకంగ మాట్లాడిన మొనగాళ్ళందరు వెర్రిమొఖం పెట్టుకొని కూసుంద్రు.

తెలంగాణ ఉద్యమం మరింత తీవ్రతరం అయ్యింది.

ప్రజల వత్తిడిని గమనించిన తెలంగాణ నాయకులు మంత్రులు, ఎం.ఎల్.ఎలు, ఎం.పిలు రాజినామ చేసింద్రు. మళ్ళీ వెనకకు తీసుకుంద్రు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాత్రం తన రాజీనామను ఉపసంహరించుకోక పోవడంతో అధిష్టానం ఆయనకు షోకాజ్ నోటీస్ పంపింది.

2010 జనవరి 8న తెలుగు విశ్వవిద్యాలయంలో అమరవీరుల సంస్మరణ సభకు జెఏసి చైర్మన్ కోదండరాం హాజరై మాట్లాడిండు. నాయకులు ఢిల్లీకి పోవాల్సిన అవసరం లేదని, పదవులకు రాజీనామ చేసి ప్రజలతో కలిసి ఉద్యమంలో పాల్గొంటె చాలని విజ్ఞప్తి చేసిండు. తెలంగాణవాడై ఉండి ఉద్యమంలో కలిసిరాని వాళ్ళను తీవ్రంగ విమర్శించిండు. దీన్ని భరించలేని దానం నాగేందర్, ముఖేష్‌గౌడ్‌లు మమ్మల్ని రాజీనామ చేయమని చెప్పడానికి కోదండరాం ఎవరని ప్రశ్నించింద్రు. విద్యార్థులు, ఉద్యమకారుల మీద ఎదురు దాడి చేసింద్రు. జనవరి 12న కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు కూడ రాజీనామలను వెనకకు తీసుకుంద్రు. తెలంగాణ కాంగ్రేసు నాయకులు కొందరు ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేసింద్రు. ప్రొఫెసర్ కోదండరాం జనవరి 16న జె.ఏ.సి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష ప్రారంభించిండు. దీనికి

నాగం, జానారెడ్డి, దామోదర్ రెడ్డిలు సంఘీభావాన్ని ప్రకటించిండ్రు.

ఆత్మబలిదానాలతో అల్లాడిపోతున్న తెలంగాణలో 2010 జనవరి 19న ఉస్మానియాలో వేణుగోపాల్‌రెడ్డి ఆత్మహత్య చేసుకుండు. విద్యార్థి నాయకులు 20,21 రెండు రోజుల బంద్‌కు పిలుపునిచ్చిండ్రు. ధర్నాలు, రాస్తారోకోలతో పాటు తెలంగాణ కాంగ్రెసు, టి.డి.పి నాయకుల బానిస మనస్తత్వానికి నిరసనగ ఉద్యమాలు చేసిండ్రు. దిష్టిబొమ్మల్ని తగలబెట్టిండ్రు.

నిజాంబాద్ తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థులు చేపట్టిన దీక్షకు 29న పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ పోవడంతో విద్యార్థులు తీవ్ర నిరసన వ్యక్తం చేసిండ్రు.

2010 జనవరి 20న 129 మంది శాసనసభ్యుల రాజీనామాలను ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి తిరస్కరించిండు. జనవరి 31న కాంగ్రేస్ వ్యవహారాల ఇంచార్జ్ జెఎసి నుంచి కాంగ్రేసువాళ్ళు బయటికి రావాలని విజ్ఞప్తి చేసిండు. ఇదేరోజు హైద్రాబాద్ ముస్లీం సంస్థల సభకు కేసీఆర్ హాజరై కాంగ్రేస్ వ్యవహార శైలి మీద నిప్పులు చెరిగిండు.

తెలంగాణ పల్లెపల్లెన దీక్షా శిభిరాలు ఏర్పడి, ఉద్యమం "ధూం-ధాం"గ నడుస్తుంది. కేంద్రం తెలంగాణ నిర్ణయాన్ని సాగదీసే దోరణిలో ఉన్నదని గ్రహించిన జె.ఎ.సి చైర్మన్ కోదండరాం ఫిబ్రవరి 7లోగ కేంధ్రం ప్రకటన చేయాలని గడువు విధించిండు.

తెలంగాణలో రోజురోజుకు పెరుగుతున్న ఉద్యమ తీవ్రతను తాత్కాలికంగ వాయిదా వేసుకునేటట్లు చేయడం కోసం కేంద్రం "శ్రీకృష్ణ కమిటి" అనే కొత్తనాటకానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే 2010 ఫిబ్రవరి 3న శ్రీకృష్ణ కమిటీని నియమించింది. జస్టీస్ బేలూరు నారాయణస్వామి శ్రీకృష్ణ అధ్యక్షుడిగ ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. సభ్య కార్యదర్శిగ వినోద్‌కుమార్ దుగ్గల్, రవీందర్‌కౌర్, రణబీర్‌సింగ్, అబూసలేహ్ షరీఫ్ ఇతర సభ్యులుగ ఉన్నరు.

ఫిబ్రవరి 12న కమిటీ పర్యటన మొదలైంది.

తెలంగాణ ఉద్యమకారులు మొదట శ్రీకృష్ణ కమిటీని తీవ్రంగ వ్యతిరేకించిండ్రు. సమైక్యాంధ్ర ఉద్యమకారులం అని చెప్పుకునేవాళ్ళు అక్కడక్కడ కమిటీపట్ల విశ్వాసాన్ని ప్రకటించిండ్రు. ఇట్ల తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జాప్యం కావడానికి ప్రధాన కారణం తెలంగాణ మంత్రుల చేతగానితనమేనని గ్రహించిన తెలంగాణ ఉద్యమకారులు, విద్యార్థులు మంత్రుల ఇండ్లమీద దాడులు చేసిండ్రు. వినూత్నరీతిలో నిరసన

వ్యక్తంచేసిన ఉద్యమకారులు పోలీసుల కాళ్ళు మొక్కిండ్రు. తెలంగాణ ద్రోహుల ఫ్లెక్సిల మీద కోడిగుడ్లు, టమాటాలను విసిరి, చెప్పులతో కొట్టిండ్రు. ఫిబ్రవరి 14న జానారెడ్డి ఇంటికి పిడికలు కొట్టి, నిరసన తెలిపిండ్రు. జానారెడ్డి ఉద్యమకారుల మీద కేసులపెట్టి ఉద్యమాన్ని అణిచేసే విధంగ ప్రవర్తించిండు. అదేరోజు ఉస్మానియాలో మళ్ళీ లాఠీచార్జ్ జరిగింది. ఉస్మానియా విద్యార్థుల మీద పదేపదే లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగ పరిగణించిన కేసీఆర్ తెలంగాణ కాంగ్రేసు నాయకుల చేతగానితనానికి మరింత కుమిలిపోయిండు. చేతగాని దద్దమ్మలంటూ ఆవేశాన్ని వెళ్ళగక్కిండు.

2010 ఫిబ్రవరి 15న అసెంబ్లీ సమావేశాలు మొదలైనయి. రాజీనామ చేయని మంత్రుల మీద కోదండరాం మండిపడ్డడు. ఫిబ్రవరి 19న కాంగ్రేస్ జెఎసి నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. దీంతో తెలంగాణ కాంగ్రేసు నాయకుల డొల్లతనం మరింత బయటపడింది. సీమాంధ్ర పాలనను ఎదిరించే దమ్ములేక చేతులెత్తేసిండ్రు. తెలంగాణ ఇప్పుడు కాకపోతె ఇంకెప్పుడు రాదన్న భావనతో విద్యార్థులు, జెఎసి నాయకులు ఉద్యమాన్ని తీవ్రతరం చేసిండ్రు.

ఫిబ్రవరి 20న ఉస్మానియా విద్యార్థి జెఎసి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టింది.

## తెలంగాణ విదార్థి గర్జన

2010 జనవరి 3న ఉస్మానియా విద్యార్థులు తెలంగాణ విద్యార్థి గర్జన పేరుతో భారి బహిరంగ సభను ఏర్పాటు చేసింది. లక్షలాదిమంది విద్యార్థులు తెలంగాణ కోసం ఒక్కటై గర్జించిండ్రు. విద్యార్థుల నినాదాల హోరు పాలకపక్షానికి నిద్రపట్టకుండ చేసింది.

2010 జనవరి 23న నిజాం కాలేజ్ గ్రౌండ్‌లో జరిగిన విద్యార్థి రణభేరి సభకు సుష్మాస్వరాజ్ హాజరై విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవద్దని ఆవేదనతో అర్థించింది. తెలంగాణ న్యాయమైన కోరికను నెరవేర్చాలని కాంగ్రేసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ విధంగ విద్యార్థి ఉద్యమరణభేరి ఢిల్లీని కదిలించింది. భారతీయ జనతాపార్టీ నాయకురాలు, ప్రతిపక్షనేత సుష్మాస్వరాజ్ తెలంగాణ గోసని అర్థం చేసుకొని ప్రసంగించిన తీరు తెలంగాణ ఉద్యమకారులకు గొప్ప ఆత్మస్థైర్యాన్ని కలిగించింది. అమరవీరుల కన్నతల్లులకు ఎందరికో ఓదార్పునిచ్చింది.

2010 ఫిబ్రవరి 7న వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల 'పొలికేక' సభ పెద్దఎత్తున జరిగింది. ఈ సభకు స్వామి అగ్నివేశ్, కోదండరాంలు

హాజరయ్యింద్రు. అదేవిధంగ తెలంంగాణ ఉద్యమ పొలికేక నింగినంటింది. ఢిల్లీ నాయకుల దిమ్మతిరిగింది.

ఫిబ్రవరి 8 2010న జమాతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మాలిక్ మొహాసిత్ ఖాన్ అధ్యక్షతన 'తెలంగాణ ముస్లీం గర్జన' నిజాం కాలేజ్ గ్రౌండ్‌లో జరిగింది. ముస్లీంలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు పలికిన ఈ సభలోనే కేసీఆర్ ముస్లీంలకు 12శాతం రిజర్వేషన్‌లు ఇస్తానని హామి ఇచ్చిండు. జి.వెంకటస్వామి, గద్దర్, దేవేందర్‌గౌడ్ కూడ సభలో ఉన్నరు.

2011 సెప్టెంబర్ 12 కరీంనగర్‌లో జనగర్జన పేరుతో జరిగిన బహిరంగ సభలో కేసీఆర్ సకలజనుల సమ్మె మొదలైందని ప్రకటించిండు. ఇంకా తెలంగాణ ఉద్యమంలో కలిసిరాని నాయకులని తూర్పాల బట్టిండు.

తెలంగాణ ద్రోహులు, ముఖ్యంగ అధికార కాంగ్రెసు నాయకులు తెలంగాణలో రోడ్లమీద తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. నాలుగుకోట్ల తెలంగాణ జనం దక్కులు పిక్కటిల్లేటట్లు నినదించింద్రు. ఉద్యమం ఉప్పెనై సీమాంధ్ర ప్రభుత్వాన్ని తాకింది. సీమాంధ్ర పాలకులు సముద్రం ఉంది కాబట్టి చూస్తే సుడిగుండాలు చూసుంటరు. కాని తెలంగాణ జనసంద్రంలో చెలరేగిన అలజడి, తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షని చూసిన వలసపాలకుల కండ్లు బైర్లుగమ్మినయి. ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యింద్రు.

2010లో హైద్రాబాద్-కోదాడ 9వ నెంబర్ జాతీయ రహదారి మీద నిర్వహించిన మానవహారంతో ఆంధ్రులకు చెమటలు పట్టినయి. బార్డర్‌లో గోడకట్టి తెలంగాణలో అడుగు పెట్టకుండ అడ్డుకున్నరు.

2010 అక్టోబర్ 10న గద్దర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ ఏర్పడ్డది. ఉద్యమం చేయాలని కొందరు, ఎన్నికలలో పోటి చేయాలని మరికొందరు ఆవిర్భావ వేదిక మీదనే ఒకరినొకరు తోసుకున్నరు. విమలక్క ప్రజాస్వామ్య పద్ధతిలోనే తెలంగాణ కోసం కొట్లాడాలని, ఎన్నికలలో పాల్గొనాల్సిందేనని ప్రకటించింది. 2010 అక్టోబర్ 21న విమలక్క ఆధ్వర్యంలో తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ ఏర్పిడింది.

తెలుగుదేశం పార్టీ నుంచి బయటికి వచ్చిన నాగం జనార్ధన్ రెడ్డి 2011 సెప్టెంబర్ 10న తెలంగాణ నగార సమితి అనే కొత్త పార్టీని ప్రకటించిండు.

2010 డిసెంబర్ 16న కేసీఆర్ వరంగల్‌లో 'తెలంగాణ మహాగర్జన'కు పిలుపునిచ్చిండు. కేంద్రం తెలంగాణ ప్రకటించి సంవత్సరం అయిపోయిన సందర్భంగ శ్రీకృష్ణ కమిటీతో సంబంధం లేకుండ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసిండు. తెలంగాణలో ఇంటికొకరు చొప్పున 25లక్షల మంది ఈ మహాగర్జన

సభకు హాజరైనట్టు ప్రకటించిండు. దేశ చరిత్రలో ఇలాంటి సభ ఇంకెక్కడ జరగదని, మొండి ప్రభుత్వానికి కీలెరిగి వాత పెట్టాలని అన్నడు. ఈ సభలో స్వామి అగ్నివేశ్ "నేను ఆంధ్ర ప్రాంతంలోని శ్రీకాకుళంలో పుట్టి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుని కోరుకుంటున్నానని" అఖిల భారత ఆర్యసమాజ్ అధ్యక్షుడు స్వామి అగ్నివేశ్ ప్రకటించిండు. మహాగర్జన సభలో ప్రారంభోపన్యాసం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ "తెలంగాణ పోరాటంలో ఇదే చివరి అంకం అవుతుందని" అన్నడు. తెలంగాణ జెఎసి చైర్మన్ కోదండరాం మాట్లాడుతూ "కండ్లుండి చూసే వారికి, చెవులుండి వినే వారికి ప్రత్యేకంగ చెప్పాల్సిన పనిలేదని, ఈ సభ మొత్తం చూస్తే తెలంగాణ గుండె చప్పుడు వినిపిస్తుందని" అన్నడు.

తెలంగాణ విద్యార్థి జెఎసి కన్వీనర్ పిడమర్తి రవి మాట్లాడుతూ డిసెంబర్ 31వరకు శాంతియుతంగ ఉంటాం. కేసీఆర్ ఒక్క మాట చెబితే చాలు హైద్రాబాద్‌లో ఒక్క ఆంద్రావాడు కూడ ఉండడు, కాని మా విధానం అది కాదని" అన్నడు. అయితే జనవరి నుంచి మాత్రం కురుక్షేత్రమే"నని ప్రకటించిండు.

"డిసెంబర్ 31 తర్వాత ఏమవుతుంది? జనవరి 1 వస్తుంది" అన్న గవర్నర్ నరసింహన్ వ్యాఖ్యల్ని తెలంగాణ ఉద్యమకారులు తీవ్రంగ ఖండించిండ్రు. ఈ సందర్భంగ అదనపు బలగాలను తెలంగాణలో నింపుతున్నట్టు ప్రకటించిన డి.జ.పి. అరవిందరావు రాష్ట్రాన్ని పోలీసు రాజ్యంగ మార్చిండని విమర్శించిండ్రు.

రాష్ట్రప్రభుత్వం తెలంగాణ మార్చ్‌కు అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి ఉద్యమకారుల మీద జరిపిన దాడులకు నిరసనగా గాంధీ జయంతి రోజు బాపుఘాట్ వద్ద తెలంగాణ జెఎసి ఆధ్వర్యంలో 'మౌనదీక్ష'ను చేపట్టడం జరిగింది. అన్ని రకాల జెఎసి నేతలతో పాటు తెలంగాణ ఉద్యమకారులు పెద్దఎత్తున ఈ దీక్షలో పాల్గొన్నరు.

2011 ఫిబ్రవరి 27న 'తెలంగాణ కవుల గర్జన' సభ జరిగింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే విధంగ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో ఈ గర్జన సభ జరిగింది. జూలూరి గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజాగాయకుడు గద్దర్, సినీ దర్శకుడు బి. నర్సింగ్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యిండ్రు. మార్చి 1న జరిగే 'రైల్‌రోకో' మరియు 10న జరిగే మిలియన్ మార్చిని విజయవంతం చేయాలని సభ పిలుపునిచ్చింది.

2013 జనవరి 25న తెలంగాణ జెఎసి 36గంటల "సమరదీక్ష"కు సిద్ధమైంది. ప్రభుత్వం ఈ సభకు అనుమతి ఇవ్వడానికి అనేక ఇబ్బందులు పెట్టింది. ఎన్ని

ఆటంకాలు ఎదురైన సమరదీక్ష జరిపి తీరుతామని జెఎసి హెచ్చరించింది. ప్రొఫెసర్ కోదండరాం, ఈటెల రాజేందర్, ఉద్యోగ సంఘ నాయకులు దేవి ప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్ హోంమంత్రిని కలిసిండ్రు. ఎమ్మెల్సీ చుక్కా రామయ్య, గద్దర్ కూడ హోంమంత్రిని కలిసి సభకు అనుమతి ఇవ్వాలని కోరిండ్రు. ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి నాయకులను అరెస్టు చేయడం మొదలు పెట్టింది. గన్‌పార్కు వద్దకు వచ్చిన కేటీఆర్, స్వామిగౌడ్‌లను ఉదయమే అరెస్టు చేసింది. న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద ఉద్రిక్తతలను పెంచింది. ఉస్మానియాలో విద్యార్థుల మీద పోలీసుల దాడులు మొదలైనయి. విద్యార్థులు రాళ్ళ వర్షం కురిపించింద్రు. ఇందిరాపార్కు సమరదీక్ష స్థలానికి బయలు దేరిన విద్యార్థులను, లెక్చరర్లను సుందరయ్య పార్కు వద్దనే అరెస్టు చేసింది. బిజెపి నాయకుకులు బండారు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డిలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించింద్రు. కోదండరాం సమరదీక్ష వేదిక నుంచి ఆవేశంగ మాట్లాడిండు. తెలంగాణ మంత్రులు పదవులకు రాజీనామ చేసి బయటికి రావాలని డిమాండ్ చేసిండు. సమరదీక్షకు సంఘీబావం తెలపడానికి వచ్చిన కాంగ్రేసు ఎంపీల మీద ఉద్యమకారుల దాడులకు ప్రయత్నం చేయడంతో కేటీఆర్, హరీశ్‌రావు, కోదండరాంలు చెప్పడంతో శాంతించింద్రు.

సమరదీక్ష ముగింపు సభలో కేసీఆర్ సీమాంధ్ర పాలన మీద నిప్పులు చెరిగిండు. నీళ్ళు, నిధులు, ఉద్యోగాలు ఎత్తుకపోయినోళ్ళను దోపిడి దొంగలనకుంటే ఏమంటరని ప్రశ్నించిండు. అరవయ్యేండ్లుగ ఈ నేలను పట్టి పీడిస్తున్నవాళ్ళను రాక్షసులనకుంటే ఏమనాలని, మీకు ఏ మాత్రం ఇజ్జత్‌గాని, పౌరుషంగాని ఉంటే వెంటనే తెలంగాణకు తీర్మాణం చేయాలని, లేకపోతే బజారు బతుకులైతయని హెచ్చరించిండు. తెలంగాణ సాధన కోసం ఇంకా ఎన్ని దీక్షలు, ఎన్ని ఉపవాసాలు చేయాలని ప్రశ్నించిండు. తెలంగాణ మంత్రులు చీము, నెత్తురు, సిగ్గు, లజ్జ ఉంటే ఇకనైన పదవులకు రాజీనామ చేసి ఉద్యమంలోకి రావాలని ఆవేశంతో కూడిన ఆవేదనని వెళ్ళగక్కిండు. అంతటితో ఆగకుండ మంచి మాటలతోని ఆంధ్రోళ్ళు వెళ్ళిపోరు. మద్రాసు రాష్ట్రంలో ఇట్నే కిరికిరి జేస్తే సహనం కోల్పోయిన రాజాజి "ఆంధ్ర కుక్కల్లారా, ఖబడ్దార్. తక్షణమే మద్రాసు ఖాలీచేసి వెళ్ళిపోండి" అంటెనే సదుర్కోని వచ్చింద్రు. వాళ్ళు పోయేదాక మనం అట్లనే అనాలె" అని కేసీఆర్ సింహ గర్జన చేసిండు. సభని ఉద్రూతలు ఊగించి సమరోత్సాహానికి సన్నద్ధం చేసిండు.

తెలంగాణ జెఎసి సమరదీక్ష నుంచి "కాంగ్రేస్‌కో ఖతం కరో– తెలంగాణకో హసిల్ కరో' అనే నినాదాన్ని ఎత్తుకుంది. తెలంగాణ విషయాన్ని కేంద్రం త్వరగా

తేల్చకుంటే ఛలో అసెంబ్లీ, సకలజనుల సమ్మె, జాతీయ రహదారుల దిగ్బంధం వంటి కార్యక్రమాలు మళ్ళీ చేపడతామని హెచ్చరించింది.

2013 సెప్టెంబర్ 28న నిజాం కాలేజిలో జెఎసి ఏర్పాటు చేసిన సకలజనభేరి సభ నలుదిక్కుల్ని కదలించింది. విద్యార్థి, ఉద్యోగ సంఘాలను రాజకీయ పార్టీలను సమన్వయం చేసుకోని ఏర్పాటు చేసిన ఈ సభ కనీవిని ఎరుగని రీతిలో జరిగింది.

తెలంగాణ బిల్లుని పార్లమెంట్‌లో పెట్టి రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని, హైద్రాబాద్‌తో కూడిన పదిజిల్లాల తెలంగాణను ప్రకటించాలని, హైద్రాబాద్ మీద పూర్తి హక్కులు తెలంగాణకే ఉండాలని, తెలంగాణ మీద సిడబ్లూసి ప్రకటించిన తీర్మాణాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది.

# జె.ఎ.సి.ల ఏర్పాటు

డిసెంబర్9 తెలంగాణ ప్రకటన నుంచి వెనకకు పోయిన కేంద్రం డిసెంబర్ 23న మరొక ప్రకటన చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అసెంబ్లీ తీర్మాణం అవసరమనే విషయాన్ని స్పష్టం చేసింది. దీంతో తెలంగాణలో రాజకీయ పక్షాలు దోబూచులాడుతున్న విషయాన్ని తీవ్రంగ పరిగణించిన రాజకీయేతర సంఘాలు ఐక్యంగ ఉద్యమించడం కోసం డిసెంబర్ 24, 2009న తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి (జెఎసి)ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. అప్పటి వరకు విద్యావంతుల వేదిక అధ్యక్షుడిగా ఉన్న ప్రొఫెసర్ కోదండరాం జెఎసి కన్వీనర్గ ఏకగ్రీవంగ ఎన్నికయ్యిండు.


డిసెంబర్ 25న జూబ్లిహిల్స్‌లోని రావినారాయణ రెడ్డి మెమోరియల్ హాల్‌లో జెఎసి స్టీరింగ్ కమిటి తొలి సమావేశం ప్రొఫెసర్ కొదండరాం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పార్టీలు జెండాలు, ఎజెండాలను పక్కనపెట్టి ఒక వేదిక మీదికి రావడం ద్వార ప్రజలకు మంచి సందేశాన్ని ఇచ్చినట్టయ్యింది. ఇక మన లక్ష్యం ఢిల్లి మెడలు వంచి తెలంగాణ సాధించుకోవడమేనని అన్నడు. మంత్రులందరు రాజీనామ చేసిన ఈ రాష్ట్రంలో ఇంకా ప్రభుత్వం ఎట్ల కొనసాగుతుందని ప్రశ్నించిండు. ఉస్మానియా విశ్వవిద్యాలయాల్లోకి పోలీసులు వెళ్ళకూడదని డిమాండ్ చేసిండు. విద్యార్థుల మీద జరిగే అణిచివేతను కలిసికట్టుగ ఎదుర్కోవాలని, ఉద్యోగలు పెన్‌డౌన్ చేయాలని ముఖ్యంగ ప్రజలను మానసికంగ ఉద్యమానికి సిద్దం చేయాలని సూచించిండు. భారతీయ జనతాపార్టీ జెఎసితో కలిసి పని చేస్తుందని సి.హెచ్. విద్యాసాగర్ రావు అన్నడు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో కాంగ్రేసు నాయకులదే కీలకమైన పాత్ర అని అన్నడు. జానారెడ్డి మాట్లాడుతూ పార్టీలు, ప్రజాసంఘాలు పరస్పర సహకారం, అవగాహనతో ప్రత్యక్ష కార్యాచరణకు సిద్దం కావాల్సిన అవసరం ఉందని అన్నడు. ఇయ్యాల దేశంలో తెలంగాణ తప్ప వేరే చర్చ లేదని, ఉద్యమం ఈ స్థాయికి రావడానికి కేసీఆర్ చేసిన కృషిని, త్యాగాన్ని పార్లమెంట్ సభ్యులు మధుయాష్కిగౌడ్ కొనియాడిండు. ఉద్యమంలో కలిసిరాకపోయిన ఫర్వాలేదు గాని, ఉద్యమానికి ద్రోహం చేయొద్దని కోరుకుండు. కేంద్రంలో కదలిక ఉన్న ఈ

సమయంలోనే తెలంగాణ ప్రజాబలాన్ని నిరూపించాలని అన్నడు. ఆంధ్రలో జరిగే కృత్రిమ ఉద్యమాన్ని మీడియా కొండంతలు చేసి ప్రచారం చేస్తుందని అన్నడు. రాష్ట్ర ఏర్పాటు కోసం అందరం పిడికిళ్ళు బిగించాలని అన్నడు.

ఇంకా ఈ జెఎసి స్టీరింగ్ కమిటి మొదటి సమావేశంలో ఆర్. దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బి.వి.మోహన్‌రెడ్డి, టి.ఎన్.జి.ఓ అధ్యక్షుడు స్వామిగౌడ్, ప్రొఫెసర్ లక్ష్మణ్, మల్లెపల్లి లక్ష్మయ్య, దాసోజు శ్రవణ్‌కుమార్, మందకృష్ణమాదిగ, అందెశ్రీ, సూర్యం (న్యూ డెమోక్రసి) పలు పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన వాళ్ళు పాల్గొన్నరు.

భవిష్యత్ తెలంగాణ ఎట్ల ఉంటదో ప్రజలకు వివరించడం ద్వార ఉద్యమానికి మరింత ప్రయోజనం కలిగే అవకాశం ఉందని ప్రొఫెసర్ రమా మేల్కొటే చెప్పడం జరిగింది.

అప్పటివరకు ఎవరికి వారై పోరాడిన ఉద్యోగులందరు ఏకమైంద్రు. దీంతో టి.ఎన్.జి.ఓ అధ్యక్షుడు స్వామిగౌడ్ అధ్యక్షునిగ, దేవిప్రసాద్ కార్యదర్శిగ ఉద్యోగసంఘాల జె.ఎ.సి ఏర్పడింది. 2011 ఫిబ్రవరి 17న అసెంబ్లీ సమావేశలు ప్రారంభమైన తర్వాత మూడు లక్షల మంది ఉద్యోగులు సహాయనిరాకరణకు దిగింద్రు. తెలంగాణ ఉద్యోగులకు రాజకీయ జె.ఎ.సి, టి.ఆర్.ఎస్. మద్దతు ప్రకటించినయి. ఫిబ్రవరి 21న ఛలో అసెంబ్లీకి పిలుపునిచ్చింద్రు. అసెంబ్లి ముట్టడికి శతవిధాల ప్రయత్నం చేసింద్రు. లాటీచార్జ్ జరిగింది. కిరణ్‌కుమార్ రెడ్డి క్రూరంగ ప్రవర్తించిండు.



దీనికి నిరసనగ రెండు రోజులు తెలంగాణ బందుకు పిలుపునిచ్చింద్రు. ఫిబ్రవరి 23న పార్లమెంట్‌లో కేసీఆర్, విజయశాంతి పోడియం వద్ద చేరి నిరసన తెలిపింద్రు. టి.ఆర్.ఎస్ నిరసనకు బి.జె.పి. ఫ్లోర్ లీడర్ సుష్మాస్వరాజ్ మద్దతు తెలిపింది. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేసింది. జె.ఎ.సి రైళ్ళ బంద్‌కు పిలుపునిచ్చింది. పల్లెపల్లె పట్టాలపైకి అనే నినాదాన్ని ఇచ్చింది. తెలంగాణను నిర్లక్ష్యం చేస్తున్నందుకు నిరసనగ మంత్రి జూపల్లి కృష్ణారావు 2011 మార్చి 31 రాజీనామ చేసిండు. నాగం జనార్ధన్ రెడ్డి టి.డి.పి. మీద తిరుగుబాటు చేసిండు.

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద "సంసద్‌యాత్ర" పేరుతో రెండు రోజుల సత్యాగ్రహ దీక్ష చేపట్టింది. తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో యూపిఎ ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచేందుకు ఈ యాత్ర ఎంతగానో ఉపయోగపడింది. జాతీయస్థాయిల రాజకీయ మద్దతును కూడగట్టడంలో విజయం సాధించింది.

## ఉప ఎన్నికలు

కేంద్రంలో కార్మికశాఖ మంత్రిగ ఉన్న కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం కేంద్రం మీద వత్తిడి పెంచిండు. 2005 మార్చిలో ప్రణబ్‌ముఖర్జీ అధ్యక్షుడిగ మంత్రిర్గ ఉపసంఘాన్ని నియమించింది. కేసీఆర్ విన్నపంతో ప్రణబ్ కమిటీకి 36పార్టీలు తెలంగాణ ఏర్పాటుకు మద్దతును తెలియజేసినయి. 2006 పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో తెలంగాణ అంశం మీద ఒక నిర్ణయం తీసుకోకపోతే ప్రభుత్వం నుంచి వైదొలగుతానని కేసిఆర్ డెడ్‌లైన్ విధించిండు. కేంద్రం స్పందించకపోవడంతో కేసీఆర్, నరేంద్రలు ఆగస్టులో కేంద్రమంత్రి పదవులకు రాజీనామ చేసింద్రు. ఈలోపు రాష్ట్రంలో వై.యస్ సర్కారు చర్చల పేర నక్సలైట్లను ఆహ్వానించి ఏరివేత కార్యక్రమం మొదలుపెట్టింది. ప్రభుత్వ వ్యతిరేక గొంతులను నొక్కిపట్టే పనిలో పడ్డది వై.యస్. సర్కారు. టి.ఆర్.ఎస్ పార్టీని చీల్చే కుట్ర కూడ చేసిండు. సంతోష్‌రెడ్డి మినహా మిగతా మంత్రులు రాజీనామ చేసింద్రు. నలుగురు టి.ఆర్.ఎస్. ఎమ్మెల్యేలు కూడ వై.యస్. మాయమాటలకు పడిపోయి ఆయన పంచన చేరింద్రు.

కాంగ్రేస్ నాయకుడు ఎం. సత్యనారాయణరావు కేసీఆర్‌కు దమ్ముంటే పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామ చేసి గెలవాలని సవాల్ విసిరిండు. సవాల్‌ని స్వీకరించిన కేసీఆర్ 2006 సెప్టెంబర్ 12న పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామ చేసిండు. 2006 డిసెంబర్ 7 కరీంనగర్ పార్లమెంట్ ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో ప్రజలందరు తెలంగాణ పట్ల తమ పూర్తి మద్దతును, విశ్వాసాన్ని ప్రకటించింద్రు. తెలంగాణకు

రెఫరెండంగ భావించిన ఈ ఎన్నికలలో కేసీఆర్ రెండు లక్షల పై చిలుకు మెజార్టీతో గెలిచి తెలంగాణ ఆకాంక్షకు మరింత బలాన్ని చేకూర్చిండు. రాష్ట్రంలోని పార్టీలన్ని ఏకమైన ప్రజలు తెలంగాణకే విజయాన్ని కట్టబెట్టింద్రు. కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు తెలంగాణకు అనుకూలంగ ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడంలో విజయం సాధించింద్రు. ఆ గెలుపు మూడున్నర కోట్ల ప్రజల గెలుపు అయ్యింది. అయినా ఆ తర్వాత పార్టీలు మాట మార్చినయి. తెలంగాణకు రెఫరెండం అన్నవాళ్ళ నోళ్ళు మూతబడి కొత్త రాగాన్ని అందుకున్నయి.

కేసీఆర్ స్వభావంతో ఇమడలేని ఏలె నరేంద్ర పార్టీని, నాయకులను బహిరంగంగ విమర్శించినందుకు గాను 2007 ఏప్రిల్ 25న పార్టీ నుంచి బహిష్కరించింద్రు.

2008 మార్చి 3న నలుగురు తెలంగాణ ఎం.పీలు, 16 మందిశాసనసభ్యులు మూకుమ్మడిగ రాజీనామ చేసింద్రు. 2008 మే29న ఉప ఎన్నికలు వచ్చినయ్. ఫలితాలు జూన్ 1న వెలువడినయి. నాలుగు ఎం.పి స్థానాలకు గాను రెండింటిలో మాత్రమే గెలిచింది. కరీంనగర్ కేసీఆర్, హన్మకొండ బి. వినోద్‌కుమార్. 16 శాసనసభ స్థానాలకు గాను ఏడింటినే గెలుచుకుంది. వాళ్లు ఈటెల రాజేందర్, హరీశ్‌రావు, కె. ప్రతాప్‌రెడ్డి, నగేశ్, సోలిపేట రామలింగారెడ్డి, వి. లక్ష్మీకాంతరావు, కొప్పుల ఈశ్వర్‌లు మాత్రమే.

ఆ తర్వాత 2010లో కాంగ్రేసు ప్రజాప్రతినిధులు రాజినామాలు చేసినట్టే చేసి అందరు వెనకకు తీసుకుంద్రు. కాని టి.ఆర్.ఎస్‌కు చెందిన పదిమంది ఎమ్మెల్యేలు రాజీనామాలను ఆమోదింప జేసుకుంద్రు. బి.జె.పి ఎమ్మెల్యే యెండల లక్ష్మినారాయణ రాజీనామ ఆమోదింప చేసుకుండు. కిషన్‌రెడ్డి రాజీనామ చేయకుండ తప్పించుకుండు. ఈ నేపథ్యంలో 2010 జులై 2న కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ జారి చేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిద్రని వేలాది మంది మీద బైండోవర్ కేసుల పెట్టింద్రు. వందలాది మందిని అరెస్టు చేసింద్రు. ఈ ఉప ఎన్నికల్లో దాదాపుగ అందరు రాజీనామ చేసినవాళ్ళే పోటీ చేసింద్రు. ఈ సంధర్భంగ జెఎసి నాయకులతో కేసీఆర్ సమావేశమై గ్రామస్థాయి దాక జెఎసి కమిటీలను విస్తరించాలని కోరిండు. నిజాంబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి యెండల లక్ష్మినారాయణ మీద డి. శ్రీనివాస్ పోటి చేసిండు. ఈ ఉప ఎన్నికల ఫలితాలలో ఎలాంటి మార్పులేదు. రాజీనామ చేసిన వాళ్ళందరు గెలిచింద్రు. గెలుపు ధీమాతో విర్రవీగిన డి.ఎస్. రెండోసారి కూడ ఓడిపోయిండు. ఓ.యు.లో ఇషాన్‌రెడ్డి ఆత్మత్యాగం చేసిండు. తెలంగాణ నాయకులు, ఉద్యమకారులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించింద్రు.

ఇషాన్‌రెడ్డి అంతిమయాత్రలో కేసీఆర్ కూడ పాల్గొన్నాడు. సిద్ధిపేటలో టి.ఆర్.ఎస్ అభ్యర్థి, హరీశ్‌రావు 95,858 ఓట్లతో భారి ఆధిక్యాన్ని సాధించి రికార్డు సృష్టించిండు.

## సహాయ నిరాకరణ ఉద్యమం

తెలంగాణలో సీమాంధ్ర ఉత్పత్తులను నిషేదించాలని, వాళ్ళ సినిమాలను చూడొద్దని, సీమాంధ్రులకు ఏ విషయంలోను సహాయం చేయకుండ నిరాకరణ ఒక ఉద్యమంగ పాటించాలని జెఎసి పిలుపునిచ్చింది.

తెలంగాణ జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు చేపట్టిన 'సహాయనిరాకరణ ఉద్యమంతో రాష్ట్ర ప్రభుత్వానికి సుక్కలు కనపడ్డయ్. ఉద్యోగులు సంఘటితంగ చేసిన ఈ ఉద్యమంతో సీమాంధ్ర ప్రభుత్వం ఒక మెట్టు కిందికి దిగింది. సహాయ నిరాకరణ ఉద్యమానికి అనుబంధంగ జెఎసి 48గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. ఆర్టీసి కార్మికులు స్వచ్ఛందంగ బంద్‌లో పాల్గొన్నరు. సింగరేణిలో కార్మికులు రెండు రోజులు సమ్మెచేసి బొగ్గు ఉత్పత్తిని నిలిపేసింన్రు. ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల కార్యకలాపాలు ఎక్కడికక్కడ స్థంభించినయ్. తెలంగాణ శాసనసభ్యులు అసెంబ్లీకి పోకపోవడంతో సభ కేవలం సీమాంధ్ర అసెంబ్లీగ మారింది.

2010 అక్టోబర్ 29వ తేదీన హైద్రాబాద్ రాష్ట్ర విద్యుత్ బోర్డు శతాబ్ధి ఉత్సవాలు జరిగినయి. ఈ ఉత్సవాల్లో భాగంగ తెలంగాణ పది జిల్లాల నుంచి పెద్ద ఎత్తున హైద్రాబాద్ ఎగ్జిబీషన్ గ్రౌండ్‌లో విద్యుత్ ఉద్యోగుల హజరయ్యింన్రు.

విద్యుత్ ఉద్యోగుల జెఎసి నాయకుడు కె.రఘు అధ్యక్షతన జరిగిన ఈ సభలో జై తెలంగాణ నినాదాం ఆకాశాన్నంటింది. ఈ సభలో కేసీఆర్ సింహ గర్జన చేసిండు. “అయ్యా పి.ఎం. గారు, సి.ఎం. గారు ఈరోజు తెలంగాణ బెబ్బులిలా లేచి కూర్చొని ఉంది. కాంట్రాక్టు ఉద్యోగులను జూనియర్ లైన్‌మెన్‌గా నియమించాలని హైకోర్టు తీర్పు చెప్పినా ఇక్కడ అమలు చేయకుండ ఆంధ్రాలో అమలు చేసింన్రు. ఈ పరిస్థితి మంచిగ అయితే సరే సరే లేకుంటే కట్కాలు బంజేత్తే వాళ్ళే దారికత్తరు. పదేళ్ళ కింద కేసీఆర్ ఒక్కడే ఇప్పుడు అందరూ కేసీఆర్లే. ఇక్కడికి అధికారులను పిలిచినా ఒక్కరు రాలేదు. వాళ్ళకు సిగ్గులేదు. 1956లో ఏ తెలంగాణ అయితే ఆంధ్రలో కలిపారో, ఆ తెలంగాణే వావాలి దానికి ఇంచ్ తగ్గినా ఒప్పుకోం” అని గర్జించిన కేసీఆర్ సరికొత్త విప్లవాన్ని సృష్టించిండు. దీంతో విద్యుత్ ఉద్యోగులు “సహాయం తెలంగాణకు–నిరాకరణ ఆంధ్రోళ్ళకు” అని పెద్దఎత్తున నిరసన తెలిపింన్రు.

2011 ఫిబ్రవరి 17 నుంచి తెలంగాణ వ్యాప్తంగ సహాయ నిరాకరణ కార్యక్రమం

మొదలైంది. గ్రామగ్రామాన చాటింపులు, ర్యాలీలు, జైల్‌భరో వంటి కార్యక్రమాలతో పాటు టి.డి.పి., కాంగ్రేస్ ప్రజాప్రతినిధుల ఇండ్ల ముందు ధర్నా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

బస్సుల్లో టికెట్ తీసుకోకుండ ప్రయాణించడం, ఇంటిపన్నులు, విద్యుత్‌బిల్లులు చెల్లించకపోవడం, టోల్‌గేట్‌ల వద్ద బిల్లులు ఇయ్యకుండ చేయడం ద్వార ప్రభుత్వానికి ఉద్యమ తీవ్రతను తెలియజేసినట్టయ్యింది. కార్యక్రమం యొక్క ముఖ్యఉద్దేశ్యం కూడ అదే. సభలు, సమావేశాలు, అరెస్టులు, లాఠీచార్జ్‌లతో తెలంగాణ పోరాట ముఖచిత్రంగ మారింది. వరంగల్ జిల్లా దూల్మిట్ట గ్రామానికి చెందిన వికలాంగుడు చీరబోయిన కనకయ్య సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిండు. తెలంగాణ రాష్ట్రమె ఎజెండగా పార్టీలన్ని సహాయ నిరాకరణ ఉద్యమానికి మద్దతు ప్రకటించినయి. శాసనసభా కార్యక్రమాలను జరగనీయకూడదని రాజకీయపక్షాలు నిర్ణయించినయి. ఉద్యోగ సంఘాల నేత స్వామిగౌడ్ ఉద్యోగులు సంతకాలు చేస్తరు కాని విధుల్లో పాల్గొనరని ప్రకటించిండు. ప్రభుత్వం దుందుడుకు చర్యలకు పాల్పడితే పరిస్థితి తీవ్రంగ ఉంటుందని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించిండు. పది జిల్లాలలో ఉద్యోగులు పెద్దఎత్తున ఉద్యమంలో పాల్గొన్నరు. నార్కట్‌పల్లి ప్రధాన రహదారిని దిగ్బందించింద్రు. అన్ని చోట్ల ధూంధాం కార్యక్రమాలు జరిగినయి. సంగెం మండలం ఎల్గూరుకు చెందిన కరంబోతు భూక్యా మహెందర్ విషం తాగి ఆత్మహత్య చేసుకుండు. జనగామలో లింగగిరి రాములు బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుండు. జి.హెచ్.ఎం.సి పరిధిలో అన్ని శాఖల ఉద్యోగులు విధులను బహిష్కరించి నిరసన తెలిపింద్రు. బస్సులు, కార్ల అద్దాలు ధ్వంసం చేసింద్రు. ఎం.ఎం.టి.ఎస్ రైళ్ళమీద రాళ్లదాడి చేసి ఒక బోగికి నిప్పు పెట్టింద్రు.

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి తెలంగాణ పోరాటానికి తలవంచే పరిస్థితి ఏర్పడింది. ఎక్కడ చూసిన నిరసనలతో తెలంగాణ మొత్తం దావానంలా మండిపోతుంది. తీవ్ర పరిస్థితులలో కిరణ్‌కుమార్ రెడ్డి "తెలంగాణకు నేను అడ్డంకి కాదు. ఇది రాష్ట్ర పరిధిలోని అంశం కాదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు విషయంలో కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా శిరసావహిస్తాను" అని చెప్పడం తెలంగాణ ఉద్యమం, అది సహాయనిరాకరణ ఉద్యమం సాధించిన విజయం. అయితే ఈ సహాయ నిరాకరణ ఉద్యమం కొనసాగుతూనే ఉంటుందని జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కొదండరాం ప్రకటించిండు.

తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటున్న ఉద్యోగుల మీద క్రమశిక్షణ చర్యలు తీసుకునే విధంగ ప్రభుత్వాన్ని ఆదేశించాలని అనంతపురం జిల్లాకు చెందిన పి.

నారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిండు.

సహాయనిరాకరణ ఉద్యమం వల్ల ప్రభుత్వానికి దాదాపు 3వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని, ప్రజా సంక్షేమం కుంటుపడిందని సీమాంధ్ర ప్రభుత్వం కపటనాటకం ఆడింది. అయినా ప్రజలు వెనకడుగు వేయలేదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద తీవ్రమైన ప్రభావం చూపిన సహాయ నిరాకరణ ఉద్యమం మిలియన్ మార్చికి బాటలు వేసింది.

# మిలియన్ మార్చ్

డిసెంబర్ 9 ప్రకటనను వెనకకు తీసుకున్న ప్రభుత్వాల మెడలు వంచాలని తెలంగాణ ఉద్యమకారులు పెద్దఎత్తున ఉద్యమ ప్రణాళికను ముందుకు తీసుకొచ్చింద్రు. ప్రజల డిమాండ్ మేరకు భాగస్వామ్య పక్షాలు రాజీనామ చేయాలని తెలంగాణ జెఎసి కోరింది.

ఫిబ్రవరి 14న తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యులు రాజీనామాలకు సిద్దమైంద్రు. ఉస్మానియా విద్యార్థుల మీద పోలీసులు కాల్పులు జరుపుతనే ఉన్నరు. టి.ఆర్ఎస్‌లోని 10మది, ఒకరు టి.డి.పి. ఒకరు బిజెపి సభ్యులు రాజీనామ చేసింద్రు. గన్‌పార్క్ అమరవీరులకు నివాళి అర్పించి గవర్నర్‌కు రాజీనామ లేఖలను సమర్పించింద్రు.

ఈ ఉద్రిక్త పరిస్థితుల నుంచి కొంతకాలం ప్రశాంతంగ ఉండాలని కేంద్రం శ్రీకృష్ణ కమిటీని ప్రకటించినప్పటికీ, పరిస్థితి సద్దుమణగలేదు సరికదా తెలంగాణ ఉద్యమం రోజురోజుకు ఉధృతమై ఉక్కిరిబిక్కిరి చేసింది.

జగన్ ఓదార్పు యాత్రలు జరుగుతున్నయ్. తెలంగాణ వాదులు జగన్ హెచ్చరించిద్రు. వరంగల్‌లో అడుగు పెట్టనియ్యమని శపథం చేసింద్రు.

2010 మే 28న ఎంతమంది చెప్పినా వినకుండ జగన్ ఓదార్పుయాత్ర పేరుతో వరంగల్ జిల్లా మానుకోటకు బయలు దేరిండు. జగన్‌ను అడ్డుకునేందుకు వేల సంఖ్యలో తెలంగాణ వాదులు, ఉద్యమకారులు మహబూబ్‌బాద్ చేరుకుంద్రు. భువనగిరిలోనే విద్యార్థులు, ఉద్యమకారుల చెమటలు పట్టించింద్రు. తెలంగాణ వాదులు మానుకోట రైల్వేస్టేషన్‌లో పెద్దఎత్తున గుమిగూడింద్రు. జగన్‌తో పాటు ఆయన అనుచరులు భూమన కర్ణాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కొండా సురేఖ, కొండా మురళి తదితరులు రైల్వేస్టేషన్ వెయిటింగ్ రూంలో ఉన్నరు. ఒక్కసారిగ 'జగన్ గోబ్యాక్' అన్న నినాదాలతో పెద్దఎత్తున వెయిటింగ్ రూంలోకి దూసుకొచ్చే ప్రయత్నం చేసింద్రు. కాంగ్రేసు గూండాలు తెలంగాణ ఉద్యమకారుల మీద దాడికి దిగింద్రు. వెంటనే రెండవ ప్లాట్‌ఫాం మీద నుంచి ఉద్యమకారలు రాళ్ళదాడి చేసింద్రు. స్టేషన్ ధ్వంసం చేసింద్రు. పోలీసలు కాల్పులు జరిపింద్రు. నలభై నిమిషాల పాటు ఒకవైపు కాల్పులు, మరోవైపు నుంచి రాళ్ళదాడితో మానుకోట స్టేషన్ యుద్దరంగాన్ని తలపించింది.

దాదాపు 13మందికి తూటాలు తగిలి గాయపడ్డరు. ముప్పయ్ మందికి పైగ రాళ్ళదాడిలో గాయపడ్డరు. తీవ్రంగ గాయపడ్డ బొందకోల ఫౌల్‌రాజ్‌ని ఆస్పత్రికి తరలించడంతో బ్రెయిన్ డెడ్ అయినట్టు డాక్టర్లు ప్రకటించిండ్రు. దీంతో ఉద్యమకారుల్లో ఉప్పొంగిన ఆవేశం దొంగ నాయకుల కాన్వాయ్ మీద రాళ్ళ వర్షం కురిపించింది. జగన్‌కు సంబంధించిన ఒక కారుకు నిప్పు పెట్టిండ్రు. ఈ విధంగ జగన్ హైద్రాబాద్ చేరే దాక వెంటబడి తరిమిండ్రు. పోలీసు కాల్పులకు వ్యతిరేకంగ ఉద్యమకారులు రాస్తారోకోలు చేసిండ్రు. జగన్ దిష్టిబొమ్మలను తగలబెట్టిండ్రు. జిల్లా వ్యాప్తంగ 144 సెక్షన్ విధించి పరిస్థితిని అదుపులోకి తెచ్చిండ్రు. రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి విషయం కేంద్రప్రభుత్వ దృష్టికి పోయింది. ఈ సంఘటనను సోనియాగాంధీ తీవ్రంగ పరిగణించింది. జగన్ వ్యవహారాన్ని తప్పు పట్టింది. జగన్ ఓదార్పుయాత్రతో తెలంగాణలోని మానుకోట మరోసారి రక్తసిక్తం అయింది. తెలంగాణలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడానికి ఘంటా చక్రపాణి చొరవతో ఆత్మహత్యల నిరోధానికి ఒక కమిటి ఏర్పాటయ్యింది. జిల్లాలలో ప్రత్యేక సమావేశాలు, విద్యార్థులకు కౌన్సిలింగ్ వంటి కార్యక్రమాలు జరిగినయి. మరో వైపు ధూం–ధాం కార్యక్రమాలు పల్లె పల్లెకు విస్తరించినయి. ఎన్.శంకర్ సినిమా జైబోలో తెలంగాణ ఉద్యమంలో ఒక భాగమైంది. రసమయి బాలకిషన్ తీసిన 'జై తెలంగాణ' సినిమాలు విరివిగా ప్రజలను ఆకర్శించినయి. తెలంగాణ సినిమా జెఎసి కూడ ఏర్పడింది.

2011 మార్చి 10న జె.ఎ.సి మిలియన్ మార్చ్‌కు పిలుపునిచ్చింది. పోలీసులు ఎన్ని రకాలుగ నిర్బంధించినా ప్రజలు కదం తొక్కి కదిలిండ్రు. తెలంగాణ రాష్ట్రాన్ని డిమాండ్ చేసిండ్రు. మిలియన్ మార్చ్‌కి బయలుదేరిన వాళ్ళని ఎక్కడికక్కడ అరెస్టు చేసిండ్రు. ఒక్క హైద్రాబాద్‌లోనే 10వేల మందిని అరెస్టు చేసిండ్రు. పరీక్షలకు వెళ్ళే ఇంటర్ విద్యార్థులను కూడ అరెస్టు చేసిండ్రు. ప్రభుత్వం ఎంత నిర్బంధం విధించినా ముండ్ల కంచెలను, పోలీసులను దాటుకొని ఉద్యమకారులు, తెలంగాణ బిడ్డలు ట్యాంక్‌బండ్ మీదికి చేరిండ్రు. న్యూడెమోక్రసీ కార్యకర్తలు పెండ్లిబృందం వేశధారణలో పోలీసు నిర్బంధాలను దాటుకొని గమ్యాన్ని ముద్దాడిండ్రు. విద్యుత్ ఉద్యోగులు సైతం ట్యాంక్‌బండ్ మీద కదందొక్కిండ్రు. పోలీసులు కోదండరాంతో పాటు అరెస్టు చేసిన ఉద్యమకారులందరిని విడిచిపెట్టాలని లేదంటే విధ్వంసం చేస్తామని హెచ్చరించిండ్రు. పోలీసుల దుందుడుకు చర్యల వల్ల విద్యార్థులు, యువకులు ట్యాంక్‌బండ్ మీద ఉన్న ఆంధ్రోళ్ళ విగ్రహాల్ని కూల్చేసే పనిలో పడ్డరు. ఎన్ని ప్రయత్నాలు చేసినా విగ్రహాలు కూల్తలేవు. ఇంతలో నల్లగొండ నుంచి వచ్చిన విద్యుత్ ఉద్యోగులు పామర్తి



కరెంట్‌రావు, పొట్టబత్తుల శ్రీనివాస్, అంజయ్య, ప్రసాద్, జంజిరాల వెంకన్నలతో పాటు మరికొందరు కరెంటుపోల్లు ఎత్తిన అనుభవంతో పక్కనే ఉన్న నీళ్ళపైపును వొడిబెట్టి విగ్రహాల తలకాయకు సుట్టి నేలకు గుంజింన్రు. సీమాంధ్ర సర్కారు నిర్బంధానికి సహనం కోల్పోయిన విద్యార్థులు, ఉద్యమకారులు ఆవేశంతో విగ్రహాలను ధ్వంసం చేసిన్రు. సిద్దేంద్రయోగి, ఆర్దర్‌కాటన్, ముట్నూరి కృష్ణారావు, కందుకూరి వీరేశలింగం, అన్నమాచార్యులు, ఎర్రాప్రగడ, బళ్ళారి రాఘవ, శ్రీకృష్ణదేవరాయలు, బ్రహ్మనాయుడు, గురజాడ అప్పారావు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, త్రిపురనేని రామస్వామి చౌదరిల విగ్రహాలను కూల్చేసిన్రు. ఆ దృశ్యాలను చిత్రీకరిస్తున్న కెమెరాలను గుంజుకొని హుస్సేన్‌సాగర్‌లో విసిరేసిన్రు. కొన్ని విగ్రహాలను రోడ్ల మీద ఈడ్చిన్రు. కొన్నింటిని సాగర్‌లో నిమజ్జనం చేసిన్రు. శ్రీశ్రీ, సి.ఆర్.రెడ్డి, నన్నయ వేమన, తిక్కన విగ్రహాలను కొంతవరకు ధ్వంసం చేసిన్రు. 20 కెమెరాలు ధ్వంసం అయినయి. ఒక ఓబివ్యాన్‌ను తగలబెట్టిన్రు. ఏసిపి చక్రపాణి జీపును ధ్వంసం చేసిన్రు.

సాయంకాలం 5గంటలకు కోదండరాంకు జేజేలతో స్వాగతం పలికిన్రు. ఓ.యు.లో పోలీసులకు, విద్యార్థులకు మధ్య యుద్ధవాతావరణం కొనసాగింది. రాళ్ళ వర్షం కురిసింది.

ట్యాంక్‌బండ్ మీదికి వస్తున్న మధుయాష్కి, కేశవరావులను అడ్డుకున్నరు. మధుయాష్కి మీద దాడి కూడ జరిగింది.

తెలంగాణ నాయకుల మీద ఉద్యమకారులు కొంత కోపాన్ని ప్రదర్శించినా మిలియన్ మార్చ్ విజయవంతం అయ్యింది.

2011 ఫిబ్రవరి 6న చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని కాంగ్రేస్‌లో విలీనం చేసిండు. మార్చి 12న జగన్ వై.యస్.ఆర్. కాంగ్రేస్ పార్టీని ప్రకటించిండు.

మొయిలి స్థానంలో రాష్ట్ర కాంగ్రేసు వ్యవహారాల ఇంచార్జ్‌గ గులాం నబీ ఆజాద్ వచ్చిండు. మే 19న తెలంగాణ జర్నలిస్ట్‌ల ఫోరం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర 'కలంకవాతు' నిర్వహించింది.

2011 జూన్ 21న ప్రొఫెసర్ జయశంకర్ సార్ కన్నుమూసిండు. తెలంగాణ మొత్తం దుఃఖంలో మునిగిపోయింది.

జూన్ 31 బి.జె.పి కరీంనగర్‌లో జరిపిన పోరుసభలో సుష్మాస్వరాజ్ తెలంగాణ రాష్ట్రాన్ని డిమాండ్ చేసింది.

2012 డిసెంబర్ కేంద్ర హోంమంత్రి చిదంబరం స్థానంలో సుశీల్ కుమార్ షిండే వచ్చిండు.

తెలంగాణ ఉద్యమంలో భాగంగ 12 మంది శాసనసభ్యులు రాజీనామ చేసింద్రు. ఇదే తరుణంలో జెఎసి 'తెలంగాణ ఉద్యమయాత్ర' పేరుతోని రెండు దఫాలుగ బస్సుయాత్ర నిర్వహించింది. ఖమ్మం జిల్లా మణుగూరులో తెలంగాణ ఉద్యమయాత్ర ప్రారంభం అయ్యింది. ప్రజలు పెద్ద ఎత్తున స్పందించి బతుకమ్మలతో స్వాగతం పలికింద్రు. జనం జేజేలు పకలడంతో దీక్ష శిబిరాలు ఉత్తేజం పొందినయి. సహాయ నిరాకరణ, సకలజనుల సమ్మె, మిలియన్ మార్చ్, సంసద్‌యాత్ర, సాగరహారం(తెలంగాణ మార్చ్' సమరదీక్ష, అసెంబ్లీ ముట్టడి, సకలజనభేరి, వంటి ఎన్నో ప్రజా ఉద్యమ కార్యక్రమాల రూపకల్పనతో ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో పడ్డది. ఉద్యోగలు, సింగరేణి, ఆర్టీసి కార్మికులు, విద్యుత్ ఉద్యోగులు, ప్రైవేట్‌రంగంలో పనిచేసేవాళ్ళు ఎందరో ఈ ఉద్యమంలో మమేకమై ముందుకు నడిసింద్రు.

తెలంగాణ ఉద్యమం తీవ్రదశలో ఉన్న ఈ సమయంలో కిరణ్‌కుమార్ రెడ్డి తిరుపతిలో నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలకు ప్రణాళిక సిద్దం చేసిండు. 2012 డిసెంబర్ 27,28,29 తేదీలలో తిరుపతిలో జరిగినయి. తెలంగాణ వాదులు ఈ ఉత్సవాలను బహిష్కరించింద్రు.

## వంటా- వార్పు

తెలంగాణ జెఎసి ఆధ్వర్యంలో 2011 జూన్ 19న హైద్రాబాద్ రోడ్ల మీద



వంటావార్పు కార్యక్రమం జరిగింది. నిత్యం రద్దీగ ఉండే రోడ్లమీద పొయ్యి మండింది.

ఈ కార్యాక్రమం ఆదివారం పొద్దున 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల దాక జరిగింది. కేసీఆర్, ఈటెల రాజెందర్‌లు ఈ కార్యక్రమంలో కుటుంబసమేతంగ పాల్గొని ఉద్యమానికి ఉత్సాహాన్ని ఇచ్చింండ్రు. హైటెక్ సిటీవద్ద జరిగిన కార్యక్రమంలో సినీనటుడు సుమన్ పాల్గొని ఉద్యమానికి సంఘీబావాన్ని ప్రకటించిండు. చార్మినార్ దగ్గర జరిగిన వంటావార్పు కార్యక్రమంలో ప్రొఫెసర్ కొదండరాం, బి.హెచ్.ఇ.యల్.లో కేటీఆర్‌లు పాల్గొన్నరు.

2013 మార్చి 21న జెఎసి సడక్‌బంద్‌కు పిలుపునిచ్చింది.

2013 మే 11న కడియం శ్రీహరి తెలుగుదేశం పార్టీకి రాజినామ చేసిండు. జూన్ 2 కాంగ్రేస్ సీనియర్ నాయకుడు కేశవరావు, మంద జగన్నాథం, వివేక్‌లు టి.ఆర్.ఎస్ పార్టీలో చేరింండ్రు. దీంతో కాంగ్రేసు పార్టీ తీవ్రంగ ఆలోచించింది. భవిష్యత్తులో పార్టీ పరిస్థితి మీద సమీక్ష జరిపింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయం మీద తక్షణమే నిర్ణయం చేయవలసిన అవసరం ఏర్పడిందని గ్రహించింది.

2013 జూన్ 3న హైద్రాబాద్‌లో జరిగిన పార్టీ సమావేశానికి అధ్యక్షుడు రాజ్‌నాథ్ సింగ్ హాజరైండు ఈ సమావేశంలోనే నాగం జనార్ధన్ రెడ్డి తెలంగాణ నగార సమితిని బి.జె.పిలో కలిపిండు. బి.జే.పి ఎన్నికల సారథిగ పార్టీ నరేంద్రమోడిని ప్రకటించింది.

## ఛలో అసెంబ్లీ

ఫిబ్రవరి 21, 2010న విద్యార్థులు తలపెట్టిన 'ఛలో అసెంబ్లి' కార్యక్రమం ద్వార అసెంబ్లీ ముట్టడికి సిద్దమయ్యింది. పొద్దున పదిగంటల కల్లా వేలాది మంది విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకొని జై తెలంగాణ అంటూ నినాదాలతో హోరెత్తించింద్రు. విద్యానగర్ గేటు కాడ బారీగ మోహరించిన పోలీసులు ఎట్టి పరిస్థితిలోను ఒక్క విద్యార్థిని కూడ బయటికి పోనీయకూడదనే లక్ష్యంతో ఉన్నరు. పోలీసులు, విద్యార్థులకు మధ్య వాగ్వివాదం జరిగింది. పోలీసుల వలయాన్ని ఛేదించుకొని ఉరుకుతున్న విద్యార్థులను పట్టుకొని తీసుకొచ్చింద్రు. అరెస్టు చేస్తామంటు బెదిరించింద్రు. విద్యార్థులు తలపెట్టిన ఛలో అసెంబ్లీని విజయవంతం చేయాలంటే ఏదో ఒకటి చేయాలె. సీమాంధ్ర ప్రభుత్వానికి తెలంగాణ సెగ తగిలించాలని ఆలోచనలో మునిగిపోయిన సిరిపురం యాదయ్య ఒక్కసారిగ తన గదిలోనుంచి బయటికి ఉరుకొచ్చిండు. అందరు చూస్తుండగనే ఒంటిమీద కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని మండుతున్న అగ్నిగోళమై పోలీసుల మీదికి ఉరికిండు. సీమాంధ్ర పాలకుల నిరంకుశత్వాన్ని ప్రపంచానికి చాటడం కోసం యాదయ్య మంటల్లో మాడిపోయిండు.

తెలంగాణ రాష్ట్రం కోసం తండ్లాడుతున్న యాదయ్యను మొదట గాంధీ ఆస్పత్రికి తీసుకపోయింద్రు. ఆ తర్వాత కంచన్‌బాగ్‌లోని అపోలో ఆస్పత్రికి తీసుకపోయింద్రు.



హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి విద్యార్థుల నిరసనల నడుమ ఆస్పత్రికి వచ్చి యాదయ్య పరిస్థితిని చూసి ఆవేదన చెందింది. తెలంగాణ బిడ్డల సాహసం ముందు వాళ్ళ అధికారం ఎందుకు పనికిరానిదైందని ఎంతగానో బాధపడ్డది.

ఆవేశంతో రగిలిపోయిన విద్యార్థులు యాదయ్య నింపిన స్ఫూర్తితో వందలాది మంది ఒక్కపెట్టున పోలీసు వలయాన్ని ఛేదించిండ్రు. గేటుని, ముండ్ల కంచెల్ని తొక్కుకుంటు విద్యార్థి శక్తిని ప్రదర్శించిండ్రు. నిజాం కాలేజికి చేరుకున్న విద్యార్థులను అసెంబ్లీ వైపుకు వెళ్ళకుండ ఆపేసింండ్రు. అందరిని అదుపులోకి తీసుకుండ్రు. చింతల్‌బస్తీ డిగ్రీకాలేజ్, సైఫాబాద్ పి.జి.కాలేజ్‌తో పాటు అసెంబ్లీకి వచ్చే అన్ని దారుల్లో పోలీసులు భారీగ మోహరించిండ్రు. ఎక్కడి వాళ్ళను అక్కడ అరెస్టులు చేసింండ్రు. తెలంగాణ జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులను చెక్‌పోస్టులకాడ ఆపేసి ఎక్కడివాళ్ళను అక్కడ్నే అదుపులోకి తీసుకుండ్రు. ఒక్క వరంగల్ జిల్లాలోనే 500 వందలకు పైగా విద్యార్థులను అరెస్టు చేసింండ్రు. హైద్రాబాద్ నగరంలో 550 మంది విద్యార్థులను అరెస్ట్‌చేసి సుదూరప్రాంతాల్లోని స్టేషన్‌లలో నిర్బంధించిండ్రు. హన్మకొండలో కాంగ్రేస్ కార్యాలయాన్ని ధ్వంసం చేసింండ్రు. నల్లగొండ జిల్లా ఆలేరుకు చెందిన బి.టెక్. విద్యార్థి శ్రీనివాస్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుండు. పాతబస్తీలోని సిటీకాలేజ్ దగ్గర పోలీసులకు, విద్యార్థులకు మధ్య ఘర్షణ జరిగింది. రెండు సార్లు లాఠిచార్జ్ చేసింండ్రు. సతీష్ అనే విద్యార్థికి తలపగిలింది. హబ్సిగూడ, రామాంతపూర్‌లలో దుకాణాలను ధ్వంసం చేసింండ్రు. జమై ఉస్మానియాలో బస్సులను తగలబెట్టింండ్రు. ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా, పోలీసులు ఎంత ప్రయత్నం చేసినా విద్యార్థులు ఆసెంబ్లిని ముద్దాడిండ్రు. అలలు అలలుగా తీరాన్ని తాకిన విద్యార్థులు విజయగర్వంతో వీరంగం చేసింండ్రు. ఆ తర్వాత సమావేశమైన విద్యార్థులు ఇప్పుడు చేసుకోవాల్సింది ఆత్మహత్యలు కాదు సీమాంధ్రుల ఆస్తుల మీద దాడులని తలిచి అందుకు సిద్దమై ర్యాలిగ బయలు దేరిండ్రు. పోలీసులను ఎదిరించి తార్నాక సెంటర్‌కు చేరుకుండ్రు. పోలీసులు బాష్పవాయువులు, రబ్బర్‌బుల్లెట్లను ప్రయోగించిండ్రు. విద్యార్థులు రాళ్ళవర్షాన్ని కురిపించిండ్రు. రాళ్ళు ఎక్కడి నుంచి ఎట్ల వస్తున్నయో పోలీసులకు అంతు జిక్కుత లేదు. ఒక రాత్రిదాక ఈ యుద్ధం కొనసాగింది.

సడక్‌బంద్, సంసద్ యాత్రల అనంతరం జూన్ 14, 2013న తెలంగాణ జెఎసి 'ఛలో అసెంబ్లీకి పిలుపునిచ్చింది. దీంతో ఉలిక్కిపడ్డ సీమాంధ్ర ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేసేందుకు అన్ని ప్రయత్నాలు మొదలుపెట్టింది. బైండోవర్లు,

మందస్తు అరెస్టులతో వేలాది మందిని నిర్భంధించింది. ఆదిలాబాద్‌లో మాక్ అసెంబ్లీలు, అర్ధనగ్న ప్రదర్శనలతో జనాన్ని ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి సన్నద్ధం చేసిండ్రు. సిర్పూర్ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య అసెంబ్లీ భవనం మీద నల్లజెండ ఎగరేసి సంచలనం సృష్టించిండు. ఉద్యమ తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం ఒక దశలో బల్క్ ఎస్.ఎం.ఎస్‌లను నిషేదించింది. కరీంగర్‌లో విద్యార్థుల అరెస్టు, గృహనిర్భంధాలతో తిరగబడ్డ ఉద్యమకారులకు పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని ఉంది. హైద్రాబాద్‌లో అనేక చోట్ల లాటీచార్జ్ జరిగింది. మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ జిల్లాలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగినయి. పెన్‌పహడ్ పోలీస్‌స్టేషన్‌లో నిర్భందించిన టీఆర్ఎస్ సూర్యాపేట ఇంచార్జ్ గుంతకండ్ల జగదీష్‌రెడ్డి ఇతర ఉద్యమకారులు స్టేషన్‌లోనే మాక్‌అసెంబ్లీ నిర్వహించిండ్రు. తెలంగాణ వ్యాప్తంగ పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి మొత్తానికి ఏదో రూపంలో హైద్రాబాద్‌కు చేరుకున్నరు.

"మాట ఇచ్చి తప్పుకున్న కేంద్రప్రభుత్వ తీరుకు నిరసనగా చేపట్టిన కార్యక్రమమే ఛలో అసెంబ్లీ" అని జెఎసి నిర్వహించిన 'ప్రజాకోర్టు'లో అడ్వకేట్ జెఎసి చైర్మన్ రాజేందర్ రెడ్డి వాదించిండు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం రాక్షసంగ వ్యవహరించడం వల్లనే ఉద్యమకారులు ప్రజాకోర్టును ఆశ్రయించినట్టు రాజేందర్‌రెడ్డి ప్రజలకు వివరించిండు.

# బతుకమ్మ పండుగ- తెలంగాణ జాగృతి

"బతుకమ్మ తోడున్నది బాధల్లో బరిగీసి నిలువన్నది

తలవంచి బాంచోలె తనువుజాలించక

ఎదిరించమంటున్నది ఏరులా సాగిపొమ్మంటున్నది" ఇది బతుకమ్మ ఇచ్చే సందేశం. ఒక జీవి పుట్టి ఈ భూమ్మీదికొచ్చినంక బతకడమే ప్రధానం.

అది మనిషి కావచ్చు. చిన్న ప్రాణి కావచ్చు దాని మనుగడ కొనసాగాలంటె ముందు బతికుండాలె.

బతుకు అనే నేపథ్యంలో పుట్టిందే బతుకమ్మ పండుగ. ప్రపంచంలో ఎక్కడ లేని ఈ బతుకమ్మ సంప్రదాయం ఒక్క తెలంగాణలోనే ఉంది.

ఎక్కడైన పువ్వుల్ని దేవునికి సమర్పించడం ఉంటది. కాని పువ్వుల్నే దేవతగా కొలిచి పండగ చేయడం ఒక్క తెలంగాణలో మాత్రమే ఉన్నది. అయితే ఈ బతుకమ్మ పుట్టుక గురించి అనేక కథలు,పాటలు ప్రచారంలో ఉన్నయి. అటు విజయనగర రాజులకు సమకాలీనులైన గోల్కొండ నవాబుల పాలనాకాలం నుంచే ప్రజలు బతుకమ్మ పండుగని చేసుకున్నట్టు చరిత్రకారులు ఒక అంచనాకు రావడం జరిగింది. బతుకమ్మ పండుగ సరిగ్గ దసర పండుగకు ముందు రావడం, ఈ పండుగలో భాగంగ ఆయుధపూజ చేయడం, యుద్ధానికి వెళ్ళినవాళ్ళు తిరిగి బతికి రావాలని కోరుకోవడం వంటి విశిష్ట లక్షణాలు విజయనగర రాజుల కాలంలోనే ఎక్కువగ కనిపిస్తయనేది



చరిత్రచెప్పిన నిజాలు. అదే క్రమంలో భక్తి ఉద్యమంలో భాగంగ ఊరూర రామాలయాల నిర్మాణం జరిగింది. ఈ ప్రభావమే గోల్కొండ రాజ్యంలో కూడ విస్తరించింది. గోల్కొండ కుతుబ్‌షాహీల పరిపాలనకాలంలో తెలంగాణలో వైష్ణవభక్తి ప్రభావంతో లెక్కలేనంత సాహిత్యం వచ్చింది. పొన్నగంటి తెలగనార్యుడు ఇబ్రహీం కుతుబ్‌షాహి మంత్రి అమీనుఖాన్‌కు సమర్పించిన యయాతిచరిత్రలో రామాయణ కథ ఉన్నది. అదేవిధంగ అబుల్‌హసన్ తానీషా కాలంలో భద్రాచలంలో రామాలయ నిర్మాణం జరిగింది. ఈ విధంగ గోల్కొండ నవాబుల పాలనాకాలంలోనే తెలంగాణ అంతట గుళ్ళు, గోపురాలు కట్టించడమే కాకుండ దసర ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహించడం జరిగింది. ఈ ఉత్సవాలలో భాగంగ జానపదులు కోలాటం, చిడతల భజన, యక్షగానం వంటి కళారూపాలలో రామాయణ చరిత్రని ఇతివృత్తంగా తీసుకొని పద్యాలు, శ్లోకాలు పాడడం జరిగింది. ఇట్లాంటి సందర్భంలో స్త్రీలకు అతి తక్కువ ప్రమేయం ఉంటుంది కాబట్టి బతుకమ్మ పండుగ సంప్రదాయాన్ని తీసుకొచ్చిండ్రు.

ఈ గుడి గోపురాలలో ఉండే దేవతల కన్న అమ్మతల్లి, ఆదిశక్తి వంటి గ్రామీణ దేవతలను పూజించిన మానవ సమాజం ప్రకృతినే దేవతగా ఆరాధించింది. సహజంగ జానపదులు ఆచరించిన ప్రతి సంప్రదాయంలోను గొప్ప శాస్త్రీయత ఉంటుంది. ఆరోగ్యానికి సంబంధించిన జాగ్రత్త ఉంటుంది.

పిల్ల-జెల్ల, గొడ్డు-గోద, పురుగు-పుట్ర అనకుండ మొత్తం గ్రామాన్ని కాపాడే గ్రామదేవతలు శక్తిస్వరూపులై బలిని కోరుకుంటరు. కాని బతుకమ్మ బలిని కోరుకోదు. బలి కాకుండ కాపాడుతుంది.

తొమ్మిది నెలలు మోసి ఒక బిడ్డకు జన్మనిచ్చిన స్త్రీ తన బిడ్డ బతకాలనే కోరుకుంటుంది. యుద్ధంలో వీరుడై విజయుడై తిరిగి రావాలనే ఒక స్త్రీ కోరుకుంటుంది. తన పసుపు కుంకుంమలు కలకాలం ఉండాలంటే యుద్ధంలో తన భర్త బతికి రావాలె. ఇట్ల బతుకుతో ముడిపడి ఉన్న పండుగ బతుకమ్మ. కులానికి, మతానికి, ప్రాంతానికి సంబంధం లేకుండ ఈ లోకమంత పచ్చగ బతకాలని, నిండు నూరేండ్లు సౌభాగ్యంతో వర్థిల్లాలని కోరుకునే గొప్ప పండుగ బతుకమ్మ.

పూర్వం ధర్మాంగదుడనే చోళరాజుకు గల వందమంది కొడుకులు యుద్ధంలో చనిపోతరు. ధర్మాంగదుడు, సత్యవతి దంపతులు మళ్ళీ సంతానం కోసం లక్ష్మీదేవి కోసం తపస్సు చేసి లక్ష్మీదేవినే బిడ్డగా పుట్టాలని కోరుకుంటరు. అట్ల ఆ చోళరాజు ఇంట్లో పుట్టిన లక్ష్మీదేవిని మునిపుంగవులు బతుకమ్మ అని ఆశీర్వదించినట్టు కాలక్రమంలో లక్ష్మీదేవే బతుకమ్మ అయినట్టు ఒక కథ ప్రచారంలో ఉన్నది. అదే

విధంగ మరో కథలో ఒక చెల్లె తన తోడబుట్టిన అన్న ఇంటికి వస్తది. అన్న ఇంట్లో లేకపోవడంతో చెరువు కాడికి స్నానం జేస్తందుకు పోయిన వొదినె, మరదళ్ళు గొడవపడి నూకేసుకోవడంతో మరదలు చెరువులో పడి చనిపోతది. ఇంటికి వచ్చిన అన్న తన చెల్లెలు ఏదని అడిగితే వెళ్ళిపోయిందని సమాధానం చెప్తది. భార్య ప్రవర్తన మీద అనుమానం ఉన్న అన్న బాధపడుతూ పండుకుంటడు. అప్పుడు తన చెల్లెలు కలలోకి వచ్చి వదినె చెర్లో నూకేసిన సంగతి చెప్తది. పొద్దున్నే చెరువు గట్టుమీద తంగేడు చెట్టయ్ మొలిచిన చెల్లెలు బతుకమ్మ పూవులో నన్ను పేర్చి ప్రతియేడు చెర్లో పడేయమని చెప్పి మాయమైతది. అందుకే బతుకమ్మ పూలలో తంగేడు పువ్వుకు అంత ప్రాధాన్యం ఇస్తరనే విషయాన్ని ఈ కథ ప్రచారం చేసింది. వాస్తవానికి తంగేడుపువ్వులో నీటిని శుద్ధిచేసే గొప్ప ఔషధీయ గుణం ఉంటుందని ఆయుర్వేదశాస్త్రం ఎప్పుడో చెప్పింది. తంగేడు, జిల్లెడు, గునుగు, గుమ్మడి వంటి రకరకాల పూవులు, గుమ్మడి, ఆనకాయ, ఆముదం వంటి ఆకులతో పేర్చిన బతుకమ్మను చెరువు కుంటల్లో నిమజ్జనం చేయడం వలన నీటి శుద్ధి జరుగుతుంది. దీనివల్ల పశుపక్ష్యాదులు, సకలజీవులకు ప్రాణాధారం అయితుందనే భావన జానపదుల్లో నేటికి ఉన్నది. అంతేకాకుండ తంగేడు బెరడు తోలును శుభ్రపరిచే ప్రక్రియలో ఉపయోగించడాన్ని బట్టి దీనికి మరింత బలం చేకూరుతుంది.

అయితే బతుకమ్మ పండుగకు మరింత దగ్గర ఉండే మరో రెండు మూడు కథలు నేను డిగ్రీ చదివేటప్పుడు మా అమ్మమ్మ చెప్పింది. అవి ఒకటి వానదేవుని కథ. నేను దీన్ని ఐదొద్దుల ఆనపాటగా రాసి రికార్డు చేయడం జరిగింది. ఈ పాట "కన్నెపిల్లలార వలలో సన్నజాజులార వలలో" అనే పల్లవితో మొదలైతది. దీన్ని తేలు విజయ పాడింది. బతుకమ్మ ఇతి వృత్తాన్ని చెప్పే మరో పాటని నేనే కైగట్టడం జరిగింది. ఈ పాట బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారి గౌరమ్మ ఉయ్యాలో" అనే పల్లవితో మొదలైన దీన్ని రమాదేవి పాడింది. ఈ పాటల్ని 2003లో పుస్తకంగ ప్రచురించినప్పటికి 2006లో రికార్డు చేయడం జరిగింది. ఈ మధ్యకాలంలో బతుకమ్మ పండుగకు మరింత దగ్గరగ ఉందనిపించే మరో కథను ఆధారం చేసుకొని కొత్త పాట రాయడం జరిగింది. ఆ పాటకు ఆధారమైన కథ ఏందంటే, సీతాదేవి తన ప్రాతివ్రత్యాన్ని నిరూపించుకోవడం కోసం మంటల్లో దూకినప్పుడు ఆమెను గమనించిన పార్వతి దేవి ఆ మంటలనుంచి కాపాడుతది. ఆకులు, పూలను ఏరుకొచ్చి తన శరీరానికి పూర్వపు అందాన్ని అద్దుతది. అదేవిధంగ రాముడు తన భార్య సీతను అనుమానించి అవమానించినందుకు క్రుంగి కుశించిపోయి చావుకు దగ్గరైన

సందర్భంలో పార్వతిదేవి లోకమాతగ శ్రీరాముని చెంతకు చేరి సీత విషయంలో జరిగిన కథను చెప్పి శ్రీరాముడిని కాపాడి సీతతో కలుపుతది. ఈ విధంగా సీతను బతికించిడంతో పాటు తన భర్తను కాపాడి పసుపు కుంకుమలు నిలబెట్టినందుకు గాను పార్వతిదేవిని ఆకులు, పూలతో పాటు పచ్చని పసుపుముద్దగా చేసిన గౌరమ్మగ బతుకమ్మ పండుగను భూలోకంలో చేస్తరు అదే సంప్రదాయంగ సకలజనులు బతుకమ్మ పండుగను ఆటపాటలతో అంగరంగ వైభవంగ చేస్తరు. ఈ విధంగ బతుకమ్మ పండుగ సంప్రదాయం జానపదుల్లో ముఖ్యంగ తెలంగాణలోనే బొడ్డెమ్మ, బతుకమమ్మ వంటి పేర్లతో ఈ ఆచారం నేటికి కొనసాగుతుంది.

"ఏ ప్రాంతంలోనైన ఏ దేశంలోనైన ఆయా సంస్కృతుల్ని నిలబెడుతున్నది స్త్రీలే, బతుకమ్మను మగవాళ్ళు ఆడవచ్చు. నాకైతే బతుకమ్మను ఆడటానికి, పాడటానికి అభ్యంతరం లేదు" –ప్రొఫెసర్ జయశంకర్ సార్.

ఈ పండుగల్లో సమకాలీన అంశాలు ముఖ్యంగ విషాదాంతాలను ఇతివృత్తంగ తీసుకొని జానపద స్త్రీలు అనేక పాటల్ని కైగట్టి పాడటం కూడ తెలంగాణ నేలకే సొంతమైంది. గంగ గౌరి సంవాదం, సీతారాముల ఎడబాటు, రైలు ప్రమాదాల వంటి అనేక సంఘటనల మీద కూడ పాటలు పుట్టుకొచ్చినయి. వలలో, ఉయ్యాలో, కోల్, సందమామ వంటి మకుటాలతో అలవోకగ పాడుకుంటుపోయే ఒక గొప్ప లయాత్మకత బతుకమ్మ పాటల్లో ఉంటది.

తంగేడు, గునుగు, సోంపు, కట్లపూలు, గుమ్మడి, జిల్లేడుపూల వంటి అనేక రకాల గడ్డిపూలు మాత్రమే బతుకమ్మను పేర్చడానికి ఉపయోగిస్తరు. అదేవిధంగ బతుకమ్మ నాడు చేసే ఫలారాలు ప్రధానంగ సజ్జ, జొన్న, రాగి, పెసర వంటి అతి సునాయసంగ చేయగలిగేవి ప్రతి ఇంట్లో ఉండే ఎంతో కొంత వరకు ఉండే ధాన్యంతో మలీదముద్దలు చేసి పంచిపెట్టడం ఆనవాయితీ. ముఖ్యంగ చెరువుల్లోకి వచ్చిన నీటిని సైతం శుభ్రపరిచే గుణం తంగేడు, గునుగు, జిల్లేడు పూలకు ఉంటుందని తర్వాత పరిశోధనల ద్వార తెలిసింది. ఈ విధంగ చెరువు నీటి మీద ఆధారపడి బతికే సకల జీవులకు ఏ విధమైన ప్రాణహాని లేకుండ చేయగల సామర్ధ్యం బతుకమ్మ పూలకు ఉంటుందనేది వాస్తవం. ఇట్లా బతుకమ్మ పండుగ వల్ల కలిగే ఎన్నో లాభాలు స్త్రీలు ఆనందంగ అందరు కలిసి మనసు విప్పి మాట్లాడుకోవడం,పాటల ద్వార తమ భావాల్ని బయటికి వ్యక్తం చేయడం వంటి ఒక అద్భుతమైన సామాజిక మాధ్యమం బతుకమ్మ. బతుకమ్మ పండుగ ఒక్కటి చాలు సమాజం తన సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పడానికి అనే విషయాన్ని అందరు ఒప్పుకొని తీరాల్సిందే.

భర్తను కోల్పోయిన స్త్రీలు కూడ బతుకమ్మని పేర్చడంలో సాయపడతరు. పాటలు పాడతరు. వేరే ఇంకెక్కడ ఏ పండగలోను వీళ్ళకు ఇంతటి గౌరవప్రదమైన స్థానం ఉండదు. మగవాళ్ళు సైతం బతుకమ్మను పేర్చడంలోను, పువ్వు తేవడంలోను సాయం చేస్తరు. ఇంటిల్లిపాది ఏ విధమైన తారతమ్యం లేకుండ ఆనందంగ చేసుకునే పండగ బతుకమ్మ. తల్లి బతుకమ్మ, పిల్ల బతుకమ్మ రెండు చేస్తరు. ఒంటరి బతుకమ్మ ఉండదు. బతుకమ్మను చెరువుల్లో నిమజ్జనం చేసేది మగవాళ్ళే. పెత్తరమాస మొదలు సద్దుల బతుకమ్మ దాక సందడి చేసే బతుకమ్మ పండగంటే తెలంగాణకు ఎక్కడలేని ఆనందం ఈ ఆనందాన్ని అర్థం చేసుకున్న మన ప్రభుత్వం బతుకమ్మని, బోనాల పండుగని రాష్ట్ర పండుగగా చేసింది. తంగేడు పువ్వుని రాష్ట్ర పువ్వుగా చేసింది. ఇంతటి గౌరవాన్ని కల్పించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నిజంగ జనం మనిషి. ప్రజా నాయకుడు.

బతుకమ్మను పేర్చే విధానం కూడ అద్భుతమైనది. పిరమిడ్‌లాగ, పర్వతం లాగ ఉంటది. హిమవంతుని బిడ్డ అయిన పార్వతి దేవి ఆకారం ఇదే అని చెప్పడంతో పాటు ఆ పిరమిడ్ ఆకారాన్ని నెత్తిలో పెట్టుకున్న వాళ్ళకు బతుకమ్మను మోసినంత సేపు సర్వశక్తులు ఆమె ఒంటిలో చేరతాయని, శరీరంలోని రుగ్మతలు దూరమైతయనే శాస్త్రీయ ఆలోచన కూడ బతుకమ్మలో ఉన్నది.

తెలంగాణ రాష్ట్ర సమితి స్థాపించిన నాటి నుంచి అనేక ఉద్యమాలు జరుగుతున్నయి. రాజకీయాలతో ఎలాంటి సంబంధంలేని కల్వకుంట్ల కవిత పెళ్ళిచేసుకొని అమెరికాలో దాదాపు స్థిరపడ్డది. అయితే 2004లో భారతదేశానికి వచ్చినప్పుడు తెలంగాణలో జరుగుతున్న రాజకీయాలను, ఉద్యమ నేపథ్యాన్ని అర్థం చేసుకున్న కవిత 2006 నాటికి ఉద్యమంలో స్త్రీల భాగస్వామ్యం లేదన్న విషయాన్ని గుర్తించింది. తెలంగాణ ఉద్యమంలో స్త్రీలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగ 2007లో తెలంగాణ జాగృతి సంస్థను స్థాపించింది.

తెలంగాణ మలివిడత ఉద్యమంలో బతుకమ్మ పోరాట రూపమెత్తింది. తెలంగాణ ఉద్యమ పాటలో మమేకమైంది. తెలంగాణ జాగృత్తి అధ్యక్షురాలు, ప్రస్తుత నిజాంబాద్ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత బతుకమ్మను బంగారు బతుకమ్మ స్థాయికి తీసుకొచ్చింది.

"ఆర్థికంగ, రాజకీయంగా నష్టపోతే పుంజుకోవచ్చు కాని సాంస్కృతికంగ నష్టపోతే పుంజుకోలేం" –ప్రొఫెసర్ జయశంకర్ సార్.

ఆ మాటల్ని అక్షరాల పాటించి తెలంగాణ సంస్కృతిని బలోపేతం చేయడం

కోసం, ముఖ్యంగ సమాజంలో సగభాగమైన స్త్రీలు తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములు కావాలన్న ఆలోచన మేథావుల్లో మొదలైంది. తెలంగాణలో స్త్రీలు అత్యంత భక్తిశ్రద్ధలతో, నిరాడంబరంగ జరుపుకునే బతుకమ్మ పండుగ ఒక ఉద్యమ నినాదంగ మారింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జాగృతి సంస్థ ద్వార తెలంగాణ చరిత్రను ప్రజలకు అందించడం కోసం విలువైన పుస్తకాలను ప్రచురించింది. అదేవిధంగ బతుకమ్మ పండగను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకొచ్చింది. అప్పటి వరకు గ్రామాలలో బతుకమ్మలు అందరు చేసేవాళ్ళు కాదు. కాని జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను చేయడం మొదలు పెట్టిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఆనందంగ అందమైన పూలతో బతుకమ్మలను పేర్చింద్రు.

మొదటి సారి 2008లో "తెలంగాణ కోటి బతుకమ్మల జాతర" పేరుతో తెలంగాణలోని స్త్రీలందరిని ఒక వేదికమీదికి తెచ్చే ప్రయత్నం చేసింది. ప్రజలు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నరు. స్త్రీలు, పిల్లలు పెద్దఎత్తున పెత్తరామాస నాడు ఎంగిలిపువ్వ బతుకమ్మతోమొదలు తొమ్మిదిరోజుల బతుకమ్మ జాతర సద్దుల బతుకమ్మ నాడు హైద్రాబాద్ ట్యాంక్‌బండ్ మీద అంగరంగ వైభవంగ ఆడి పాడి బతుకమ్మను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేసే అధ్భుతమైన కార్యక్రమంతో బతుకమ్మ ఒక ఉద్యమంగ వచ్చింది.

తెలంగాణ సంస్కృతిని చిన్నచూపు చూసిన ఆంద్రోళ్ళను ఈ గడ్డనించి వెళ్ళగొట్టడమే లక్ష్యంగ ఉద్యమం ఎగిసిపడింది. జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ పదిజిల్లాలలో బతుకమ్మ ఉత్సవాలు జరిగినయి. హైద్రాబాద్ చరిత్రలో ఈ ఉత్సవం ఒక పెద్ద మార్పుకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ మట్టి ప్రతి అణువులో జై తెలంగాణ అన్న నినాదం తప్ప వేరే శబ్ధం లేదు. చెట్టు పుట్టలు, వాగు,వంకలు తెలంగాణ కోసం పరితపిస్తున్నట్టుగ నేల నేలంత పూలతేర్లై పల్లె, పట్నం అనే తేడా లేకుండ "జై తెలంగాణ" నినాదం బతుకమ్మ పాటలో మమేకమైంది.

బండారు సుజాతశేఖర్ బతుకమ్మ పాటనే తన పరిశోధనాంశంగ పి. హెచ్. డిని పూర్తి చేసింది. విమల, రమాదేవి, తేలు విజయ, స్వర్ణ, పద్మ, మల్లిక, లావణ్య వంటి ఎందరో గాయనీమణులు బతుకమ్మ పాటల్ని అధ్భుతంగ గానం చేసింద్రు. ఈ విధంగ తెలంగాణ జాగృతి చేపట్టిన ఈ బతుకమ్మలు క్రమంగ ఉద్యమంలో పెద్ద ఎత్తున స్త్రీలు పాల్గొనే అవకాశం కలిగించింది. ఇది కేవలం ఆ పండగ సంధర్భంలోనే కాకుండ ఎక్కడ తెలంగాణ ధూంధాం జరిగితే అక్కడ, ఎక్కడ తెలంగాణ సభ జరిగితే అక్కడికి స్త్రీలు పెద్దఎత్తున బతుకమ్మలు, బోనాలను స్వాగతంగ తీసుకొచ్చి బొట్టుపెట్టి

ఆహ్వానించేవారు. ఒక గొప్ప సాంస్కృతిక వైభవం తెలంగాణ జాగృతి బతుకమ్మ ద్వార తీసుకొచ్చింది.

తెలంగాణ జాగృతి 'కోటి బతుకమ్మల జాతర' పేరతో సెప్టెంబర్ 26, 2010న పాటల సి.డి., పోస్టర్‌ని ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేతుల మీదుగ ఆవిష్కరించింది. ఈ సంవత్సరం అక్టోబర్ 7న నల్లగొండ జిల్లా సూర్యాపేటలో మొదలైన కోటి బతుకమ్మల జాతర 15వ తేదీన హైద్రాబాద్ ట్యాంక్‌బండ్ మీద జరిగే సద్దులబతుకమ్మ పండుగతో ముగుస్తుందని ప్రకటించింది. ఇట్ల తెలంగాణ రాష్ట్రం వచ్చేంతవరకు బతుకమ్మ పోరాట బతుకమ్మగా ఆ తర్వాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో బంగారు బతుకమ్మగా ఆవిర్భవించింది. బంగారు తెలంగాణ నిర్మాణంలో స్త్రీలను భాగస్వాములను చేసే దిశగ బతుకమ్మ కదిలింది.

# తెలంగాణ పాటల ధూం-ధాం

తెలుగు సాహిత్యంలో తెలంగాణ జానపద సాహిత్యానికి ఎంతో విశిష్ఠత ఉన్నది. జానపద సాహిత్యంలో గాని, శిష్ట సాహిత్య రచనల్లో గాని తెలంగాణకు ఒక ప్రత్యేక శైలి ఉన్నది. జానపదుల మాటల్లోనే కవిత్వ పరిభాష ఉంటది. అట్లాంటి తెలంగాణ మట్టిలో పుట్టిన పాట సాహిత్య ప్రక్రియల్లో ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. అన్ని వర్గాల ప్రజలను ప్రభావితం చేసిన ఘనత పాటకే దక్కింది. ఈ నేల మీద పుట్టిన ప్రతి ఉద్యమంలోను పాట ప్రధాన భూమికను పోషించింది. 1952లో జరిగిన ముల్కీ ఉద్యమంలో గద్యరచన ప్రభావం ఉన్నట్టు కనిపిస్తది.

ఆంధ్ర దోపిడికి వ్యతిరేకంగ 1969లో ప్రారంభమైన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉధృతంగ సాగింది. సి.ఆర్.పి.ఎఫ్. ఎపిఎస్‌పి దాడులతో రక్తసిక్తమైంది. లాఠీచార్జీలు, తుపాకీ కాల్పులు ప్రతి నిత్యం పెరిగినయి. పాఠశాలలు, కళాశాలు సినిమా థియేటర్లు కూడ జైళ్ళుగ మారినయి. 1969-71 మధ్య కాలంలో 370 మంది చనిపోయిండ్రు. 1946-51, 1968-72 సంధర్భలలో తెలంగాణప్రజానీకం వీరోచితంగ పోరాడింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని అణిచేయడంలో కాంగ్రేసుకు సి.పి.ఐ.,సి.పి.యం.,లు



ఇతోధికంగ సహకరించినయి. సమైక్య రాగాన్ని ఆలపించినయి.

1969 తెలంగాణ పోరాట సమయంలో కొంతవరకు పద్యరచనల ప్రభావం మొదలైంది.

"కవనాన కుత్తుకల నవలీల నుత్తరించగ
బలోన్మత్తులేలిన భూమి
వీరులకు కాణాచిరా తెలంగాణ
ధీరులకు మొగసాలరా" –రావేళ్ళ వెంకటరామారావు అంటూ తెలంగాణ శక్తిని గానం చేసిండు.

"తెలంగాణ వేరైతే దేశానికి ఆపత్తా
తెలంగాణ వేరైతె తెలుగుభాష మరుస్తరా
తెలంగాణ వేరైతె చెలిమి తుట్టె పడుతుందా
వానపడక ఉంటుందా
చెలిమెలెండిపోతయా" అంటూ కాళోజీ నారాయణరావు తెలంగాణ వేరైతే ఈ దేశానికి వచ్చే ఆపదేమి లేదని చాటి చెప్పిండు.

"మన కొంపలార్చినా మన స్త్రీల చెరిచినా
మన పిల్లలను చెరిచి మనల బంధించినా
మానవాధములను మండలాధీశులను
మరిచిపోకుండగ గుర్తుంచుకోవాలె
కసిఆరిపోకుండ బుసకొట్టుచుండాలె
కాలంబు రాగానే కాటేసి తీరాలె" అంటూ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల మీద తిరుగుబాటు చేయడానికి తగిన సమయం కోసం వేచిచూడాలని అంటాడు కాళోజీ నారాయణ రావు.

ఆ తర్వాత వచ్చిన విప్లవోద్యమం స్త్రీవాద, దళిత ఉద్యమాలలో పాట ప్రభవించింది. ఉద్యమాల వైపు ప్రజలను ఆకర్శించింది. పాట పదునైన ఆయుధమైంది. అట్ల విప్లవోద్యమ ప్రభావం నుంచి ఆవిర్భవించిందే 1996 తెలంగాణ పోరాటం ప్రజాస్వామ్య తెలంగాణ ఆకాంక్షల కొలిమిని రాజేసిన పాట తెంగాణ జనసభగా అవతరించింది. విప్లవాల పురిటిగడ్డ నల్లగొండ జిల్లా భువనగిరి నుంచి పాట నడక మొదలైంది.

"అమ్మా తెలంగాణమా ఆకలి కేకల గానమా
అమ్మ నీకు అమ్మనీకు వందనాలమ్మో కమ్మని ప్రేమా నీదమ్మో

ఎట్టోల్ల మట్టి సిప్పవు – గాయిదోల్ల గాంద్రగొడ్డలివి

ఖమ్మం మెట్టు అడవులతోని కట్టుకుంది పచ్చని చీర
ఆదిలబాదు ఆకు నులిమి పెట్టుకుంది నుదుట బొట్టు
నాగారం అడవి తుమ్మతో దిద్దుకుంది కండ్ల కాటుక
కుసుమ పువ్వులు నూరమ్మో పసపు రాసుకుందమ్మో

నిండు ముత్తయిద తెలంగాణము ముండమోసినట్లున్నాదమ్మో" అంటూ విప్లవ కవి, గాయకుడు గద్దర్ తెలంగాణ గోసని, సీమాంధ్రపాలనలో నలిగిపోయిన తెలంగాణ బతుకు చిత్రాన్ని కండ్లకు కట్టినట్టు రాసిన ప్రదర్శించిన తీరు యావత్ తెలంగాణని మంత్రముగ్ధుల్ని చేసింది.

"తాగబోతె నీళ్ళు లేవు తుమ్మెదాలో
తడిగొంతులారిపాయె తుమ్మెదాలో

అంటూ నీళ్ళకోసం తండ్లాడుతున్న తెలంగాణ పల్లెల వెతల్ని అక్షరీకరించిన మిత్ర పాటని గానం చేసింది బెల్లి లలిత.

"పల్లెపల్లెన పల్లేర్లు మొలిచే పాలమూరులోన మన తెలంగాణలోన
పాతగోడలు పందిరిగుంజలు చిన్నబోయినాయి ఇండ్లు దుమ్మురేగినాయి
చెట్టుమీద ఆ పిట్టలెగురవు చేదబాయిలో ఊటలూరవు
పచ్చపచ్చనూర్లు పలుగురాళ్ళు దేలినాయి

పనీపాట లేక ప్రజలు తల్లడిల్లినారు" అంటూ కరువుతో కన్నీరు బెట్టి, ఎక్కిళ్ళు బట్టిన పల్లెను గురించి మిత్ర రాసిన మరో పాట తెలంగాణలో పాలపిట్టయ్ తిరిగింది.

1996లో జరిగిన వరంగల్ సదస్సులో తెలంగాణ ఉద్యమం మళ్ళీ ఊపందుకుంది. అన్ని వర్గాల ప్రజలు అందులో పాల్గొన్నరు. ప్రత్యేక తెలంగాణ నినాదంలో అనేక సంస్థలు ఏర్పడ్డయి. 1997 డిసెంబర్‌లో వరంగల్ డిక్లరేషన్ లో తెలంగాణ సమస్యలను చర్చించిండ్రు. ఉద్యమం ద్వారనే తెలంగాణ సాధించుకోవాలని పిలుపునిచ్చిండ్రు.

1998 నుంచి తెలంగాణ ఉద్యమకారుల మీద ప్రభుత్వం తీవ్ర అణిచివేతకు చర్యలు తీసుకుంది. 1999 మే25 బెల్లి లలితను అతి కిరాతకంగ చంపిండ్రు. కరెంటు చార్జీలను తగ్గించమని అడిగిన రైతులను, స్కాలర్‌షిప్‌లను పెంచమని అడిగిన విద్యార్థులను, కనీస జీతాలు ఇయ్యమని అడిగిన అంగన్‌వాడీలను తెలుగుదేశం ప్రభుత్వం నెత్తుటేరుల్లో ముంచింది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ నందిని సిద్దారెడ్డి రాసిన

"జోహరులు జోహారులు
అమరులకు జోహార్ వీరులకు జోహార్
మావుళ్ళ రేవుళ్ళ మట్టీ పొత్తిల్లల్ల
తొవ్వ పువ్వుల తీరు అమరులుంటారు
బువ్వా కొల్లాగొట్టి భూమాతను చెరబట్టి
నాగలి దున్నే కార్తె నా అన్న రైతుల్ని
నాట్లేసే చెల్లెల్ని వరిమీద చెరబట్టిన
నైజామోని గుండెలపై నడయాడిన వీరులకు" ఈ పాట వీరుల స్మృతిగీతంగ క్రమంగ అనేక వేదికల మీద ప్రారంభగీతమైంది.

నందిని సిద్దారెడ్డి రాసిన మరో పాట కవి, గాయకులు దేశపతి గొంతులో ప్రాణం పోసుకొని ఊరూర ఉద్యమాన్ని తట్టి లేపింది. అదే

"నాగేటి సాళ్ళల్ల నా తెలంగాణ నా తెలంగాణ
నవ్వేటి బతుకుల్లో నా తెలంగాణ నా తెలంగాణ
పూసేటి పువ్వుల్ల పూనాసలల్ల
పారేటి నీళ్ళల్ల పానాదులల్ల
కొంగుజాపిన తల్లి నా తెలంగాణ నా తెలంగాణ
పాలుదాపిన తల్లి నా తెలంగాణ నా తెలంగాణ
తంగేడు పువ్వుల్ల తాంబాలమంత
తీరొక్క రంగుల్లో తీరిచ్చిన పువ్వు
తీరొక్క రంగుల్లో తీరిచ్చిన పువ్వు
బంగారు రంగుల బాజారులెన్నో
బతుకమ్మ పండుగ నా తెలంగాణ నా తెలంగాణ
బంతిపూల తోట నా తెలంగాణ నా తెలంగాణ" పాట. ఇట్ల ఇంకా అనేక మంది కవులు, గాయకులు, ప్రజా వాగ్గేయకారులు తమ ఆటపాటలతో ఉద్యమానికి ఊతమిచ్చింద్రు. అనేక పాయలుగా ప్రవహిస్తున్న పాటను ఒకటి చేసిన ఘనత "తెలంగాణ ధూం-ధాం"కే దక్కింది. రసమయి బాలకిషన్, అంతడ్పుల నాగరాజుతో కలిసి 2002 డిసెంబర్‌లో "ధూంధాం" వేదికను ఏర్పాటు చేసింద్రు. అంతడుపుల నాగరాజు ఆదిలాబాద్ జిల్లా మందమర్రి ముద్దుబిడ్డ. గొప్ప జానపద నృత్యకారుడు.

ఆయన తన బృందంతో బ్రేక్, షేక్, ఫోక్ మిక్స్‌చేసి అద్భుతమైన కళాప్రదర్శన చేసేవాళ్ళు. దీంతో నాగరాజు బృందం టి.ఆర్.ఎస్ నాయకులను ఆకర్శించింది. సుద్దాల అశోకతేజ రాసిన "నేలమ్మ నేలమ్మ నీకు వేలవేల వందనాలమ్మా" అనే పాటని వేదికలమీద ప్రదర్శించింద్రు. ఆ తర్వాత నంచర్లగోపి సేకరించి తెచ్చిన పాట "తాలాడిల్లా తల్లాడిల్లా ఏవి నా పల్లెల్లోన " అనే పాటని గొప్ప నృత్యరూపకంగ తయారుచేసి రసమయి బాలకిషన్, అంతడుపుల నాగరాజులు ఇద్దరు కలిసి హైద్రాబాద్ రవీంద్రభారతిలో ప్రదర్శించడంతో వీళ్ళ ఆట,పాట కేసీఆర్ దృష్టికి పోయింది. ఆ తర్వాత రసమయి, అంతడుపుల నాగరాజులు తెలంగాణ సాంస్కృతిక విభాగం ద్వార పార్టీ వేదికల మీద ప్రదర్శనలు చేసింద్రు. మువ్వలసవ్వడి, జానపదాల జాతర వంటి పేర్లతో సభలు నిర్వహించిన వీళ్ళు, మొట్టమొదట ధూంధాం అనే పేరుతో 2001లో కామారెడ్డిలో సభ నిర్వహించడం జరిగింది. దాని కోసం సంతోష్‌రెడ్డి వేదికను ఏర్పాటుచేసిండు. చింతస్వామి పోస్టర్‌లను, బ్రోచర్‌లను డిజైన్ చేసిండు. రసమయి పెద్దఎత్తున అప్పటికే ఉన్న గూడ అంజయ్య, జయరాజు లాంటి కవి,గాయకులను ఆహ్వానించి సభని విజయవంతం చేసింద్రు. ఈ కార్యక్రమాన్ని చూసిన జనం మరిచిపోలేకపోయింద్రు. ఆట,పాట, మాటలతో కూడిన ఈ సభ అత్యంత విజయవంతం అయ్యింది. తెలంగాణ వాదాన్ని ప్రచారం చేయడం కోసం మరింత బలంగా దీన్ని వెంటనే "ధూంధాం" అనే ఒక వేదికనే ఏర్పాటుచేసింద్రు. అట్ల మొదలైన ఈ ధూంధాం ద్వార తెలంగాణ పాటల పల్లకిని ఊరూర తిప్పింద్రు. ఊట చెలిమలై ఉద్యమ పాటకు పల్లవయ్యింద్రు. డప్పు, దరువులతో చిందేసి ఆడింద్రు. అనేక పార్శ్వాలుగ ఉన్న తెలంగాణ ఉద్యమకారులు, కవులు, రచయితలు, కళాకారులు, గాయకులను కలుపుకొని లలితకళా తోరణంలో పెద్దఎత్తున ధూంధాం చేసింద్రు.

ఒక పాటని కాదు, ఒక గాయకుడని కాదు రాజకీయాలకు అతీతంగ కేవలం తెలంగాణ సంస్కృతిని, తెలంగాణకు జరుగుతున్న దోపిడిని, అవమానాన్ని, వివక్షలను పాటలద్వార చెప్పడంతో ప్రజలకు హత్తుకపోయింది. ధూంధాం అంటెనే ఒక అద్భుతమైన పాటల వేదిక అయ్యింది. ఆ తర్వాత రసమయితో విభేదించిన కొందరు "ఆట–పాట" "హల్‌చల్" వంటి పేర్లతో వేదికలు తయారు చేసింద్రు. కాని అంతగా ఆదరణకు నోచుకోలేదు. ఆ తర్వాత ఒక్క రసమయి అంతడుపుల నాగరాజు ఆటపాట గంటలతరబడి సభను అలరించింద్రు. "అమ్మా తెలంగాణమా ఆకలి కేకల గానమా" అంటూ గద్దర్ పాటతో మొదలైన ధూంధాం క్రమంగ అందెశ్రీ "సూడా సక్కాని తల్లి సుక్కల్లో జాబిలి" పాట మీద అంతడుపుల నాగరాజు బృందం కళాప్రదర్శనలోని

బతుకమ్మలు, బోనాలు, పీరీలు, కులవృత్తుల వంటి అంశాలు ప్రజలను విశేషంగ ఆకర్శించినయి. గూడ అంజయ్య రాసిన "అమ్మోనివా నువ్వు అయ్యోనివా – తెలంగాణోనికి తోటి పాలోనివా, ఇసుంట రమ్మంటె ఇల్లంత నాదంటవా – వారెవ్వ తిన్నింటి వాసాలు లెక్కెడ్తవా" పాట సీమాంధ్ర పాలకులను కడిగేస్తది.

"సూడు తెలంగాణ సుక్కనీరు లేనిదాన

నా గోడు తెలంగాణ బతుకు పాడైన వీణ" అంటూ అందెశ్రీ నీళ్ళు లేని తెలంగాణ బాధని చూసి నిప్పులు కురిపస్తడు. ఇంతలో

"పండు వెన్నెల్లలోన వెన్నెల్లలోన పాడేటి పాటలేమాయె

నా పల్లెటూరిలోన ఆడేటి ఆటలేమాయె" అంటూ నిస్సార్ పాట అంతరించిపోయే తెలంగాణ పల్లెకళల్ని, ఆటపాటల్ని గుర్తుకు తెస్తది. ఆ వెంటనే నేర్నాల కిషోర్ "ఎట్లున్నవే నా పల్లె – నువ్వెట్లున్నవే నా తల్లి" అంటూ పల్లెతల్లిని తల్చుకుంటడు. పల్లెతో గల అనుబంధాన్ని, మధుర స్మృతులను గానం చేస్తడు.

సీమాంధ్రపాలన తెలంగాణ బతుకుల్లో ఏమార్పు తీసుకురాలేదన్న వాస్తవాన్ని గోరటి వెంకన్న

"ఏమి మారెను ఏమీ మారెనురా తెలంగాణ బతుకులు

ఎందుకింత హీనంగున్నయిరా

ఇంటిముందు కొట్టాముల మేకపిల్లల రొచ్చు ఉంది

ఇంటిలోన గంప కింద కోడిపిల్లల్ల రెట్ట ఉంది

పెంట దిబ్బ అంచున వెలసీనా

వెలివాడ పేదల కంటినిండ సోకమున్నదిరా" అంటూ పల్లెబతుకుల్ని కొలుపుబెట్టి చెప్పుతడు.

ఆ వెంటనే ధూంధాం వేదిక మీద చిచ్చరపిడుగైన రసమయి బాలకిషన్

"గల్లు గల్లు తెలంగాణ కదులుతున్నదో అన్నల్లార ఓ తమ్ముల్లారా

రగులుతున్నదో

"పుడితొక్కటి సత్తెరెండు రాజిగ ఒరె రాజిగ

ఎత్తుర తెలంగాణ జెండ రాజిగ ఒరె రాజిగ

గజ్జెలు గజ్జాలు రెండు గజ్జెలో రాజన్న" అంటూ గూడ అంజన్న రాసిన పాటతో చెంగుచెంగున ఎగిరిదునికి సీమాంధ్ర పాలకుని గుండెల్లో గుబులు పుట్టిస్తడు.

తెలంగాణ పల్లెలు ఎండి మొండాలైతున్నయన్న ఆర్తితో జయరాజు

"ఇంకేమి మిగిలిందిరా తెలంగాణ జిల్లేడు మొలిసిందిరా

ఇంకేమి మిగిలిందిరా తెలంగాణ పల్లేరు గాసిందిరా” అంటడు.

2006లో నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో పెద్దఎత్తున “ధూం-ధాం” జరిగింది. ఏపూరి సోమన్న, పైలం సంతోష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో గద్దర్, రసమయిలతో పాటు గూడ అంజయ్య, గోరటి వెంకన్న, అందెశ్రీ, నేర్నాలకిషోర్, గిద్దె రామనర్సయ్య, నిస్సార్, అంబటి వెంకన్న, ఆలేరు విజయ వంటి వందలాది మంది కళాకారులు పాల్గొన్నరు.

తెలంగాణ పాటల పుట్టయ్యింది. పాటకవులు, కళాకారులతో ధూంధాం ఊరూర ఉద్యమజెండాను ఎగరేసింది.

“పోరుసాగుతుంది కొడుకా తెలంగాణ హోరు సాగుతుంది బిడ్డా<br>
జనహోరు సంద్రమై ఎగిసేటి కెరటమై<br>
త్యాగాల వీణపై రాగాల రాసులై<br>
మూడున్నరకోట్ల గొంతులొక్కటై ప్రజాతెలంగాణ పల్లవందుకొని<br>
నావ సాగుతుంది కొడుకా పోరాట తోవ జూపుతుంది బిడ్డా” అంటూ ఏపూరి సోమన్న ఉప్పెనై ఉరొకొచ్చిండు.

“ఉండు పైలంగుండు అమ్మ మాయమ్మ<br>
ఇల్లు పైలం జూడు తల్లి మాయమ్మ<br>
బతుకుదెరువు లేక అమ్మ మాయమ్మ<br>
బొంబాయిబోతున్న తల్లి మాయమ్మ” అంటూ కోదారిశ్రీను రాసిన పాటను ఆదూరి సంతోష్, పుష్ప, స్నేహ వంటి కళాకారుల ఎందరో పల్లెపల్లెకు తిప్పి తెలంగాణ వలసబతుకుల జీవన చిత్రాన్ని కండ్ల ముందుంచిండ్రు. ఇదే పాటలో ఆఖరికి ఆ ముసలితల్లి కొడుక్కు కర్ర అందించి ఉద్యమానికి సిద్ధం చేసిన తీరు ప్రేక్షకుల్లో ఉత్తేజాన్ని కలిగించింది. ఈ పాట తెలంగా ఉద్యమం ఉధృతిని పెంచిందనడంలో ఎలాంటి సందేహం లేదు. కోదారి శ్రీను బొంబాయి పాట ధూంధాంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇంకా కోదారి శ్రీను రాసిన ఎన్నో పాటలు చిన్నపిల్లలు కూడ అలవోకగ పాడుకున్నరు. తెలంగాణ నినాదాన్ని ప్రత్యేకరాష్ట్ర ఆకాంక్షని సజీవం చేసింద్రు.

“ముద్దుల రాజాలో కొడుక ఉత్తరమేస్తున్నో బిడ్డా సల్లంగుండు రాజాలు నువ్వు సక్కంగుండు రాజాలు” అని ఎక్కడో దూరదేశానున్న కొడుకును తలుచుకుంటున్న తల్లి వ్యథను గానం చేస్తడు. అదేవిధంగ మొత్తం ధూంధాం కార్యక్రమానికే ఒక ఊపునిచ్చిన పాట “అసోయ్ ధులా హోరతి – కాళ్ళ గజ్జెల గమ్మతి తెలంగాణ లడాయికి

సాగుతున్న ఇమ్మతి" అనే పాటలో సీమాంధ్ర పాలకులు ఈ నేలను విడిచిపోకపోతే వాళ్ళను తరిమికొడతమన్న సందేశాన్ని అతి సున్నితంగ పాటలో వినిపిస్తడు. దాదాపుగా ఈ పాటతో ధూంధాం అయిపోయినంత పనైతది.

"ఆడుదాం డప్పుల్ల దరువెయ్‌రా పల్లె తెలంగాణ పాటపాడరా

ఎటుజూసిన టీవీల లొల్లే గదరా మన పనిపాటలన్నిటిపై దాడేగదరా" అంటూ పాశ్చాత్య విష సంస్కృతి తెలంగాణ పల్లెల్ని పాడుజేసిని తీరుని వర్ణిస్తది

"ఛలో ధూంధాం తెలంగాణ జాతరొచ్చెరా

ఛలో ధూంధాం తెలంగాణ దండు గట్టెరా

మత్తడి దుంకి అలుగు తన్నుకొని పారినట్టు

మెత్తని గుండెలు సైతం నగారయ్యి మోగినట్టు

నెత్తిన బోనమెత్తి శివసత్తులు దుంకినట్టు ధూంధాం" అంటు విప్లవ కవి, తెలంగాణ పోరుబిడ్డ మిత్ర రాసిన పదాలకు జీవంపోసి ప్రజాయుద్ధాన్ని రగిలించిన తెలంగాణ ప్రజాగాయని విమల అనేక పాటలతో అరుణోదయ బృందంతో జనశక్తిని కూడగట్టింది. మన రాష్ట్రం వచ్చేదాక పన్నులు కట్టేది లేదని జంగ్‌కు సైరనూదింది. ఇట్ల అనేక పాటలతో వందలాది మంది కళాకారులతో ధూంధాం యొక్క విస్తృతి పెరిగింది. ఎవరితో సంబంధం లేకుండనే కళాకారుల బృందాన్ని ఒకదాన్ని పిలుచుకొని మారుమూల పల్లెల్లో సైతం పెద్ద ఎత్తున "ధూంధాం" సభలు నిర్వహించిండ్రు. తెల్లవార్లు పాటలు పాడి పల్లెల్ని మేల్కొలిపిండ్రు. 2009 డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన చేసిన కేంద్రం మళ్ళీ డిసెంబర్ 23 ప్రకటన చేసి ఒకడుగు వెనకకు వేయడంతో అప్పుడు మొదలైంది అసలైన ధూంధాం. చంద్రప్రకాశ్ లాంటి రచయితలు ఎందరో ఏకంగ సోనియాగాంధీ మీదనే పాటల పాడి ఉద్యమాన్ని ఉగ్రూతలూగించిండ్రు. ఈ దశలో తెలంగాణ పాట సీమాంధ్రపాలకున్ని వేటాడింది. వెంటబడి తరిమింది. వాళ్ళ తలుపులు, కిటికీలు మూసుకున్న వాని తలపుల్లో తెలంగాణ పాట ప్రతిధ్వనించింది. వాళ్ళకు తెలువకుండనే ఉద్యమం గురించి ఆలోచించేలా చేసింది. మొత్తానికి వలసపాలకులకు కంటిమీద కునుకు లేకుండ చేసింది.

కాసోజు శ్రీకాంతాచారి మొదలు వందలాది మంది తెలంగాణ బిడ్డలు నేలరాలుతున్న విషాద సంఘటనలు గుండెని పిండేసిన బాధతో

"రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా

రక్తబంధం విలువ నీకు తెలియదురా

నుదిటి రాతలు రాసె ఓ బ్రహ్మదేవా

తల్లి మనసేమిటో నీవు ఎరుగవురా
తెలిసుంటే చెట్టంత నా కొడుకును
తిరిగి తెచ్చీయగలవా నీ మహిమలు" అంటూ మిట్టపల్లి సురెందర్ శివుడ్ని నిలదీసి అడిగిన తీరు సాయిచంద్ గొంతులో ప్రాణం పోసుకుంది. కొడుకును పోగొట్టుకున్న తల్లి దుఃఖానికి దుఃఖంతోనే ఓదార్పునిచ్చిందీ పాట. కన్నతల్లులకు కాసింగ గుండెధైర్యాన్నిచ్చిందీ పాట.

తెలంగాణ ధూంధాంలో గిద్దె రామనర్సయ్య
"కొమ్మాలల్ల కోయిలమ్మ పాటబాడుతన్నది జై తెలంగాణ అన్నది
అలసిపొయిన లేడికూన గంతులేస్తనన్నది కాలి గజ్జెగడుతనన్నది
ప్రాణంబోయిన మేకపిల్ల డప్పునైతనన్నది దండోర వేస్తనన్నది
ఇప్పుడు బుట్టిన లేగ దూడ దుంకులాడ్తనన్నది ధూంధాం జేస్తనన్నది"

ఈ పాటతో తెలంగాణ కోసం పశుపక్ష్యాదులతో పాటు సకలజీవరాశిని సిద్ధంచేసి యుద్ధంలో సైనికుల్ని చేస్తదీ పాట. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష అణువణువులో ఉన్న విషయాన్ని తేటతెల్లంజేస్తదీ పాట.

ఇన్ని ఉద్యమాలు ఇంత పోరాటం జరుగుతున్నా ఇంకా ఇక్కడి వనరుల్ని కొల్లగొడుతున్న సీమాంధ్ర దొంగల్ని చూసి గూడ సహనం వహించే తెలంగాణ తల్లిని చూసి అంబటి వెంకన్న

"వందనాలు వందనాలు వందనాలమ్మో
తెలంగాణ తల్లీ నీకు దండాలోయమ్మో
జింకపిల్లలోలె గంతులేసే కృష్ణా గోదారమ్మలున్న
పీకతుమ్మలు బెరిగి బోళ్ళు గుట్టలతోని బీళ్ళువారుడేంది
చెంగనాలుదోలె వాగువంక చెరువు అలుగు దుంకుతున్న
శెలక పంటలతోని చేతకూలిలేక చెమటబిండుడేంది
నిండు గర్భిణివోలె సాగరుకుండలు మోసి మందికిచ్చుడేంది
దూపదీరక నువ్వు అస్కులాడుకుంట ప్రాణత్యాగమేంది.."అంటూ ప్రశ్న విల్లంబులను అందించి ప్రజల్ని ఉద్యమబాట పట్టిస్తడు. ఆ ప్రజా ఉద్యమంలో తానో సైనికుడై సాగిపోతడు.

"ఎయ్యాలెరో అడుగెయ్యాలెరో ఏసినంక ఎనకడుగు ఎయ్యొద్దురో
చెయ్యాలెరో పోరుజెయ్యాలెరో చేసినంక శత్రువుకు లొంగొద్దురో
తెలంగాణే లక్ష్యంగ తెగువతోని నడువాలె

తెర్లుజేయ జూసినోన్ని తరిమితరిమి కొట్టాలె" అంటడు. అంతేకాకుండ అంబటి వెంకన్న మరో పాటలో

"గుత్పలే పట్టాలె ఎన్నీయల్లో గుంజి కొట్టాలింక ఎన్నీయల్లో

సమైక్యమంటోన్ని ఎన్నీయల్లో దంచి తరుమాలింక ఎన్నీయల్లో" ఇంకా ఈ సమైక్యాంధ్ర ఎత్తులు సాగవని, గుత్పలు చేతబట్టి గుంజికొట్టే దాక సూడొద్దని సీమాంధ్ర పాలకులకు ఒక హెచ్చరిక జేస్తడు.

విద్యార్థి అమరవీరులను తలుచుకుంటూ అనేక పాటలొచ్చినయి. వాటిలో ముఖ్యంగ దరువు ఎల్లన్న రాసిన

"వీరులార వందనం విద్యార్థి అమరులార వందనం పాదాలకు

మా త్యాగధనులారా మరిచిపోము మేము

గుండెల్లో గుడి గడతం పోరుదండం బెడతం" పాట విద్యార్థి ఉద్యమాన్ని నడిపించిందంటే అతిశయోక్తి కాదు. అదే కోవలో మొత్తం తెలంగాణ ఉద్యమానికి ఊపునిచ్చిన పాట అభినయ శ్రీనివాస్ రాసిన

"ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన కిరణమా వీరతెలంగాణమా

వీర తెలంగాణమా నాలుగుకోట్ల ప్రాణమా

కాకతీయ క్యాంపస్‌లో కురిసిన ఓ వర్షమా వీ తెలంగాణమా

వీర తెలంగాణమా నాలుగుకోట్ల ప్రాణమా'' పాటతో క్యాంపస్‌లు కదందొక్కినయ్. పోలీసు తూటాలకు ఎదురు నిలిచి పోరాడినయి. ఇట్ల పాట ఉద్యమాన్ని రగిలించింది. ఉద్యమం పాటని పుట్టించింది.

వేలాదిగ తరలివచ్చిన జనం మధ్య తెలంగాణ పాట కొత్తపుంతలు తొక్కింది. ఎవరి దారులు వాళ్ళకు ఉన్న ధూంధాం పాటలో పరవశించిన జనంగాని, నాయకులుగాని తెలంగాణే లక్ష్యంగ ఉద్యమంలో ముందు నిలిసింద్రు. బతుకమ్మలు, బోనాలు, కోలాటపాటలు, డప్పు దరువులతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.

అందెశ్రీ రాసిన "జయజయహే తెలంగాణ జననీ జయకేతనం" అన్న పాట జనం నాలుకల మీద నాట్యం చేసింది. ప్రతినిత్యం పాఠశాలల్లో పిల్లలు మాతృగీతంగ పాడుకున్నరు.

ఇట్ల ఒకటి కాదు రెండు కాదు వందలాది పాటలు ధూంధాం చేసినయ్. సీమాంధ్ర పాలకుల దుమ్ము దులిపినయ్. ఆ పాటల వరుసలో ఇంకా యశ్‌పాల్, దయానర్సింగ్, దరువు అంజన్న, బాబ్జీ, కొమిరె వెంకన్న, అన్వేషి, పొలిశెట్టి లింగయ్య, సుందిళ్ళ రాజన్న, తిరుపతి, సంతోష్ వంటి పాటకవులతో పాటు గాయకులు జడల

రమేశ్, రమాదేవి, తేలువిజయ, స్వర్ణ,పుష్ప, వడ్లకొండ అనిల్, గర్జన, జంగ్ ప్రహ్లాద్, జహంగీర్, బచ్చలకూరి శ్రీను, అరుణోదయ వెంకట్, మధుప్రియ వంటి కళాకారులు ఎందరో ధూంధాంలో మమేకం అయ్యిండ్రు. అయితే వీళ్ళు మాత్రమే సమగ్రం కాదు. ఈ పాటల ప్రవాహంలో ఇంకా చాలామంది కవులు, గాయకులు, కళాకారుల చెమట నెత్తుటిధారలు ఉన్నయి. ఈ క్రమంలోనే డిసెంబర్ 22, 2012న ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ధూంధాం దశాబ్ది ఉత్సవాలు ఘనంగ జరిగినయి. ప్రజాయుద్ధనౌక గద్దర్, గూడ అంజయ్య, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ సభని ప్రారంభించిండ్రు. ప్రజాగాయని విమల మీద పెట్టిన కేసులు ఎత్తివేసి, బేషరతుగ విడుదల చేయాలని ధూంధాం అధ్యక్షుడు రసమయి బాలకిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిండు. తెలంగాణ భాషని గోసని పట్టించుకోని ప్రపంచ తెలుగు మహాసభలను బహిష్కరించాలని తీర్మాణం చేసిండు. తెలంగాణకు కాంగ్రేసే ప్రథమ శత్రువని, తెలంగాణ ఇవ్వడానికి కాంగ్రేస్ సిద్దంగా లేదని గద్దర్ తీవ్రంగ విమర్శించిండు. అదేవిధంగ తెలంగాణ రాష్ట్రం కోసం ధూంధాం చేపట్టిన కార్యక్రమాలు గొప్ప సాంస్కృతిక ఉద్యమానికి పునాదులని అన్నడు. ఈ సభలోనే 'తెలంగాణ పాట – గతం –వర్తమానం' అనే అంశం మీద లోతైన చర్చ జరిగింది. అందెశ్రీ, దప్పు రమేశ్, ధూంధాం కార్యదర్శి అంతడుపుల నాగరాజు, మిట్టపల్లి సురెందర్, కోదారి శ్రీను వంటి వందలాది మంది కళాకారుల తమ కళాప్రదర్శనలు చేసిండ్రు. ఈ కార్యక్రంలో ఆర్. నారాయణ మూర్తి, కేకే. కోదండరాం, ఈటెల రాజేందర్, నాగం జనార్దన్ రెడ్డి, కిషన్‌రెడ్డి ఇంకా తెలంగాణ ప్రముఖులు పాల్గొని ప్రసంగించిండ్రు.

ఇట్ల తెలంగాణ ఉద్యమంలో పాటతోపాటు అనేక ఉద్యమశక్తులు ప్రతిది ఒకదానికొకటి అనుసంథానమైంది. అంతిమంగ తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయమంటు నినదించి ముందుకు కదిలింది. దెబ్బకు దయ్యం ఉరికినట్టు తెలంగాణ ఉద్యమ ధాటికి, ముఖ్యంగ ధూంధాం ప్రభంజనానికి చిన్నగ సీమాంధ్రపాలకుల శక్తి సన్నగిల్లింది.

రాష్ట్రప్రభుత్వం 2011 సంవత్సరానికిగాను సినిమా నంది అవార్డులను 2012 అక్టోబర్ 13న ప్రధానం చేసింది. ఈ అవార్డుల్లో గతంలో ఎన్నడు లేని విధంగ తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన సినిమాలకు, ఉద్యమ పాటలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చింది. తెలంగాణ ఉద్యమమే ఇతివృత్తంగ తీసిన 'జైబోలో తెలంగాణ' సినిమా ఉత్తమ జాతీయ సమగ్రతా చిత్రంగ ఎంపికైంది. ఉత్తమ దర్శకుడిగా ఎన్.శంకర్, ఉత్తమ గాయకుడిగా (పొడుస్తున్న పొద్దుమీద) గద్దర్ మొత్తం మూడు

నంది అవార్డులను సొంతం చేసుకుంది. (గద్దర్ ఈ అవార్డును తిరస్కరించిండు)

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కథతో పాటే ప్రధాన ఇతివృత్తంగ వచ్చిన 'రాజన్న' సినిమాకు ఏడు నంది అవార్డులు దక్కినయి. బేబి అన్ని ఉత్తమ బాలనటిగా, ఉత్తమ గాయనిగ మాళవిక (అమ్మా అవని..) ఎన్నికైంది.

ఉద్యమ నేపథ్యంలోనే తీసిన మరోక సినిమా పోరు తెలంగాణలో రాతిబొమ్మల్లోన కొలువైన శివుడ.. పాటకు ఉత్తమ గేయరచయితగ మిట్టపల్లి సురెందర్ ఎన్నికైండు. ఇంకెన్నాళ్ళు సినిమాకు సుజాతరెడ్డికి ఉత్తమ సహాయనటి అవార్డు దిక్కింది. ఈ విధంగ తెలంగాణ "ధూం-ధాం" ధాటికి మునుపెన్నడు లేని విధంగ రాష్ట్రప్రభుత్వ నందులు కూడ పరుగెత్తుకుంటోచ్చినయి. ఆ తర్వాత

పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా

అన్న పాట పల్లెపల్లెన ప్రతిధ్వనించింది. సినిమా థియేటర్లు దద్దరిల్లినయి. ఈ విధమైన సాంస్కృతిక ఉద్యమం తర్వాత జరిగిన రాష్ట్ర ఏర్పాటుతో తెలంగాణ చీకటి బతుకుల్లో కాంతిరేఖ ప్రసరించింది. క్రమంగ ధూం-ధాం కళాకారులతో పాటు ఉద్యమంలో తెలంగాణ కోసం పాటను పట్టుకొని ప్రయాణం కొనసాగించి, జీవితాన్ని త్యాగం చేసిన కళాకారులతో "తెలంగాణ సాంస్కృతిక సారథి" ఆవిర్భవించింది. రసమయి బాలకిషన్ చైర్మన్‌గా ఏప్రిల్ 9, 2015న పదవీ బాధ్యతలు స్వీకరించిండు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పడమే లక్ష్యంగ పల్లెకళల్ని, ఆటపాటల్ని బతికిస్తూ, పల్లె జీవన సౌందర్యానికి కళలు తోడ్పడతాయనే లక్ష్యంతో సారథి పనిచేస్తుంది.

# జయశంకర్ సార్ జీవితం (1934-2011)



జయశంకర్ సార్ జీవితం నలుగురికి ఆదర్శప్రాయమైనది. ఆయన ఉపాధ్యాయుడిగ, అధ్యాపకుడిగ, రిజిస్ట్రార్‌గ, వైస్‌ఛాన్సలర్‌గ చేపట్టిన ప్రతి పదవిలోను ఒదిపోయిండు. ఆ పదవులకే వన్నె తెచ్చిండు. జ్ఞానం మూర్తీభవించిన బుద్ధునిగ మంచి పరిపాలనాధక్షునిగ జీవించిన బుద్ధిశాలి ప్రొఫెసర్ జయశంకర్ సార్. తన పాఠాలతో తెలంగాణ మట్టిని సైతం కదిలించి పోరుబాట పట్టించిన ధీరోధాత్తుడు.

వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో కొత్తపల్లి లక్ష్మీకాంతరావు-మహాలక్ష్మి పుణ్యదంపతులకు ముగ్గురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. పెద్దవాళ్ళయిన ముగ్గురు మగపిల్లల్లో జయశంకర్‌సార్ నడిపోడు. ఈయన 1934 ఆగస్టు 6న జన్మించిండు. జయశంకర్ సార్ తల్లిది ఖమ్మం జిల్లా. అప్పుడు ఖమ్మం వరంగల్ జిల్లాలో భాగమే. ఆరోజుల్లో ఉర్దూ మీడియం పాఠశాలలు మాత్రమే ఎక్కువగ అందుబాటులో ఉండేయి. జయశంకర్ సార్ హన్మకొండ వరకు పోయి లష్కర్ వీధిలో గల మర్కజీ ఉర్దూ మీడియం పాఠశాలలో ప్రాథమిక విద్యని అభ్యసించిండు. స్కూల్ హెడ్‌మాస్టర్ పేరు రషీదుల్ హాసన్. 1944-45 ప్రాంతంలో జయశంకర్‌సార్ నాలుగవతరగతి చదివేటప్పుడు ఒక మరిచిపోలేని సంఘటన జరిగింది. అవి నిజాంకు వ్యతిరేకంగ స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న రోజులు. ప్రతినిత్యం మర్కజి పాఠశాలలో ప్రేయర్ ఉండేది. ఉర్దూలో ఉండే ఈ ప్రేయర్ సారాంశం

"ఈ రాష్ట్రం, ఈ రాష్ట్ర ప్రజలు ఆచంద్ర తారార్కం సుభిక్షంగ ఉండుగాక" అనే అర్థంతో చాలా గొప్పగ ఉండేది.

ఆ ప్రేయర్ ముగించుకొని క్లాస్‌రూంలోకి పోయెటప్పుడు విద్యార్థులు హెడ్‌మాస్టర్ ముందు నుంచి నమస్కారమనో, సలామనో, ఆదాబనో చెప్పుకుంటు పోయేవాళ్ళు. ఆరోజు జయశంకర్‌సార్ మాత్రం 'వందేమాతరం' అని అన్నడు. అంతే హెడ్‌మాస్టర్ జయశంకర్ సార్‌ని ఆఫీసు రూంలోకి తీసుకపోయిండు. ఎందుకంటే అవి బయట ఎక్కడైన వందేమాతరం అంటే చంపేసే రోజులు. జయశంకర్ సార్ తండ్రి లక్ష్మీకాంతారావు, హాయగ్రీవచారి ఇద్దరు సమకాలికులు వాళ్ళు కలిసిన ప్రతిసారి వందేమాతరం అని సంభోదించుకోవడం జయశంకర్‌సార్ చాలాసార్లు విన్నడు. అందుకని దాన్ని స్కూల్‌లో ప్రయోగించిండు. హెడ్‌మాస్టర్ జయశంకర్‌సార్‌ని నిలదీసి "వందేమాతరం అంటె అర్థం తెలుసా" అంటే "తెలువదని" సమాధానం చెప్పిండు. "పొద్దున్నే మీ నాన్నని తీసుకొని రమ్మని" చెప్పిండు. ఆసమస్య అట్ల అంతటితో సద్దుమణిగింది.

హన్మకొండ హైస్కూల్‌లో మాధ్యమిక విద్య, హన్మకొండ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ ఎస్ సి వరకు చదువుకుండు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఎ., పూర్తి చేసిండు. ఆర్ట్స్ అండ్ సైన్స్ సబ్జెక్టులు తప్పకుండ చదవాలన్న నిబంధనతో అత్యుత్తమ ర్యాంకులు సాధించిండు. 1956 జూన్‌లో బి.ఎడ్.లో చేరి 1957 మార్చిలో హన్మకొండలోనే బి.ఎడ్ పూర్తి చేసిండు. అప్పట్లో బి.ఎడ్.పూర్తి చేస్తే పర్మనెంట్ జాబ్ ఇస్తం అనే సిస్టం ఉండేది. పేస్కేల్ 154 రూపాయలు ఉండేది. అది ఇప్పుడు 15000లతో సమానమైనది. జయశంకర్ సార్‌కు నిజాం స్టేట్‌లోనే రిజల్ట్స్ వచ్చినయి, కాని అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించేదాక చేతికి అందలే. ఈలోపు పాసైన పదిమంది విద్యాశాఖ డైరెక్టరేట్‌కు పోయి చూసిండ్రు. అప్పటికే ఆంధ్రోళ్ళు హయ్యర్ పోజీషన్‌లోకి వెళ్ళిపోయింఁడ్రు. ఆ తర్వాత టీచర్‌గ అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతికొచ్చి, ఉద్యోగంలో జాయిన్ కావడానికి వెళ్ళినప్పుడు, పేస్కేలు మారిందని తెలిసి ఆశ్చర్యపోయిండు. ఆంధ్రప్రదేశ్ అవతరణతో టీచర్ల జీతాలు తగ్గించిన విషయాన్ని ప్రశ్నిస్తే,

"మిష్టర్ జయశంకర్ ఇది మి నిజాం గవర్నమెంట్ కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైండిట్" అన్నడు. అంతటితో ఆగకుండ

"ఇష్టం ఉంటే చేయి లేకపోతే లేదు" అని ఈగని తీసేసినట్టు తీసేసింఁడ్రు. దీంతో అప్పుడే ఆయన ఆత్మగౌరవం దెబ్బతిన్నది. "మనని ఒప్పించి ఒక్కటైన వాళ్ళ తీరు ఇదా" అనుకొని బాధపడ్డడు. "ఆంధ్రప్రదేశ్ అవతరణ తెలంగాణ పాలిట శాపంగ మారిందని" అనుకుండు. జయశంకర్ సార్‌కు అత్యంత అభిమాన సబ్జెక్ట్

అర్ధశాస్త్రం. బనారస్ హిందు విశ్వవిద్యాలయం నుంచి మరియు అలీగఢ్ విశ్వవిద్యాలయం నుంచి అర్ధశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిండు. 1975లో వరంగల్‌లోని చందా కాంతయ్య మెమోరియల్ (సి.కె.యం) కాలేజ్ ప్రిన్సిపాల్‌గ పనిచేసి ఆ కళాశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిండు. ప్రతి విద్యార్థిని ఎప్పటకి పేరు పెట్టి పిలవడం ఒక్క జయశంకర్ సార్‌కే సాధ్యమైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో పి.హెచ్.డి పట్టా పొందిండు.

జయశంకర్ సార్‌కు ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి నారాయణ, ప్రొఫెసర్ కె. సీతారామరావు లాంటి ఎందరో ప్రముఖులు వివిధ రంగాలలో పనిచేసే శిశ్యులు అనేకమంది ఉన్నారు.

జయశంకర్ బాల్యమిత్రులు వెంకటేశ్వర్లు, శ్రీధరస్వామిలిద్దరు చివరిదాక సార్‌తో కలిసే ఉన్నరు.

1948 నుంచి 1952 మధ్య కాలంలో వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగాల కోసం తెలంగాణ ప్రాంతానికి వలస వచ్చిండ్రు. తెలంగాణవాళ్ళకు ఇంగ్లీష్ రాదని, కమ్యునిస్టు భావాలు ఎక్కువగ ఉంటయని కేంద్ర ప్రభుత్వం ఇక్కడ ఆంధ్రా వాళ్ళకే ఉద్యోగాలు ఇచ్చింది. దీంతో ఇక్కడికి వచ్చినవాళ్ళు ఇక్కడి యాసని, భాషని బాగ వెక్కిరించిండ్రు. ఒకసారి కొందరు భాషా పండితులు అయ్యదేవర కాళేశ్వర్ రావుని పిలిచి వరంగల్‌లో ఒక సభ జరిపిండ్రు. ఆయన తెలంగాణ సంస్కృతిని, ముఖ్యంగ భాషని అవమానించడతో జయశంకర్‌సార్ మరికొందరు మిత్రులు కలిసి ప్రసంగాన్ని అడ్డుకున్నరు. పోలీసులు లాఠీచార్జ్ చేసి అందర్ని దెబ్బలు కొట్టిండ్రు. ఇట్ల తెలంగాణ విలీనమైన నాటినుంచే లాఠీదెబ్బలు తిని నెత్తురు ధారపోసిన చరిత్ర తెలంగాణది. ఈ విధంగ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని రగిలించడంలో జయశంకర్‌సార్ మూడు తరాలకు వారధిగ నిలిచిండు.

జయశంకర్ సార్ 'గైర్‌ముల్కి' గోబ్యాక్ అంటూ నినదించిండు. 1952లో హైద్రాబాద్ సిటి కాలేజ్‌లో ఇంటర్ చదువుతున్న సమయంలో జయశంకర్ సార్ ముల్కీ ఉద్యమంలో విద్యార్థిగ తన వంతు పోరాటం చేసిండు. సిటీకాలేజ్ విద్యార్థులు 'ఇడ్లి సాంబార్ గోబ్యాక్, గోంగూర పచ్చడి గాబ్యాక్' అంటూ ఉద్యమం చేస్తుండ్రని తెలిసి వరంగల్ ఉన్న జయశంకర్‌సార్ ఆ ప్రదర్శనలో పాల్గొనడానికి వరంగల్ నించి బస్సులో బయలు దేరిండు. బస్సు ఖరాబు కావడంతో భువనగిరి వద్ద ఆగిపోయిండు. ఇంతలో అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిగి కాలేజ్ విద్యార్థులు ఏడుగురు చనిపోయిండ్రున్న వార్తతో దుఃఖంలో మునిగిపోయిండు. ఆ విద్యార్థుల అమరత్వాన్ని,

ఆశయాన్ని కొనసాగించిండు. తెలంగాణకు జరుగుతున్న దోపిడిని, అన్యాయాన్ని, అవమానాన్ని ఎవరు మాట్లాడని కాలంలోనే అత్యంత సాహసంతో ఎదిరించిన ధీశాలి జయశంకర్ సార్. 1954లోనే విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టి మొదటి ఎస్సార్సి (ఫజల్అలీ కమీషన్) ముందు తెలంగాణ అంశాన్ని పూసగుచ్చినట్టు వివరించిన మేథోసంపన్నుడు. తెలంగాణ అస్తిత్వ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదిని నిర్మించిండు. "ప్రత్యేక తెలంగాణ ఇస్తే మీరు బతకగలుగుతరా" అన్న ఫజల్ అలీ ప్రశ్నకు "మంచిగ బతుకుతం. బతకలేకపోతే బిక్షమెత్తుకుంటం. వాళ్ల దగ్గరికి మాత్రంబోం" అని సమాధానం చెప్పిండు జయశంకర్ సార్. 1968లో మొదలైన అంశం ప్రత్యేక రాష్ట్ర డిమాండ్గ 1969 తెలంగాణ ఉద్యమంగ రాజుకున్న సందర్భంలో అధ్యాపకునిగ క్రియాశీల పాత్రను పోషించిండు. తెలంగాణ మట్టిలోని ధిక్కార స్వభావాన్ని వెతికి పట్టుకుండు. సమ్మక్క, సారక్కల శౌర్యాన్ని, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మల పోరాట పటిమను తట్టి లేపిండు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ను స్థాపించి దానికి అధ్యక్షునిగా, కార్యదర్శిగా కూడ పనిచేసిండు.

1969 ఉద్యమం సంధర్భంగ నాటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ ఆహ్వానించిన మేథావుల బృందంలో జయశంకర్ సార్, తోట ఆనందరావులు కీలక వ్యక్తులుగ ఉన్నరు. జయశంకర్ సార్ ఉద్యమ మిత్రడు డా॥ గోపాలకృష్ణ. తోట ఆనందరావు, కనకదుర్గలు కూడ ఎప్పుడు తనతోనే కలిసి ఉండేవారు. జయశంకర్ సార్కు ఆపరేషన్ అయినప్పుడు బోకే పంపి అక్టోబర్ 2 రాజ్భవన్కు పిలిపించుకొని ఖర్చులు ప్రభుత్వం భరిస్తదని చెప్పినప్పుడు తిరస్కరించి ధన్యవాదాలు చెప్పి వచ్చిండు.

1970 నుంచి 1990 వరకు తెలంగాణ ప్రాంతంలో యువకులు నక్సలిజం వైపు ఆకర్శించబడ్డరు. నక్సల్బరి, శ్రీకాకుళ పోరాటాలు, గోదావరి లోయ పోరాటాలు, సిరిసిల్ల రైతు పోరాటాల ప్రభావం సమాజం మీద ఎంతగానో ఉన్నప్పటికి తెలంగాణ అంశాన్ని విడువకుండ అందరిని ఆలోచింపచేసిన ఘనత ప్రొఫెసర్ జయశంకర్ సార్ది. తెలంగాణ ప్రజలు అత్యంత అభిమానంతో ఆయనను ముద్దుగ జయశంకర్ సార్ అని పిలిచింద్రు. ఒక వ్యక్తి తన పరోక్షంలో కూడ 'సార్' అనే సంబోధనతో మాట్లాడే గౌరవాన్ని సంపాదించుకున్న మొట్టమొదటి మనిషి, మాననీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని స్వప్నించి, జీవితాంతం అదే శ్వాసగ బతికిన ఆశావాది జయశంకర్ సార్. బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగ ఉన్నప్పుడు పి.వి. నర్సింహ్మారావు విద్యాశాఖ మంత్రిగ ఉండేటోడు. ఆయన అప్పుడు సమైక్యవాది.

జయశంకర్ సార్ చేస్తున్న ఉద్యమాల కారణంగా 1970-71లో ఖమ్మం

ఆర్ట్స్‌కాలేజ్‌కి ట్రాన్స్‌ఫర్ చేసింద్రు. సిటి కాలేజ్‌లో పనిచేస్తున్న రోజుల్లో ఇంద్రారెడ్డి సార్‌కు శిశ్యుడుగ ఉన్నడు.తెలంగాణ భావజాల వ్యాప్తిని చేస్తూనే అనేక పదవులను చేపట్టిండు. 1975 నుంచి 79 వరకు సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్‌గ, బోర్డు మెంబర్‌గ పనిచేసిండు. కాకతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకోసం ఎంతగానో కృషిచేసిండు. ఆ తర్వాత కాకతీయ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకట్రామయ్య జయశంకర్‌సార్‌ని యునివర్సిటి రిజిస్ట్రార్‌గా నియమించిండు. 1979–81 వరకు కాకతీయ యూనివర్సిటి రిజిస్ట్రార్‌గ పనిచేసిండు. ఆ తర్వాత 1981–91 వరకు పది సంవత్సరాలు హైద్రాబాద్ సీఫెల్ రిజిస్ట్రార్‌గ పనిచేసిండు. ఈ సమయంలోనే మన్మోహన్ సింగ్ యూజిసి (యూనిర్సిటి గ్రాంట్స్ కమీషన్) చైర్మన్ అయ్యిండు. దీంతో నెలకోసారి మన్మోహన్ సింగ్‌ని, జయశంకర్ సార్ కలిసే అవకాశం కలిగింది. జయశంకర్ సార్ ప్రతిభను గుర్తించిన మన్మోహన్ సింగ్ జాతీయ కమిటీల్లో జయశంకర్ సార్‌ని సభ్యుడిగ నియమిస్తూ ఉండేవాడు. జయశంకర్ సార్ 1987లో స్థాపించిన “తెలంగాణ ఇన్‌ఫర్మేషన్ ట్రస్ట్” గౌరవసభ్యులుగ ఉన్నారు. అదేవిధంగ మరుగున పడుతున్న తెలంగాణ వాదాన్ని బతికించాలంటే పత్రికల అవసరం ఎంతగానో ఉందని అదే సంవత్సరంలో కాళోజీతో కలిసి “మా తెలంగాణ” పత్రికను ఆవిష్కరించింద్రు. 1991లో పి.వి. నర్సింహ్మారావు ప్రధానమంత్రిగ ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ ఫైనాన్స్ మినిష్టర్ అయ్యిండు. అప్పుడు సిఫెల్ రిజిస్ట్రార్‌గ కొంతకాలం ఉండి అదే సమయంలో 1991 డిసెంబర్‌లో కాకతీయ యూనివర్సిటి వైస్ ఛాన్స్‌లర్ అయిండు. కాకతీయ విశ్వవిద్యాలయంలో “కాన్వొకేషన్” కార్యక్రమానికి కేవలం ఫోన్ ద్వార మన్మోహన్ సింగ్‌ని ఆహ్వానించిండు. 1991–94 వరకు కాకతీయ యూనివర్సిటి వైస్‌ఛాన్స్‌లర్‌గ ఎనలేని సేవలు అందించిండు. అటెండర్ పోస్టుకు సంబంధించి జిల్లా మంత్రి హాయగ్రీవాచారితో విభేధించిండు. ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చేసిన సిఫారసులు రూల్స్‌కు విరుద్దంగ ఉన్నయని తిప్పి పంపిన ధైర్యవంతుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్.

1996లో ఎన్.డి.ఎ ప్రభుత్వం మూడు రాష్ట్రాను ప్రకటించడంతో మళ్ళీ తెలంగాణ రాష్ర ఆకాంక్ష ప్రజల్లో కదలాడింది. ఉద్యమాన్ని తిరిగి పునరుజ్జీవింప చేయడం కోసం జయశంకర్ సార్ అహర్నిశలు కృషి చేసిండు. 1996 అక్టోబర్ 27న నిజాంబాద్‌లో మొదటి సభ జరిపి, నవంబర్ 1ని తెలంగాణ విద్రోహదినంగ వరంగల్‌లో పెద్ద సభను ఏర్పాటు చేయడంతో పాటు కీలకమైన ఉపన్యాసం చేసిండు. 1997 జనవరిలో గోదావరిఖనిలో మల్లెపల్లి రాజం మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్మారకోపన్యాసం చేసిండు. ఆ ఉపన్యాసం మొత్తాన్ని

"తెలంగాణలో ఏమి జరుగుతుంది" అనే పేరుతో పుస్తకంగ ప్రచురించడం జరిగింది. తెలంగాణ మలిదశ ఉద్యమానికి దాదాపుగ ఇదే మొదటి పుస్తకం.

1996లో చంద్రబాబునాయుడు తెలంగాణ అనే పదం మీదనే నిషేదం విధించిడు. ఎక్కడ ఎవరు తెలంగాణ అంశం మాట్లాడకూడదు అన్నంతగ నిర్బంధం పెంచిండు. ఆరోజుల్లో జయశంకర్ సార్‌కు ఎక్కువగ ఎమ్మె ప్రణయ భాస్కర్ సపోర్ట్ ఉండేది.

ఆ తర్వాత ఎవరి ఊహకు కూడ అందని విధంగ 1996 లో రాజుకున్న తెలంగాణ ఉద్యమానికి ఆయనే ఆద్యుడిగా అందరితో కలిసి అడుగులు వేసిండు. తెలంగాణ విద్యావంతుల వేదికని ఏర్పాటు చేసి కీలక భూమికను పోషించిండు. ఆ తర్వాత టి.ఆర్.ఎస్ పార్టీ ఆవిర్భావంలోను తనదనైన శైలిని కనబర్చిండు.

తెలంగాణ ప్రాంత విద్యార్థులు, బుద్దిజీవులు, కవులు, కళాకారులలో ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను వ్యక్తం చేసే సభలు, సమావేశాలకు కీలకమైన వ్యక్తిగ మారిండు. ఆనాడు విశాలాంధ్రను వ్యతిరేకించిన పాతతరం పెద్దలు ఎందరో తనతో కలిసి నడిసింఁడ్రు. జయశంకర్ భావజాలాన్ని ఊరూర ప్రచారం చేసింఁడ్రు.

1983లో జరిగిన హిమయత్‌నగర్ శాసనసభ ఎన్నికల ఉదంతాన్ని జయశంకర్ సార్ పదేపదే గుర్తుచేస్తుంటడు. దానికి కారణం ఏందంటే ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగ బరిలో నిలిచిన అనామకుడు, స్థానికుడైన నారాయణ గౌడ్ విజయం సాధించడం జరిగింది. ఆయన తట్టుకోలేని ఆనందంతో అకస్మాత్తుగ గుండెపోటుతో చనిపోయిండు. దీంతో అక్కడ ఉప ఎన్నిక వచ్చింది. ఈసారి స్థానికేతరుడైన ఉపెంద్రని తెలుగుదేశం పార్టీ నిలబెట్టింది. ఆయన ఓడిపోయిండు. దీన్ని బట్టి స్థానికేతరులకు తెలంగాణలో బలం లేదనే విషయాన్ని గ్రహించిండు. ఇదే విషయం 1989 ఎన్నికలలో కల్వకుర్తి నియోజకవర్గంలో కూడ జరిగింది. 1989 శాసనసభ ఎన్నికలలో ఎన్.టి. రామారావు ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ మూడు ప్రాంతాల నుంచి శాసన సభ ఎన్నిల బరిలో దిగిండు. కాని తెలంగాణ ప్రాంతంలోని కల్వకుర్తి నియోజక వర్గంలో స్థానికుడైన కాంగ్రేస్ అభ్యర్థి చిత్తరంజన్ దాస్ చేతిలో ఓడిపోయిండు. వీటిని బట్టి తెలంటాణ ప్రజల మనోభావాలు తెలంగాణ వాదానికి అనుకూలంగ ఉన్నయనే విషయాన్ని గ్రహించిండు. తెలంగాణ వాదం ప్రజల్లో సజీవంగ ఉందనే విషయం అందరికి అర్థమయ్యేలా చేయగలిగిండు ఈ సంఘటనల ఆధారంగ.

తెలంగాణ ఐక్యవేదిక (నాన్ పొలిటికల్ అకడమీషన్ గ్రూప్ ) జయశంకర్ సార్, కేశవరావ్‌జాదవ్‌తో కలిసి ఏర్పాటు చేసిండు. భావజాల వ్యాప్తి చేయడమే ప్రధాన లక్ష్యం.

1996 నవంబర్‌లో తెలంగాణ ప్రజాసమితి భూపతి కృష్ణమూర్తి ఏర్పాటు చేసిన సభకు రెండు వందల మంది జనం అనుకుంటె ఐదు వేల మంది వచ్చిండ్రు. ఇంత పెద్ద సభలో అందరు రోజంత మాట్లాడింద్రు. అయినా ఒక హిందు పేపర్ మాత్రమే విషయాన్ని హైలైట్ చేసింది. దీంతో చంద్రబాబు నాయుదు 'వేర్పాటు వాదాన్ని సహించేది లేదు, ఉక్కుపాదంతోని అణిచివేస్తాను' అనడంతో జనాన్ని ఉత్తేజ పరచడానికి మరింత ఆవేశంతో ముందుకు పోయింద్రు. ఢిల్లి ఆలిండియా కాంగ్రేస్ కమిటి కార్యాలయంలో ప్రణబ్‌ముఖర్జీ కమిటీ ముందు అధికారికంగనే రెండు గంటలు అనర్గళంగా మాట్లాడిండు.

అన్నమయ్య, త్యాగయ్యలు దేవుని గురించి రాసిద్రు. తెలంగాణ కవులు, వాగ్గేయకారులు ఇక్కడి వెతల గురించి రాసింద్రు. తెలంగాణ దేవులాట గురించి రాసింద్రని పదేపదే చెప్పేటోడు. తనివితీర ఆనందిచేటోడు.

వాస్తవంగ జయశంకర్ సార్ తయారు చేసిన పత్రాలే 610 జీ.ఓ.కు ఆధారాలు అయినయి. 610 జీవో పై జరిగిన ఉల్లంఘనలన్నింటిని ఒక దగ్గర చేర్చి గిర్‌గ్లాని కమీషన్ ముందు వాదించి ఒప్పించి సాక్ష్యాధారాలతో సహా రుజువు చేసిండు. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమానికి, ముఖ్యంగ ఉద్యోగ సంఘాలకు అవే ఆధారమైనయి.

మేథావి అని ఇతరుల చెప్పుకోవాలె. మనకు మనం అనుకోగూడదని ఎన్నోసార్లు చెప్పిండు. జయశంకర్ సార్ తెలంగాణ ఉద్యమానికి ఒక గొప్ప వరం. ముఖ్యంగ టి.ఆర్.ఎస్ పార్టీకి పునాది రాయి. నక్సల్స్ శాంతి చర్చలకు పోవాల్న వద్దా అన్న చర్చ వచ్చినప్పుడు "విప్లవకారులు నిజమైన శాంతి కాముకులు. చర్చలకు తప్పకుండ పోవాలని వాదించిండు.

జయశంకర్ సార్ కవులు,కళాకారులు, ఉద్యమకారుల్ని అమితంగ ప్రేమించిడు. ముఖ్యంగ ప్రజలను ప్రేమించే గుణం ఉన్నది కాబట్టి కళలు, కళాకారుల పట్ల ఇంకా ఎక్కువ ప్రేమను కలిగి ఉన్నడు. ఒక రకంగ చెప్పాలంటే 1996 నుంచి జయశంకర్ సార్ ఉద్యమకారుల్ని తయారు చేయడంలో నిమగ్నమైండు. అందులో భాగంగానే జయశంకర్ సార్ గద్దర్‌ని కలిసిండు. అనేక ఉద్యమాలకు పాట ఆయువు పట్టు కాబట్టి నీ పాటను ఎక్కుపెట్టాల్సిన సమయం ఆసన్నమైనదని గద్దర్‌కు సూచించిండు. సానుకూలంగ స్పందించిన గద్దర్ "అమ్మా తెలంగాణమా ఆకలి కేకల గానమా

అమ్మనీకు వందనాలమ్మో...కమ్మనీ ప్రేమ నీదమ్మో.." అన్న పాట రాయడంతో జయశంకర్ సార్ ఆనందానికి అవధులు లేవు. "ఎంత పెద్ద పుస్తకం రాసినా ఇంత విషయం జనంలోకి పోదు. పైగా ఈ పాట జనం గుండెలకు హత్తుకపోతదని"

ఆనందాన్ని వ్యక్తం చేసిండు. దగాపడ్డ తెలంగాణ గుండెచప్పుడు వినిపించిన తర్వాత గద్దర్ మీద భువనగిరి సభ అనంతరం కాల్పులు జరిగినయి. ఆ సమయంలో ఐసియులో ఉన్న గద్దర్‌ని చూసి జయశంకర్ సార్ ఏడ్చిండు.

అమెరికాలో 1999లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరాన్ని స్థాపించిండు. తెలంగాణ ఉద్యమంలో ఎన్.ఆర్.ఐ.ల మద్దతును కూడగట్టడం కోసం బ్రిటన్, కెనడా వంటి దేశాల్లో విస్తృతంగ పర్యటించిండు. 2000 సంవత్సరంలో అమెరికాలో జరిగిన తెలంగాణ డెవలప్‌మెంట్ సదస్సు ద్వార తెలంగాణ వెనుకబాటు తనాన్ని అంతర్జాతియ స్థాయిలో ప్రచారం చేసిండు. ఇందులో భాగంగానే అమెరికాలోని పది ముఖ్యమైన నగరాల్లో ఉద్యమ ప్రసంగాలు చేసిండు.

2002 డిసెంబర్ 6న అంబేద్కర్ ట్రస్ట్‌వాళ్ళు ఏర్పాటు చేసిన సభలో "చిన్న రాష్ట్రాలు – అంబేద్కర్ ఆలోచనలు" అనే అంశం మీద రెండు గంటలు మాట్లాడిండు. ఆ సభ ముగింపులో "ఇవాళ నెహ్రూ బతికుంటే నేను ఆనాడే చెప్పాను కలిసి ఉండే పొంతన లేకపోతే ఎప్పుడైనా విడిపోవచ్చునని, ఇప్పుడు తెలంగాణ విడిపోవాలనే చెబుతాను అంటాడు. ఫజల్ అలీ బతికుంటే నేను ఆనాడే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగ ఉండాలని తీర్పు ఇచ్చాను. ఇప్పుడూ ఆ మాటే చెబుతాను అంటాడు. అంబేద్కర్ బతికుంటే దోపిడికి, అణిచివేతకు, వివక్షకు గురైతున్న తెలంగాణను చూసి తానే ఉద్యమానికి నాయకత్వం వహించేవాడు అనడంతో ప్రెస్‌క్లబ్ ప్రతిధ్వనించింది.

1969 ఉద్యమం సంధర్భంగ తెలంగాణ యూనివర్సిటి టీచర్స్ కన్వెన్షన్ ఏర్పాటు చేసి, ఆ సదస్సులో వచ్చిన ప్రసంగాలనన్నింటిని 'తెలంగా ణ మూవ్‌మెంట్ యాన్ ఇన్వెస్టిగేషన్ ఫోకస్" పేరుతో జయశంకర్ సార్ మరియు ఆయన మిత్రుడు తోట ఆనందరావు పుస్తకంగ ప్రచురించిండ్రు.

జయశంకర్ సార్ తెలుగులో, ఇంగ్లీషులో అనేక వ్యాసాలు రాసిండు. ఇంటర్వ్యూలు ఇచ్చిండు. పుస్తకాలు రాసిండు. సార్ రాసిన 'తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్' ఎప్పటికీ డిమాండ్ ఉన్నటువంటిదే.

"ప్రజలకు కష్టాలు తెలుసు ఆకష్టాలు ఎందుకున్నవో వాటి మూల కారణాలు వారికి తెలియవు. మేథావులుగ మనం చేయాల్సింది ప్రజలకు కష్టాలు ఎందుకున్నవి చెప్పటం. కారణాలు తెలిస్తే కష్టాలు తీరే మార్గాన్ని ప్రజలే ఎన్నుకుంటరు" అనే లోతైన జ్ఞానాన్ని తెలంగాణ లీడర్లకు అందించిండు.

తెలంగాణ ప్రాంతంలోని సమస్యల మీద అధ్యయనం చేస్తున్న "సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్" సంస్థకు జీవితకాల చైర్మన్‌గ వ్యవహరించిండు.

కేసీఆర్ కేంద్రంలో మంత్రి పదవి చేపట్టి తెలంగాణ కోసం జాతీయ స్థాయిలో మద్దతును కూడగడుతుండు. అదే సమయంలో ప్రధాని ప్రతిపాదన మేరకు జయశంకర్ సార్ కూడ కేవలం తెలంగాణ విషయమై ఢిల్లీలో ఉండడం కోసమే ఒక అధికారిక పదవిలో చేరిండు.

శ్రీకృష్ణ కమిటీకి ఇవ్వాల్సిన రిపోర్టును జయశంకర్ సార్ నెలరోజుల పాటు కష్టపడి తయారు చేసిండు. కమిటీకి నివేదికలు సమర్పించే ఆ సమయంలో జనవరి నుంచి ఏప్రిల్ వరకు సార్ ఏనాడు రాత్రి 2గంటల కన్న ముందు నిద్రపోలేదు. ఆ రిపోర్టు పుస్తకాన్ని 2010 జూలై 23న కరీంనగర్ ఫిల్మ్‌భవన్‌లో ఆవిష్కరించిండు. దీర్ఘకాలిక ఉద్యమంలో హింసకు తావుండకూడదని చెప్పిండు. 1952, 1969 ఉద్యమాల నించి నేర్చుకున్న గుణపాఠం అదేనని, శాంతియుత పోరాటమే శరణ్యమని పదేపదే గుర్తుచేసిండు.

పురందేశ్వరి దేవి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రిగా ఉన్నప్పుడు విశాఖపట్నంలో మైనింగ్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వై.యస్. మీద ఒత్తిడి తెచ్చింది. దానికి ఆయన అనుమతి ఇచ్చిండు. దీనికి వ్యతిరేకంగ 'తెలంగాణ విద్యావంతుల వేదిక' హైద్రాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నరు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జయశంకర్ సార్ మాట్లాడుతూ "సముద్రగర్భ శాస్త్రానికి సంబంధించిన కోర్సులను హైద్రాబాద్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం ఎంత హాస్యాస్పదంగ ఉంటుందో విశాఖపట్నంలో మైనింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరడం అంతే తెలివి తక్కువగా ఉంటుంది. మైనింగ్ విశ్వవిద్యాలయాన్ని కోల్‌బెల్ట్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ 'తెలంగాణ విద్యావంతుల వేదిక' పెద్దఎత్తున ఉద్యమించింది. దీని ఫలితమే ఈ ఆలోచన సీమాంధ్రుల్లో కలిగింది. ఆలోచన మనం చేస్తే అమలు చేసుకోవడం వాళ్ళ వంతు.

2009లోనే ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముంపు బారిన పడుతున్న కోటిలింగాల ప్రాంతాన్ని రక్షించుకునేందుకు తెలంగాణ విద్యావంతుల వేదిక పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపట్టింది.

తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్‌లో 2009 జూన్ 14న ప్రొఫెసర్ ఒక సమావేశం ఏర్పాటు చేసిండు. దీనికి పెద్దఎత్తున వచ్చిన ప్రవాసాంధ్రులు, విద్యార్థులు, మేధావులు, మీతోపాటు మిగిలిన అందరు కేసీఆర్ ఒంటెద్దు పోకడలను సమర్థించడం వల్లనే తెలంగాణ ఉద్యమం ఇన్ని

వైఫల్యాలకు గుర్రైనట్టు మాట్లాడడం జరిగింది ఆ సమయంలో జయశంకర్ సార్ "మేం కేసీఆర్‌తో ఉన్నమాట వాస్తవం. మేం చెప్పినట్టు ఆయన నడుస్తున్నాడో ఆయన చెప్పినట్టు మేం నడుస్తున్నమో అది వేరే సంగతి. ఏది ఏమైనా జరిగినదది. ఆయన తెలంగాణ ఉద్యమాన్ని తనకనువైన ధోరణిలో నడిపిస్తున్నాడు. మేం ఆయన వెంటే ఉన్నం. ఉంటాం కూడ. మేం చేస్తున్న పని మీకు నచ్చవలసిన అవసరం లేదు. మీతో విభేదించవలసిన అగత్యం మాకు అంతకన్నా లేదు. మా పైన మీరు ఏర్పరుచుకున్న అభిప్రాయాలు తప్పు అనిగాని, మేం చేస్తున్న పనులు కరెక్ట్ అని మిమ్మల్ని విమర్శించడం కాని, మమ్మల్ని మేం సమర్థించుకోవడం గాని చేయడం లేదు. మేము అనుసరిస్తున్న పంథా సరైనది కాదని మీకు తోస్తే మీకు నచ్చిన నాయకుడి వెంట, మీకు ఉత్తమమని తోచిన ఉద్యమ పంథాలో వెళ్ళండి. మిమ్మల్ని ఎవరూ అడ్డుకోవడం లేదు" అనడంతో దాదాపు అందరి నోళ్ళు మూతపడ్డయ్.

అనేక సభల్లో కేసీఆర్‌తో పాటు జయశంకర్ సార్ పాల్గొంటు ఉండేవాడు. సార్‌కు ఎవరైన గులాభి కండువ కప్పే ప్రయత్నం చేస్తే సున్నితంగ తిరస్కరించేవాడు. కేసీఆర్ కూడ ఆ విషయాన్ని చూసి చూడనట్టు ఉండేవాడు. అయితే ఒకసారి మాత్రం ఒకవ్యక్తి బలవంతంగ గులాబి కండువ కప్పే ప్రయత్నం చేస్తుంటే పక్కనే ఉన్న కేసీఆర్ స్పందించి "జగమెరిగిన తెలంగాణ వాదికి జెండాలెందుకయ్య" అనడంతో వేదికమీద నవ్వులు విరబూసినయ్.

జయశంకర్ సార్‌ని కేసీఆర్ స్వంత తండ్రి లెక్క చూసుకుంటడు. కేసీఆర్ ప్రతి పుట్టిన రోజుకు జయశంకర్ సార్‌కు పాదాభివందనం చేసినంకనే మిగత కార్యక్రమాలు చేపడతడు.

కేసీఆర్ దీక్ష చేపడుతున్నట్టు ప్రకటించిన సందర్భంలో నవంబర్ 27, 2009న ఆయన కరీంనగర్ తెలంగాణ భవన్‌లోనే ఉన్నడు. కేసీఆర్ నిరాహార దీక్ష సమయంలో జయశంకర్ సార్ పోషించిన పాత్ర అమోఘమైనది, అనితర సాధ్యమైనది. కేసీఆర్ దీక్ష మొదలు పెడతానని ప్రకటించినప్పటి నుంచి కేసీఆర్‌ని విడువకుండ వెంటనే ఉన్నడు. ముఖ్యంగ ఖమ్మం జైళ్ళో, దావఖానలో పడ్డ బాధలు ఇన్నీ అన్నీ కావు. ఆ సమయంలో కేసీఆర్‌ని కొడుకులెక్క చూసుకుండు. కంటికి రెప్పలా కాపాడిండు. సీమాంధ్ర ప్రభుత్వం కేసీఆర్ ప్రాణాలను తీయడానికి జరిగే కుట్రలను ఎప్పటికప్పుడు గమనించిండు. ఉద్యమాన్ని అబాసు పాలు చేయాలని వేసిన ఎత్తుగడలను చిత్తు చేసిండు. కేసీఆర్ కుటుంబానికి, తెలంగాణ సమాజానికి ఓదార్పు నిచ్చిండు. గొప్ప శక్తితో ముందుకు నడిపించిండు. 2009 డిసెంబర్ 9న సోనియాగాంధి రాజకీయ

సలహాదారు అహ్మద్ పటేల్ జయశంకర్ సార్‌కు ఫోన్ చేసి దీక్ష విరమింపజేయాలని కోరిండు. ఆ తర్వాత కొద్ది సేపటికే హోంమంత్రి చిదంబరం ఫోన్ చేసి ప్రకటన ఎట్ల ఉండాలని అడిగిండు. సార్‌నే డక్టేట్ చేయమని కోరిండు. చిదంబరం కూడ జయశంకర్ సార్‌ని సార్ సార్ అని సంబోధించడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ విధంగ తెలంగాణ ప్రకటనకు నోట్ తయారు చేసిన ఘనత జయశంకర్ సార్‌ది.

2009 డిసెంబర్9 ప్రకటన వచ్చిన తర్వాత సీమాంధ్ర కృత్రిమ ఉద్యమం వల్ల తలెత్తిన వివాదం ప్రకటన వెనకకు పోయిన సందర్భంలో కూడ అధైర్యపడని ధీరత్వం జయశంకర్ సార్‌ది. తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఆజన్మ బ్రహ్మచారిగా మారి అలుపులేని పోరాటం చేసిన తెలంగాణ స్వాప్నికుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్.

డిసెంబర్ 9 ప్రకటన అకస్మాత్తుగ వచ్చింది కాదు. దాని వెనక చాలా నేపథ్యం ఉన్నది. మాట తప్పిన పార్టీలను పిలిచి మాట్లాడుకుంటే సరిపోతది. ఆంధ్ర ప్రాంత రాజకీయ నాయకులు చాల సక్సెస్‌ఫుల్‌గ కుల రాజకీయాలు చేసింద్రు. డిసెంబర్ 9న కేంద్రప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందని దాన్ని అమలు చేసే బాధ్యత కూడ వాళ్ళదేనని, లేని పక్షంలో కేంద్రం మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించే బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని అన్నడు.

ప్రజల భాగస్వామ్యమే రాజకీయ నాయకుల మెడలు వంచుతుందని జయశంకర్ సార్‌కు అపారమైన నమ్మకం ఉండేది. జెఎసి ఆధ్వర్యంలో 'పాలమూరు ప్రజల ధర్మాగ్రహం – లక్షమందితో సత్యాగ్రహం' అనే కార్యక్రమాన్ని కనీవినీ ఎరుగని రీతిలో జరిపింద్రు. లక్షంటే నాలుగు లక్షల మంది జనం వచ్చింద్రు. రోజంత రోడ్లమీద దీక్ష చేసింద్రు. దీంతో జయశంకర్ సార్ అనుకున్నది అయితదనే నమ్మకం కలిగింది. ఉద్యమంలో ప్రజలు మమేకమై కలిసి రావడం వల్ల కల సాకారమైతదని భావించిండు.

జయశంకర్ సార్ జాతియ, అంతర్జాతీయ వేదికల మీద తెలంగాణ అంశాన్ని అతి సునాయాసంగ ప్రజలకు వివరించిన గొప్ప ఉపన్యాసకుడు. ఎప్పుడు ఎవరిని దూశించకుండ కేవలం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని మాత్రమే ప్రజలకు వివరించి చెప్పిండు. ప్రభుత్వాల మెడలు వంచేలా జనాన్ని తయారు చేసిండు. జయశంకర్ సార్ ప్రభావంతోనే "తెలంగాణకు ద్రోహం చేసే వాడు ప్రాంతేతరుడైతే ప్రాంతందకా తరిమికొట్టండి. ప్రాంతంవాడే దోపిడి చేస్తే ప్రాంతంలోనే పాతరపెట్టండి" అనే పిలుపునిచ్చిండు కాళోజీ నారాయణరావు. జాతీయస్థాయిలో తెలంగాణకు మద్దతు కూడగట్టడంలోను, అందరిలోను ఏకాభిప్రాయాన్ని సాధించడంలోను కేసీఆర్‌కు అండగ నిలబడ్డడు. తన సుసంపన్నమైన మేధస్సుతో, వాక్చాతుర్యంతో కేంద్రప్రభుత్వ పెద్దలను

ఒప్పించిన తీరు అమోఘమైనది. కేసీఆర్ లాంటి వ్యక్తులు బహిరంగంగానే జయశంకర్ సార్ కాళ్ళకు దండం పెట్టిండ్రంటే ఆయన వ్యక్తిత్వం ఎంత ఉన్నతమైనదో, ఆదర్శప్రాయమైనదో మనం అర్థం చేసుకోవచ్చు.

రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్వయంగ జయశంకర్ సార్‌ని పిలిపించుకొని తెలంగాణ అంశం మీద మాట్లాడిండు. ప్రధాని మన్మోహన్ సింగ్ కోరిక మేరకు యు.పి.ఎ ప్రభుత్వం ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. ఈ ప్రణాళికలో తెలంగాణ అంశాన్ని ఏవిధంగ చేర్చాలనే సూచన చేసింది జయశంకర్ సార్. 2009 డిసెంబర్ 9న హోంమంత్రి చిదంబరం తయారు చేసిన ప్రకటనను రూపొందించింది కూడ జయశంకర్ సారే.

జయశంకర్ సార్‌ని ఎక్కువసార్లు ఇంటర్వ్యూ చేసిన వ్యక్తిగ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణిని చెప్పుకోవచ్చు. చక్రపాణి ఒక టీవి ఛానెల్ కోసం దాదాపు మూడు గంటల పాటు ఇంటర్వ్యూ చేసిన అనంతరం "అరవయ్యేండ్ల తెలంగాణ పోరాట చరిత్ర ఆవిష్కృతమైంది" అని ఇంటర్వ్యూని ముగించడం జరిగింది.

జయశంకర్ సార్‌లో ఒక గొప్ప రాజకీయ విశ్లేషణ ఉంటది. కాంగ్రేసు అధిష్టానం బొత్స సత్యనారాయణను కాంగ్రేసు అధ్యక్షునిగ చేసినప్పుడు సీమాంధ్రకు కాంగ్రేసు ముఖ్యమంత్రిన తయారు చేసుకుంటున్నది. కనుక కేంద్రం తెలంగాణ ఇవ్వడానికి మానసికంగ సిద్దపడుతున్నది" అనడంలో విశాల దృక్పథంతో కూడిన రాజకీయ విశ్లేషణ ఉన్నది.

ఈయన 2004 నుంచి 2006 మధ్య కాలంలో న్యూఢిల్లీలోని ప్రభుత్వ జాతీయ కమీషన్ ఆర్గనైజింగ్ సెక్టార్ మెంబర్‌గ పనిచేసిండు. కేరళలోని మహాత్మగాంధీ వర్సిటి ప్లానింగ్‌బోర్డు సభ్యుడిగ పనిచేసిండు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్ సభ్యుడిగ, యూజిసి వర్కింగ్ కమిటి సభ్యుడిగ సేవలు అందించిండు. ఉస్మానియ, కాకతీయ కళాశాలల్లో సెనేట్ మరియు అకడమిక్ కౌన్సిల్ సభ్యుడిగ పనిచేసిండు.

జయశంకర్‌సార్ తెలంగాణ ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శిగ పనిచేసిండు. భారత యూనివర్సిటి కళాశాలల అధ్యాపకుల సమాఖ్య ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గ పనిచేసిండు.

ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హైద్రాబాద్‌లోని అమెరికన్ స్టడీస్ రీసెర్చ్ సెంటర్‌లలో ఆయన జీవితకాల సభ్యుడిగ కొనసాగిండు.

తన జీవితంలో ఎన్నో కీర్తి శిఖరాలను అధిరోహించిన జయశంకర్‌సార్

తనకంటు ఏమి మిగుల్చుకోలేదు. జయశంకర్ సార్ ఊర్లో తండ్రి సంపాదించిన ఆస్తి తన భాగానికి వచ్చిన రెండెకరాల భూమిని కూడ అక్కంపేట హైస్కూల్‌కు ఇచ్చేసిండు.

21 జూన్, 2011 మంగళవారం ఉదయం 11.15ని॥ జయశంకర్ సార్ తుది శ్వాస విడిచిండు. అక్కడ ఆ సమయంలో అమెరికాలో ఉండే జయశంకర్ సార్ తమ్ముడు ప్రసాదరావు ఆయన భార్య, కొడుకు లాంటి బ్రహ్మం, ఒక నర్సు, ఒక డాక్టర్, సార్ బాల్యమిత్రుడు వెంకటేశ్వర్లు ఉన్నరు. సార్ భౌతిక కాయం మీద తెల్లటిగుడ్డ కప్పిండ్రు. టీవీలో స్క్రోలింగ్ మొదలైందో లేదో వెంటనే హన్మకొండలోని అడ్వకేట్స్ కాలనీ వైపు జనప్రవాహం మొదలైంది. 22వ తేది బుధవారం నాడు ఏకశిల పార్కు నుంచి పద్మాక్షమ్మ గుట్ట దగ్గరున్న శివధామం దాక బుధవారం సాగిన స్ఫూర్తి యాత్రలో 'జయశంకర్ సార్ అమర్ హై" జయశంకర్ సార్ ఆశయాన్ని సాధిస్తాం అంటూ దాదాపు మూడు కిలోమీటర్లు ఎండను లెక్కచేయకుండ నడిసిండ్రు.

## తెలుగు భాష – జయశంకర్ సార్

తెలంగాణవాళ్ళు మాట్లాడే తెలుగు భాష గురించి ఆంధ్ర ప్రాంతం వారికి కొన్ని విచిత్రమైన అభిప్రాయాలు ఉన్నయి. ఇక్కడ మాట్లాడే తెలుగు అసలు తెలుగే కాదని కొందరు, కాకపోతే కల్తీ తెలుగని, నకిలీ తెలుగని, ఉర్దూ మయమైన తెలుగని ఎవరికి తోసినట్టు వాళ్ళు మాట్లాడ్తరు. ఈ సంధర్భంగ జయశంకర్ సర్ ప్రస్తావించిన ఒక సంఘటనలోని అంశాలు సార్ మాటల్లోనే..

“1968–69లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఉధృతంగ నడుస్తున్నప్పుడు ఒక అనుభవం ఎదురైంది. ఆ రోజుల్లో జంధ్యాల పాపయ్య శాస్త్రి ఒక గేయంలో, ఒకవేళ ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే, అది దక్షిణ పాకిస్థానం అవుతుందని రాశాడు. అంతేకాదు తురక భాషతో తెలుగును భ్రష్టు పట్టిస్తున్నారు అన్నడు. అది అర్థం కాక నేను, ఇంకో మిత్రుడు ఆయన దగ్గరికి వెళ్ళి 'శాస్త్రిగారు మీ బాధేమిటని' అడిగాము. దానికి ఆయన సమాధానమిస్తూ "ప్రత్యేక తెలంగాణలో తెలుగంత భ్రష్టుపట్టిపోయి, అది పూర్తిగా తౌరక్యాంధ్రం అవుతుందని అన్నాడు. తౌరక్యాంధ్రం అంటే తురకలు మాట్లాడే ఉర్దూమయమైన తెలుగు అని ఆయన వివరించాడు. దానికి మేము స్పందిస్తూ ఉర్దూ కేవలం తురకల భాషే కాదని, అద ఒక సంపన్నమైన, మధురమైన భారతీయ భాష అని చెప్పాము. అంతే కాక మతానికి భాష అవసరం కావచ్చు కానీ, భాషకు ఒక మతమంటూ ఉండదని అన్నాము. ఒక వేళ ఉర్దూ ముస్లీంల భాష అయితే

ఇంగ్లీషు ఏ మతం వారి భాష అవుతుంది? అది కేవలం క్రైస్తవుల భాషే అని అనగలమా? అటువంటప్పుడు హిందువులది ఏ భాష అని చెప్పాలి? ఈ దేశంలో మాట్లాడే భాషలన్ని హిందువుల భాషలు కావా? ఉర్దూ కూడ భారతదేశంలో పుట్టి విస్తరించి అనేక భారతీయ భాషలను ప్రభావితం చేసి, వాటితో ప్రభావితమైన భాషే కదా. నిజానికి తెలంగాణ వారికంటే ఆంధ్ర ప్రాంతం వారు మాట్లాడే తెలుగులోనే ఎక్కువ ఉర్దూ పదాలు ఉంటాయని పాపయ్య గారికి వివరించే ప్రయత్నం చేశాము.

కానీ ఆయన నమ్మే పరిస్థితిలో లేరు.

అప్పుడు ఒక తెలుగు దినపత్రికను తీసి మొదటి పేజీలో ఉన్న ఒక హెడ్‌లైన్ ఆయనకు చూపించాము. అది 'నిజాంబాద్ జైలు నుండి ఐదుగురు ఖైదీల పరారి' అని వుంది. ఇందులో జైలు, ఖైది, పరారి అన్ని ఉర్దూ పదాలే అన్నాము. దానికి శాస్త్రి గారు 'అట్లానా' అన్నడు. మా చర్చను కొనసాగిస్తూ శాస్త్రి గారితో మీ కవిత్వంలో కూడ ఉర్దూ పదాలు ఉన్నాయి కదా అన్నాము. ఎక్కడ అని ఆయన ఆశ్చర్యంగ అడిగిండు. అప్పుడు పాపయ్యగారి రచనల నుండే కొన్ని ఉదాహరణలు చూపించాము. ఒక పద్యంలో

'రాజాజీ మున్నగు పెద్దలకు మా రాష్ట్రమ్ము మాటంటేనే బేజారెత్తెను గుండె' అని అన్నాడు. బేజారు అన్నది ఉర్దూ పదమే కదా! అదే విధంగ విజయశ్రీలో జెండా, పంఖా అనే ఉర్దూ పదాలను వాడాడు. ఈ చర్చను మరింత కొనసాగిస్తు మీరే కాదు, చాలామంది ప్రసిద్ధ తెలుగు కవులు అనేక ఉర్దూ పదాలను వాడినారు. ఉదాహరణకు గుర్రం జాషువా 'ఫకీరుల, బీద శూన్యపాత్రలన్' అని రాశాడు. ఫకీరు ఉర్దూ పదమే కదా! ఇక శ్రీశ్రీ మహాప్రస్థానంలో పారశీ భూయిష్టమైన ఉర్దూ పదాలను చాలా విరివిగా వాడినాడు. తారీఖులు, దస్తావేజులు, మతలబులు, కైఫీయత్తులు, కదం, దగా మొదలైన పదాలు శ్రీశ్రీ కవిత్వానికి సౌందర్యంతో పాటు అమరత్వాన్ని కూడ ప్రసాదించాయి.

ఇక వ్యవహార భాష విషయానికి వస్తే ఆంధ్ర ప్రాంతపు తెలుగువారు, తెలంగాణ ప్రాంతపు తెలుగువారి కంటే ఉర్దూ పదాలను చాలా విరివిగా వాడుతారు. ఈ వాస్తవానికి తెలుగు ప్రసార మాధ్యమాలు దర్పణం పడతాయి. తెలుగు వాడుక భాషలో మిళితమైన ఉర్దూ పదాలు కోకొల్లలు. కానీ అవి ఉర్దూ పదాలనే విషయం వాటిని వాడే వారికి బహుశ తెలియదు. ఈ సంధర్భంగా మచ్చుకు కొన్ని పదాలు పాపయ్యశాస్త్రి గారికి వినిపించాము. అవి దరఖాస్తు, మంజూరు, ఫిర్యాదు, అర్జీ, పైరవీ, తనిఖీ, తనఖా, ముసాయిదా, వకాల్తా, వకీలు, తర్జుమా, ఖాతరు, బేతరు,

బేఖాతరు, బేవార్సు, హైరానా, నజరానా, పేషీ, అజమాయిషీ, రాజీ, రాజీనామా, జమీందారు, ఖబర్దారు, జబర్దస్తీ, కలేజా, కుస్తీ, కదం, కందకం, బురుజు, దగాకోరు, దగుల్బాజీ, ఖాలి, ధోకా, నామోషీ, మజాఆక, బహదూరు, బినామీ, బేకారు, బాపతు, బద్‌నామ్, తడాక, వాపసు, పరారీ, గోరీ, పంచాయితీ, ఫైసలా, కసరత్తు, మద్దతు, వాయిదా, జవాబు, సవాళ్ళు, తాఖీదు, తయారు, తాలూకు, ఇలాకా, సిఫార్సు, నకలు, సిపాయి, మహాజరు, ఆదా, బందు, గూండా, పహిల్వాన్, బద్మాష్, దాదాగిరీ, కితాబు, నమూనా, నకిలీ, నగిషీ, లడాయి, కబ్జా, తమాషా, షికారు, జల్సా, పుకారు, నిషా, ఖుషీ, మజా, మిఠాయి, ఖారా, ఖూనీ, ఖజానా, ఖాతా, జమా, ఖర్చు, చిల్లర, నగదు, బాకీ, వసూళ్ళు, దుకాణం, బజారు, చందా, జరిమానా, ఇలాంటి ఇంకా ఎన్నో వందల పదాలు ఉన్నాయి. ఆంధ్ర అంతటా వాడే తెలుగు భాషలో ఉర్దూ పదాలు ఇంత విరివిగా ప్రవేశించిన నేపథ్యంలో, తెలంగాణలో మాట్లాడే తెలుగును తౌరక్యాంధ్రం అనడం ఎక్కడి న్యాయం, ఎంతటి న్యాయం అని అంటే, పాపయ్య శాస్త్రి నివ్వెర పోయాడు.

భాషకు మతం ఉండదు. మతానికి భాష ఉంటుంది. మనది తురకల భాష ఎలా అయ్యింది. నేను ఉర్దూలోనే చదువుకున్న. సీమాంధ్రులు రాసిన కవిత్వంలో, నిత్యజీవితంలో లెక్కలేనన్ని ఉర్దూ పదాలు ఉపయోగిస్తరు. అయితే విషాదం ఏంటంటే సీమాంధ్రులకు వాళ్ళు వాడింది ఉర్దూపదం అనేది వాళ్ళకు తెలియదు. అందుకే ఎవడి భాష వానికే ప్రామాణికం.

అధిక సంఖ్యలో ఉన్న ఆంధ్రులు ఏమి అన్నా చెల్లుతుంది. కానీ అల్పసంఖ్యలో ఉన్న తెలంగాణ వారు నిజం చెప్పినా చెల్లదు. దీనినే అంబేద్కర్ పరిభాషలో చెప్పాలంటే మైనారిటీ వర్గంపై మెజారిటీ పెత్తందారీతనం అవుతుంది" అని జయశంకర్ సార్ పాపయ్య శాస్త్రిని తూర్పారబట్టిండు. సీమాంధ్ర కవులు, రచయితలు, జర్నలిస్టులు ఎన్ని ఉర్దూ పదాలు ఉపయోగిస్తరో జల్లెడపట్టి చూపించిండు.

## జయశంకర్ సార్ ఆఖరి ప్రసంగం

నమస్తే తెలంగాణ దినపత్రి ఆవిష్కరణ సభలో...

"ఈ కోరిక ఈనాటిది కాదు. ఈ అవసరం ఇప్పటిది కాదు. గత యాభై సంవత్సరాల నుంచి ఆలోచిస్తూనే ఉన్నం. అప్పుడప్పుడు కొన్ని ప్రయత్నాలు జరిగినయి కాని ఫలించలేదు. దానికి కారణం సీమాంధ్ర పెట్టుబడిదారుల గుత్తాధిపత్యంలో ఉన్నటువంటి ప్రసారమాధ్యమాలు, వాటిని పూర్తిగా సమర్థిస్తున్న పాలకవర్గాలు.

కనుకనే ఇంతకాలం పట్టింది. ఇప్పుడు ఈ పత్రికకు ఎలాంటి అవాంతరాలు ఉండవు. ఇది ప్రజల పత్రిక. సమర్థవంతమైన యాజమాన్యం ఉంది. నిష్ణాతులైన సంపాదకవర్గం ఉంది. ఈ ఉద్యమానికి చోదక వ్యక్తిగ ఉన్నటువంటి కేసీఆర్ అండదండలున్నాయి. కనుక దీనికి ప్రమాదం ఉండదు. అసలు ఏంజరిగింది. ఈ యాబయ్యేండ్ల కాలంలో ఇంతకుమందే అల్లం నారాయణ గారు చెప్పింద్రు. వాస్తవాలను మభ్యపెట్టడం, మరుగున పడేయడం, లేకపోతే వక్రీకరించడం జరిగింది. ఇది యాబై ఏళ్ళు భరించినం. మిమ్మల్ని ఎక్కువగా విసిగించను. ఇప్పటికే నారాయణగారు వివరించింద్రు. ఒకటి రెండు ఉదాహరణలు మాత్రమే ఇస్తాను నేను. అవి కూడ మీకు తెలియనివి కావు. మీరు జ్ఞాపంక చేసుకుంటారని.

మలిదశ తెలంగాణ ఉద్యమం పుంజుకున్నాక ఈ పత్రికలు చేసిన విషప్రచాం ఏందంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కృష్ణా, గోదావరి నదీ జలాలు ఒక్క నీటి చుక్క కూడ ఆంధ్ర ప్రాంతానికి రావు, ఆ ప్రాంతం అంతా ఎడారిగా మారిపోతుందని ఒక దుష్ప్రచారం చేశాయి. ఎంత వాస్తవ విరుద్ధం! దానికే పదేపదే ప్రాచుర్యం లభించింది మీడియాలో. కానీ, మనం ఏం చెప్పాం. కృష్ణా గోదావరి నదులకు కాలువ అడ్డం వేస్తే అవి ఆగేవి కావు. అంతే కాదు, ఈ నదీ జలాల్లో తెలంగాణ వారు కోరుకున్నది ఈ ప్రాంతానికి న్యాయబద్దంగ రావాల్సింది రావాలని. అంధ్ర ప్రాంతానికిగానీ, రాయలసీమ ప్రాంతానికి గానీ చట్టబద్దంగ, న్యాయబద్దంగ ఎంత నీరు కావాలో అంత నీరు ఇవ్వాల్సిందే. దానికి మా అభ్యంతరం లేదు. కానీ, దీనికి ప్రాచుర్యం ఇవ్వలేదు. ఎందుకు ఇవ్వలేదంటే? ఆంధ్ర ప్రాంత ప్రజానీకాన్ని తెలంగాణ ప్రాంత ఉద్యమానికి వ్యతిరేకంగ బ్రెయిన్‌వాష్ చేసే ఉద్దేశంతో ఇటువంటి విషప్రచారం చేస్తూ వచ్చింది. విగ్రహాల గురించి ఒక్కటే ఒక సంఘటన మీ దృష్టికి తీసుకువస్తాను. విగ్రహాల విధ్వంసం వేరు. రాసుకుంటే రాసుకోండి. అప్పుడప్పుడు కొంతమంది ఆంధ్రప్రాంత మిత్రులు అంటారు, తెలంగాణ ప్రాంత వైతాళికుల విగ్రహాలు పెట్టమని మీరు ఎందుకు అడగలేదు. మేము వద్దన్నామా అంటూ వాపోయారు. ఒ సంఘటన అందులో ప్రత్యక్ష భాగస్వామిని, సజీవసాక్షిని గనుక మనవి చేస్తున్నాను. దాశరథి గొప్ప కవి. శ్రీశ్రీ, జాషువాతో పాటు దాశరథి విగ్రహాన్ని పెట్టమని అప్పుడే ప్రశ్నించాం. చివరకు దాశరథి ఎట్ల చనిపోయిండు? ఎన్.టి రామారావు అవమాన పరిచిండు. ఆయన ముఖ్యమంత్రి కాకముందు దాశరథి ఆంధ్రప్రదేశ్‌లో ఆస్థాన కవిగా ఉండేవారు. ఎన్.టి. రామారావు వచ్చిన తర్వాత చేసిన మొదటి పని దాశరథిని ఆ సీట్లోంచి తొలగించిండం. నిరసన తెలిపాం. దాశరథి కూడ తెలిపాడు. ఎన్.టి. రామారావు

దాశరథి పట్ల మంచిగ ప్రవర్తించలేదు. ఆ అవమానభారం మోయలేక పరమపదించిండు. ఈ వాస్తవాలు ఆంధ్ర పత్రికలకు తెలియదా? ఎందుకు రాయలేదు. ఆ రోజు అనేక విగ్రహాలతో పాటు దాశరథి విగ్రహం గురించి ప్రత్యక్షంగ చర్చకు వచ్చినప్పుడు పత్రికలు పట్టించుకోలేదు. విగ్రహాల విధ్వంసం గురించి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఓవైసీ ఏమన్నాడు? విగ్రహాలను కూలదోయాలని ఆరోజు అన్నాం. ఈ రోజు అంటాం అని అన్నాడు. ఎందుకంటే వివక్ష ఉంది కాబట్టే. విగ్రహాలు కూలగొట్టడాన్ని గురించి ప్రముఖంగా రాసిన సీమాంధ్ర పత్రికలు అక్బరుద్దీన్ ప్రసంగం గురించి ఎందుకు రాయలేదు? వివక్ష, అర్ధసత్యాలు, అసత్యాలు వాస్తవాల వక్రీకరణ జరగడం వల్లనే తెలంగాణ ప్రాంతానికే కాదు, నిజంగా ఆంధ్ర ప్రాంత సామాన్య ప్రజానీకానికి కూడా వాస్తవాలు తెలియకుండా చాలా అన్యాయం జరిగింది. ఎందుకంటే వాళ్ళ దృష్టికి వాస్తవాలు పోలేదు. మనం ఎంత మొరపెట్టుకున్నా వాస్తవాలు వాళ్ళ దృష్టికి పోలేదు. ఉద్దేశ పూర్వకంగ చేస్తూ పోయారు. ఎట్లా రాస్తారంటే వాళ్ళు ముఖ్యంగ గత పదేండ్ల నుంచి తెలంగాణ ప్రాంతంలో ఉద్యమం ఉధృతం అయ్యింది. వివిధ కార్యక్రమాలు చేపట్టాం. లక్షాయాభైవేల పాల్గొన్నారు. ఈ ప్రోగ్రామ్ గురించి తెలంగాణ ప్రాంత ఎడిషన్‌లలో మాత్రమే కొద్దో గొప్పో రాసేవాళ్ళు. ఆంధ్ర ప్రాంత ఎడిషన్‌లలో చూస్తే ఎక్కడ కనపడవు. ఇది వాస్తవాన్ని కప్పిపుచ్చడం కాదా..వక్రికరించడం కాదా? కనుకనే ఇవన్నీ భరించిన తర్వాత మన వాణిని వినిపించేందుకు అవసరమని భావించండం వల్లే ఈ పత్రిక వచ్చింది. రాష్ట్ర సాధన జరిగిన తర్వాత తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణం కొరకు ఒక ఉపకరణంగ దీన్ని వాడుకోవాలె. ఇది ఒక నిరంతర ప్రక్రియ. ఈ రోజుతో ముగిసేది కాదు. కనుక మనం పౌరులుగా ఈ బాధ్యతను గుర్తించి సంపాదకవర్గానికి, యాజమాన్యానికి సంపూర్ణ మద్దతునిచ్చి ఈ పత్రిక తెలంగాణ ప్రాంతంలోనే కాదు, మొత్తం దేశంలో తలమానికంగా మారేలా తీర్చిదిద్దుకోవాలని ఆశిస్తూ... అలా వస్తుందని విశ్వసిస్తున్నా... జై తెలంగాణ.

## జయశంకర్ సార్ దృష్టిలో భవిష్యత్ తెలంగాణ

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన వెంటనే త్వరితగతిన అభివృద్ధిని సాధిస్తుంది. నీళ్ళలో మన వాటా తేలిన తర్వాత జలవనరుల విషయంలో మనకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది.

స్వయం పాలనలో శాసిస్తాం. ఇతరుల పాలనలో యాచిస్తాం.

పెద్ద ప్రాజెక్టుల సంగతి కాసేపు పక్కన పెడితే... నిజాం కాలం నాటికే తెలంగాణ ప్రాంతంలో గొలుసు కట్టు చెరువుల వ్యవస్థ ఉండేది. ఉద్దేశ్య పూర్వకంగానే వాటిని నాశనం చేశారు.

తెలంగాణ వస్తే మొదటగ ఈ చెరువులను పునరుద్దరించాలి. అన్ని సాధ్యం కాకపోవచ్చు. అయినా వాటిని బాగుచేస్తే గ్రామీణ వ్యవస్థ సస్యశ్యామలం అవుతుంది. ఇక నిజాం కాలంలో విద్య, వైద్యం రెండూ ఉచితమే. అయితే వీటన్నింటిని వారు నాశనం చేశారు. అభివృద్ధి అంటారు కానీ వాళ్ళు ఇక్కడ ఒక్క ఆసుపత్రిని గాని, కాలేజీని గాని కట్టింది లేదు. మన రాష్ట్రంలో అయితే ఇలాంటి అనేక అంశాల మీద మనం ప్రత్యేక దృష్టిని పెట్టే అవకాశం ఉంది.

# సకలజనుల సమ్మె

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించకపోతే ప్రభుత్వ ఉద్యోగులందరు ఆగస్టు 1తర్వాత ఏ క్షణంలోనైన సమ్మె బాట పడతారని ప్రభుత్వానికి తెలంగాణ జెఎసి అల్టిమేటం ఇచ్చింది. కోదండరాం నాయకత్వంలో ఉద్యోగసంఘాల నాయకులు ముఖ్యమంత్రి కిరణ్‌కుమారెడ్డికి సమ్మె నోటీసును అందజేసినయి.

2011 జులై 20న దేశరాజధానిలో తెలంగాణ కోసం మరో యువకుడు బలిదానం చేసిండు. పార్లమెంట్, రాష్ట్రపతి భవన్‌ల దగ్గర ఉన్న ఒక చెట్టుకు ఉరిపెట్టుకొని మందాడి యాదిరెడ్డి చనిపోయిండు. బుదవారం పొద్దున విషయాన్ని తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని రామ్‌మనోహర్ లోహియ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసింద్రు.

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం పెద్ద మంగళారం గ్రామానికి చెందిన యాదిరెడ్డి 18వ తేదీన ఢిల్లీకి వచ్చినట్టు ఆధారం దొరికింది. మృతదేహం దగ్గర దొరికిన పది పేజీలలో ప్రతిదాంట్లో 'జై తెలంగాణ' అని రాసి ఉన్నది. సోనియాజి మా తెలంగాణ మాకివ్వండి. రాహుల్‌జి, ప్రధానమంత్రి ఇది నా ఆఖరి కోరిక అన్న యాదిరెడ్డి ఆవేదన ఎంతమందికి అర్థమైతది. శ్రీకృష్ణ కమిటి 8వ అధ్యాయం సరికాదని కూడ లేఖలో పేర్కొన్నడంటే తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డ తెలంగాణని ఎంత ఆరాదిస్తుంద్రో, ప్రేమిస్తుంద్రో అర్థమైతది. కల్మశం లేని ప్రేమ మాత్రమే త్యాగాలకు సిద్ధపడతదనే సందేశాన్ని తెలంగాణ రుజువు చేసింది. దానం నాగేందర్, సర్వేసత్యనారాయణ, జైపాల్‌రెడ్డిలు దొంగలని కూడ లేఖలో రాసిండు. రాజ్యసభ్యుడు వి.హన్మంతరావు యాదిరెడ్డి సుట్టాలకు ఫోన్ చేసిండు. గ్రామ సర్పంచ్‌ని, యాదిరెడ్డి బాబాయిని, దోస్తుని ఢిల్లి వచ్చేందుకు విమాన టికెట్లు ఏర్పాటు చేసిండు. హైద్రాబాద్‌లో డ్రైవర్‌గ పనిచేసే యాదిరెడ్డి తెలంగాణ రాష్ట్రం రాకపోతే మన బతుకుల ఎట్లబాగుపడతయనే ఆవేదనతో సావుకు సిద్ధమై ఢిల్లికి పయనమయ్యిండని తెలిసింది. పెద్దమంగళారంలో యాదిరెడ్డి అంత్యక్రియలు తెలంగాణ వాదులు, నాయకుల వీడ్కోలుతో ఊరేగింపు కదిలింది. 2013 మార్చి 24న హన్మకొండలో భోజ్యానాయక్ ఆత్మహత్య చేసుకుండు. తెలంగాణ రాష్ట్రం ఇంకా ఏర్పాటు చేయడం లేదని, కాంగ్రేసు, టి.డి.పి నాయకుల ప్రవర్తనకు నిరసనగ, "ఐ వాంట్ తెలంగాణ, జై తెలంగాణ'

అంటూ నినాదాలు చేస్తూ సుబేదారి ఆర్ట్స్‌కాలేజ్ ప్రాంగణంలో పెట్రోలు పోసుకొని నిప్పంటించుకుండు. ఆస్పత్రికి తరలించే లోపే మార్గమధ్యలోనే చనిపోయిండు. భోజ్యానాయక్ మృతికి సంతాపంగ కాకతీయ విద్యార్థి జెఎసి తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చింది.

ప్రఖ్యాత రచయిత్రి, బుకర్ ప్రైజ్ విన్నర్ అరుంధతీరాయ్ తెలంగాణ ఒక న్యాయమైన డిమాండ్ అని అది తప్పక విజయం సాధిస్తుందనే సందేశాన్ని పంపింది.

2011 సెప్టెంబర్ 13న సకలజనుల సమ్మె మొదలైంది. దాదాపుగ ప్రభుత్వ కార్యాలయాలన్ని మూతపడ్డయ్. ఆంధ్ర, తెలంగాణ సంఘాలన్ని దాదాపుగ రెండుగ విడిపోయినయి. తెలంగాణ గజిటెడ్ ఉద్యోగుల జె.ఎ.సి నాయకుడు శ్రీనివాస్ గౌడ్, విద్యుత్ ఉద్యోగుల జెఎసి నాయకుడు రఘు ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిండ్రు. అన్నివర్గాల ప్రజలు సమ్మెలో భాగస్వాములైండ్రు. విద్యార్థులు, ఉద్యోగులు, లాయర్లు, డాక్టర్లు, రైతులు, కులవృత్తిదారులు, కార్మికులు, కర్శకులు ప్రతి ఒక్కరు ఏకమై ఒకే గొంతకతో తెలంగాణ రాష్ట్రాన్ని డిమాండ్ చేసిండ్రు.

తెలంగాణ పదిజిల్లాలు జైతెలంగాణ నినాదంతో ప్రతిధ్వనిస్తున్నయ్. తక్షణమే పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో సకలజనులు ఏకమై కదిలిండ్రు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. కరెంటు ఉత్పత్తి ఆగిపోయింది. సింగరేణి కార్మికులు సెప్టెంబర్ 13 నుంచి అక్టోబర్ 17వరకు 35 రోజులపాటు వీరోచితంగ సకలజనుల సమ్మెలో పాల్గొన్నరు. తెలంగాణ రాష్ట్రమే అంతిమలక్ష్యంగ పోరాడిండ్రు. ఎంతటి త్యాగాలకైన సిద్ధమని ప్రకటించిన గని కార్మికుల పోరాటం కేంద్రంలో కదలికను తీసుకొచ్చింది.

ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు ఏలాడుతున్నయి.

దాదాపు ఒకరోజు 75వేల పైచిలుకు అర్జీలు వచ్చే సచివాలయం బోసిపోయింది. సెప్టెంబర్ 16న రెండులక్షల మంది ఉపాధ్యాఉలు సమ్మె బాట పట్టిండ్రు. సెప్టెంబర్ 19నుంచి ఆర్టీసి కార్మికులు సమ్మెలో భాగంగ బస్సులు బంజేసిండ్రు. సెప్టెంబర్ 20 నుంచి గ్రేటర్ హైద్రాబాద్ మున్సిపల్ ఉద్యోగులు సమ్మెలో భాగమైండ్రు. సెప్టెంబర్ 21 నుంచి విద్యుత్ ఉద్యోగులు సమ్మె మొదలుపెట్టిండ్రు. బి.ఎస్.ఎన్.ఎల్ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు ఎల్.ఐ.సి. రక్షణశాఖ ఉద్యోగులు సైతం ర్యాలీలు, రాస్తారోకో వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టిండ్రు. అంగన్‌వాడీలు, హమాళీలు, బీడి కార్మికులు ఆటో రిక్షా కార్మికులు, కులసంఘాలు, వృత్తిసంఘాలు రోజుకొకరుగ సకలజనులు సమ్మెలో చేరిండ్రు.

సెప్టెంబర్ 19న జెఎసి ఇచ్చిన పిలుపునందుకొని జాతీయ రహదారుల దిగ్బంధనంతో రవాణా వ్యవస్థను ఎక్కడికక్కడ స్థంబింప జేసింద్రు. సెప్టెంబర్ 24, 25 తేదీలలో రైల్‌రోకో కార్యక్రమాన్ని చేపట్టింద్రు.

పల్లెజనం పట్టాలెక్కి నిరసన వ్యక్తం చేసింద్రు.

రైళ్ళు, బస్సులు, ఆటోలు లేక పెట్రోలు బంక్‌లు బందు పెట్టడంతో మొత్తం వ్యవస్థ ఎక్కడిదక్కడ నిలిచిపోయింది. హైద్రాబాద్ రోడ్లమీద పిల్ల కనపడతలేరు. రోడ్లన్ని నిర్మానుష్యంగ మారినయి. తెలంగాణ పదిజిల్లాలు ఒక్కతీరుగ ఉన్నయి. ఆఖరికి దేవాలయాలు కూడ బందుపెట్టి దేవుండ్లను పస్తులు ఉంచింద్రు. రోజుకో తీరుగ నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వానికి చెమటలు పట్టించింద్రు. మంత్రుల, ఎమ్మెల్యేలకు పిండప్రధానాలు చేసింద్రు. చావుడప్పులు కొట్టింద్రు. గోరీలు కట్టింద్రు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో ర్యాలీలు తీసింద్రు. ఒక్కటిగాదు ఎన్ని చేయాల్నో అన్ని చేసింద్రు.

తెలంగాణ వ్యాప్తంగ దాదాపు 2500మందిని అరెస్టు చేసింద్రు. 250 మంది మీద రైల్వే చట్టం ప్రకారం కేసులు నమోదు చేసింద్రు. పొన్నం ప్రభాకర్, జీవన్‌రెడ్డి, విజయశాంతి, హరీశ్‌రావు, కవితతో పాటు అనేక మంది ప్రముఖులు రైల్వే చట్టం కింద అరెస్టు చేసింద్రు. సమ్మె 34వరోజుకు చేరిన సమయంలో ఆర్టీసి కొద్దిగ సమ్మెను సడలించింది. రాష్ట్రంలో రైల్‌రోకో ఉద్రిక్తతను పెంచింది. పట్టాలపైకి ఎడ్లబండ్లతో వచ్చింద్రు. నల్లగొండ పట్టణంలో పట్టాల దగ్గర టెంట్‌లను పీకి పోలీసులు వీరంగం చేసింద్రు. నల్లగొండలో తెలంగాణ రచయితల వేదిక అంబటివెంకన్న ఆధ్వర్యంలో కవులు “పట్టాల మీద కవితాపఠనం” కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించింద్రు. గౌడ, యాదవ, బెస్త, ముదిరాజ్, మున్నూరుకాపు వంటి కులాలు పెద్ద ఎత్తున సకలజనుల సమ్మెలో రోజుకో విధంగ పాల్గొన్నరు.

ఎవరు చేయలేనన్ని కార్యక్రమాలతో ఢిల్లీని కదిలించింద్రు. తెలంగాణ శక్తిని ప్రదర్శించి కేంద్రప్రభుత్వ మెడలు వంచింద్రు. సెప్టెంబర్ 13న మొదలైన సకలజనుల సమ్మె 42రోజుల పాటు కొనసాగి అక్టోబర్ 24, 2011న ముగిసింది. ఉద్యోగ సంఘాల నేతలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోని, ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ్మతోని రెండుసార్లు చర్చలు జరిపి ఆఖరికి ముఖ్యమంత్రితో చర్చలు జరిపిన జెఎసి అర్ధరాత్రి సమ్మె విరమించినట్టు అధికారికంగ ప్రకటించింది.

మార్చి 4న ప్రభుత్వంతో తొమ్మిది అంశాల మీద కుదిరిన ఒప్పందం ప్రకారం

1. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుకు రిటైర్డ్ హైకోర్టు జడ్జితో కమీషన్ ఏర్పాటు
2. ఎస్మా కింద సమ్మెను నిషేదిస్తు జారీచేసిన నోటిపికేషన్ ఉపసంహరణ

3. ఉద్యోగులపై నమోదైన కేసులను ఎత్తేయడం
4. జి.వో. నెంబర్ 177 పై తదుపరి చర్యలు తీసుకోవడం
5. సకలజనుల సమ్మె సమయంలో జరిగిన డిప్యుటేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి పునఃపరిశీలించడం
6. సమ్మెలో భాగంగ విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు దినాలుగ ప్రకటించడం
7. సమ్మె కాలంలో జీతాలు నష్టపోయిన ఉద్యోగులకు స్పెషల్ అడ్వాన్స్ చెల్లించడం.
8. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఫిక్స్‌డ్ టెన్యూర్ ఉద్యోగులను తిరిగి నియమించాలని ఏజెన్సీలను ప్రభుత్వం కోరడం
9. అక్టోబర్ 25 నుంచి విధుల్లో చేరుతున్నట్టు అంగీకరించి హామి ఇవ్వడం వంటి తొమ్మిది ఒప్పందాలను కొన్ని షరతులతో ఒప్పుకుంది.

అయినా సీమాంధ్ర కుటిలయత్నాలు తెలిసిన ఉద్యమ సంఘాల నాయకులు, సమ్మె తాత్కాలికంగ మాత్రమే ఆగిందని చెప్పడంతో పాటు ఉద్యమం ఇంకా కొనసాగుతుందని జెఎసి చైర్మన్ కోదండరాం వెంటనే ప్రకటించిండు.

ప్రపంచ చరిత్రలో ఇట్లాంటి సమ్మెలు జరిగిన సందర్భం చాలా అరుదు. 1905లో రష్యాలోను, రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో జర్మనీలోను అదేవిధంగ 1940 ప్రాంతంలో భారతదేశంలోను ఇట్లాంటి సమ్మె జరిగినట్టు చరిత్ర చెబుతున్నప్పటికి సకలజనుల సమ్మెకు ఒక ప్రత్యేకత ఉన్నది. అస్సాం, లిబియా, ఈజిప్టులలోను ఇట్లాంటి సమ్మెలు జరిగిన ఉదంతాలు ఉన్నయి. కాని తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన సకలజనుల సమ్మె మొత్తం పోరాటాల చరిత్రలోనే ఒక విప్లవాన్ని సృష్టించింది. పది, పదిహేను సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ఒక్కసారిగ విశ్వరూపాన్ని ప్రదర్శించింది.

# శ్రీకృష్ణ కమిటి నివేదిక

2009 డిసెంబర్ 9 తర్వాత తెలంగాణలో జరిగిన, జరుతున్న పరిణామాలతో పాటు రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని కూలంకశంగ పరిశీలించడం కోసం కేంద్రం 2010 ఫిబ్రవరి 13న శ్రీకృష్ణ కమిటీని నియమించింది.

జస్టీస్ బి.ఎన్. శ్రీకృష్ణ అధ్యక్షుడిగ ఉన్న ఈ కమిటీలో డా॥ రణబీర్‌సింగ్, డా॥ అబూసలే షరీఫ్, డా॥ రవీందర్ కౌర్, వినోద్ కె.దుగ్గల్ సభ్యులుగ ఉన్నరు.

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు, సమైక్యాంధ్ర కొనసాగింపు అనే విషయంలో తలెత్తిన పరిస్థితిని అధ్యయనం చేసి కమిటి పూర్తి నివేదికను డిసెంబర్ 31లోపు అందజేయాలని సూచించింది. అయితే ఈ కమిటీని మొదట ఎవరూ అంగీకరించలేదు. రోశయ్య కమిటీకన్న అద్వాన్నమైనదని అన్నడు కోదండరాం. ఆ తర్వాత అందరు కమిటీకి నివేదికల సమర్పించిండ్రు. కమిటీ ఆన్‌లైన్‌లో కూడ నివేదికలు సమర్పించే అవకాశాన్ని కల్పించింది. శ్రీకృష్ణ కమిటీ ముందు టి.ఆర్.ఎస్.పార్టీ నాలుగు గంటలపాటు తమ వాదనలు వినిపించింది. డిసెంబర్ 31 తర్వాత కమిటీ నివేదిక తెలంగాణకు వ్యతిరేకంగ వస్తె జరగబోయే యుద్ధానికి కమిటీయే కారణమైతదని హెచ్చరించిండు.

శ్రీకృష్ణ కమిటీ విధి విధానాలను వ్యతిరేకిస్తు ఉస్మానియాలో విద్యార్థుల చేపట్టిన ఆందోళన కాల్పులకు దారితీసింది. మీడియాను క్యాంపస్‌లోకి అనుమతించకుండ పోలీసులు వీరంగం సృష్టించిండ్రు. జర్నలిస్టుల మీద కూడ లాఠీచార్జ్ చేసిండ్రు. నాయకులను క్యాంపస్‌లోకి అనుమతించకుండ నిరంకుశ వలసాధిపత్యాన్ని ప్రదర్శించింది. 16వ తేదీన మరోసారి పోలీసులు క్యాంపస్ మీద విరుచుకపడ్డరు. బాష్పవాయు గోళాలు, రబ్బర్‌బుల్లెట్లను ప్రయోగించిండ్రు. జర్నలిస్టుల వాహనాలను తగలబెట్టిండ్రు. తీవ్రంగ ప్రతిఘటించిన విద్యార్థులు రాళ్ళ వర్షం కురిపించిండ్రు. హోంమంత్రి జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

రోషయ్యకు ముఖ్యమంత్రి పదవి భారమైంది. 2010 నవంబర్ 24న స్పీకర్ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని ముఖ్యమంత్రిగ నియమించింది.

2010 డిసెంబర్ 16న ఓరుగల్లు గర్జన పేరతో పెద్ద బహిరంగ సభ జరిగింది. శ్రీకృష్ణ కమిటి తెలంగాణకు అనుకూలంగ నివేదిక ఇయ్యాలని డిమాండ్ చేసింది.

2010 డిసెంబర్26న తెలంగాణ కాంగ్రేస్ పార్లమెంట్ సభ్యులు గన్‌పార్క్‌లో దీక్ష చేపట్టింద్రు. విద్యార్థుల మీద పెట్టిన కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేసింద్రు.

రెండు వందల మంది తెలంగాణ న్యాయవాదులు ప్రత్యేక రైలులో ఢిల్లీకి చేరుకొని, 2010 ఫిబ్రవరి 23న డిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించింద్రు. జెఎసి కన్వీనర్ కోదండరాం, బిజెపి అధికార ప్రతినిధి ప్రకాశ్ జవదేకర్, సమాజ్‌వాది నేత అమర్‌సింగ్ దీక్షకు సంఘీబావం ప్రకటించింద్రు. న్యాయవాదులు పెద్దఎత్తున ఎవరు ఊహించని రీతిలో పార్లమెంట్‌ను ముట్టడించింద్రు. శ్రీకృష్ణ కమిటీ గోబ్యాక్, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసింద్రు.

శ్రీకృష్ణ కమిటీకి తెలంగాణ వ్యాప్తంగ నిరసన ఎదురైంది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును జాప్యం చేయడం కోసమే శ్రీకృష్ణ కమిటీని వేసింద్రని సింగరేణి కార్మికులు కమిటీని తీవ్రంగ వ్యతిరేకించింద్రు. కమిటీ సభ్యులు మొదటిసారి హైద్రాబాద్‌ను సందర్శిస్తున్న సందర్భంగ 2010 మార్చి4న సింగరేణి కార్మికులు సమ్మె సైరన్ మోగించింద్రు.

2010 మార్చి 8న టి.డి.పి. తెలంగాణ జెఎసి నుంచి బయటికి వెళ్ళిపోయింది.

శ్రీకృష్ణ కమిటి 8వ చాప్టర్‌లోని కుట్రల మీద విద్యావంతుల వేదిక అన్ని జిల్లాలలో సదస్సులు నిర్వహించింది. తెలంగాణ ఉద్యమం పట్ల సీమాంధ్ర మీడియా అనుసరిస్తున్న పద్ధతులను నిరసిస్తూ సెమినార్‌లను నిర్వహించింది.

తెలంగాణ రాష్ట్రం ఇస్తే హిందు, ముస్లీం ఉగ్రవాదం రాజుకుంటదని, మావోయిస్టులు, మతఘర్షణలకు తెలంగాణ కేంద్రబిందువు అవుతుందని హెచ్చరించింది. ఒక్క ముక్కలో తెలంగాణలో సీమాంధ్రులకు, వాళ్ళ ఆస్తులకు బద్రత ఉండదన్న విషయాన్ని నొక్కివక్కానించింది.

505 పేజీలు, 9 చాప్టర్లు గల శ్రీకృష్ణ కమిటి నివేదిక ముగింపులో కమిటి చేసిన ఆరు ప్రధాన ప్రతిపాదనలతో గడువు ముగియడానికి ఒక రోజు ముందుగానే కేంద్ర హోంమంత్రి చిదంబరానికి అందజేసింద్రు.

1. ఉద్యమాన్ని సాధారణ శాంతి బద్రతల పరిస్థితిగా పరిగణించి కేంద్రం నుంచి సాధారణ మద్దతు తీసుకుంటు పూర్తిగ రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలె.
2. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు – హైద్రాబాద్ కేంద్రపాలిత ప్రాంతం
3. హైద్రాబాద్ రాజధానిగ రాయల తెలంగాణ ఏర్పాటు
4. ప్రత్యేక తెలంగాణ అతిపెద్దకేంద్ర పాలిత ప్రాంతంగ ఏర్పాటు గుంటూరు, కర్నూలు, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లోని కొన్ని మండలాలు కలుపుతూ

హైద్రాబాద్‌ను పెద్ద కేంద్రపాలిత ప్రాంతంగ చేయడం

5. హైద్రాబాద్ రాజధానిగ తెలంగాణ రాష్ట్రప్రతిపత్తి

6. ప్రధాన సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తూ తెలంగాణ ప్రాంతానికి రాజ్యాంగబద్ధ రక్షణను కల్పించడం. రాష్ట్రాన్ని సమైక్యంగ ఉంచడం.

ఈ నివేదిక తెలంగాణ వాదులను అసంతృప్తికి గురి చేసింది.

శ్రీకృష్ణ కమిటీ రహస్యంగ ఉంచిన 8వ అధ్యాయంలో ఉద్యమాన్ని ఏ విధంగ అణిచివేయవచ్చునో తగిన సూచనలు చేసింది. ఈ నివేదిక వల్ల తెలంగాణ ఉద్యమం మరోసారి ఆకాశాన్ని అంటుకుంది.

శ్రీకృష్ణ కమిటీ రిపోర్టులో మహబూబ్‌నగర్ గ్రోత్‌రేట్ 78 శాతంగాను,గుంటూరు గ్రోత్ రేట్ 42 శాతంగాను చూపించిండ్రు. దీనివల్ల మహబూబ్‌నగర్ కన్న గుంటూరు వెనకబడిందని అర్థమైతుంది. ఇట్లాంటి అనేక కతలు శ్రీకృష్ణ కమిటీ లీలల్లో ఉన్నయి. ఒక బాధ్యాతయుతమైన కమిటి సుబ్బరామి రెడ్డి ఇచ్చే విందులో పాల్గొన్నరంటెనే వాళ్ళ నిబద్ధత బయటపడుతుంది.

జలగం వెంగళరావు స్వయంగ నేను తెలంగాణకు చెందినవాన్ని కాదు అని చెప్పితే ఈ కమిటీ వెంగళరావు తెలంగాణ ముఖ్యమంత్రుల జాబితాలో చేర్చింది. తెలంగాణ విద్యుత్ రంగానికి సంబంధించి శ్రీకృష్ణ కమిటీ తన నివేదికను తప్పుల తడకగా చూపించింది.

ఆంధ్రప్రదేశ్ అవతరణతో అంటే 1956లోనే విద్యుత్‌బోర్డు ఏర్పడినట్టు రిపోర్టులో ఉన్నది. కాని వాస్తవానికి 1922లోనే హైద్రాబాద్ హుస్సేన్‌సాగర తీరంలో పవర్‌ప్లాంట్ ఉండేది. ఈ విద్యుత్‌కేంద్రం నుంచి 1972వరకు నిరంతరాయంగ విద్యుత్ ఉత్పత్తి జరిగింది. అది జగమెరిగిన సత్యం. అప్పట్లో దీని ప్రాధాన్యతను గుర్తించిన నిజాం సర్కారు 1939లోనే పోస్టల్‌స్టాంపు విడుదల చేసింది. అయితే సీమాంధ్రపాలకులు ఈ చారిత్రక కట్టడాన్ని (థర్మల్ పవర్ ప్లాంట్) కూలగొట్టి అక్కడ ఐమాక్స్ థియేటర్‌ని, ఎన్.టి. రామారావు సమాధిని కట్టి సంబూరపడ్డరు. తెలంగాణ చరిత్రను మాయం చేసింద్రు. మరి అంతప్తె శ్రీకృష్ణకమిటీ కూడ ఈ నిజాన్ని నిర్ధారించలేక చేతులేత్తేసింది. అంతేకాకుండ ఆంధ్రప్రాంతంలో నిర్మించతలపెట్టిన తొమ్మిది ప్రైవేట్ విద్యుత్‌ప్రాజెక్టులను జెన్‌కో నిర్మిస్తున్నట్టు తప్పుడు రిపోర్టు సమర్పించింది.

మొత్తానికి అబద్దాలపుట్టగ మారిన శ్రీకృష్ణ కమిటీ నివేదిక మీద తెలంగాణ ఉగ్రరూపం దాల్చింది. ఉస్మానియా యూనివర్సిటి బగ్గుమన్నది. తెలంగాణ ప్రజల మనోబావాలను, ఆత్మబలిదానాలను గుర్తించని కమిటీ నివేదికకు వ్యతిరేకంగ

విద్యార్థులు రాజ్‌భవన్ ముట్టడికి ప్రయత్నించడంతో వాతావరణం యుద్ధరంగంగ మారింది. బస్సుల్ని తగల బెట్టింద్రు. పోలీసులకు విద్యార్థులకు మద్య హోరాహోరి యుద్ధం జరిగింది.

# తెలంగాణ ఉద్యమం - కొండా లక్ష్మణ్ బాపూజీ



కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదిలాబాద్ జిల్లా వాంఖిడిలో 1915 సెప్టెంబర్ 27న కొండా పోశెట్టి-అమ్మక్క దంపతులకు జన్మించిండు. పోశెట్టి దంపతులకు గల ఆరుగురి సంతానంలో కొండా లక్ష్మణ్ ఐదవ సంతానం. వీరిలో నలుగురు మగపిల్లలు, ఒక్క ఆడపిల్ల. ఆ తర్వాత కొంత కాలానికి అమ్మక్క చనిపోయింది. చివరపుట్టిన బిడ్డ కూడ చనిపోయింది. తల్లిలేని పిల్లలు ఐదుగురు పిల్లల్ని పోశెట్టి కంటికి రెప్పలా చూసుకుండు. కొండా పోశెట్టి పోస్ట్‌మ్యాన్‌గ విధుల్లో చేరినప్పుడు పోశెట్టి బాపూజీ అని రికార్డుల్లో రాయడం జరిగింది. ఆయన సేవలకు మెచ్చిన ప్రభుత్వం క్యాషియర్‌గ, సబ్ పోస్ట్‌మాస్టర్‌గా ప్రమోషన్‌లు ఇచ్చింది. కొండా పోశెట్టి బాపూజీ నెల జీతం 15 హాలిసిక్కాలు మాత్రమే. బ్రిటీష్ ఇండియాలో కల్దార్ రూపాయలు వేరే ఉండేయి. ఆ తర్వాత నిజాం రాజ్యంలో 1905లో జిల్లా కేంద్రంగ ఉన్న ఆదిలాబాద్ 1914లో అసిఫాబాద్‌ని జిల్లా కేంద్రం చేసింన్రు. తిరిగి అదే సంవత్సరం మళ్లీ ఆదిలాబాద్‌నే జిల్లా కేంద్రంగ మార్చింన్రు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఉర్దూ, మరాఠీ మీడియంలో పాఠశాల విద్యను కొనసాగించిండు. మరాఠీ ప్రాంతమైన రాజూర మాణిక్‌ఘడ్‌లో నాల్గవ తరగతిలో చేరిండు.

కొండా లక్ష్మణ్ బాపూజీ యుక్తవయసులో ఉన్నపుడు స్వాతంత్రోద్యమంలో భాగంగ గాంధీజీ చాందా కు వస్తుండని తెలిసి, నిజాం ప్రభుత్వం, పాఠశాల అధికారులు ఆ సభకు అనుమతి నిషేదించినప్పటికి కొండా లక్ష్మణ్ బాపూజీ మరికొంత మంది విద్యార్థులతో అక్కడికి వెళ్ళడం జరిగింది. మహాత్మగాంధీ ఉపన్యాసంతో ఉత్తేజితుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ తన తెల్లప్యాంటును చింపి 'గాంధీటోపి'ని తయారు చేసుకొని పెట్టుకుండు. ఈ విధంగ బాపూజీ గాంధీ టోపిని ధరించడం 1932లోనే మొదలైంది. నిజాం రాజ్యంలో గాంధీ టోపిని ధరించడం అనేది నిజాం ప్రభుత్వాన్ని ధిక్కరించడానికి

సంకేతం. అట్ల మొదలైన గాంధీటోపిని జీవితాంతం విడువకుండ ధరించిండు. కొండా లక్ష్మణ్ బాపూజీ 7వ తరగతి పాసయ్యే నాటికి ఆయన వయసు ఇరవై సంవత్సరాలు నిండింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల కళాశాల విద్య కొనసాగించలేక హైకోర్టు సాయంకాలం పూట నడిపే రెండు సంవత్సరాల లాకోర్సును పూర్తి చేసిండు.

కొండా లక్ష్మణ్ బాపూజీ మంచి క్రీడాకారుడు. ఆదిలాబాద్ జిల్లా కుస్తీ పోటీల్లో ప్రథముడిగ నిలిచిండు. ప్రతి సంవత్సరం గణేశ్ ఉత్సవాలు, నిత్యం వ్యాయామశాలల్ని క్రమం తప్పకుండ నిర్వహించే వాడు. తన 23వ యేట మెట్రిక్యులేషన్ పూర్తి అయిన తర్వాత ఆదిలాబాద్ జిల్లా రాజురాఘర్ ప్రాంతంలో యువజన సంఘాన్ని స్థాపించి వృత్తికులాల మీద జమీందారి పెత్తనాన్ని ఎదిరించి వాళ్ళ ఇనాం భూముల్ని తిరిగి ఇప్పించడం జరిగింది. ఇదే క్రమంలో 1938లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేమాతర ఉద్యమం ప్రారంభమైంది. హైద్రాబాద్ స్టేట్ కాంగ్రేస్ నిర్వహించిన ఈ సత్యాగ్రహంలో పాల్గొని తన దేశభక్తిని చాటుకోవడం జరిగింది. ఈ సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు గాను కొండా లక్ష్మణ్ బాపూజీని గౌలీగూడ సమీపంలోని పుత్లిబౌలి దగ్గర అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు పంపింద్రు.

కొండా లక్ష్మణ్ బాపూజీ 1940లో న్యాయవాదిగ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగ కేసులు వాదించి గెలిచిండు. 1941లో ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో 'కిసాన్ సదస్సు' ను ఏర్పాటు చేసి, జయప్రకాశ్ నారాయణ్, ఎన్.జి. రంగా లాంటి నాయకులను ఆహ్వానించిండు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగ రాజకీయ కార్యాకలాపాలు ముమ్మరం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ మీద అనేక కేసలు పెట్టి, పోలీసులు ఆయన ఇంటిని ముట్టడించింద్రు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలివిగా అక్కడినుంచి తప్పించుకొని హైద్రాబాద్, కర్నూలు, గుంతకల్ మీదుగ బొంబాయికి చేరుకుండు. ఎం.ఎన్.రాయ్ ఆలోచనలు, రచనలు ముఖ్యంగ 'విప్లవ నిర్వహణ పద్దతులు' కొండా లక్ష్మణ్ బాపూజీలో ఉద్యమస్ఫూర్తిని రగిలించినయి. దీంతో ఎం.ఎన్.రాయ్ ప్రసంగాలను 'భారత విప్లవ సమస్యలు' అనే పేరుతో ఉర్దూలోకి అనువదించి ముద్రించడం జరిగింది. ఎం.ఎన్.రాయ్ ఉపన్యాసాల ప్రభావంతోనే జీవితాన్ని ప్రజలకు అంకితం చేయాలన్న భావన బలంగ నాటుకుంది. జాతీయ ఉద్యమాలలో భాగంగ షోలాపూర్‌లో నేతాజి సుభాష్ చంద్రబోస్‌ను కలిసే ఆవకాశం దొరికింది. దాంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాట పంథాలోనే పయనించాలని నిర్ణయించుకుండు. జాతీయ నాయకుల ప్రభావంతో 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని సత్యాగ్రహ ఉద్యమాన్ని చేపట్టిండు. 1945లో ఒకటవ

గ్రేడ్ వకీలు డిప్లమా కోర్సులో పాసై హైద్రాబాద్ రాజ్యంలోని జ్యుడీషియల్ కమిటి (సుప్రీంకోర్టు) లో వకాలత్ మొదలు పెట్టిండు.

1941లో మెదక్ జిల్లా సంగారెడ్డి తాలూకా నిజాంపేటలో జరిగిన పద్మశాలి యువజన సభకు అధ్యక్షుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ 1945లో నిజాం రాష్ట్ర పద్మశాలి మహాసభకు అధ్యక్షుడయ్యిండు. 1947లో కొండా లక్ష్మణ్ బాపూజీ అధ్యక్షతన వరంగల్‌లో జరిగిన మూడవ పద్మశాలి మహాసభ ద్వార హైద్రాబాద్‌లో సంఘ భవనానికి మార్గం సుగమం అయ్యింది. హైద్రాబాద్‌లోని రాజమొహల్లా ప్రాంతంలో 1300 చదరపు గజాల జాగలో ఉన్న భవనాన్ని 25వేల రూపాయలకు కొనుగోలు చేయడం జరిగింది.

నిజాం ప్రభుత్వ అధికారిక ప్రచార సాధనం దక్కన్ రేడియోలో జాతీయవాద వ్యతిరేక ప్రచారం మొదలైంది. ఈ సమయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ దీన్ని తిప్పికొట్టడం కోసం మైసూరు రాష్ట్రంలో స్వతంత్ర రేడియో స్టేషన్‌ని ఏర్పాటు చేయడం కోసం అనేక ప్రయత్నాలు చేసిండు. ఆఖరికి రేడియో స్టేషన్ ఏర్పాటు చేసిండు.

1947లో నిజాం నవాబు మీద బాంబు విసిరిన నారాయణ పవార్‌తో కొండా లక్ష్మణ్ బాపూజీ కూడ ఉన్నడు. అయితే ఆ బాంబు లక్ష్యాన్ని చేరలేదు. నవాబు కారును కొంత వరకు పాడు చేయగలిగింది. దీంతో కొండా లక్ష్మణ్ బాపూజీ రహస్యంగ బొంబాయికి వెళ్ళిపోయిండు.

రహస్య ఉద్యమ కాలంలోనే మద్రాసుకు చెందిన డాక్టర్ శకుంతలాదేవితో వివాహం జరిగింది. చేనేత ఉద్యమ పితామహులు గుంటక నరసయ్య ఈ వివాహం జరగడానికి ఎంతగానో సహకరించిండు. కొండా లక్ష్మణ్ బాపూజీ-శకుంతలాదేవి దంపతులకు ఇద్దరు కొడుకులు ఒక కూతురు ఉన్నారు. భూస్వామ్య విధానానికి, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగ చేసిన పోరాటం బాపూజీని రాజకీయరంగం వైపుకు ఆకర్శించినయి. హైద్రాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో కలవడంతో కొండా లక్ష్మణ్ బాపూజీ మీద ఉన్న కేసులన్ని కొట్టివేయబడినయి. దీంతో మచిలీపట్నం నుంచి హైద్రాబాద్‌కు చేరుకున్న కొండా లక్ష్మణ్ బాపూజీ 1949లో తిరిగి లాయర్‌గ ప్రాక్టీస్ మొదలు పెట్టిండు. కొండా లక్ష్మణ్ బాపూజీ 1950 ఫిబ్రవరి 19న హైద్రాబాద్ హ్యాండ్లూమ్ వీవర్స్ సెంట్రల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్'ను స్థాపించి దానికి అధ్యక్షుడిగ ఏకగ్రీవంగ ఎన్నికైండు. ఆ తర్వాత ఇది 'హైకో'గ మారి ఆప్కోలో విలీనం అయ్యింది.

కొండా లక్ష్మణ్ బాపూజీ 1952లో జరిగిన తొలి ఎన్నికలలో ఆసిఫాబాద్

నియోజకవర్గం నుంచి కాంగ్రేసు పార్టీ అభ్యర్థిగ పోటీచేసి గెలిచిండు. ఆ తర్వాత 1957లో నల్లగొండ జిల్లా చిన్నకొండూరు నియోజకవర్గం నుంచి గెలిచి శాసనసభ డిప్యూటి స్పీకర్‌గా ఎన్నికయ్యిండు. దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో 1960లో ఎక్సైజ్ గ్రామీణ చిన్నతరహా, పారిశ్రామిక, చేనేత టెక్స్‌టైల్, జౌళీ పరిశ్రమల శాఖామంత్రిగా పని చేసిండు. రాష్ట్రంలో తోళ్ళ పరిశ్రమ అభివృద్ధి కోసం డా॥నాయుడమ్మ ఆధ్వర్యంలో ఒక కమీషన్‌ని నియమించిండు. ఇదే సమయంలో గీత, మత్స్యకార సహకార సమాఖ్యలను స్థాపించిండు. మాడపాటి హనుమంతరావు కొండా లక్ష్మణ్ బాపూజీని 'సహకార రత్న' అనే బిరుదుతో సత్కరించిండు. 1962లో ప్రత్యర్థి అక్రమాల వల్ల స్వల్ప తేడాతో ఓడిపోయిన కొండా లక్ష్మణ్ బాపూజీ కోర్టులో కేసువేసి గెలిచిండు. 1965 ఉప ఎన్నికలలో తిరిగి గెలిచిండు. 1967 ఎన్నికలలో భువనగిరి నుంచి గెలిచి కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో సమాచార, పౌరసంబంధ కార్మికశాఖ మంత్రిగ పనిచేసిండు. ఆ సమయంలో భువనగిరి సర్పంచ్‌గ కొమ్మిడి నర్సింహ్మారెడ్డి ఉన్నడు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రభుత్వ పక్షపాత ధోరణికి నిరసనగా, తెలంగాణ రాష్ట్రం కోసం ఒక బలమైన గొంతుకను వినిపించడానికి తన మంత్రి పదవికి రాజీనామ చేసిండు. ప్రత్యక్ష ఉద్యమంలో ముందున్న కొండా లక్ష్మణ్ బాపూజీని అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్‌జైలుకు తరలించిండ్రు. కొండా లక్ష్మణ్ బాపూజీ, జె. ఈశ్వరీ బాయి, టి.ఎన్. సదాలక్ష్మి ఇంకా ఇతర నాయకులు కొందరు విద్యార్థి, ఉద్యోగ, యువజన ఉద్యమాలకు పూర్తి మద్దతును ప్రకటించిండ్రు. ప్రత్యక్ష ఉద్యమాలలో పాల్గొన్నరు. 1971లో సర్పంచ్‌లందరు కలిసి సమితి అధ్యక్షున్ని ఎన్నుకునే విధానాన్ని ప్రవేశపెట్టిండ్రు. దీంతో జలదృశ్యంలో సమావేశమైన సర్పంచ్‌లు కొమ్మిడి నర్సింహ్మారెడ్డిని సమితి చైర్మన్‌గ ఎన్నుకున్నరు. కొండా లక్ష్మణ్ బాపూజీ 1972లో భువనగిరి అసెంబ్లీ స్థానం నుంచి మరోసారి శాసనసభ్యునిగ ఎన్నికైండు. హైద్రాబాద్‌లో 1972, ఫిబ్రవరి 2న కొండా లక్ష్మణ్ బాపూజీ వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ఒక పెద్ద ర్యాలి నిర్వహించిండు. అనంతరం బాలగోవింద్ వర్మ అధ్యక్షతన జరిపిన సభకు ఇందిరాగాంధీ హాజరై ప్రసంగించింది. బీసి కులాల ఐక్యత కోసం కులసంఘాలన్నింటిని ఒక వేదిక మీదికి తేవడం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ ఎంతగానో కృషి చేసిండు.

కొండా లక్ష్మణ్ బాపూజీ శ్రీమతి మీరాసేథ్ కమిటీ ద్వార కేంద్ర ప్రభుత్వానికి చేనేత రంగం మీద నివేదిక ఇచ్చిండు. ఈ కమిటీ ముందు 'చేనేత రంగాన్ని కేవలం

కళారంగంగ చూడకుండ ఉపాధి రంగంగ చూస్తే చేనేతకు ప్రయోజనం కలుగుతుందని వాదించిండు.

1946లో మొదటిసారి కాంగ్రేసులో చేరిన కొండా లక్ష్మణ్ బాపూజీ 1952లో తన 37వ యేట బొజ్జం నరసింహంతో కలిసి రాష్ట్ర వెనకబడిన తరగతుల సంఘాన్ని స్థాపించిండు. ఈ సభలోనే బాపూజీకి ఆచార్య అనే బిరుదుని ప్రధానం చేసింద్రు. 1953లో జాతీయస్థాయిలో కాకా కలేల్కర్ కమీషన్, 1979లో మండల్ కమీషన్, రాష్ట్ర స్థాయిలో 1968లో అనంతరామ కమీషన్, 1982లో మురళీధర్‌రావు కమీషన్‌లు ఏర్పడి విచారణ జరిపిన ప్రతి సందర్భంలోను కొండా లక్ష్మణ్ బాపూజీ క్రియాశీలకపాత్ర పోషించిండు. కాకా కలేల్కర్ కమీషన్‌లో డాక్టర్ శకుంతలాదేవి అసోసియేట్ సభ్యురాలిగ నియమించబడింది. మురళీధర్ రావు కమీషన్ 44శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని సూచించింది. ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగ ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం 44శాతం రిజర్వేషన్‌లు ప్రకటిస్తూ జి.ఓ. ఇచ్చింది. కాని ఆ వెంటనే హైకోర్టు దాన్ని కొట్టేసింది.

1975లో కొండా లక్ష్మణ్ బాపూజీ షష్టి పూర్తి వేడుకలు ఎగ్జిబీషన్ గ్రౌండ్‌లో అత్యంత వైభవంగ జరిగినయి. ఆనాటి చేనేత మంత్రి కే.వి. కేశవులు అధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ముఖ్యఅతిథిగా హాజరైండు. ఆ వేదిక మీది నుంచే విమానప్రమాదంలో చనిపోయిన తన చిన్నకొడుకు పేరు మీద "ఫ్లయింగ్ ఆఫీసర్ కె.ఎల్. ఉమేశ్ మెమోరియల్ ట్రస్టు"ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిండు. ఆ తర్వాత ప్రజారోగ్యం, మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం 1989లో డాక్టర్ శకుంతలాదేవి పుట్టినరోజు సందర్భంగ 'కొండ శకుంతలాదేవి ఫౌండేషన్'ను ఏర్పాటు చేసింద్రు.

ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ మండల్ కమీషన్ సిఫార్సులను వ్యతిరేకించినందుకు 1990లో కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామ చేసిండు.

2001 ఏప్రిల్ 27న తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఇంటిలో (జలదృశ్యం) జరిగింది. ఆ విధంగ తెలంగాణ మలివిడత పోరాటానికి తన ఇంటినే పార్టీ కార్యాలయంగ మార్చిండు. తెలంగాణ ఉద్యమానికి కేంద్రమైన జలదృశ్యాన్ని చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరించలేకపోయిండు. వాస్తవానికి జలదృశ్యం ప్రాంతం, కిర్లోస్కర్‌భవనం, ట్యాంక్‌బండ్ దాక నిజాం తన నివాసం కోసం ఎంచుకున్నటువంటి స్థలం. సెక్రెటేరియట్‌లోని పాత భవనం కూడ నిజాం కోసం కట్టుకున్నదే. ఆనాటి నెంబర్‌వన్ కాంట్రాక్టర్

కమాల్‌ఖాన్ తన ఇంటి ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా నిజాం నవాబుని ఆహ్వానించిండు. దీంతో ఆ స్థలాన్ని కమాల్‌ఖాన్‌కు లీజుకు ఇచ్చిండు. 1933–34లో ఆ స్థలాన్ని డీనోట్‌ఫై చేసింద్రు. మక్కా నవాబు దగ్గర ఈ జలదృశ్యం స్థలాన్ని కొండా లక్ష్మన్ బాపూజీ కొన్నడు. అయితే షాపూర్‌వాడికి, మక్కా నవాబుకు మధ్య కోర్టు వివాదం నడుస్తుంది. కోర్టులో ఆ స్థలం షాపూర్‌వాడిదేనని తీర్పు వస్తే జలదృశ్యం వదిలేస్తానని బాపూజీ రాతపూర్వకంగ ఇవ్వడం జరిగింది. ఈ చిన్న లిటిగేషన్‌తో చంద్రబాబునాయుడు అత్యంత దౌర్జన్యం చేసి ఇంటిని ఖాలీ చేయించిండు. విలువైన సమాను, దస్తావేజులను ఎత్తుకపోయిండు. ఆ ఇల్లు ఆస్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకే చెందుతుందని సుప్రీంకోర్టు 2002లో తీర్పు ఇచ్చినప్పటికి అవి తిరిగి వెనక్కి ఇవ్వలేదు. ఆ తర్వాత 2004 అధికారంలోకి వచ్చిన కాంగ్రేసు ప్రభుత్వం అన్ని పార్టీలు, ప్రజాసంఘాల వినతి మేరకు గంధీనగర్‌లో ఒక ఇంటిని కేటాయించింది. వై.యస్. ప్రభుత్వం జూబ్లీహిల్స్‌లో 1500 గజాల జాగ ఇస్తూ జలదృశ్యం మీద అన్ని హక్కులు వదులుకునే విధంగ లిఖితపూర్వక హామీని తీసుకుంది.

వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం, సాధికారత కోసం బీసి వెల్ఫేర్ ఫౌండేషన్‌ను స్థాపించి 25 లక్షల మూలధనాన్ని అందజేసిండు. 2005లో భారత రాష్ట్రపతిచేత 'ఎమినెంట్ ఫ్రీడం ఫైటర్' గా గౌరవాన్ని పొందిండు. కొండా లక్ష్మణ్ బాపూజీ కేవలం రాజకీయ నాయకుడే కాదు గొప్ప సంఘసంస్కర్త. సామాజిక, రాజకీయ, స్వాతంత్ర్య ఉద్యమాలలో అలుపులేని పోరాటం కొనసాగించిన నిస్వార్థ నాయకుడు. నాలుగైదు భాషల్లో మంచి పాండిత్యం సంపాదించిన జ్ఞానవంతుడు కొండా లక్ష్మణ్ బాపూజీ.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 2010లో తన పేరు మీద తన స్వగ్రామమైన వాంఖిడిలో సేవాసదన్ ప్రారంభించిండు. గిరిజనులకు సేవ చేయడానికి 25లక్షల రూపాయలు సేవాసదన్‌కు మూలధనంగ అందజేసిండు.

నాయకులు స్వంత ఎజెండాలను పక్కనపెట్టి పోరాటం చేసినప్పుడు మాత్రమే తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తుందని, మాట ఇచ్చి తప్పించుకొని తిరుగుతున్న కాంగ్రేసు పార్టీని కొండా లక్ష్మణ్ బాపూజీ తీవ్రంగ విమర్శించిండు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నవంబర్1 2011న కొండా లక్ష్మణ్ బాపూజీ బోయినపల్లి వెంకటరామారావు, కొలను శివారెడ్డి లాంటివాళ్ళు పన్నెండు మందితో కలిసి సత్యాగ్రహ దీక్ష చేపట్టిండు. వారం రోజుల పాటు కొనసాగిన దీక్ష విరమించి ఉద్యమం వివిధ రూపాలలో కొనసాతుతుందని ప్రకటించిండు.

రాష్ట్ర విభజనకు సంబంధించిన అంశాల మీద తలెత్తే సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వాదులు-ప్రత్యేకాంధ్రులతో 'రాష్ట్ర విభజన కమిటీని ఒకదానిని ఏర్పాటు చేసింద్రు. "కలిసి విడిపోదాం-విడిపోయి కలిసుందాం" అనే నినాదంతో ఏర్పాటైన ఈ కమిటీకి తెలంగాణ కురువృద్ధుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ నేతృత్వం వహించింద్రు. ఇరు ప్రాంతాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాలను కేంద్రప్రభుత్వానికి నిపుణుల కమిటీలు సూచించాలనేది ఈ కమిటీ ముఖ్య ఉద్దేశ్యం.

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితమంత నేత కార్మికులు, బడుగు బలహీనవర్గాల పక్షం నిలిచి పోరాడిండు. తెలంగాణ కోసం జీవితాన్ని త్యాగం చేసిండు. 1996లో భువనగిరి సభ మొదలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తొమ్మిది పదులు దాటిన వయసులో ఢిల్లీలో నిరాహార దీక్ష చేపట్టిండు. ప్రజా సంఘాలతో కలిసి బస్సుయాత్ర చేసిండు. తెలంగాణ యువకులకు ఎందరికో ఉద్యమ స్ఫూర్తిని కలిగించిండు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జీవితాన్ని ధారపోసిన కొండా లక్ష్మణ్ బాపూజీ 97 సంవత్సరాల వయసులో 2012 సెప్టెంబర్ 21న ఆయన స్వగృహంలోనే కన్నుమూసిండు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఐదుసార్లు శాసనసభకు ఎన్నికై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటి స్పీకర్‌గా, రెండుసార్లు మంత్రిగా భాధ్యతలు నిర్వహించిండు. 1969 ఉద్యమంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా తన మంత్రి పదవికి రాజీనామ చేసి, ఆ తర్వాత ఎలాంటి పదవులను ఆశించకుండ జీవితాన్ని గడిపిండు. ఈ విధంగ తెలంగాణ ఉద్యమ చరిత్రలో, తెలంగాణ రాష్ట్రం కోసం రాజీనామ చేసిన మొదటి మంత్రిగా కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్ర సృష్టించిండు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ కారుడు మాజీమంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ మరణం బడుగు బలహీన వర్గాల ప్రజలతో పాటు యావత్ తెలంగాణను దుఃఖసాగరంలో ముంచింది.

# సాగరహారం (తెలంగాణ మార్చ్)

తెలంగాణ ప్రాంతం అంతోఇంతో నిమ్మలంగ ఉన్నదంటే కాకతీయుల, కుతుబ్‌షాహీల హయాంలో ఒకటి రెండు శతాబ్దాలు నిలకడగ ఉన్నదేమో కానీ మిగిలిన కాలమంత పోరాటమే. నిత్య రణరంగమే. దేశముఖ్‌లు, జాగీర్దార్లు, భూస్వాములు, రజాకార్లు, కమ్యునిస్టులు ఎప్పుడు ఏదో ఒక యుద్ధ వాతావరణమే తెలంగాణ నిండ పరుచుకొని ఉండేది.

తెలంగాణలో దాదాపుగ 1930 నుంచి ఇప్పటివరకు కమ్యునిస్టు పోరాటాలు కొనసాగుతనే ఉన్నయి. తెలంగాణ ఉద్యమానికి నక్సలైట్లు సైతం మద్దతు ఇచ్చింద్రు. సి.పి.ఐ పూర్తిగ ప్రత్యక్ష ఉద్యమంలో కూడ పాల్గొంటుంది. 1996లో నిషేదానికి గురయ్యేనాటికి పీపుల్స్‌వార్ తెలంగాణలో చాల బలంగ ఉన్నది. 1997లో తెలంగాణ జనసభ ఏర్పడిన నాటి నుంచి మిలియన్‌మార్చ్‌లో న్యూ డెమోక్రసి నేతల మీద కేసుల వరకు ప్రభుత్వం ఉద్యమం పట్ల కక్ష్య సాధింపు చర్యలకే పాల్పడింది.

తెలంగాణ పల్లెలు ఇప్పుడు శాంతిని కోరుకుంటున్నయి. శాంతి మార్గంలో పయనిస్తున్నరు. సీమాంధ్ర ఉక్కుపాదాలతో పొక్కిలైన ఈ నేల దుఃఖించింది కాని అధర్మపోరాటానికి అర్రులు చాపలే. ఆత్మహత్య చేసుకుంది గాని ఎవరిని హత్యలు



చేయలే. ఇప్పటి వరకు చనిపోయిన వందలాది మంది తెలంగాణ బిడ్డలు ప్రజాస్వామ్యాన్ని ధిక్కరిస్తే, ఆయుధాలు దరిస్తే యుద్ధం బీభత్సాన్ని సృష్టించేది.

"ఇంటికో మనిషి – చేతికో జెండ" అనే నినాదంతో జెఎసి చాలా పెద్దఎత్తున చేపట్టిన కార్యక్రమం సెప్టెంబర్ 30న తెలంగాణ మార్చ్ (సాగరహారం) కార్యక్రమం. సెప్టెంబర్ 30 సంబురం కాదు సమరమే.

ప్రతిజిల్లా నుంచి 100 మంది ఉద్యమ కార్యకర్తలను ఎంపిక చేసుకుంది. వీళ్ళంత మూడు రోజుల ముందుగానే హైద్రాబాద్ చేరుకునే విధంగ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. నగర ప్రజలను కూడ మార్చ్‌లో భాగస్వాములను చేసేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేసింది.

తెలంగాణ మార్చ్ కోసం జెఎసి జులైలో పిలుపునిచ్చింది. తెంగాణ మున్సిపల్ జెఎసి హైద్రాబాద్‌లోని 18 సర్కిళ్ళలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహించింది. సెప్టెంబర్ 30, 2012 హైద్రాబాద్ నగరంలో యుద్ధమేఘాలు కమ్ముకున్నయి. కిరణ్‌కుమార్ రెడ్డి సర్కారు నగరమంత 144 సెక్షన్ విధించింది. ఒకవైపు గణేశ్ నిమజ్జనం కొనసాగుతుంది. ఉద్యమకారులను అరెస్టు చేయడం, బైండోవర్లు, గృహనిర్బంధాలు కొనసాగుతున్నయి.

హైద్రాబాద్‌లో అంతర్జాతీయ జీవవైవిధ్య సదస్సు ప్రారంభమైతుంది. వినయక నిమజ్జనం జరుగుతుంది. ఈ రెండింటి నడుమ పెద్ద పండుగల వచ్చిందే సాగరహారం సెప్టెంబర్ 30, తెలంగాణ మార్చ్. దీన్ని వాయిదా వేసుకోవలసింది ప్రభుత్వం వత్తిడి తెచ్చింది. నగరంలో సీమాంధ్రుల ఆస్తుల మీద దాడులు జరిగే అవకాశం ఉన్నందున సభకు అనుమతి నిరాకరించింద్రు. జెఎసి మార్చ్‌కు అనుమతి ఇప్పించే బాధ్యత తెలంగాణ మంత్రులకు అప్పజెప్పింద్రు.

తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి హైద్రాబాద్‌లో మార్చ్ నిర్వహిస్తామని మూడు నెలల క్రితమే ప్రకటించింది. జులై 7న నోమా ఫంక్షన్‌హాల్‌లో జరిగిన జెఎసి విస్తృతస్థాయి సమావేశంలో సెప్టెంబర్ 30న 'తెలంగాణ మార్చ్' నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. జెఎసి కార్యక్రమాలకు రాజకీయ పార్టీల మీద ఆధారపడకుండ ప్రజల భాగస్వామ్యంతోనే ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలని నిర్ణయించింది. సెప్టెంబర్ 1నాటికే తెలంగాణ మార్చ్ మీద ప్రజల్లో అవగాహన కలిగింది. మూడేండ్ల క్రితం కేంద్రప్రభుత్వం చేసిన ప్రకటనకు కట్టుబడి తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలు పెట్టాలన్నది జెఎసి డిమాండ్. రాజ్యాంగ వ్యవస్థమీద ఉన్న నమ్మకంతో ఇక్కడి ప్రజలు ప్రజాస్వామ్య బద్దంగ అడుగుతున్నరు. ఆడిన మాటని తప్పినందుకు

నిలదీస్తున్నరు. అందుకోసం అందరు ఒక దగ్గర చేరడానికి ఏర్పాటు చేసుకున్న వేదికే ఈ సాగరహారం.

తెలంగాణ మంత్రులు జానారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, బసవరాజు సారయ్యలు మార్చ్‌కు అనుమతి ఇప్పించడానికి సమావేశాలు నిర్వహిస్తున్నరు. పోలీసులతోని, ముఖ్యమంత్రితోని సమావేశాలు జరుపుతున్నరు. మరోవైపు టి.ఆర్.ఎస్ శాసనసభ్యులు ఈటెల రాజేందర్ నాయకత్వంలో పోలీసు అధికారులను, మంత్రులను ముఖ్యమంత్రిని కలిసి సాగరహారం నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం మీద వత్తిడి తెచ్చింద్రు.

తెలంగాణ మార్చ్ నిర్వహించే స్థలాన్ని ట్యాంక్‌బండ్ నుంచి సికింద్రాబాద్‌లోని జింకాన గ్రౌండ్‌కు మార్చితే అనుమతి ఇవ్వగలమని జెఎసి కి సమాచారం ఇచ్చింది. అంతేకాకుండ ఎట్టిపరిస్థితిలోను ట్యాంక్‌బండ్ మీద గాని, నెక్లెస్‌రోడ్డుపై గాని, ఆఖరికి ఇందిరాపార్క్‌వద్ద కూడ అనుమతి ఇచ్చేది లేదని ఖరాఖండిగ తేల్చి చెప్పింది. దీంతో తెలంగాణ కాంగ్రేసు నాయకులకు జర్రంత సెగ తగిలంది. ముందే ప్రకటించినట్టు సాగరహారాన్ని నెక్లెస్ రోడ్డులోనే నిర్వహించి తీరుతామని జెఎసి చైర్మన్ కోదండరాం ఖచ్చితంగ చెప్పిండు. దీంతో అడ్డుకునే ప్రయత్నంలో ప్రభుత్వం, విజయవంతం చేసుకునే దిశగ ఉద్యమకారులు అనేక ఆలోచనలతో ఉన్నరు. రోజురోజుకు ఉద్యమ వేడి పెరిగింది. అణిచివేత ఎక్కువైంది. ప్రజల్లో ఆవేశం అంతకంతకు పెరిగింది. ప్రభుత్వం ఎట్టకేలకు జెఎసి మార్చ్‌లో ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావుండదని లిఖితపూర్వకంగ హామీ ఇచ్చినంక 2012 సెప్టెంబర్ 28న 'తెలంగాణ మార్చ్'కు అనుమతి ఇచ్చింది. వేదికను టాంక్‌బండ్ నుంచి నెక్లెస్‌రోడుకు మార్చుకోవాలని సూచించింది.

తెలంగాణ ఉద్యమకారుల మీద పెట్టిన బైండోవర్ కేసులను రద్దుచేయాలని, అరెస్టు చేసిన వారందరిని బేషరతుగ విడుదల చేయాలని టి.ఆర్.ఎస్.ఎల్పి నేత ఈటెల రాజేందర్ విజ్ఞప్తి చేసిండు. హైద్రాబాద్‌కు వచ్చే దారుల్లో పోలీసుల అమానవీయ చర్యలను తగ్గించి శాంతియుతంగ మార్చ్ జరిగేందుకు పోలీసులు సహకరించాలని కోరిండు.

సభ నిర్వహణ కోసం అన్ని జిల్లాల నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చింద్రు. వరంగల్ జిల్లా నుంచి అంబటి శ్రీనివాస్, డోలి సత్యనారాయణలు వలంటీర్లను తీసుకొచ్చి సభ ఏర్పాట్లలో మునిగిపోయింద్రు.

తెలంగాణ మార్చ్‌కు అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి చివరి నిమిషంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు అందరిని ఆశ్చర్య పరిచింది. ఉస్మానియా యూనివర్సిటిని



దిగ్బంధించింది. సాక్షాత్తు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గృహనిర్బంధంలోకి వెళ్ళిపోయిండు. గవర్నర్ ఉండే రాజ్‌భవన్ చుట్టు ముండ్ల కంచెలు ఏసుకుండ్రు. శాసనసభకు, సచివాలయానికి తాళాలు ఏసుకుండ్రు. పోలీసులను కావలి పెట్టుకుండ్రు.

సెప్టెంబర్ 16న కరీంనగర్ కవాతు నిర్వహించడం ద్వార సాగరహారానికి జనాన్ని సమాయత్తం చేసింది. తెలంగాణ పదిజిల్లాల్లో ప్రజలు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగ పాల్గొనేలా తగిన కార్యాచరణ ప్రణాలిక రూపొందిచింది.

సర్కస్ గ్రౌండ్‌లో ఉద్యోగ సంఘాల నాయకుడు స్వామిగౌడ్ పదివేల మందితో పెద్ద బహిరంగ సభను ఏర్పాటు చేసిండు. సెప్టెంబర్ 29 నాటికి కేంద్రం తెలంగాణ ఏర్పాటు అంశం మీద స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించకపోతే సమరానికి సిద్ధమేనా అని అనడంతో జనమంత ఒక్కసారిగ ముక్తకంఠంతో సమరమే అని సమాధానం ఇచ్చిండ్రు. ఉపాధ్యాయులు, కార్మికులు, ఉద్యోగులందరు పెద్దఎత్తున మార్చ్‌లో పాల్గొనాలని ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ దేవిప్రసాదరావు పిలుపునిచ్చిండు. అటీటు కాని నపుంసక నాయకులను హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విఠల్ అన్నడు.

సాగరహారాన్ని ట్యాంక్‌బండ్ మీద కాకుండ నెక్లెస్‌రోడ్డులోని పి.వి.ఘాట్ వద్ద మ॥3.00గంటల నుంచి సాయంకాలం 7.00గంటల వరకు నిర్వహించుకోవాలని షరతుని విధించింది. షరతులతో కూడిన అనుమతి ఇచ్చిన ప్రభుత్వమే షరతును ఉల్లంఘించి ప్రజలను మార్చ్‌కు రాకుండ అడ్డుకుంది. 2011 మార్చిలో జరిగిన మిలియన్ మార్చ్‌లో కూడ ప్రభుత్వం ఇట్లాంటి చర్యలకు పాల్పడిన సంగతి మనకు తెలుసు అయినప్పటికి లక్షమంది జనం ట్యాంకుబండ్‌ని ముద్దాడిన చారిత్రక ఘట్టం

ఆవిష్కరించబడింది. అట్ల ప్రభుత్వ ద్వంద్వ వైఖరితో విసిగిపోయిన జనం ఒక్కసారిగి తిరగబడ్డరు. అది ఇది అన్ని కలిసి సాగరహారం హోరెత్తింది. చవట ప్రభుత్వానికి చెమటలు పట్టించింది.

తెలంగాణ మార్చ్ జరిగిన తీరు ఎవరినైన విస్మయానికి గురిచేస్తుంది. బుద్ధభవన్ నుంచి ఇందిరాగాంధి విగ్రహం వరకు జనజాతర సాగింది. పోలీసు వలయాలను ఛేదించుకుంటు ఐదు లక్షలకు పైగా జనం తెలంగాణ ఆకాంక్షను మోసుకొచ్చింద్రు. సీమాంధ్ర పాలకుల గుండెల్లో గుబులు పుట్టించింద్రు.

పొద్దూకంతల చిన్నగ మొదలైన వాన రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో కుండపోతగ కురిసింది. అయినా జనం సభాస్థలాన్ని విడిచి పక్కకుపోలే. దీక్ష చేపట్టాలని నిర్ణయించిన కోదండరాం సభను కొనసాగిద్దామ అని అడిగినప్పుడు జనమంత కొనసాగిద్దామని చెప్పింద్రు. అర్ధరాత్రి వరకు దీక్ష కొనిసాగింది. మరోసారి కుండపోత వాన రావడంతో వరద పెరిగి మొత్తం ప్రాంగణమంత బురదమయం అయింది. దీంతో ఇంకా ప్రజలను ఇబ్బంది పెట్టలేక దీక్షను విరమించి మార్చ్‌ని ఆపేసింద్రు. లేదంటే పి.వి.ఘాట్ మరో తెహ్రీస్క్వేర్‌గా మారి ఉండేది.

ఒక్క ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే 140 రౌండ్ల బాష్పవాయు గోళాలను ప్రయోగించింద్రు. విద్యార్థుల మీద విచ్చలవిడిగ లాఠిచార్జ్ చేసింద్రు. వేదిక సమీపంలోనే 40రౌండ్ల బాష్పవాయు గోళాలను ప్రయోగించింద్రు. హైద్రాబాద్ నిండ 40వేల మంది పోలీసులు, పారామిలిటరి బలగాలు కవాతు చేసిన జనం ఒక్కడుగు వెనకకు వేయలేదు. పదంపదం కలిపి కదం తొక్కింద్రు. తెలంగాణ పదాలు పాడుకుంటు ఆకలి దూపని మరిచింద్రు. జెండాలకు అతీతంగ జనం ఏకమైన అద్భుత దృశ్యం సాగరహారం. పోలీసుల, ప్రభుత్వ కుట్రలను ఛేదించి, ప్రజా ఉద్యమానికి నాంది పలికింది.

సాగరహారం వేదిక మీద కళాకారుల పాటలతో హోరెత్తింది. ఆ పక్కనే పోలీసుల బాష్పవాయువులు విద్యార్థులను పోరాటం వైపుకు ఉసిగొల్పుతున్నయి.

ఉద్యమం టి.ఆర్.ఎస్‌కు, కేసీఆర్‌కు ఎంత అవసరమో టి.ఆర్.ఎస్ కేసీఆర్ కూడ ఉద్యమానికి అంతే అవసరం.

తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగ సాగరతీరం దద్దరిల్లింది. ఒకేజెండా, ఒకే మాట, ఒకే పాట, ఒకే బాట అదే తెలంగాణ మార్చ్ సాధించిన విజయం. తక్షణమే తెలంగాణ ప్రకటించకపోతే ప్రజలే అసెంబ్లీ, సచివాలయాల తాళాలు పగులగొట్టి స్వయంపాలనను ప్రకటించుకునే అవకాశం ఉన్నది.

తెలంగాణ తల్లి బానిస సంకెళ్ళను తెంచడం కోసం నడుం కట్టిన బిడ్డలు. విద్యార్థుల ఉన్నత ఉద్యోగాలను పక్కన పెట్టి తెలంగాణ రాష్ట్రం కోసం కలలు గన్నరు. అందుకోసం సెప్టెంబర్ 30 తెలంగాణ మార్చ్‌లో పాల్గొని సాగరహారం వేయాలని ఎందరో సంకల్పించింద్రు. హైద్రాబాద్ నగరాన్ని జనం అష్టదిగ్భంధనం చేసింద్రు. నెక్లెస్‌రోడ్డు జనహారం అయ్యింది. తెలంగాణ పది జిల్లాల నుంచి కదలివచ్చిన కడలితరంగంలా జనం ప్రశాంతంగ కదులుతున్నరు. పిల్లలుచ, పెద్దలు, వృద్ధులు, మహిళలు ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టిన సాగరతీరం చేరింద్రు. పోలీసులు సభలో కూర్చున్న వారి మీదికి బాష్పవాయు గోళాలను ప్రయోగించింద్రు. వాటర్ కానన్‌లతో దాడి చేసింద్రు. డి.జి.పి హెలికాప్టర్‌తోని చెక్కర్లు గొట్టిండు.

పోలీసుల లాఠీచార్జీలను, టియర్‌గ్యాస్ కాల్పులను ఎదిరిస్తు రాళ్ళతో జవాబు చెప్పింద్రు. కిలోమీటర్ దాక పోలీసులను వెనక్కి నెట్టింద్రు. పోలీసులు వాటర్ కానన్‌లను ప్రయోగించింద్రు.

ఈజిప్టు తరహా ఉద్యమం కాదిది. అంతకు మించిన ఉద్యమం. 2011 జనవరి 25న కొన్నివేల మంది యువకుల ప్రజాస్వామ్య ప్రదర్శనతో మొదలైన ఉద్యమం ఫిబ్రవరి 11న ఆ దేశ అధినేత హోస్ని ముబారక్ రాజీనామాతో ముగిసింది.

తెలంగాణ ఉద్యమ చరిత్రలో సాగరహారం ఒక అపూర్వ ఘట్టం. లక్షలాది మంది యువకులు పోలీసుల బారికేడ్‌లను, చెక్‌పోస్టులను, ఇనుప కంచెలను దాటుకొని ఇంటిల్లిపాది తెలంగాణ మార్చ్‌కు తరలి వచ్చింద్రు.

తెలంగాణ వచ్చే దాక ఇక్కడి నుంచి కదిలేది లేదని కొదండరాం ప్రకటించిండు. ప్రభుత్వం మన మీద బాంబులు వేసినా సరే సభా ప్రాంగణాన్ని విడిచేది లేదని తేల్చి చెప్పిండు.

సెప్టెంబర్ 30, 2012 ఆదివారం తెలంగాణ రాష్ట్ర సాధన చరిత్రలో మైలురాయిగ నిలిచిపోయింది.

ఈజిప్టులో 35 సంవత్సరాల హుస్సేని ముబారక్ నియంతృత్వాన్ని కూల్చి ప్రజా ప్రభుత్వాన్ని సాధించిన తరహాలోనే సెప్టెంబర్ 30ని విజయవంతం చేద్దాం అని ప్రజలు యుద్ధస్ఫూర్తితో కదిలింద్రు. తెహ్రీస్క్వేర్‌లో నిర్వహించిన అంకుంఠిత దీక్ష తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శం కావాలని నాయకులు కోరుకున్నరు. వందలాంది అమరుల ఆత్మత్యాగాల సాక్షిగ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాలనే ఆవేశంతో అడుగులేసింద్రు. ఇంటిల్లిపాది జాతరకొచ్చినట్టు జెండా కర్ర చేతబట్టుకొని జంగ్ సైరనూదింద్రు.

చివరికి ముఖ్యమంత్రి సభకు వచ్చే మహిళల్ని సైతం చెప్పులు తొడుక్కొని రావద్దని ఆజ్ఞలు జారిచేసే పరిస్థితి దాపురించింది.

కరీంనగర్ జిల్లా రామగుండం మండలం పెద్దంపేటకు చెందిన గుడి రాజిరెడ్డి బతుకుదెరువు కోసం హైద్రాబాద్‌కు వచ్చిండు. కూకట్‌పల్లిలో చికెట్‌సెంటర్ నడుపుకొని బతికే గుడి రాజిరెడ్డి తెలంగాణ మార్చ్‌లో జెండా పట్టుకొని జై తెలంగాణ అంటు నినాదాలు చేసిండు. పోలీసుల దౌర్జన్యానికి, పెత్తందారి ప్రభుత్వ విధానానికి ఎదురినిలిసిండు. తెలంగాణ మార్చ్‌లో బాష్పవాయు గోళాలను లెక్కచేయకుండ ముందుకు కదిలిండు. సీమాంధ్ర ప్రభుత్వం ప్రజల నడుమ పెట్టిన పొగను మింగి, రక్తం కక్కి రణరంగాన్ని సృష్టించిన రాజిరెడ్డి 25 రోజుల తర్వాత చనిపోయిండు. ఉద్యమాన్ని బతికించిండు.

దీనికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. హుస్సేన్‌సాగర తీరంలో మార్చ్‌కు అనుమతినిచ్చి ముండ్ల కంచెలు పాతింది. మార్చ్‌కు తరలివస్తున్న లక్షలాది మందిని నిర్భందించింది. పోలీసులు, పారా మిలటరి బలగాలను మోహరించి భయభ్రాంతులకు గురిచేసింది. మార్చ్ జరుగుతున్నంత సేపు సైన్యం కవాతు నిర్వహించింది. రబ్బర్ బుల్లెట్లు, బాష్పవాయు గోళాలు, జల ఫిరంగులను విచ్చలవిడిగ ప్రయోగించింది. యుద్ధ వాతావరణాన్ని సృష్టించింది అయినా ఒక్క అడుగు వెనకకు తగ్గకుండ తెలంగాణ బిడ్డలు కదందొక్కింద్రు. ఈజిప్ట్ ఉద్యమాన్ని ఆకాశానికి ఎత్తిన మీడియాకు తెలంగాణలో జరిగిన సాగరహారం అంతగ రుచించలేదు. మార్చ్‌లో పాల్గొన్న ప్రతి తెలంగాణ బిడ్డ జన్మధన్యమైంది అన్నంత సంబరంగ ఇండ్లకు చేరింద్రు. ఎంతటి నిర్భందాన్నయిన ఎదిరించింద్రు. ప్రజాస్వామ్యయుతంగ పోరాటం చేసింద్రు.

తెలంగాణ మార్చ్ ప్రశాంతంగ ముగిసినందుకు కేంద్రహోంశాఖ మంత్రి సుశీల్‌కుమార్ షిండే ఊపిరి పీల్చుకుండు. తెలంగాణ ప్రజల ఔదార్యాన్ని ఉద్యమ స్ఫూర్తిని, నిజాయితీని, ధర్మాగ్రహాన్ని అర్ధం చేసుకుండు. న్యాయవాదులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, జర్నలిస్ట్‌లు, కవులు, కళాకారులు పెద్దఎత్తున మార్చ్‌లో పాల్గొన్నరు. ఉద్యమంలో ఒరకికొకరు సహకరించుకుంటు ఎవరి వృత్తిని వారు నిర్వర్తించింద్రు. అలసిపోయిన సొమ్మసిల్లిన వాళ్ళకు వైద్య సేవలు అందించింద్రు. అరెస్టు చేసిన వాళ్ళను న్యాయవాదులు దగ్గరుండి ఇడిపించిద్రు. బాట పొడుగూత ఇండ్లముందు మంచి నీళ్ళుపోసి ఉద్యమకారులను ఉత్తేజ పరిచింద్రు.

తెలంగాణ మార్చ్ విజయవంతాన్ని చూసి తట్టుకోలేని సీమాంధ్ర ప్రభుత్వం కోదండరాంని అరెస్టు చేసింది. విద్యార్థి నాయకుల మీద అక్రమ కేసుల

బనాయించింది. మార్చ్‌కు వచ్చిన వాహనాలను సీజ్ చేసింది. డ్రైవర్లను అరెస్టు చేసి నానా ఇబ్బందులకు గురి చేసింది. బస్సులు, రైళ్ళ వేళల్లో మార్పులు చేసి ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేసింది.

# పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు

2013 జులై 11న ఢిల్లీలో కాంగ్రేసు కోర్ కమిటి సమావేశానికి సోనియాగాంధి, మన్మోహన్ సింగ్, ఆజాద్, చిదంబరం, షిండే, దిగ్విజయ్‌సింగ్ హాజరయ్యింద్రు. తెలంగాణ అంశాన్ని తేల్చేటందుకు చర్చలు జరిగినయి.

జులై 25న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని, ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ్మను పి.సి.సి. అధ్యక్షుడు బొత్స సత్యనారాయణను అధిష్టానం ఢిల్లికి పిలిపించింది. ఈ సమావేశంలో కిరణ్, బొత్సలు సమైక్యరాష్ట్రం గురించే మాట్లాడింద్రు. రాజనర్సింహ్మ తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని వివరించి చెప్పిండు. మరుసటి రోజు పొద్దున్నే కాంగ్రేస్ వ్యవహారాల ఇంచార్జ్ దిగ్విజయ్ సింగ్ తెలంగాణ అంశం మీద సంప్రదింపుల ముగిసినయని ప్రకటించిండు.

2013 జులై 30న హైద్రాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణ ఇస్తున్నట్టు కాంగ్రేస్ వర్కింగ్ కమిటి ప్రకటించింది.

2013 ఆగస్టు5న ఆర్థికమంత్రి చిదంబరం తెలంగాణ ప్రక్రియ మొదలైందని పార్లమెంట్‌లో ప్రకటించిండు. కేంద్రం ఎ.కె. ఆంటోని అధ్యక్షుడిగ దిగ్విజయ్‌సింగ్, వీరప్పమొయిలి,అహ్మద్‌పటేల్ సభ్యులుగ విభజన కమిటీని ప్రకటించింది. ఆంటోని కమిటి విభజన బిల్లు అమలు కోసమేనని దిగ్విజయ్‌సింగ్ మరోసారి ప్రకటించిండు. దీంతో ఆగష్టు 8న కిరణ్‌కుమార్ రెడ్డి నీళ్ళవిషయంలో సీమాంధ్ర పరిస్థితి మీద అధిష్టానంపై తిరగబడ్డడు.



సెప్టెంబర్ 21న 'సేవ్ ఆంధ్రప్రదేశ్' సభను హైద్రాబాద్‌లో నిర్వహించింద్రు. సీమాంధ్ర నుంచి ఫ్యాక్షనిస్టులు, గుండాలు తెలంగాణ బిడ్డల్ని గాయపరిచింద్రు. వీళ్ళతో పాటు ఈ సభలో ధర్మపురి సత్యవాణి నీతి వాక్కులు, గజల్ శ్రీనివాస్ గందరగోళం పాటలతో సభ వేడెక్కింది. దీంతో శ్రీనివాస్ అనే కానిస్టేబుల్ జై తెలంగాణ అంటూ వేదికమీదకి ఉరికిండు. సీమాంధ్ర గూండాలు, పోలీసులు వెంటబడి కొట్టింద్రు. అంతకుముందే విద్యార్థి నాయకుడు దూదిమెట్ల బాలరాజుని ఇష్టంవచ్చినరీతిలో కొట్టి గాయపరిచింద్రు.

సెప్టెంబర్ 21న చంద్రబాబు నాయుడు ఢిల్లికి పోయి రాష్ట్రపతిని కలిసిండు. రెండు ప్రాంతాలల్లో ఉద్యమాలు జరుగుతున్నందున రాష్ట్రాన్ని సమైక్యంగ ఉంచాలని కోరిండు. మరోసారి తన రెండు కండ్ల సిద్ధాంతాన్ని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పిండు.

కృత్రిమ సమైక్యాంధ్రకు దీటుగ సెప్టెంబర్ 29న నిజాం కాలేజ్ గ్రౌండ్‌లో టి.ఆర్.ఎస్. సకలజనభేరి బహిరంగ సభను నిర్వహించింది.

తెలంగాణ విషయాన్ని ఇంకా జాప్యం చేయడం న్యాయం కాదని, 2013 అక్టోబర్ 3న కేంద్ర హోంశాఖ రూపొందించిన తెలంగాణ నోట్‌ను కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. సి.డబ్లు.సి తీసుకున్న నిర్ణయాన్ని యధావిధిగ అంగీకరించింది.

2013 అక్టోబర్ 5న లోటస్‌పాండ్‌లో జగన్ సమైక్య దీక్షకు కుసుండు.

నవంబర్ 12,13 తేదీలలో మంత్రుల బృందం రాష్ట్ర విభజన మీద సలహాలు, సూచనలు చేయవలసిందిగా రాష్ట్ర పార్టీలను ఢిల్లికి ఆహ్వానించింది.

తెలంగాణకు వ్యతిరేకంగ సీమాంధ్ర నాయకులు చేస్తున్న కార్యక్రమాలకు నిరసనగ డిసెంబర్ 4న నిరసన దినం పాటించి డిసెంబర్ 5న తెలంగాణ బంద్ పాటించాలని కేసీఆర్ పిలుపునిచ్చిండు.

డిసెంబర్ 5న పార్లమెంట్ సమావేశాలు మొదలు కావడంతోనే తెలంగాణ ముసాయిదా బిల్లు -2013ను కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది.

2013 డిసెంబర్ 12న రాష్ట్రపతి బిల్లుని రాష్ట్రానికి పంపి ఆరు వారాల్లో అభిప్రాయాన్ని చెప్పాలని కోరిండు. బిల్లు అసెంబ్లీకి చేరకుండ కిరన్‌కుమార్ రెడ్డి అనేక ఎత్తుగడలు ఏసిండు.

డిసెంబర్ 13న అసెంబ్లీ వాయిదా పడ్డంక బిల్లు అసెంబ్లీకి చేరింది. 14వ తేదీ ఆదివారం కావడం వలన 15న బిల్లు ప్రతులు శాసనసభ్యులకు అందించింద్రు. డిప్యూటి స్పీకర్ మల్లు భట్టి విక్రమార్క 16న బిల్లుపై చర్చను ప్రారంభించ వలసిందిగ ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడిని కోరిండు. సీమాంధ్ర నాయకులు

బిల్లుప్రతులను చింపి పైశాచిక ఆనందాన్ని పొందింగ్రు. అసెంబ్లీలో తెలంగాణ బిల్లు మీద చర్చ ప్రారంభమైందని దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ప్రకటించిండు. మూడు రోజుల నడిచిన సభ 19న వాయిద పడ్డది. అదేరోజు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ శీతాకాలం కావడం వలన హైద్రాబాద్‌లోని బొల్లారంకు విచ్చేసిండు.

శాసనసభ మలివిడత సమావేశాలు 2013 జనవరి 3న ప్రారంభం కావడానికి ముందు శాసనసభ వ్యవహారాల శాఖనుంచి శ్రీదర్ బాబును తొలగించి, ఆ స్థానంలో సమైక్యవాది అయిన శైలజానాద్‌ని నియమించిండు. ముఖ్యమంత్రి చర్యలకు నిరసనగ 2014 జనవరి 2న శ్రీధర్‌బాబు తన మంత్రి పదవికి రాజినామ చేసిండు.

జనవరి 6న బిజినెస్ అడ్వైజరీ కమిటి సమావేశాన్ని స్పీకర్ నాదెండ్ల మనోహర్ నిర్వహించిండు. ఎం.ఐ.ఎం. శాసన సభాపక్ష నాయకుడు అక్బరుద్దిన్ అడిగిన ప్రశ్న (ఇంతకు తెలంగాణ బిల్లుపై చర్చ మొదలైందా..) కు స్పీకర్ ప్రారంభమైందని సమాధానం చెప్పిండు.

జనవరి 8న తెలంగాణ బిల్లు మీద వట్టి వసంతకుమార్ తొలి ప్రసంగం చేసిండు. చర్చ రెండు రోజులు అర్దవంతంగ నడిచింది. టి.ఆర్.ఎస్ శాసన సభాపక్ష నేత ఈటెల రాజేందర్ జనవరి 10న తెలంగాణ అమరులను

తలుచుకుంటు ఉద్వేగ భరితంగ మాట్లాడిండు. తెలంగాణ ముసాయిదా బిల్లు మతగ్రంధాలంత పవిత్రమైనదని ఆర్తిని వ్యక్తం చేసిండు. సీమాంధ్ర నాయకుల కుటిలనీతిని, కుట్రలను గమనించిన కేంద్రం రూల్ 77 కింద బిల్లును వెనకకు పంపవలసిందిగా స్పీకర్‌కు తీర్మాణం నోటీసు ఇచ్చింగ్రు. 2014 జనవరి 30తో రాష్ట్రపతి ఇచ్చిన గడువు పూర్తి అయ్యింది. గడువు పెంచే అవకాశం లేదు. వాస్తవానికి మొత్తం సభ్యుల అభిప్రాయంతో బిల్లు పై చర్చ ముగిసినప్పటికి ముఖ్యమంత్రి రూల్ 77 కింద ఇచ్చిన తీర్మాణం చర్చకు తీసుకున్నట్టు ప్రకటించి మూజువాణి ఓటుతో ఆమోదించినట్టు ప్రకటించిండు. బిల్లు విషయంలో అడుగడుగున ఆంధ్ర నాయకుల అసలు రంగు స్పష్టంగ బయట పడ్డది. మొత్తానికి 49 రోజులు రాష్ట్ర శాసన సభలో ఉన్న తెలంగాణ బిల్లు విజయవంతగం రాష్ట్రపతికి చేరింది.

# హైద్రాబాద్‌కు తిరిగొచ్చిన కేసీఆర్

రాష్ట్ర అసెంబ్లీలో తెలంగాణ బిల్లు మీద చర్చ ముగిసిన వెంటనే జనవరి 30న అదేరోజు కేసీఆర్ ఢిల్లికి పోయి బిల్లుకు మద్దతు కూడగట్టే పనిలోపడ్డడు. 2014 ఫిబ్రవరి 2న లాలూప్రసాద్ యాదవ్, రాంవిలాస్ పాశ్వాన్‌లతో పాటు ఇంకా ఎందరెందరినో కలిసి బిల్లుకు మద్దతు ఇవ్వాల్సిందిగ కోరిండు.

ఫిబ్రవరి 3న రాష్ట్ర అసెంబ్లి పంపిన అభిప్రాయం కేంద్ర హోంశాకు అందింది. పిబ్రవరి 4న కేసీఆర్ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌ని కలిసిండు. ఫిబ్రవరి 5న పార్లమెంట్ సమావేశాలు మొదలైనయి.

ఢిల్లికి చేరిన చంద్రబాబు, జగన్‌లు ఫిబ్రవరి 6న వేరువేరుగ సుష్మా స్వరాజ్‌ని కలిసింద్రు. సుష్మా స్వరాజ్ చంద్రబాబు నాయుడ్ని నిలదీసింది. అసలు మీ పార్టీకి ఒక స్టాండంటూ లేదా అని ప్రశ్నించింది. ఆ తర్వాత జగన్ సుష్మాస్వరాజ్ ముందు తన తెలివిని ప్రదర్శించే ప్రయత్నం చేసిండు. మీరు తెలంగాణ ప్రతినిధిలా మాట్లాడుతున్నరని తన కసిని వెళ్ళగక్కిండు జగన్. అవును నేను తెలంగాణ ప్రతినిధినే



అంటూ సుష్మా స్వరాజ్ ఘాటుగ సమాధానం చెప్పడంతో జగన్ గుంటనక్కలా తోకముడుచుకొని వెళ్ళి పోయిండు.

ఫిబ్రవరి 7న తెలంగాణ బిల్లును కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. ఫిబ్రవరి 9న బిల్లు రాష్ట్రపతి వద్దకు చేరింది. ఫిబ్రవరి 10న కేసీఆర్ సోనియాగాంధిని కలిసిండు.

పార్లమెంట్ సమావేశాలకు ఆటంకం కలిగిస్తున్న సీమాంధ్ర కాంగ్రేసు ఎం.పి.లు ఏకంగ ప్రభుత్వం మీద అవిశ్వాసం పెట్టింద్రు. దీంతో ఫిబ్రవరి 11న లగడపాటి రాజగోపాల్, రాయపాటి సాంబశివరావు, హర్షకుమార్, సబ్బం హరి, సాయి ప్రతాప్, ఉండవల్లి ఆరుణ్‌కుమార్‌లను సస్పెండ్ చేసింది.

రాష్ట్ర పునర్విభజన బిల్లును 2014 ఫిబ్రవరి 13న హోం మంత్రి సుశీల్‌కుమార్ షిండే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిండు. సీమాంధ్ర ఎం.పి.లు సభను గందరగోళ పరిచింద్రు. లగడపాటి రాజగోపాల్ పార్లమెంట్‌లో పెప్పర్ స్ప్రే ప్రయోగించిండు. పార్లమెంటు సభ్యులు కండ్లు మంట మండడంతో కేకలు పెట్టింద్రు. ప్రాణభయంతో పరుగులు తీసింద్రు. మోదుగుల వేణుగోపాల్ రెడ్డి (టి.డి.పి) మైకు ఇరగొట్టి దాడికి తయారైండు. సీమాంధ్రుల వైఖరి ప్రపంచానికి తెలిసిపోయింది. ఈ గంధరగోళానికి కారణమైన 16 మంది ఎం.పి.లను స్పీకర్ ఆ రోజు నుంచి ఐదు రోజుల పాటు సస్పెండ్ చేసింది.

ఫిబ్రవరి 13న పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టినప్పటికి వెంకయ్యనాయుడు మాటలు నమ్మిన సుష్మాస్వరాజ్ బిల్లు ప్రవేశపెట్టలేదని చెప్పింది. నాలుగు రోజుల సెలవుల తర్వాత ఫిబ్రవరి 17న పార్లమెంట్ తిరిగి ప్రారంభం కావలసి ఉంది. ఈలోగ కిరన్, జగన్, చంద్రబాబు, సీమాంధ్ర ఉద్యోగ సంఘాల నాయకుడు అశోక్ వందలాది మంది గూండాలతో ఢిల్లీకి చేరుకుంద్రు. కాని సభాస్థలంలో ఎవ్వరు లేరు. అందరు ఢిల్లిలోని అందమైన, చారిత్రక ప్రదేశాలను చూస్తందుకు పొయ్యింద్రు.

ఫిబ్రవరి 18న తెలంగాణ బిల్లు మీద చర్చను మొదలు పెడుతూ హోం మంత్రి షిండే మాట్లాడిండు. ఫిబ్రవరి 13నే బిల్లు ప్రవేశ పెట్టినట్టు షిండే ప్రకటించిండు. తర్వాత కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి మాట్లాడిండు. సుష్మాస్వరాజ్ తెలంగాణ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించింది.

లోక్‌సభలో తెలంగాణ బిల్లు పాస్ కావడంతో పిచ్చెక్కిన కిరన్‌కుమార్‌రెడ్డి పదవులన్నింటికి రాజినామ చేసి గవర్నర్ నరసింహన్‌కు అందజేసిండు.

హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే ఫిబ్రవరి 20న రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టిండు. ఇక్కడ కేవిపి రామచంద్రరావు ప్లకార్డుతో నిరసన తెలిపిండు. సుజనా

చౌదరి, సి.యం. రమేశ్ పిచ్చిబట్టినట్టు చేసింగ్రు. ఆరోజు బిల్లు పదిసార్లు వాయిద పడ్డది. రాజ్యసభ డిప్యూటి చైర్మన్ కురియన్ బిల్లు మీద అభిప్రాయాలను కోరిండు. అప్పుడు వెంకయ్య నాయుడు అడ్డుతగిలిండు. ఇంతలో బి.జే.పి. రాజ్యసభ ఫ్లోర్‌లీడర్ అరుణ్‌జైట్లి తమ పార్టి తెలంగాణ బిల్లుకు మద్దతు ఇస్తుందని ప్రకటించిండు. సీతారాం ఏచూరి ఇంకా విశాలాంధ్ర కాన్నే కుసుండు. మూజువాణి ఓటుతో బిల్లు పాసైనట్టు డిప్యూటి స్పీకర్ కురియన్ ప్రకటించిండు.

రాజ్యసభలో బిల్లు పాసైన వెంటనే కేసీఆర్ ప్రెస్‌మీట్ పెట్టిండు.

ఎట్టకేలకు అరవయ్యేండ్ల సుదీర్ఘ పోరాటం విజయం సాధించింది. ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను, అమరవీరులను తలుచుకుండు. తెలంగాణ కలని సాకారం చేసిన సోనియాగాంధికి, హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండేకు, లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్‌కు, రాజ్యసభ డిప్యూటి చైర్మన్ కురియన్‌కు, సుష్మాస్వరాజ్‌కు, అరుణ్‌జైట్లికి, రాజ్‌నాథ్‌సింగ్‌కు కృతజ్ఞతలు చెప్పిండు. తెలంగాణ బిల్లు మీద రాష్ట్రపతి ఆమోద ముద్ర పడి గెజిట్ అయిన తర్వాతనే హైద్రాబాద్‌కు వస్తనని చెప్పిండు. ప్రజలంత సంబరాలు చేసుకుంగ్రు.

## జూన్2 తెలంగాణ ఆవిర్భావం

లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లు ఆమోదం పొందిన తెల్లారి కేసీఆర్ ఢిల్లిలో అందర్ని కలిసిండు. తెలంగాణ బిల్లుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేసిండు. ఫిబ్రవరి 23న కుటుంబసభ్యులందరితో పోయి సోనియాగాంధికి కృతజ్ఞతలు చెప్పిండు. ఫిబ్రవరి 24న కేశవరావుతో కలిసి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీని కలిసిండు. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌ని, రాహుల్ గాంధిని కలిసి ధన్యవాదాలు చెప్పిండు.

అమరుల ఆశయాన్ని భుజాన మోసుకొని 2014 జనవరి 30న పోరాట ఘట్టాలను తలుచుకుంటు ఢిల్లికి పొయిన కేసీఆర్ 26 రోజులు ఉన్నడు. తెలంగాణ రాష్ట్రంతోనే హైద్రాబాద్‌కు తిరిగి వస్తానని చెప్పి వెళ్ళిన కేసీఆర్ ఫిబ్రవరి 26న హైద్రాబాద్ రావడానికి తయారైండు. అలుపులేని పోరాట యోధుడు, రాష్ట్ర సాధకుడు కేసీఆర్ వస్తుండన్న విషయం తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హైద్రాబాద్‌కు చేరుకుంటుంగ్రు. సాయంకాలం 4గం॥లకు కేసీఆర్ శంషాబాద్ విమానాశ్రయంలో దిగిండు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుండు. కార్యకర్తలు, నాయకుల స్వాగత సత్కారాల నడుమ

బేగంపేట నుంచి గన్‌పార్క్ దాక విజయోత్సవ ర్యాలి సాగింది. లక్షలాది ప్రజల నడుమ హైద్రాబాద్ మొత్తం పూలతో నిండిపోయింది. గులాబిమయమై శోభిల్లింది. కళాకారుల ధూంధాంలతో నేలతల్లి దద్దరిల్లింది. ఒంటెలు, గుర్రాలు, యాత్రలో లయబద్ధంగ అడుగులేసినయ్. విజయోత్సవ ర్యాలి గన్‌పార్క్ చేరిన వెంటనే హెలీకాప్టర్ ద్వార అమరవీరుల స్థూపం మీద పూలవర్షం కురిసింది. కేసీఆర్‌తో పాటు నాయకులందరు అమరవీరులకు జోహార్లు అర్పించిండ్రు. అక్కడి నుంచి తెలంగాణ భవన్‌కు చేరిన ర్యాలి జయశంకర్‌సార్‌కు నివాళి అర్పించింది.

2014 మార్చి 1న తెలంగాణ బిల్లు మీద రాష్ట్రపతి సంతకం పెట్టిండు. వెంటనే కేంద్రప్రభుత్వం మార్చి2న గెజిట్ విడుదల చేసింది. దేశచరిత్రలో తెలంగాణ 29వ రాష్ట్రంగ ఆవిర్భవించింది. అదేరోజు రాష్ట్రంలో పాలన రాష్ట్రపతి చేతుల్లోకి వెళ్ళిపోయింది. మొదటిసారి 1973 జనవరి 18న రాష్ట్రంలో వచ్చిన రాష్ట్రపతి పాలనకు కారణం తెలంగాణ ఉద్యమమైతే, మళ్లీ దాదాపు 41 సంవత్సరాల తర్వాత రెండవసారి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగ ఆవిర్భవించిన సంధర్భంలో రాష్ట్రపతి పాలన విధించడం జరిగింది.

కేసీఆర్ అనేక ఊహాగానాలకు తెరదించి టి.ఆర్.ఎస్ పార్టీని ఏ పార్టీలోను విలీనం చేసేది లేదని ప్రకటించిండు.

కేంద్రప్రభుత్వం 2014 మార్చి 4న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినంగ జూన్ 2న జరపుకోవాలని ప్రకటించింది.

భారత తొలి ప్రధాని నెహ్రూ అన్న మాటల్ని ఆయన కోడలు సోనియాగాంధి నిజం చేసింది. ఆలు మగల పంచాదికి పెద్దమనిషిగా మారి పంచాది తశ్వ జేసింది. తెలంగాణ ప్రజలను సీమాంధ్ర బానిస సంకెళ్ళనించి విముక్తి చేసి, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను నింపింది.

జయహో.. సోనియాగాంధి.

# తెలంగాణ తొలి ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కూడ సీమాంధ్రుల కుట్రలు మాత్రం ఆగలే. విద్య, ఉద్యోగాల విషయంలో అనేక ఎత్తుగడలు ఏసింద్రు.

2014 మార్చి 5న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. టి.ఆర్.ఎస్. పార్టీ ఎవరితో పొత్తుపెట్టుకోకుండ ఎన్నికల బరిలో నిలబడ్డది. తెలంగాణలో పుట్టగతులు లేకుండ పోయిన తెలుగుదేశం పార్టీకి ఎన్నికల్లో ఏ మొకం పెట్టుకొని జనంలోకి పోవాల్నో అర్థం గాలె. మోత్కుపల్లి నర్సింహులు ఖమ్మంజిల్లా మధిర నుంచి పోటీలోకి దిగిండు. సీమాంధ్ర మీడియా తెలంగాణ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఎవరు ఎన్నిచేసినా కేసీఆర్ ఎన్నికల ప్రచారం ముందు ఎవరు నిలువలేక పోయింద్రు. తెలంగాణ ప్రజలు టి.ఆర్.ఎస్ పార్టీకే పాలనా పగ్గాలు అందించింద్రు. 2014 కొత్త రాష్ట్రంలో జరిగిన మొట్టమొదటి ఎన్నికలలో టి.ఆర్.ఎస్.పార్టీకి 63 అసెంబ్లీ స్థానాలు, 11 పార్లమెంట్ స్థానాలు దక్కినయి.

కాంగ్రేస్ పార్టీకి 21 స్థానాలు, ఆంధ్ర ఆదిపత్య తెలుగుదేశం పార్టీకి 15 స్థానాలు, ఎం.ఐ.ఎం. 7 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది. టి.ఆర్.ఎస్. శాసనసభాపక్ష నాయకుడిగ మే 17న కేసిఆర్ ఏకగ్రీవంగ ఎన్నికయ్యిండు.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగ ప్రజలు 2014 జూన్ 2న తెలంగాణ ఆవిఆర్భావ సంబరాలు అంబరాన్ని అంటే విధంగ జరుపుకుంద్రు. అదే రోజు రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్ సమక్షంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగ కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేసిండు. కేసీఆర్ క్యాబినెట్ 11మంది మంత్రులతో కొత్తగ కొలువుదీరింది. శాసనసభ స్పీకర్‌గ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటి స్పీకర్‌గ పద్మా దేవేందర్ రెడ్డి, శాసనమండలి చైర్మన్‌గ స్వామిగౌడ్, డిప్యూటి చైర్మన్‌గ నేతి విద్యాసాగర్ ఎన్నికయ్యింద్రు. ప్రతిపక్ష నాయకుడుగ కుందూరు జానారెడ్డి (కాంగ్రేస్) ఎన్నికైండు.

# ముఖ్యాంశాలు

1. దక్కనీలు ముల్కీలు, అఫాకీలు గైర్‌ముల్కీలు.
2. పర్షియన్ అధికారులే అఫాకీలు.
3. అఫాకీలు షియాలు, దక్కనీలు సున్నీలు.
4. కులీకుతుబ్‌షా అఫాకీ అయినప్పటికీ తెలుగుభాషను ప్రేమించిండు.
5. కుతుబ్‌షాహీల పాలన ఔరంగజేబు దండయాత్రలతో అంతమయ్యింది.
6. గోల్కొండ పాలకుడు ఇబ్రహీం కుతుబ్‌షాహి కాలంలోని తెలంగాణ కవి – పొన్నగంటి తెలగనార్యుడు.
7. యయాతి చరిత్రను రచించింది – పొన్నగంటి తెలగనార్యుడు
8. యయాతి చరిత్రలోని కథాంశము – రామాయణ ఇతివృత్తము
9. నిజాం ఉల్ ముల్క్ అసలు పేరు మీర్ ఖమృద్దిన్ ఖాన్.
10. నిజాం అలీఖాన్ కాలం నుంచే ముల్కీ ఉద్యమాలు మొదలైనయి.
11. మొట్టమొదట సికిందర్‌జా కాలంలోనే జాగీర్దారులు తిరుగుబాటు చేసింట్రు.
12. సాలార్జంగ్ సంస్కరణల వల్లనే దేశముఖ్‌లు, జాగీర్దారులు బలపడ్డరు.
13. ఖల్సా (దివాని) అంటే నిజాం ప్రభుత్వ ఆధీనంలో ఉండే భూమి.
14. మీర్ మహబూబ్ అలీపాషా కాలంలో ఉర్దూ అధికార భాష అయ్యింది.
15. నిజాం ప్రాంతంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థుల చేత నిత్యం చేయించే ఉర్దూ ప్రతిజ్ఞ సారాంశం తెలుగులో – ఈ రాష్ట్రం ఈ రాష్ట్ర ప్రజలు ఆ చంద్ర తారార్కం సుభీక్షంగ ఉండుగాక.
16. ముల్కీల పక్షపాతి అయిన దివాన్ – కిషన్ పర్‌షాద్.
17. ఉర్దూలో గజళ్ళు రాసిన నిజాం – మీర్ ఉస్మాన్ అలీఖాన్.
18. హైద్రాబాద్‌లో జన్మించినవాళ్ళే ముల్కీలు అన్నది – మీర్‌ఉస్మాన్ అలీఖాన్
19. ప్రభుత్వ ఉద్యోగంలో ముల్కీలనే నియమించాలని ఫర్మాన జారీ చేసింది – మీర్ ఉస్మాన్ అలీఖాన్, 1919లో
20. రజాకార్ అంటే స్వయం సేవకుడు.
21. నిజాం సైన్యాధికారి – ఏల్ ఆండ్రూస్
22. 1949లో హాలిసిక్కా నాణేన్ని రద్దు చేసింది–జె.ఎన్. చౌదరి, మిలిట్రిప్రభుత్వం

23. 1952 ఎన్నికల నాటికి నిషేదం విధించబడిన పార్టీ - కమ్యునిస్టు పార్టీ.
24. బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో పనిచేసిన ఆంధ్రప్రాంతానికి చెందిన మంత్రి –వి.బి.రాజు (కార్మికశాఖ)
25. తెలంగాణ ప్రాంతాయ సంఘం తొలి అధ్యక్షుడు – కె. అచ్యుత్‌రెడ్డి.
26. 1984లో జనసంఘ్, భారతీయ జనతాపార్టీగ అవతరించింది.
27. 1969 ఉద్యమలో తొలి అమరుడు – శంకర్, సదాశివపేట
తెలంగాణ ప్రజా సమితి మొదటి అధ్యక్షుడు – మదన్‌మోహన్, సిద్ధిపేట.
28. 1969 ఉద్యమంలో రాష్ట్ర గవర్నర్ –ఖండూబాయ్ దేశాయ్. దేశచరిత్రలో పి.డి.యాక్టు కింద అరెస్ట్ అయిన తొలి గజిటెడ్ ఆఫీసర్ – డా॥గోపాల కిషన్, ఉస్మానియ అసిస్టెంట్ సర్జన్.
29. 1975 ఏప్రిల్‌లో మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు హైద్రాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో జరిగినయి.
30. టిఆర్ఎస్ 2001 జులైలో 100 ఎం.పి.టీ.సీలు, 85 జెడ్జిటీసీలు, రెండు జిల్లాపరిషత్ చైర్మన్ పదవులను గెలుచుకుంది.
31. టి.ఆర్.ఎస్. 2001 ఆగస్టు గ్రామ పంచాయతి ఎన్నికల్లో 3000 సర్పంచ్‌లు, 1200 వార్డులు గెలుచుకుంది.
32. ఎన్నికల సంఘం టిఆర్ఎస్‌ని రాజకీయ పార్టీగ గుర్తించిన తేది 2001, ఆగస్టు 18
33. 2002లో భూదాన్ పోచంపల్లిలో కేసీఆర్ బిక్షాటన చేసింది చేనేత కార్మికుల కుటుంబాల కోసం
34. 2003 జులై 20 కరీంనగర్ జిల్లా ధర్మపురిలో కేసీఆర్ గోదావరి పుష్కరాలు ప్రారంభించిండు.
35. 2003 అక్టోబర్ 22న వరంగల్ జిల్లా మేడారంలో కేసీఆర్ పల్లెబాట కార్యక్రమాన్ని ప్రారంబించిండు.
36. కేసీఆర్ దీక్షా సమయంలో ఖమ్మం ఆస్పత్రి సూపరింటెండెంట్ – డా॥పాపాలాల్
37. కేసీఆర్ దీక్ష విరమించిండన్న తప్పుడు వార్తని మీడియాకు విడుదల చేసిన డి.పి.ఆర్.ఓ. – ముర్తుజా
38. కేసీఆర్ దీక్ష సమయంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ – ఉషారాణి
39. తెలంగాణ ఉద్యమంలో భాగంగ కాగడాల ప్రదర్శనలో చనిపోయిన వరంగల్ జిల్లా కంతాయిపాలెం గ్రామానికి చెందిన అతి చిన్న వయస్కుడు – ఈదెగ

మధుకర్ (పది సంవత్సరాలు)

40. తెలంగాణ ఉద్యమంలో భాగంగ జరిగిన 'వంట–వార్పు' కార్యక్రమంలో పాల్గొన్న సినీనటుడు – సుమన్
41. 2010లో కోటి బతుకమ్మల జాతర పోస్టర్ మరియు పాటల సీడిని ఆవిష్కరించింది – ప్రొఫెసర్ జయశంకర్ సార్
42. కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రి – పి.వి. నర్సింహ్మారావు
43. తెలంగాణ ఉద్యమనేపథ్యంలో వచ్చిన మొదటి పుస్తకం – తెలంగాణలో ఏం జరుగుతుంది
44. తెలంగాణలో ఏం జరుగుతుంది అనే పుస్తకం – జయశంకర్‌సార్ ప్రసంగ పాఠం
45. తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్ పుస్తక రచయిత – ప్రొఫెసర్ జయశంకర్ సార్

# ఆధార గ్రంథాలు


1. నల్లా నరసింహులు – తెలంగాణ సాయుధపోరాటం నా అనుభవాలు 2009, విశాలాంధ్ర పబ్లీషింగ్ హౌజ్, హైద్రాబాద్
2. కె. జితేంద్రబాబు – నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు 2009, తెలంగాణ జాగృతి, హైద్రాబాద్
3. తెలంగాణ కన్నీటి గాథ– కొత్తసునిత 2002, సహచర ప్రచురణలు
4. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్ర– శోభాగాంధి, 2002.
5. జ్వలితదీక్ష – గటిక విజయ్‌కుమార్, 2013
6. తెలంగాణ రాష్ట్రం చరిత్ర ఉద్యమాలు– ఎలికట్టె శంకర్ రావు, 2014
7. సర్ జయశంకర్ – ఘటన ముద్రణ – 2011
8. దినపత్రికలు 2009 నుంచి 2014వరకు
9. సుంకిరెడ్డి నారాయణరెడ్డి – తెలంగాణ చరిత్ర, 2011, తెలంగాణ ప్రచురణలు, సికింద్రాబాద్.
10. తెలంగాణ మార్చ్– పిట్టల రవీందర్, 2013, తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రచురణ.
11. రాష్ట్రసాధన ఉద్యమం, 2009– పోరుతెలంగాణ ప్రచురణలు
12. ఉద్యమడైరి, పిట్టల రవీందర్,2015. హోంల్యాండ్ పబ్లికేషన్స్.
13. ఒక్కొక్క పాటేసి, తెలంగాణ రీసోర్స్ సెంటర్, 2014
14. కొండాలక్ష్మణ్ దార్శనికత, రుద్రమదేవి ఉమన్‌వెల్ఫేర్ ప్రచరణ, 2015.

# రచయిత పరిచయము

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | అంబటి వెంకట నరసింహా |
| కలం పేరు | : | అంబటి వెంకన్న |
| తల్లి దండ్రులు | : | మణెమ్మ - గురువయ్య, |
| కులం | : | బెస్త (బి.సి.ఎ) |
| పుట్టిన తేది | : | 12-04-1974, |
| విద్యార్హతలు | : | ఎం.ఎ. ఇంగ్లీష్, బి.ఎడ్.,<br>ఎం.ఎ జానపద కళలు |
| చిరునామా | : | 7-1-155/డి9/7, శ్రీనగర్ కాలనీ,<br>పానగల్‌రోడ్, నల్లగొండ. |
| వివాహం | : | ఫిబ్రవరి 08, 1996 |
| భార్య | : | సరోజ |
| పిల్లలు | : | వెన్నెల, వేకువ |
| **ప్రచురించిన పుస్తకాలు** | : | కదురు, తుంగు, జిల్లెడుపూలు, మబ్బులు,<br>గోగుమల్లెలు, వడిసెల |
| **పాటల సీడీలు** | : | తెలంగాణ బతుకమ్మపాటలు,<br>తెలంగాణ గౌడ్ కల్లుపాట, జంభూరాజ్యం,<br>సందమామలు, బెస్తోల్ల పోరుబాట,<br>సర్దార్ సర్వాయి పాపన్న పాటలు,<br>తెలంగాణ దేవులాట, జైజై తెలంగాణ |
| **సినిమా పాటలు** | : | జైబాలాజి, |
| **నటుడిగా** | : | కోహినూర్, పౌరుడు,<br>హుష్‌కాకి, నైవేద్యం నాటికలు<br>జై బోలో తెలంగాణ సినిమా |
| **అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు** | : | 2006లో భారతీయ దళిత సాహిత్య అకాడమీ ఢిల్లీ వారి చేత |